

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 257

SUNDAY Special

ఆదివారం 8-12-2024


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్‌కు 'హెడ్'పోటు...

అడిలైడ్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 337 పరుగులు చేసిన ఆస్ట్రేలియాకు 157 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 128 రన్స్‌తో పోరాడుతోంది.

- వివరాలు 12లో



లద్దాఖ్‌లో 'క్వాంటమ్' ఎర్త్ స్టేషన్

ఉపగ్రహ ఆధారిత క్వాంటమ్ సమాచార ప్రసారాల సాంకేతికతపై భారత్ దృష్టి పెట్టింది. అత్యధిక నాణ్యత, భద్రత కోసం క్వాంటమ్ టెక్నాలజీని వాడుకోవాలని నిర్ణయించింది.

- వివరాలు 6లో

ధ్యాన దినోత్సవంగా డిసెంబర్ 21



ఏటా డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరుపుకోవాలన్న భారత్ సహ ప్రతిపాదనను ఐరాస ఏకగ్రీవంగా ఆమోదించింది.


- వివరాలు 6లో ▶



నేడు మళ్లీ ఢిల్లీ చలో

డిమాండ్ల సాధనకు రైతు సంఘాలు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం నేడు తిరిగి మొదలవుతుందని రైతు నేత సర్వాన్ సింగ్ చెప్పారు.

- వివరాలు 6లో ▶



డెమాస్కస్ శివార్లకు రెబెల్స్

సిరియాలో తిరుగుబాటుదార్ల పైచేయి కొనసాగుతోంది. శనివారం వారు హామ్స్ సిటీలోని శివారు ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు.

- వివరాలు 6లో ▶

కాంగ్రెస్‌పై కత్తులు!



'ఇండియా' కూటమి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధమన్న బెంగాల్ సీఎం, తృణమూల్ చీఫ్ మమత వ్యాఖ్యలు కూటమిలో కలకలం రేపాయి.

- వివరాలు 6లో ▶

మోదీకిదే నా సవాల్

తొలి ఏడాదిలో రుణమాఫీ చేశారా? 55 వేల ఉద్యోగాలిచ్చారా?

చేస్తే చూపించండి.. ఢిల్లీ నడిబజారులో క్షమాపణ చెబుతా: సీఎం రేవంత్‌రెడ్డి



బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్‌లో కృష్ణమ్మకు పూజలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్, ఎంపీ చామల, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

లేదంటే మా ప్రభుత్వాన్ని అభినందించండి.. ప్రధానిగా మీ గౌరవం పెరుగుతుంది

- నడ్డావి అడ్డగోలు మాటలు.. ఈటల, కిషన్‌రెడ్డీ దొంగల సోపతి పట్టొద్దు
- గెలిస్తే ఉప్పొంగడం, ఓడితే కుంగిపోవడం తెలంగాణకు మంచిదా?
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- ఏడాదిగా ప్రతిపక్ష నేత కుర్చీని ఖాళీగా ఉంచడంపై ఏం చెబుతారు..?
- నల్లగొండ ప్రజాపాలన విజయోత్సవ సభలో రేవంత్ ప్రశ్న
- బ్రాహ్మణ వెల్లెంల- ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు, యాదాద్రి థర్మల్ ప్లాంట్ రెండో యూనిట్‌ను ప్రారంభించిన సీఎం
- నల్లగొండ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: గత 75 ఏళ్లలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రభుత్వం, ఏ సీఎం కూడా తొలి ఏడాదిలోనే 55,143 ఉద్యోగాలు ఇవ్వలేదని.. దీనిపై తాను సూటిగా ప్రధాని మోదీకే సవాల్ విసురుతున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మోదీ పాలనలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా మొదటి ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఇస్తే లెక్క చూపాలని... ఢిల్లీ నడిబజార్‌లో క్షమాపణ చెప్పి తలవంచుకొని వస్తానని సవాల్ చేశారు. గెలిస్తే ఉప్పొంగడం, ఓడిపోతే కుంగిపోవడం తెలంగాణ సమాజానికి, ప్రజాస్వామ్యానికి మంచిదా, కేసీఆర్ ఎందుకు బయటికి రావడం లేదని సీఎం ప్రశ్నించారు. దీనిపై కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని వ్యాఖ్యానించారు. శనివారం సాయంత్రం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గంధంవారిగూడెంలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

''కేసీఆర్, బీఆర్‌ఎస్ వారు మాట్లాడిన ప్రెస్‌మీట్ల కాగితాలు తీసుకెళ్లి ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి అవే నకలు కొడుతున్నారు. కిషన్‌రెడ్డి, ఈటల మారాలి. ఆ దొంగల సోపతి పడితే మీరు కూడా దొంగల బండి

మిగతా 2వ పేజీలో ▶



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న జేపీ నడ్డా. చిత్రంలో డీకే అరుణ, బండి సంజయ్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఈటల రాజేందర్

ఇది గారడీ సర్కార్

కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ధ్వజం

- అలవికాని హామీలిచ్చి గద్దెనెక్కి ఒక్క హామీనీ నిలబెట్టుకోలేదని మండిపాటు
- తెలంగాణకు బీజేపీయే ఉజ్వల భవిష్యత్తు అందించగలదని వ్యాఖ్య
- హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో బహిరంగ సభలో ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గారడీ ప్రభుత్వం కొనసాగుతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మండిపడ్డారు. ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.. ఏడాది నుంచి ప్రజల్ని వంచిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఏడాది పాలనంతా గత బీఆర్‌ఎస్ పాలనకు నకలుగా ఉందని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో 'కాంగ్రెస్ ఏడాది పాలన-వైఫల్యాలపై బీజేపీ నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన జేపీ నడ్డా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

అన్నీ మోసపూరిత హామీలే...

'తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ పరిస్థితులను చూస్తే కాంగ్రెస్ వైఖరి స్పష్టమవుతుంది. పాత పెన్షన్ స్కీం జాడలేదు. 2 లక్షల ఉద్యోగాల ఊసులేదు. మహిళలకు ప్రతి నెలా ఇస్తామన్న రూ. 2,500 ఏ ఒక్కరికీ అందలేదు. ఆటోడ్రైవర్లకు రూ. 12 వేల హామీ ఏమైంది? రైతులకు ఎకరాకు రూ. 15 వేలు, కౌలు రైతులకు రూ. 12 వేలు, షాదీ ముబారక్ కింద రూ.లక్ష, తులం బంగారం, విద్యార్థులకు రూ.5 లక్షల క్రెడిట్ కార్డులు, స్కూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు... ఇలా వందల సంఖ్యలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా రేవంత్ ప్రభుత్వం అమలు చేయలేదు. దీనిపై ప్రశ్నించిన మాపై ఎదురుదాడి చేస్తున్నారు'

మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

కోల్పోయింది అధికారమే.. పోరాటతత్వం కాదు!



బీఆర్‌ఎస్ పార్టీ కోల్పోయింది అధికారాన్ని మాత్రమేనని.. పోరాటతత్వాన్ని కాదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీపై ప్రజలకు అభిమానం ఏమాత్రం తగ్గలేదన్నారు.

- వివరాలు 2లో ▶

టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా దిల్ రాజు



ప్రముఖ సినీ నిర్మాత, పంపిణీదారుడు దిల్ రాజు ను తెలంగాణ ప్రభుత్వం టీఎఫ్‌డీసీ (తెలంగాణ చలనచిత్రాభివృద్ధి సంస్థ) చైర్మన్‌గా నియమించింది. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

- వివరాలు 10లో ▶

'గరుడ' దళంతో గగన నిఘా!



రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి వంటి వీవీఐపీలు పాల్గొనే సభలు, సమావేశాలకు భద్రతా బలగాలు మరింత పటిష్ట భద్రతను కల్పిస్తాయి. ఇందుకోసం రాష్ట్ర పోలీసులు గరుడ దళాన్ని రంగంలోకి దింపనున్నారు.

- వివరాలు 14లో ▶

● తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రండి




తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కార్యక్రమ ఆహ్వాన పత్రికను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఇస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- మాజీ సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం
- ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిసిన మంత్రి పొన్నం
- ప్రభుత్వం తరఫున ఆహ్వాన పత్రిక అందజేత
- మధ్యాహ్నం కలిసి భోజనం చేసిన ఇద్దరు నేతలు
- మా భేటీలో రాజకీయాలు మాట్లాడలేదు: పొన్నం

2లో

కోర్టు ఆదేశాలంటే లెక్కలేదా?



- స్టేటస్‌కో ఆదేశాలున్నా పాస్‌బుక్ జారీ చేస్తారా?
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం
- కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌పై క్షమశిక్షణా చర్యలకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కోర్టు ఆదేశాలను ధిక్కరించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, గండిపేట మండల తహసీల్దార్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. గండిపేట మండలం నార్సింగిలోని సర్వే నంబర్ 340/4/1లో ఉన్న రెండెకరాల వివాదాస్పద భూమిపై స్టేటస్ కో ఆదేశాలున్నా.. అధికారులు ఆ భూమిపై ఓ సంస్థకు పట్టాదారు పాస్‌బుక్ జారీచేయటంపై మండిపడింది. ఈ భూమిపై చాలాకాలంగా వివాదం నడుస్తున్నది. సదరు భూమిపై 2014లోనే హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలిచ్చింది. కానీ, 2023 అక్టోబర్‌లో ధరణి పోర్టల్‌లో ఆ భూమి ఇండస్ట్రియల్ ఆయిల్ ప్యూరిఫికేషన్

మిగతా 3వ పేజీలో ▶

తెలంగాణ తల్లి విగ్రహ మార్పును ఆపండి

- రాష్ట్రంలో విగ్రహాలను మార్చకుండా ప్రభుత్వాన్ని ఆదేశించండి
- రూ. 150 కోట్ల ప్రజాధనం వృథాను నివారించండి
- హైకోర్టులో ప్రముఖ రచయిత జూలూరి గౌరీశంకర్ పిల్

14 లో

నిరాడంబరమూర్తి.. ఉద్యమస్ఫూర్తి



- 'సాక్షి'తో నూతన తెలంగాణ తల్లి విగ్రహ రూపకర్త ప్రొఫెసర్ గంగాధర్, కాంస్య విగ్రహ రూపశిల్పి ఎం.వి.రమణారెడ్డి
- భావితరాలకు ఆమే అభయహస్తం
- బహుజనుల పోరాట పిడికిళ్లే విగ్రహ పీఠం

14 లో



మీరు ఎలా చెబితే అలా!

ఐదుగురు యువకులు జలసమాధి



చెరువులో పడిన కారు

చెరువులో కారు బోల్తా..

- సరదాగా షికారుకని వెళ్లిన ఆరుగురు స్నేహితులు
- మధ్యలో ఆగి మద్యం తాగి.. ఆపై కల్లు తాగేందుకు యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లికి ప్రయాణం
- జలాల్‌పురం సమీపంలో మూల మలుపు, పొగ మంచుతో రోడ్డు సరిగా కనబడక ఇబ్బంది
- సడెన్ బ్రేక్ వేసిన యువకుడు.. అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులో పల్టీకొట్టిన కారు
- ఈదుకుంటూ బయటపడిన ఒకరు.. నీట మునిగి మృతి చెందిన ఐదుగురు
- మృతులంతా హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌కు చెందినవారే..

భూదాన్ పోచంపల్లి: వారంతా 25 ఏళ్లలోపు యువకులు.. కలసి తిరిగే స్నేహితులు.. సరదాగా షికారుకు బయలుదేరారు.. మధ్యలో మద్యం తాగారు.. ఆపై కల్లుతాగాలనే కోరిక పుట్టింది.. దానికోసం వెళుతుంటే, పొగమంచులో దారి సరిగా కనిపించక కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న ఐదుగురు యువకులు జల సమాధి అయ్యారు. ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. శనివారం తెల్లవారుజామున యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురం సమీపంలో ఈ విషాద ఘటన చోటుచేసుకొంది. మృతులంతా హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ ప్రాంతానికి చెందినవారే.

ఆరుగురు కలసి వెళ్లి..

ఎల్‌బీ నగర్ ప్రాంతంలోని సిరినగర్ కాలనీకి చెందిన తీగుళ్ల వంశీగౌడ్ (23), ఇంద్రపల్లి హర్షవర్ధన్ (22), వీరమల్ల విఘ్నేశ్వర్(20), ఆర్టీసీ కాలనీకి చెందిన కలకోటి అక్షయ్‌కుమార్ అలియాస్ బల్లు (19), వాస్తుకాలనీకి చెందిన జెల్ల వినయ్ (21), బోడుప్పల్

మిగతా 13వ పేజీలో ▶

3 లక్ష్యాలతో ఆర్టీసీకి జవసత్వాలు



గత ప్రభుత్వం ఆర్టీసీని దెబ్బతీస్తే మేం లాభాల్లోకి తెచ్చాం

- సంస్థ బలోపేతం, ప్రయాణికులకు వసతులు, సిబ్బంది సంక్షేమం మా విధానం
- మహాలక్ష్మి పథకంతో సంస్థకు మంచి రోజులు
- ఏడాదిలో 116 కోట్ల మంది ఉచిత ప్రయాణం.. వారికి రూ. 4 వేల కోట్లు ఆదా
- హైదరాబాద్‌లో త్వరలో డీజిల్ ఆటోల తొలగింపు యోచన
- అవసరమైతే ఆటోవాలాలకు చేయూతనందిస్తాం

10 లో

'సాక్షి' ఇంటర్వ్యూలో బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

క్లుప్తంగా...

బీఆర్ఎస్ వచ్చినంక అన్నీ మాయం

కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కౌంటర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అన్నీ మాయమయ్యాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవాచేశారు. మాయం చేయడం, మోసం చేయడం మినహా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్‌కు ఆయన కౌంటర్ ఇస్తూ శనివారం 'ఎక్స్' వేదికగా రీట్వీట్ చేశారు. 'తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక దళితులకు మూడెకరాల భూమి మాయం. ఇంటికో ఉద్యోగం మాయం. ధరణితో పేద ప్రజల భూములు మాయం. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మాయం. నిరుద్యోగులకు ఉద్యోగాలు మాయం. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు మాయం. కాళేశ్వరంతో ప్రభుత్వ ఖజానా మాయం. పంటకు గిట్టుబాటు ధర మాయం. ప్రజాస్వామ్య సూచిక ధర్నాచౌక్ మాయం. ప్రజలకు మీ దర్శనం మాయం. మీ పార్టీ పేరులో ఉన్న తెలంగాణ మాయం. ప్రభుత్వం పోయాక కేసీఆర్ మాయం' అంటూ కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్ రూరల్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని, ప్రజలను దోచుకున్న కల్వకుంట్ల కుటుంబాన్ని ఉద్దేశించి మాత్రమే తాను అలా స్పందించానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వెలమలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పందిస్తూ శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై పది నెలలుగా అవాకులు చెవాకులు మాట్లాడుతున్న కల్వకుంట్ల కుటుంబంపై 15 రోజుల కిందట తాను మాట్లాడానన్నారు. తన మాటలను ఎడిట్ చేసి, వివాదాస్పదంగా మార్చి కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని శంకర్ తెలిపారు. తాను మాట్లాడిన మాటలు తప్పుగా భావిస్తే వెనక్కి తీసుకుంటున్నానని ప్రకటించారు. ఎవరినీ కించపరిచే, ఎవరి మనోభావాలను దెబ్బతీసే ఉద్దేశం తనకు లేదని స్పష్టంచేశారు.

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు

కారు, మొబైల్ ఫోన్ సీజ్



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కారును సీజ్ చేసిన బంజారాహిల్స్ పోలీసులు

గచ్చిబౌలి/బంజారాహిల్స్ (హైదరాబాద్): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లా ఖాన్ తెలిపారు. ఈ నెల 5న కొండాపూర్‌లోని కొల్ల లగ్జారియా విల్లాస్‌లో బంజారాహిల్స్ పోలీసులు కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడం తెలిసిందే. అక్కడికి వెళ్లిన తనతో దురుసుగా ప్రవర్తించడం, చనిపోతానంటూ బెదిరించడం, విధులకు ఆటంకం కలిగించినట్లు మాసబ్ ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురాం ఫిర్యాదు చేశారని తెలిపారు. కోర్టు అనుమతితో శుక్రవారం కౌశిక్ రెడ్డిపై బీఎన్ఎస్ 220, 226 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు.

కౌశిక్‌రెడ్డి మొబైల్ ఫోన్ సీజ్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కారుతో పాటు మొబైల్ ఫోన్‌ను బంజారాహిల్స్ పోలీసులు సీజ్ చేశారు. బంజారాహిల్స్ సీఐ ఫిర్యాదు మేరకు కౌశిక్‌రెడ్డిని గురువారం అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా బెయిల్ మంజూరైంది. ఈ ఘటనలోనే కౌశిక్‌రెడ్డి కారు, మొబైల్ ఫోన్‌ను కూడా సీజ్ చేశారు. కౌశిక్‌రెడ్డి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చేముందు ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారో తెలుసుకునేందుకు ఫోన్‌ను స్వాధీనం చేసుకుని.. కోర్టుకు సమాచారం ఇచ్చి.. కాల్ డేటా కోసం ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం



సాక్షి, అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న హిందూ మహాసముద్రం మీదుగా ఉన్న ఆవర్తనం ప్రభావంతో శనివారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే 24 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కొనసాగుతూ 11వ తేదీ నాటికి శ్రీలంక-తమిళనాడు తీరాల సమీపానికి చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో ఆదివారం ఏపీలోని పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



శనివారం నల్లగొండలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభకు హాజరైన ప్రజలు. అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మోదీకిదే నా సవాల్..

▶ మొదటి పేజీ తరువాయి

ఎక్కుతారు. అటే పోతారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా.. అడ్డగోలుగా మాట్లాడవద్దు. ఏది పడితే, ఎలా పడితే అలా మాట్లాడితే చెల్లదు. మీరు కేసీఆర్‌లా తయారుకాకండి. మోదీ పాలనలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా మొదటి ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఇస్తే లెక్క చూపండి. మోదీకి సవాల్ చేస్తున్నా.. ఢిల్లీ నడిబజార్‌లో మీకు క్షమాపణ చెప్పి తలవంచుకొని వస్తా. లేకపోతే నా లెక్క అప్పజెబుతా. మీ నాయకులు, మీరు తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించండి. అప్పుడే ఈ దేశ ప్రధానమంత్రిగా మీ గౌరవం పెరుగుతుంది. అంతేకాదు మేం తొలి ఏడాదే 25.50 లక్షల మంది రైతుల రుణమాఫీ చేశాం. రూ.21 వేల కోట్లు వారి ఖాతాల్లో వేశాం. మోదీ, కేసీఆర్ మీరు ఎప్పుడైనా చేశారా? సవాల్ విసురుతున్నా. మోదీ అధికారంలో ఉన్నప్పుడైనా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనైనా ఒక్క ఏడాదిలోనే ఇలా రుణమాఫీ చేస్తే.. నేను మా మంత్రులతో సహా వచ్చి క్షమాపణ చెబుతాం.

కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోండి..

గెలిస్తే ఉప్పొంగడం, ఓడిపోతే కుంగిపోవడం తెలంగాణ సమాజానికి, ప్రజాస్వామ్యానికి మంచిదా? కేసీఆర్ ఎందుకు బయటికి రావడం లేదు? ఎందుకు మాట్లాడటం లేదు? అధికారంలో ఉంటే చలాయిస్తాం, ఓడిపోతే ఫామ్ హౌస్‌లో పడుకుంటామంటే ఎలా? దీనిపై ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? మేం ఎన్నికల్లో పోటీ చేయలేదా? ఓడినా, గెలిచినా ప్రజల్లో ఉండలేదా? రెండుసార్లు మీరు గెలిచారు. మేం ఓడిపోయాం.. అయినా జానారెడ్డిలాంటి పెద్దలు ప్రజల్లో ఉండి, అసెంబ్లీలో పాలకపక్షానికి సూచనలు, సలహాలు ఇస్తూ, తప్పిదాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. మా ఎమ్మెల్యేలను గుంజుకున్నా, సీఎల్పీ హోదాను తొలగించినా మొక్కవోని ధైర్యంలో భట్టి విక్రమార్క కొట్లాడారు. ఇప్పుడు సంవత్సరం పూర్తయినా మీరు ప్రతిపక్ష నాయకుడిగా మీ పాత్ర పోషించారా? అసెంబ్లీకి వచ్చారా? ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, టీఆర్ఎస్ అధ్యక్షుడిగా, పదేళ్లు సీఎంగా మీకున్న అనుభవాన్ని, మీ వయసును తెలంగాణ ప్రజల కోసం ఏ ఒక్కరోజైనా వినియోగించారా? ఆలోచించాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కుర్చీ ఖాళీగా ఉంచడం పట్ల తెలంగాణ సమాజానికి ఏం సమాధానం చెబుతారు?

గాలి బ్యాచ్‌ని ఊరి మీదకు వదిలారు..

ప్రభుత్వ నిర్ణయాలు మీకు నచ్చకపోతే, ప్రజలకు కష్టం వస్తే ప్రజలపక్షాన మాట్లాడాల్సింది పోయి ఒక గాలి బ్యాచ్‌ను తయారు చేసి ఊరి మీదికి వదిలారు. వారేం మాట్లాడుతున్నారో, ఏం చేస్తున్నారో ఎప్పుడైనా విన్నారా? ప్రతి అభివృద్ధి పనిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు ఇవ్వొద్దన్నప్పుడు, గ్రూప్-4, గ్రూప్-1 పరీక్షలు పెట్టవద్దన్నప్పుడు, డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేయాలన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా ముందుకు వెళుతుంది? కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉంటే.. కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పుతో మాకు అప్పగించారు. అప్పులకు ప్రతి నెలా రూ.6,500 కోట్ల చొప్పున ఏడాదికి రూ.65 వేల కోట్లు వడ్డీ కట్టాల్సి వస్తోంది.

నాడు 'ఔటర్' రోడ్డు.. ఇప్పుడు 'రీజనల్' రోడ్డు

నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఔటర్ రింగ్ రోడ్డు వేశారు. ఇప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా రీజనల్ రింగు రోడ్డు తీసుకువచ్చి అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటాం. 50వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీగా కొత్త నగరాన్ని నిర్మించుకుని, పెట్టుబడులు తెచ్చి.. నిరుద్యోగులకు, ఇంజనీర్లకు, డాక్టర్లకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత మాదే. మూసీ కాలుష్యంతో మనుషులు జీవించలేని పరిస్థితి నల్లగొండ ప్రాంతానికి రాబోతోందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ చెప్పింది. అందుకే మూసీలో గోదావరి జలాలను పారించేందుకు, పారిశ్రామిక కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రక్షాళన చేపట్టాం. అడ్డం వచ్చే వారి సంగతి ప్రజలే చూసుకోవాలి..'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

ఉచిత విద్యుత్ ఇచ్చింది వైఎస్సార్ కాదా?

"వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెప్పినప్పుడు.. కొందరు కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందన్నారు.ఆ మాటలు తప్పు అని నిరూపించి రైతులకు ఉచిత కరెంటును ఇచ్చారు. దేశంలోనే మొదటిసారిగా రైతులకు ఉచిత కరెంటు ఇస్తూ, వారి రూ.1,200 కోట్ల కరెంటు బిల్లులను మాఫీ చేస్తూ, వేల మంది రైతులపై విద్యుత్ చౌర్యం కేసులను ఎత్తివేస్తూ.. ఒక్క సంతకంతో హామీలు అమలు చేశారు. మేం ఆయనను ఆదర్శంగా తీసుకుని వ్యవసాయానికి 24 గంటల ఇస్తున్నాం. ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. వైఎస్సార్ రాజీవ్ ఆరోగ్యశ్రీని అమల్లోకి తెస్తే... కేసీఆర్ వచ్చి నిర్వీర్యం చేశారు. మేం వచ్చాక ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. వరి వేస్తే ఉరేనని కేసీఆర్ అన్నారు. మేం వరి సాగు చేయాలని చెప్పడమేకాదు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తున్నాం.''

సీఎం ప్రారంభించిన అభివృద్ధి పథకాలివీ..

నార్కట్‌పల్లి, మిర్యాలగూడ, నల్లగొండ టూటౌన్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి శనివారం డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, దామోదర తదితరులతో కలసి నల్లగొండ జిల్లాలో పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల- ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ డెలివరీ చానల్స్‌ను ప్రారంభించారు. రిజర్వాయర్ వద్ద పూజలు చేసి కృష్ణమ్మకు చీరసారె సమర్పించి జలహారతి ఇచ్చారు. తర్వాత హెలికాప్టర్‌లో దామరచర్ల మండలం వీర్లపాలెం చేరుకుని థర్మల్ పవర్ ప్లాంట్‌లో యూనిట్-2ను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. 800 మెగావాట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. అనంతరం నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుని మెడికల్ కాలేజీ భవనాన్ని ప్రారంభించారు. నర్సింగ్ కళాశాల, రోడ్లు, కాల్వలు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నల్లగొండ సభ వేదికగా సీఎం కప్-2024 క్రీడా పోటీలను, శాప్ అధికారిక గీతాన్ని ప్రారంభించారు.

బ్రాహ్మణ వెల్లెంల-ఉదయసముద్రం ప్రాజెక్టు ఇదీ..

సుమారు లక్ష ఎకరాలకు సాగునీటిని అందించి రైతుల కష్టాలు తీర్చేందుకు ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి.. ఉమ్మడి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంలలో ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. 2007లో దీనికి శంకుస్థాపన చేశారు. రూ.699 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదనలను ఆమోదించారు. 2009లో పనులు ప్రారంభమయ్యాయి. నల్లగొండ పట్టణం సమీపంలోని ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి అప్రోచ్ చానల్, సొరంగం తవ్వారు. పంపుహౌస్ నిర్మాణం, మోటార్ల ట్రయల్ రన్, 486 ఎకరాల్లో బ్రాహ్మణ వెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం తదితర కీలక పనులన్నీ ఇటీవలే పూర్తయ్యాయి. మొత్తంగా ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 6.70 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నార్కట్‌పల్లి, నల్లగొండ, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, కట్టంగూర్, శాలిగౌరారం మండలాల్లోని లక్ష ఎకరాలకు సాగునీటిని అందించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఇందులో రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా 54 గ్రామాలకు, ఎడమ కాలువ ద్వారా 40 గ్రామాలకు సాగునీరు అందిస్తారు.

తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా చేస్తాం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

నల్లగొండ: రాబోయే నాలుగేళ్లలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే రోల్ మోడల్‌గా నిలబెడతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్లగొండ ప్రజాపాలన విజయోత్సవ సభలో వారు మాట్లాడారు. తమ ప్రభుత్వం ఓవైపు రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తూనే, మరోవైపు అప్పులు తీర్చుకుంటూ ముందుకుసాగుతోందని భట్టి విక్రమార్క చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకులాలను పెట్టిందే తప్ప నిర్వహణను పట్టించుకోలేదని.. తాము యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకులాలను నియోజకవర్గానికి ఒకటి చొప్పున నిర్మిస్తున్నామని చెప్పారు. గత సర్కారు యాదాద్రి పవర్ ప్లాంట్ మొదలుపెట్టిందే తప్ప పర్యావరణ అనుమతులు తీసుకోలేకపోయిందని.. తాము అనుమతులు తెప్పించి, నిధులిచ్చి పనులు వేగవంతం చేశామని తెలిపారు.



మెడికల్ కాలేజీ క్లాస్‌రూమ్‌లో విద్యార్థులతో కలిసి కూర్చున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి, పొంగులేటి, రఘువీర్‌రెడ్డి, ఉత్తమ్, దామోదర, కోమటిరెడ్డి, గుత్తా తదితరులు

నల్లగొండ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం: ఉత్తమ్

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులన్నీ నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం సొరంగ మార్గాన్ని ప్రారంభిస్తే బీఆర్ఎస్ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆ ప్రాజెక్టును పూర్తిచేసి మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుందన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని చెప్పారు.

ఎస్ఎల్‌బీసీ.. ఇక ఆర్ఆర్ ప్రాజెక్టు: కోమటిరెడ్డి

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని ఇక నుంచి ఆర్ఆర్ (రాజశేఖర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి) ప్రాజెక్టుగా పేరు పెట్టుకున్నామని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. నాడు వైఎస్సార్ ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గానికి శంకుస్థాపన చేస్తే.. ఇప్పుడు సీఎం రేవంత్ ఆ ప్రాజెక్టు పూర్తికి నిధులు ఇస్తున్నారని పేర్కొన్నారు.

కోల్పోయింది అధికారమే.. పోరాటతత్వం కాదు!

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పుతాం

- గడిచిన ఏడాది బీఆర్ఎస్‌కు అత్యంత గడ్డుకాలం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు
- ఏడాది కాంగ్రెస్ పాలనపై షార్ట్ ఫిల్మ్ విడుదల

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ కోల్పోయింది అధికారాన్ని మాత్రమేనని.. పోరాటతత్వాన్ని కాదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు అభిమానం ఏమాత్రం తగ్గలేదని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసమే పనిచేస్తామని స్పష్టంచేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దర్శకత్వం వహించి, నిర్మించిన 'నమ్మి నానబోస్తే' షార్ట్ ఫిల్మ్‌తో పాటు కాంగ్రెస్ పాలనపై రూపొందించిన 'అంతా ఉత్తదే' పాటను కేటీఆర్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి బీఆర్ఎస్ పార్టీ 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగుపెడుతోంది. గడిచిన ఏడాది పార్టీకి అత్యంత గడ్డుకాలం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, కేసీఆర్ తుంటి ఎముకకు గాయం, ఎమ్మెల్సీ కవిత అరెస్టు, లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం వంటి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. బీఆర్ఎస్ తరఫున గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ నేతల అరెస్టులకు కుట్రలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలన్నీ దాటుకుంటూ బీఆర్ఎస్ తిరిగి బలంగా నిలబడింది. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికే వ్యతిరేకత మూటగట్టుకుంది. ఉపఎన్నిక జరిగితే పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా గెలవరు' అని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ బోసిపోతుండగా.. విపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ తెలంగాణ భవన్ మాత్రం నిత్యం కళకళలాడుతోందని తెలిపారు. 'ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు రసమయి బాలకిషన్ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ అద్దం పట్టింది' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతీనెల షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించి విడుదల చేస్తానని రసమయి బాలకిషన్ ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎస్. మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, రవిశంకర్, చిన్నయ్య, లింగయ్య, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, డాక్టర్ రాజయ్య, ఆనంద్, క్రాంతికిరణ్, ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీప్రసాద్ పాల్గొన్నారు.



షార్ట్‌ఫిల్మ్ విడుదల అనంతరం మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో రసమయి, మహమూద్ అలీ తదితరులు

భూసేకరణ రద్దయ్యే వరకు పోరు

లగచర్లలో భూసేకరణ నోటిఫికేషన్ రద్దు అయ్యేంత వరకు పోరాటం చేస్తామని, రైతులు, గిరిజనులకు అండగా నిలుస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రకటించారు. రైతులు, గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా ఎస్పీతో టెలిఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్ పోలీసు వేధింపులు నిలిపివేయాలని కోరారు. లగచర్ల బాధితులు శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు జైలులో ఉన్న బాధితులను బెయిల్‌పై తీసుకువచ్చేందుకు బీఆర్ఎస్ లీగల్ విభాగం సర్వశక్తులూ ఒడ్డుతోందని కేటీఆర్ చెప్పారు. లగచర్ల బాధితుల డిమాండ్లను అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తుతామని ప్రకటించారు. భేటీలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన మంత్రి పొన్నం ప్రభాకర్, హర్కర వేణుగోపాల్

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రండి

మాజీ సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం

ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిసిన మంత్రి పొన్నం

సాక్షి, హైదరాబాద్/మర్కూక్ (గజ్వేల్): ఈ నెల 9న సచివాలయం ఆవరణలో నిర్వహించే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రొటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రొటోకాల్ విభాగం డైరెక్టర్ వెంకట్‌రావు శనివారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేసీఆర్‌కు మంత్రి పొన్నం శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేశారు. అంతకుముందు కేసీఆర్ నివాసంలో మంత్రి పొన్నం బృందానికి బీఆర్ఎస్ నేతలు జోగినపల్లి సంతోష్‌కుమార్, జీవన్‌రెడ్డి, వంశీధర్‌రావు తదితరులు సాదర స్వాగతం పలికారు. పొన్నంకు కేసీఆర్ శాలువా కప్పి సత్కరించారు. ఇద్దరు నేతలు మధ్యాహ్నం కలిసి భోజనం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఉద్యమ జ్ఞాపకాలను ఇరువురు నేతలు నెమరువేసుకున్నారు. పొన్నం బృందం సుమారు గంటన్నరపాటు కేసీఆర్ నివాసంలో గడిపారు. అనంతరం పొన్నం మాట్లాడుతూ.. తమ భేటీలో ఎలాంటి రాజకీయ అంశాలు ప్రస్తావనకు రాలేదని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి హాజరు కావాలా వద్దా అనేది కేసీఆర్ సొంత నిర్ణయమని వెల్లడించారు. మంత్రి పొన్నం వెంట గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ కూడా ఉన్నారు.

విపక్షంగా బీఆర్ఎస్, బీజేపీ ఫెయిల్

బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట..

బీజేపీలో నాలుగు ముక్కలాట: టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్



'పాలమూరు వీర.. రేవంత్‌రెడ్డి' పాటను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర పోషించటంలో బీఆర్ఎస్, బీజేపీలు విఫలమయ్యాయని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో మూడు ముక్కలాట, బీజేపీలో నాలుగు ముక్కలాట నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. 'కుర్చీ కావాలని కేసీఆర్ కుమార్తె కవిత అడుగుతోంది. కాదు నాకే కావాలని కుమారుడు కేటీఆర్ అంటున్నారు. ఈ ఇద్దరి మధ్య ఏదైనా జరిగితే కుర్చీ లాక్కోవాలని హరీశ్‌రావు చూస్తున్నారు. ఇక, బీజేపీలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఉత్తర, దక్షిణ ధృవాలుగా పనిచేస్తున్నారు. ఈటల రాజేందర్ తూర్పు చూస్తుంటే, డి.కె.అరుణ పడమర చూస్తున్నారు' అని ఎద్దేవా చేశారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే సాధారణ ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి బీఆర్ఎస్ కనిపించకుండా పోతుందని చెప్పారు. ఆ పార్టీ నుంచి చాలా మంది తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. 8 మంది ఎంపీలను గెలిపిస్తే బీజేపీ నేతలు రాష్ట్రానికి ఎన్ని నిధులు తెచ్చారని ప్రశ్నించారు. తాము కేటీఆర్ అరెస్టు కోసం గవర్నర్ అనుమతి కోరినప్పటికీ ఎందుకు అనుమతి రావడం లేదో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. తనకు మంత్రివర్గంలో చేరాలనే ఆలోచన ఎప్పుడూ లేదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఏఐసీసీ నిర్ణయమే ఫైనల్ అని స్పష్టం చేశారు. సమగ్ర సర్వే గణాంకాల ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

పాలమూరు వీర పాట విడుదల: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌పై రూపొందించిన 'పాలమూరు వీర' అనే పాటను మహేశ్‌గౌడ్ శనివారం అసెంబ్లీ అవరణలో ఆవిష్కరించారు. నిర్మాత యుగంధర్‌గౌడ్ ఆధ్వర్యంలో కవి రేలారే ప్రసాద్ రచించిన ఈ గీతం అద్భుతంగా ఉందని ఆయన ప్రశంసించారు. ఈ గీతానికి కళ్యాణ్ సంగీతం అందించగా, ఎంఎల్ఆర్ కార్తికేయ ఆలపించారు.

నేడు బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం

ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ అధ్యక్షతన భేటీ

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో నాయకులకు దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 9 నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో నేడు బీఆర్ఎస్ శాసనసభా పక్ష భేటీ జరగనుంది. ఎర్రవల్లి నివాసంలో ఆదివారం ఉదయం 10.30కు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీకి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కొందరు ముఖ్య నేతలు కూడా హాజరుకానున్నారు. సుమారు వారం రోజుల పాటు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ నాయకులకు దిశానిర్దేశం చేస్తారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలు, ఏడాదిలో రేవంత్ ప్రభుత్వ పాలన వైఫల్యాలతో పాటు ప్రజా సమస్యలను ప్రస్తావించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు సోమవారం బీఏసీ సమావేశంలో ప్రతిపాదించే ఎజెండా ఆధారంగా తమ వ్యూహానికి పదును పెట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కాగా, ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదాలో కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేది, లేనిదీ ఆదివారం జరిగే భేటీలో స్పష్టత వచ్చే అవకాశముంది. గత ప్రభుత్వం చేసిన పలు చట్టాలకు ప్రస్తుత ప్రభుత్వం సవరణలు తీసుకువస్తోంది. అలాగే విద్యుత్ కొనుగోలు అంశంపై విచారణ నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టేందుకు అధికార పార్టీ సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న నిర్ణయాలపై ప్రభుత్వం ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తే వాటిని తిప్పికొట్టేందుకు అనుసరించే వ్యూహంపైనా ఈ భేటీలో కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు. కేవలం అసెంబ్లీ సమావేశాల కోణంలోనే కాకుండా జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు, బీఆర్ఎస్ ప్రతిస్పందించాల్సిన తీరుపై కేసీఆర్ సూచనలు చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

ఏడాది పాలనపై బీఆర్ఎస్ చార్జిషీట్ నేడు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ చార్జిషీట్ విడుదల చేయనుంది. మాజీ మంత్రి హరీశ్ రావు, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యక్రమంలో పాల్గొంటారు. 'నమ్మించారు.. నట్టేట ముంచారు. ఏడాది కాంగ్రెస్ పాలన చూస్తే.. వంచనే తప్ప ఏ వర్గానికి జరిగిన మేలు లేదు.. అన్ని వర్గాలను విజయవంతంగా రోడ్డెక్కించారు'..అని బీఆర్ఎస్ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది.



వరంగల్ చపాట మిర్చికి జీఐ ట్యాగ్

- ఇండియన్ పేటెంట్ ఆఫీస్ ఆమోదం
- జీఐ జర్నల్‌లో వివరాలు ప్రచురణ

సాక్షి, వరంగల్/సిద్దిపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేకంగా పండిస్తున్న చపాట మిర్చికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ (జీఐ ట్యాగ్) లభించింది. ఇప్పటికే తెలంగాణ నుంచి పోచంపల్లి ఇక్కత్, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నిర్మల్ బొమ్మలు, హైదరాబాద్ హలీమ్‌తోపాటు మరికొన్ని ప్రత్యేక ఉత్పత్తులు జీఐ గుర్తింపు దక్కించుకున్నాయి. తాజాగా ఈ జాబితాలో దేశంలోని తీపి మిర్చి రకాల్లో ఒకటైన చపాట మిరప చేరింది. చపాట మిరపకు జీఐ ట్యాగ్ కోసం తిమ్మంపేట మిర్చి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ రెండేళ్ల క్రితం దరఖాస్తు చేయగా.. ఇండియన్ పేటెంట్ ఆఫీస్ (ఐపీవో) తాజాగా ఆమోదించింది. 'జియోగ్రాఫిక్ ఇండికేషన్స్ జర్నల్'లోనూ చపాట రకం మిర్చికి సంబంధించిన వివరాలు ప్రచురితమయ్యాయి. రెండేళ్ల క్రితం చపాట మిర్చికి వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.లక్ష వరకు ధర పలికింది. తక్కువ ఘాటుతో ఎర్రని టమాటా పండులాంటి రంగు కలిగి ఉండటం ఈ మిర్చి ప్రత్యేకత. అందుకే దీనిని టమాటా మిర్చి అని కూడా పిలుస్తారు.

మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు

- ఐదేళ్లలో వడ్డీ లేని రుణాలిచ్చి కోటీశ్వరులను చేస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

సనత్‌నగర్: రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని.. వ్యాపారులుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను మంత్రి సీతక్కతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని మహిళలందరూ అందిపుచ్చుకొని కోటీశ్వరులుగా ఎదగాలన్నారు.



ఎగ్జిబిషన్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క

17 రకాల వ్యాపారాలకు వడ్డీలేని రుణాలు: మంత్రి సీతక్క

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్య మని, అందుకోసం వడ్డీ లేని రుణాలను అందించి ప్రోత్సహిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. 17 రకాల వ్యాపారాలను గుర్తించి.. ఆ వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, కార్పొరేషన్ల చైర్మన్లు శోభారాణి, కాల్వ సుజాత, వెన్నెల, నిర్మల జగ్గారెడ్డి, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చైర్‌పర్సన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేయాలి

- భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి
- దివ్యాంగులనూ మోసం చేసిన కాంగ్రెస్: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) ఉత్తర భాగంలో భూములు కోల్పోతున్నవారికి న్యాయం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రింగ్‌రోడ్డు కోసం చౌటుప్పల్ జంక్షన్ వద్ద 184 ఎకరాల భూమిని సేకరిస్తున్నారని.. ఆ భూములు, ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం ఇస్తున్న పరిహారం ఏ మాత్రం సరిపోదని తెలిపారు. ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు శనివారం హరీశ్ రావును ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించిన తర్వాత వారి అంగీకారంతోనే భూ సేకరణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 26న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నిర్వహించే మహాధర్నాకు రావాల్సిందిగా ఆ సంస్థ ప్రతినిధులు శనివారం హరీశ్‌రావును కలిసి ఆహ్వానించారు. వారి సమస్యలపై కూడా పోరాడుతామని ఆయన హామీ ఇచ్చారు. అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, దివ్యాంగులను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని ప్రకటించి.. ఏడాది అవుతున్నా పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేసేంత వరకు బీఆర్‌ఎస్ పోరాడుతుందని ప్రకటించారు.



శనివారం హరీశ్‌రావును కలిసిన ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు

కోర్టు ఆదేశాలంటే లెక్కలేదా?

▶ మొదటి పేజీ తరువాయి

ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందినదిగా గుర్తిస్తూ అధికారులు పట్టాదార్ పాస్‌బుక్ జారీచేశారు. ఈ చర్యపై పిటిషనర్ సంస్థ ఏషియన్ ట్యూబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మళ్లీ కోర్టుకు వెళ్లింది. 1998లో చట్టపరంగా సదరు రెండెకరాల భూమిని కొనుగోలు చేశామని ఆ కంపెనీ వాదిస్తున్నది. ఈ అంశంపై తాజాగా విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి.. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీసం పిటిషనర్‌కు నోటీసులైనా ఇవ్వకుండా ఇండస్ట్రియల్ ఆయిల్ ప్యూరిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట పాస్‌బుక్ ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. స్టేటస్ కో ఆదేశాలను పాటించకపోవడం చిన్నం పాండురంగం కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని స్పష్టంచేశారు. 'కోర్టు ఉత్తర్వులంటే లెక్కలేదా? గతంలో స్టేటస్ కో ఆదేశాలిచ్చినా మీ ఇష్టం వచ్చిన వారిని ధరణి పోర్టల్‌లో చేర్చి పాస్‌బుక్ జారీ చేస్తారా? ఈ విషయంలో కలెక్టర్‌తోపాటు ఆర్డీవో, తహసీల్దార్ అక్రమాలకు పాల్పడినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే న్యాయవ్యవస్థపై కూడా ప్రజలకు నమ్మకం పోతుంది. రెవెన్యూ అధికారుల సహకారం లేకుండా ఈ పనులు జరగవు. ఇండస్ట్రియల్ ఆయిల్ ప్యూరిఫికేషన్ పేరున రెండెకరాల భూమిని ధరణి పోర్టల్లో చేర్చి పాస్‌బుక్ జారీ చేయడం చట్టవిరుద్ధం. 2014లో ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రెవెన్యూ రికార్డులన్నీ నాలుగు వారాల్లో పిటిషనర్ పేరిట మార్చాలి. ఈ అక్రమాల్లో పాలు పంచుకున్న అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశిస్తున్నాం. భూమిని పొందేందుకు ఇండస్ట్రియల్ ఆయిల్ ప్యూరిఫికేషన్ సంస్థ మోసపూరిత చర్యలకు పాల్పడింది. చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఆ సంస్థకు రూ.5 లక్షలు జరిమానా విధిస్తున్నాం. ఆ సొమ్మును నాలుగు వారాల్లో హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీలో జమ చేసి.. రిసీట్‌ను కోర్టు రిజిస్ట్రీకి సమర్పించాలి' అని ఆదేశించారు.

'2019-24లో పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడండి'

సాక్షి, హైదరాబాద్: 2019–24లో ఉన్న మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించడం సహా వారి సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సిరిసిల్ల మాజీ సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. గత పదవీ కాలంలో పల్లె ప్రగతి, రైతు వేదిక తదితర అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ, వాటి బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని కేటీఆర్‌కు వివరించారు. ఏడాదిగా బిల్లుల విడుదల కోసం పోరాడుతున్నామని, ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సకాలంలో బిల్లులురాక చాలా మంది సర్పంచులు తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, అప్పుల భారం తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుల విడుదల కోసం అనేకమార్లు ప్రస్తుత ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా, ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల్లో సర్పంచ్‌ల సమస్యను లేవనెత్తుతామని కేటీఆర్ హామీ ఇచ్చారని మాజీ సర్పంచ్‌లు తెలిపారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం తెచ్చేలా ఆదేశాలివ్వండి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బీజేపీ లీగల్‌సెల్ వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో న్యాయవాదులకు తగిన రక్షణ కల్పించేందుకు ఓ చట్టాన్ని తీసుకొచ్చేలా ప్రభుత్వానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీజేపీ నేతలు, లీగల్ సెల్ నాయకులు కోరారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు చట్టాన్ని ప్రవేశపెట్టేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు బీజేపీ మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, లీగల్‌సెల్ కన్వీనర్ గోకుల రామారావు, న్యాయవాదులు ఏఎస్ భాస్కర్ గిరి, ఆర్వీ పవన్ మైత్రేయ, జనార్దన్‌గౌడ్, సోమసి శ్రీనివాస్, పవనక తదితరులు వినతిపత్రం అందించారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణతోపాటు, దాడులకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించేలా చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరముందన్నారు.

ట్రెసా ఉపాధ్యక్ష పదవికి బాణాల రాంరెడ్డి రాజీనామా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు బాణాల రాంరెడ్డి తెలిపారు. రెవెన్యూ శాఖలో కింది స్థాయి ఉద్యోగుల సమస్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అనేక సందర్భాల్లో ప్రస్తావించినట్టు ఒక ప్రకటనలో వెల్లడించారు. అయినప్పటికీ ట్రెసా నాయకత్వం ఈ అంశాలపై దృష్టి సారించనందున సంఘాన్ని, సంఘ నాయకుడిగా తనను నమ్ముకున్న కిందిస్థాయి ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రెసాలో కొనసాగడం భావ్యం కాదని భావిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

10, 11 తేదీల్లో కేరళ సంఘీభావ సభలు

పిలుపునిచ్చిన తెలంగాణ రైతు సంఘం

సాక్షి, హైదరాబాద్: కేరళ ప్రజల హక్కులను రక్షించాలని, వామపక్ష ప్రత్యామ్నాయాన్ని బలోపేతం చేయాలనే నినాదంతో దేశవ్యాప్తంగా ఈనెల 10, 11 తేదీల్లో కేరళ సంఘీభావ సభలు, సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో కేరళ సంఘీభావ దినం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేరళ ప్రజల హక్కులను అణచివేసేందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీకార, నిరంకుశ చర్యలను తిప్పికొట్టాలని అన్నారు. చట్టబద్ధమైన నిధులు, రుణాలు తీసుకోవడానికి అనుమతి నిరాకరించడం, గవర్నర్ కార్యాలయాన్ని దుర్వినియోగం చేయడం, కోఆపరేటివ్ ఫెడరలిజాన్ని ప్రోత్సహిస్తామనే ప్రధాని వాదనకు విరుద్ధమైనవని తెలిపారు. 400 మంది ప్రాణాలను బలిగొన్న, 100 మందికి పైగా తప్పిపోయిన వయనాడ్ కొండచరియల విపత్తు బాధితులకు సహాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందని మండిపడ్డారు. కేరళ పట్ల కేంద్రం వివక్ష ప్రదర్శిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల్లో జరిగే ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఫ్యూచర్ సిటీకి ప్రత్యేక 'అథారిటీ'

అభివృద్ధి సంస్థ ఏర్పాటుకు సర్కారు కసరత్తు



- మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, పోలీసు విభాగాలతో సమన్వయం
- ఫోర్త్ సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు
- నిధుల వినియోగం, ప్లానింగ్, భూ కేటాయింపులు, నిర్వహణ బాధ్యత దీనిదే..

సాక్షి, హైదరాబాద్: భాగ్య నగరానికి భవిష్యత్ నగరం (ఫ్యూచర్ సిటీ) మణిహారంగా మారనుంది. రంగారెడ్డి జిల్లా బేగరికంచె, మీర్‌ఖాన్‌పేటలలో సుమారు 50 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ, భద్రత తదితరాల నిర్వహణ కోసం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) ఏర్పాటు చేయాలని ఆయన నిర్ణయించారు. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్), గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహాలో అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాధికార సంస్థ కార్యాచరణ, విధి విధానాలు ఉండేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ప్రత్యేక అథారిటీ అధీనంలో పని చేయడానికి రెవెన్యూ, పట్టణాభివృద్ధి తదితర విభాగాల సిబ్బందిని కేటాయించనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

అవాంతరాలు ఎదురవకుండా..

ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే 13,973 ఎకరాల భూమిని సేకరించింది. సుమారు మరో 36 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించనుంది. ఈ సిటీలో పారిశ్రామిక, పర్యాటక, ఆతిథ్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఇప్పటికే బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ, హెల్త్‌సైన్స్ పేరుతో 5 వేల ఎకరాల్లో గ్రీన్ ఫార్మాసిటీకి సీఎం శంకుస్థాపన చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సిటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ తరహాలో 70 ఎకరాల్లో అత్యాధునిక వాణిజ్య భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మలక్‌పేటలో 150 ఎకరాల్లోని హైదరాబాద్ రేస్ క్లబ్‌ను కూడా ఇక్కడకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫోర్త్ సిటీలో బీసీసీఐ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఈ క్రమంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ఎలాంటి అవాంతరాలు ఎదురవకుండా, అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా అథారిటీని ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు.

లక్ష్యం ఇలా..

మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జలమండలి, విద్యుత్, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, రోడ్డు రవాణా శాఖ, పబ్లిక్ ఏజెన్సీలతో అభివృద్ధి కార్యకలాపాలను ఎఫ్‌సీడీఏ సమన్వయం చేస్తుంది. ఫోర్త్ సిటీ అభివృద్ధి సంస్థకు ప్రత్యేకంగా కేటాయించిన నిధుల వినియోగం, ఆర్థిక నియంత్రణను పర్యవేక్షిస్తుంది. భవిష్యత్ నగరికి ప్రతిష్టాత్మకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశ, విదేశీ సంస్థలు, పెట్టుబడులు తీసుకురావాలని సీఎం భావిస్తున్నారు. పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక పాలసీలు, ప్రోత్సాహకాల రూపకల్పన, అమలు అథారిటీదే బాధ్యత. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌తో నిర్వాసితులైన వారికి పునరావాసం కల్పన, పరిహారం అందజేత వంటి ప్రత్యామ్నాయ మార్గాలను సూచించడంతో పాటు పేద, మధ్యతరగతి వారికి సైతం ఫ్యూచర్ సిటీలో స్థానం కల్పించేలా అథారిటీ పని చేయనుంది. ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను రూపొందించడం, టౌన్‌షిప్‌లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, భూ కేటాయింపులు తదితరాలను పర్యవేక్షిస్తుంది.

గుండెపోటుతో టెన్త్ విద్యార్థి మృతి

సీఎం కప్‌లో అపశ్రుతి



వనపర్తి: జిల్లావ్యాప్తంగా శనివారం ప్రారంభమైన గ్రామస్థాయి సీఎం క్రీడా పోటీల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో పాల్గొన్న పదవ తరగతి విద్యార్థి వాలీబాల్ ఆడుతూ కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పామిరెడ్డిపల్లి ముందరితండాకు చెందిన సాయి పునీత్ (15) బలిజపల్లి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నాడు. తోటి విద్యార్థులతో కలిసి ఉదయం నుంచి క్రీడాపోటీల్లో పాల్గొన్నాడు. పాఠశాల ఆవరణలో ఉదయం ఒకసారి కళ్లుతిరిగి పడిపోగా.. నిర్వాహకులు తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో తల్లి నీలమ్మ అక్కడికి చేరుకుంది. అయితే తనకు ఏమీ కాలేదని.. తల్లిని ఇంటికి వెళ్లమని పునీత్ చెప్పటంతో ఆమె ఇంటికి వెళ్లిపోయింది. మళ్లీ క్రీడల్లో పాల్గొన్న పునీత్ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. నిర్వాహకులు వెంటనే ఆస్పత్రికి తరలించగా.. పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. కాగా.. విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకులు జిల్లా కేంద్రంతో పాటు బలిజపల్లి గ్రామంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ఎమ్మెల్యే మేఘారెడ్డి హామీ ఇచ్చారు.



నా కుమారుడా! నీ తండ్రి ఉపదేశము ఆలకింపుము. నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము. అవి నీ తలకు సొగసైన మాలికయు నీ కంఠమునకు హారములునై యుండును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం
తిథి: శు.సప్తమి ఉ.7.41 వరకు, తదుపరి అష్టమి తె.5.35 వరకు(తెల్లవారితే సోమవారం),
నక్షత్రం: శతభిషం ప.2.41 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.8.41 నుండి 10.11 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.54 నుండి 4.37 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.50 నుండి 9.20 వరకు, తదుపరి తె.5.29 నుండి 7.13 వరకు(తెల్లవారితే సోమవారం)

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం : 5.22
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

ఏక్‌నాథ్ శిందే (ఉప ముఖ్యమంత్రి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఉదయ్ సామంత్, భరత్ గొగావాలే, రవి పాఠక్, సంజయ్ శిర్సాత్, నేను.. కూర్చొని ఉన్నాం. మాతో రాజన్ శర్మ కూడా ఉన్నారు.

రాజన్ శర్మ పార్టీ ఎలక్షన్ స్ట్రాటజిస్ట్. మిగతా నలుగురు... పార్టీలోని పొలిటికల్ స్ట్రాటజిస్టు లీడర్‌లు.

ఉప ముఖ్యమంత్రి పదవిని నేను నిరాకరించాలా, లేక అంగీకరించాలా అనే పది రోజుల సుదీర్ఘ సంశయ స్థితి ముగియటానికి ముందు రోజు జరిగిన సమావేశంలో రాజన్ శర్మ లేరు. నేను, ఆ నలుగురు లీడర్లు మాత్రమే ఉన్నాం.

ఇప్పుడు – ఉప ముఖ్యమంత్రిగా నేను ప్రమాణ స్వీకారం చేసి వచ్చాక జరుగుతున్న ఈ అంతరంగిక సమావేశానికి రాజన్ శర్మ కూడా వచ్చి జాయిన్ అయ్యారు.

"ఏమైనా మీరు తొందరపడ్డారు శిందేజీ..." అన్నారు శర్మ – కొంత సంభాషణ తర్వాత!

నేను ఉప ముఖ్యమంత్రి పదవిని అంగీకరించటాన్నే ఆయన తొందరపాటు అంటున్నారని సమావేశంలో ఉన్న నలుగురికీ అర్థం అయింది. అసలు ఉప ముఖ్యమంత్రి పదవిని స్వీకరించేలా నన్ను మోటివేట్ చేసింది ఆ నలుగురే!

"ముఖ్యమంత్రిగా తప్ప, ఉప ముఖ్యమంత్రిగా ఉండనని మీరు గట్టిగా చెప్పాల్సింది



శిందేజీ. అప్పుడు ప్రధానిలో ఒక అస్థిమితం ఉండేది. ప్రధాని సహపాత్రధారి అమిత్ షాలో ఒక జాగ్రత్త ఉండేది. మొత్తంగా బీజేపీనే... శివసేన అంటే ఒక రెస్పెక్ట్‌తో ఉండేది..." అన్నారు రాజన్ శర్మ.

"అలా అని మేము అనుకోవటం లేదు..." అన్నారు రవి పాఠక్, సంజయ్ శిర్సాత్.

"అవును అనుకోవటం లేదు..." అన్నారు ఉదయ్ సామంత్, భరత్ గొగావాలే.

"ఉప ముఖ్యమంత్రి పదవిని నిరాకరించి ఉంటే కూటమిలో శిందేజీకి వచ్చే రెస్పెక్ట్ గురించి నేను మాట్లాడుతున్నాను. ఉప ముఖ్యమంత్రి పదవిని అంగీకరిస్తే కేబినెట్‌లో శిందేజీ వర్గానికి వచ్చే పోర్టుఫోలియోల గురించి మీరు మాట్లాడుతున్నారు..." అన్నారు రాజన్ శర్మ.

"అవకాశాన్ని కాలదన్నుకొని రెస్పెక్ట్‌ని రాబట్టుకోవటం ఏం పని శర్మాజీ?! వచ్చిన అవకాశాన్నే నిచ్చెనగా వేసుకుని రెస్పెక్ట్‌ని కాళ్ల దగ్గరకు తెచ్చుకోవాలి కానీ..." అన్నారు ఆ నలుగురూ ఒకే మాటగా!

"ఇక నేను వెళతాను..." అంటూ లేచారు రాజన్ శర్మ.

"కూర్చోండి శర్మాజీ. ఎన్నికల్లో కూటమిని గెలిపించారు. మీ ప్రచార వ్యూహమే కదా కూటమిని నిలబెట్టింది..." అన్నాన్నేను.

"అదే అంటున్నాను శిందేజీ. ప్రజలు శివసేనపై అభిమానంతో బీజేపీని గెలిపిస్తే, బీజేపీ ఏం చేయాలి?! శివసేన నాయకుడిని కదా ముఖ్యమంత్రిని చేయాలి?" అన్నారు రాజన్ శర్మ.

"శర్మాజీ మీకు తెలియట్లేదు. ఎన్నికల ప్రచార వ్యూహం వేరు, ఎన్నికయ్యాక అధికారం కోసం వేయవలసిన ఎత్తుగడలు వేరు..." అన్నారు రవి పాఠక్ నవ్వుతూ.

ఆ నవ్వుకు దెబ్బతిన్నట్లు చూశారు రాజన్ శర్మ.

"ఎత్తుగడ అంటే ఫడ్నవిస్‌ది పాఠక్‌జీ. ఆయన్ని ముఖ్యమంత్రిని చేయాలని ఆయన వెనుక ఉన్న ఒక్కరూ అనలేదు. శిందేజీ వెనుక ఉన్నవాళ్లు మాత్రం శిందేజీ ఉప ముఖ్యమంత్రి పదవిని నిరాకరించకూడదని పట్టుపట్టారు..." అన్నారు రాజన్ శర్మ.

ఆ మాట నిజమే అనిపిస్తోంది!
ఈ నలుగురు పట్టిపట్టి ఉండకపోతే నా రెస్పెక్ట్ నాకుండేది. ఎప్పుడేం జరుగుతుందోనని మహారాష్ట్ర రాజకీయం అంతా నా చుట్టూ తిరుగుతుండేది.

ఒకటి మాత్రం వాస్తవం.

ఎవరైనా అయినవాళ్లు కానీ, కానివాళ్లు కానీ మన ఇష్టానికి వ్యతిరేకంగా మనల్ని ఏదైనా చెయ్యమని పట్టు పట్టినప్పుడు మనం వాళ్లకు తలొగ్గితే, ఆ తప్పు.. 'పట్టుపట్టిన' వాళ్లది అవదు. 'పట్టుబడిన' వాళ్లదే అవుతుంది.

సీజ్ ద పోర్ట్

జనతంత్రం



వర్ధెల్లి మురళి



ఒక సాధారణ రైస్ మిల్లు యజమాని స్థాయి నుంచి ఎకాయెకిన ఓడరేవు యజమానిగా ఎదగగలిగిన నేర్పరి కేవీ రావు. అటువంటి వ్యక్తి ఓ యువకుడు వచ్చి బెదిరించగానే ఆస్తులు రాసిచ్చేటంతటి అర్భకుడని ఎవరు నమ్మగలుగుతారు? ఒకవేళ అటువంటి బెదిరింపులు ఎదురైవుంటే కేసు పెట్టలేనంత అమాయకుడేం కాదు కదా! సెబీకో, ఎన్‌సీఎల్‌టీకో ఫిర్యాదు చేయాలని కూడా తెలియని వ్యక్తి కాదుగదా? కనీసం యెల్లో మీడియా చెవిలో ఊదాలనీ, తనను పోర్టు యజమానిని చేసిన చంద్రబాబుకు చెప్పుకోవాలని కూడా తోచలేదా? ఆ పని చేసివుంటే వాళ్లు అప్పుడే ఒక బడబానలాన్ని సృష్టించి ఉండేవారు కాదా? వాటాలను అమ్మేసిన ఐదేళ్ల తర్వాత మంత్రులు పెట్టిన ముహూర్తానికే కేవీ రావు నిద్ర లేవడం వెనకనున్న రహస్యం గురించి విజ్ఞులైన ప్రజలు అర్థం చేసుకోలేరా?

వైసీపీలోని ప్రముఖులను ఏదోరకంగా కేసుల్లో ఇరికించాలి. కాకినాడ సీపోర్టును మళ్లీ కాజెయ్యాలి. జగన్ మోహన్‌రెడ్డి వ్యక్తిగత ప్రతిష్ఠకు ఇంకొంచెం మసి పూయాలి. ఇదే కదా వ్యూహం? అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ప్రభుత్వం వారి ఏకసూత్ర కార్యక్రమంగా ఈ వ్యూహం మారిపోయింది. అసలు కాకినాడ సీపోర్టు కూడా ప్రభుత్వానిదే! ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం తెచ్చి మరీ నిర్మించారు. దీన్ని అప్పనంగా పప్పుబెల్లాలకు కేవీ రావుకు కట్టబెట్టింది చంద్రబాబే!

ఎన్నికల హామీలను అమలు చేయడం మాట దేవుడెరుగు. ప్రజల దైనందిన సమస్యలను కూడా పెడచెవిన పెడుతున్న ప్రభుత్వాన్ని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చూస్తున్నాము. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రాశులు పోసుకున్న రైతుల కళ్లల్లో దైన్యాన్ని చూస్తున్నాము. మద్దతు ధర లభించక దారుణంగా నష్టపోతున్న రైతన్నల దుఃస్థితి ప్రతి గ్రామానా కనిపిస్తున్నది. ప్రభుత్వం మాత్రం రైతును దగా చేస్తున్న దళారుల కళ్లల్లో ఆనందాన్ని చూస్తున్నట్టున్నది. రైతు సేవా కేంద్రాలు ఆచరణలో దళారీ సేవా కేంద్రాలుగా మారాయని రైతులు విమర్శిస్తున్నారు.

నిబంధనలకు తిలోదకాలిచ్చి తేమ శాతాన్ని అధికంగా చూపెట్టి బస్తాకు 400 నుంచి 500 రూపాయల వరకు దళారులు లాగేస్తున్నారని సమాచారం. రైతుకు లభించవలసిన మద్దతు ధరలో టన్నుకు కనీసం 6 వేల రూపాయల చొప్పున దళారులు మింగేస్తున్నారని రైతు సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ సంవత్సరం 37 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రభుత్వం జీవో ఇచ్చింది. రైతులు పండించిన మొత్తం ధాన్యం 84 లక్షల టన్నులని అంచనా.

ప్రభుత్వం చెప్పుకున్న లక్ష్యం ప్రకారం 37 లక్షల టన్నుల లెక్కనే తీసుకుందాం. టన్నుకు ఆరువేల చొప్పున ఈ మొత్తం ధాన్యంలో దళారీల దోపిడీ విలువెంత? 2,200 కోట్లు! రైతు సేవా కేంద్రాల్లోనే తిష్ఠవేసిన గాదె కింది పందికొక్కులు అప్పనంగా 2,200 కోట్ల రూపాయల రైతుల శ్రమ ఫలాన్ని లాక్కుంటూ ఉంటే మన సర్కార్ వారు ఏం చేస్తున్నారో తెలుసా? ఉపముఖ్యమంత్రి, మరో మంత్రి కలిసి రేషన్ బియ్యం అక్రమ రవాణా దొంగలను పట్టుకుంటామంటూ సముద్రంలోకి వెళ్లి 'సీజ్ ద షిప్' అని గర్జిస్తున్నారు. ఇంతకూ ఆ మంత్రివర్యులు సీజ్ చేయమన్న షిప్పులో ఏమున్నది? 38 వేల మెట్రిక్ టన్నుల బియ్యం లోడ్‌చేసి ఉన్నాయట! అందులో మన రేషన్ బియ్యం మాత్రం 640 టన్నులేనని తెలుస్తున్నది.

ఈ రేషన్ బియ్యాన్ని సేకరించి ఎగుమతి చేయడానికి కిలోకు 40 రూపాయలు పడుతుందని ఓ లెక్క. టన్నుకు 40 వేలు. 'సీజ్ ద షిప్'లో ఉన్న 640 టన్నుల విలువ దాదాపుగా రెండున్నర కోట్లు! పెద్ద లెక్కే. ఆ ఓడతోపాటు మరో ఓడలో ఇండోనీషియాకు పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని మరో మంత్రిగారి వియ్యంకుడు తరలించారనీ, దాని జోలికి మాత్రం మన డిప్యూటీ వెళ్లలేదని వైసీపీ వాళ్లు విమర్శిస్తున్నారు. ప్రజాపంపిణీ కోసం ఉద్దేశించిన రేషన్ బియ్యం అక్రమ మార్గం పడితే అరికట్టవలసినదే! అభ్యంతరం లేదు. అందుకు మన వ్యవస్థలను సక్రమంగా వినియోగించుకుంటే సరిపోతుంది. ఇంత పెద్ద ఛేజింగ్ సినిమా అవసరం లేదు.

ఒకపక్క రైతుల జేబులు కొట్టి వేల కోట్లు లాగేసుకునే పనిలో ఉన్న దళారులను పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం కాకినాడ రేవుకాడ ఈ డ్రామా వేయడం వెనుక మరేదో మతలబు ఉందనిపించడం లేదా? నిజంగానే చాలా మతలబు ఉన్నది. కాకినాడ రేవు ఇతివృత్తంతో చాలా సన్నివేశాలను వరసగా నడిపించారు. 'సీజ్ ద షిప్' ఓ డైలాగ్ మాత్రమే! సినిమా టైటిల్ 'సీజ్ ద పోర్ట్' కావచ్చు!! నవంబర్ మొదటి వారంలో రాష్ట్ర ఆర్థికమంత్రి తన వియ్యంకుడి ఇంట్లో ఫంక్షన్ కోసం పెద్దాపురం వెళ్లారు. ఆ వెంటనే ఓ మంత్రిగారు కాకినాడ పోర్టుకు వెళ్లారనీ, అక్కడ పోర్టు అధినేత కేవీ రావునూ, సీఈఓ మురళీధరన్‌నూ కలిసి వచ్చారనీ విశ్వసనీయ సమాచారం. అయితే ఈ వివరాలను గోప్యంగా ఉంచారు. నవంబర్ 27న కాకినాడ జిల్లా కలెక్టర్ యాంకరేజి పోర్టులో లోడింగ్ జరుగుతున్న నౌకను తనిఖీ చేశారు. అందులో లోడ్ చేసిన బియ్యంతో 640 టన్నుల పీడీఎస్ బియ్యం కూడా ఉన్నట్టు గుర్తించారు.

మరో రెండు రోజులకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు ఢిల్లీ నుంచి వచ్చీరావడంతోనే కాకినాడ పోర్టుకు వెళ్లారు. 'సీజ్ ద షిప్' సన్నివేశాన్ని రక్తి కట్టించారు. ఈ పోర్టు ఎవరిది, ఇక్కడ అధికారులెవరంటూ పవన్ ప్రశ్నించారు. వాస్తవానికి బియ్యం ఎగుమతి జరుగుతున్న యాంకరేజీ పోర్టు నూటికి నూరుపాళ్లు ప్రభుత్వానిదే! పోర్టు ప్రభుత్వానిదే, రాష్ట్రంలో ఉన్న అన్ని శాఖల అధికారులపై పెత్తనం ప్రభుత్వానిదే! మరి పౌర సరఫరా బియ్యం అక్రమ రవాణా జరిగితే బాధ్యులు ఎవరవుతారు? ఈ మౌలికమైన అంశాన్ని ఉప ముఖ్యమంత్రి పక్కనబెట్టి హడావిడి చేశారు.

ఒకపక్క రైతుల జేబులు కొట్టి వేల కోట్లు లాగేసుకునే పనిలో ఉన్న దళారులను పట్టించుకోని ప్రభుత్వం కాకినాడ రేవు కాడ ఈ డ్రామా వేయడం వెనుక మరేదో మతలబు ఉందనిపించడం లేదా? నిజంగానే చాలా మతలబు ఉన్నది. కాకినాడ రేవు ఇతివృత్తంతో చాలా సన్నివేశాలను వరసగా నడిపించారు. 'సీజ్ ద షిప్' ఓ డైలాగ్ మాత్రమే! సినిమా టైటిల్ 'సీజ్ ద పోర్ట్' కావచ్చు!!

నవంబర్ మొదటి వారంలో రాష్ట్ర ఆర్థికమంత్రి తన వియ్యంకుడి ఇంట్లో ఫంక్షన్ కోసం పెద్దాపురం వెళ్లారు. ఆ వెంటనే ఓ మంత్రిగారు కాకినాడ పోర్టుకు వెళ్లారనీ, అక్కడ పోర్టు అధినేత కేవీ రావునూ, సీఈఓ మురళీధరన్‌నూ కలిసి వచ్చారనీ విశ్వసనీయ సమాచారం. అయితే ఈ వివరాలను గోప్యంగా ఉంచారు. నవంబర్ 27న కాకినాడ జిల్లా కలెక్టర్ యాంకరేజి పోర్టులో లోడింగ్ జరుగుతున్న నౌకను తనిఖీ చేశారు. అందులో లోడ్ చేసిన బియ్యంతో 640 టన్నుల పీడీఎస్ బియ్యం కూడా ఉన్నట్టు గుర్తించారు.

మరో రెండు రోజులకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు ఢిల్లీ నుంచి వచ్చీరావడంతోనే కాకినాడ పోర్టుకు వెళ్లారు. 'సీజ్ ద షిప్' సన్నివేశాన్ని రక్తి కట్టించారు. ఈ పోర్టు ఎవరిది, ఇక్కడ అధికారులెవరంటూ పవన్ ప్రశ్నించారు. వాస్తవానికి బియ్యం ఎగుమతి జరుగుతున్న యాంకరేజీ పోర్టు నూటికి నూరుపాళ్లు ప్రభుత్వానిదే! పోర్టు ప్రభుత్వానిదే, రాష్ట్రంలో ఉన్న అన్ని శాఖల అధికారులపై పెత్తనం ప్రభుత్వానిదే! మరి పౌర సరఫరా బియ్యం అక్రమ రవాణా జరిగితే బాధ్యులు ఎవరవుతారు? ఈ మౌలికమైన అంశాన్ని ఉప ముఖ్యమంత్రి పక్కనబెట్టి హడావిడి చేశారు. ఆయన సహచరుడు నాదెండ్ల మనోహర్ మరో అడుగు ముందుకువేసి కాకినాడ పోర్టు యాజమాన్యంలో 41 శాతాన్ని బలవంతంగా అప్పటి ప్రభుత్వ పెద్దలు లాగేసుకుని 'అరబిందో'కు కట్టబెట్టారని ఆరోపించారు.

ఇక్కడ అసలు కథ ప్రారంభమైంది. బియ్యం ఎగుమతులు జరుగుతున్న యాంకరేజీ పోర్టు వేరు. అరబిందో కంపెనీ వాటాలు కొనుక్కున్న డీప్ వాటర్ పోర్టు వేరు. కాకినాడ పోర్టు అనే పేరుతో ఈ రెండు పోర్టుల మధ్య తేడా తెలియకుండా గందరగోళ పరచడం ఉద్దేశపూర్వకమే. ఎందుకంటే 'కాకినాడ సీపోర్ట్స్' పేరుతో ఉన్న డీప్ వాటర్ పోర్టులో అరబిందో కంపెనీ వాటాలు కొనుగోలు చేసినప్పుడు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. డీప్ వాటర్ పోర్టు వాటాల కొనుగోలుకూ, యాంకరేజీ పోర్టులో బియ్యం అక్రమ ఎగుమతి వార్తలకూ లంకె బిగించే వ్యూహం కావచ్చు. చేతిలో మీడియా ఉన్నది కదా!

నాదెండ్ల మనోహర్ కథను ప్రారంభించిన మరుసటి రోజే కేవీ రావు అనే సదరు పోర్టు యజమాని వైసీపీకి చెందిన ముఖ్యులపై ఫిర్యాదు చేయడం, ఆ కేసును సీఐడీ చేపట్టడం చకచకా జరిగిపోయాయి. అరబిందో అనేది సుమారు పది బిలియన్ డాలర్ల టర్నోవర్ కలిగిన ఒక మల్టీనేషనల్ కంపెనీ, ప్రతిష్ఠాత్మక సంస్థ. కాకినాడ సీపోర్ట్స్‌లో 495 కోట్ల రూపాయలు చెల్లించి 41 శాతం వాటాను కొనుగోలు చేసింది. ఒకవేళ ప్రభుత్వంలోని ప్రముఖుల్ని ఉపయోగించుకొని బెదిరించి ఉంటే అంత సొమ్ము ఎందుకు చెల్లించాలనేది మొదటి కామన్‌సెన్స్ ప్రశ్న. ఇంకో పది శాతం రాయించుకుంటే పోర్టు మీద పెత్తనం వారికే వచ్చేది కదా! ఎందుకని వదిలేశారన్నది రెండో కామన్‌సెన్స్ ప్రశ్న! భయంతో గజగజ వణికిపోయి వాటాలు రాసిచ్చేసిన వ్యక్తే ఇంకా ఆ పోర్టుకు అధిపతిగా, ఆయన నియమించుకున్న మనిషే సీఈవోగా ఎలా కొనసాగుతున్నారనేది ఇంగితజ్ఞానం వేసే ఇంకో ప్రశ్న.

ఒక సాధారణ రైస్ మిల్లు యజమాని స్థాయి నుంచి ఎకాయెకిన ఓడరేవు యజమానిగా ఎదగగలిగిన నేర్పరి కేవీ రావు. అటువంటి వ్యక్తి ఓ యువకుడు వచ్చి బెదిరించగానే ఆస్తులు రాసిచ్చేటంతటి అర్భకుడని ఎవరు నమ్మగలుగుతారు? ఒకవేళ అటువంటి బెదిరింపులు ఎదురైవుంటే కేసు పెట్టలేనంత అమాయకుడేం కాదు కదా! సెబీకో, ఎన్‌సీఎల్‌టీకో ఫిర్యాదు చేయాలని కూడా తెలియని వ్యక్తి కాదుగదా? కనీసం యెల్లో మీడియా చెవిలో ఊదాలనీ, తనను పోర్టు యజమానిని చేసిన చంద్రబాబుకు చెప్పుకోవాలని కూడా తోచలేదా? ఆ పని చేసివుంటే వాళ్లు అప్పుడే ఒక బడబానలాన్ని సృష్టించి ఉండేవారు కాదా? వాటాలను అమ్మేసిన ఐదేళ్ల తర్వాత మంత్రులు పెట్టిన ముహూర్తానికే కేవీ రావు నిద్ర లేవడం వెనకనున్న రహస్యం గురించి విజ్ఞులైన ప్రజలు అర్థం చేసుకోలేరా?

వైసీపీలోని ప్రముఖులను ఏదోరకంగా కేసుల్లో ఇరికించాలి. కాకినాడ సీపోర్టును మళ్లీ కాజెయ్యాలి, జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత ప్రతిష్ఠకు ఇంకొంచెం మసి పూయాలి. ఇదే కదా వ్యూహం? అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ప్రభుత్వం వారి ఏకసూత్ర కార్యక్రమంగా ఈ వ్యూహం మారిపోయింది. అసలు కాకినాడ సీపోర్టు కూడా ప్రభుత్వానిదే! ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం తెచ్చి మరీ నిర్మించారు. దీన్ని అప్పనంగా పప్పుబెల్లాలకు కేవీ రావుకు కట్టబెట్టింది చంద్రబాబే! పోర్టు పరిసర ప్రాంతాల్లోని భూములను కూడా దేశంలో ఎక్కడా లేనంత కారుచౌకగా ఆయనకు కట్టబెట్టారు. కేవీ రావు మీద ఎందుకింతటి అవ్యాజమైన ప్రేమ? రైస్ మిల్ యజమాని హఠాత్తుగా పోర్టు యజమాని ఎలా అయ్యారు? ఆయన చట్టబద్ధంగా అమ్మేసుకున్న వాటాలను మళ్లీ కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయా? ఇంతకూ కేవీ రావు పోర్టు సొంతదారేనా లేక ఎవరికైనా బినామీగా ఉన్నారా? అనే అనుమానాలు కూడా జనంలో ఉన్నాయి. 'సీజ్ ద పోర్ట్' సినిమా పూర్తయితే తప్ప యథార్థాలు బయటకు రావేమో!

పోర్టుకు అనుబంధంగా ఏర్పాటు చేసిన కాకినాడ సెజ్ భూములపై కూడా యెల్లో మీడియా పచ్చి అసత్యాలను ప్రచారం చేస్తున్నది. పరిశ్రమలు ప్రారంభించకుండా వదిలేసిన కారణంగా తమ భూములను తమకిచ్చేయాలని దీర్ఘకాలంగా రైతులు ఆందోళన చేస్తున్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఆ రైతులను అరెస్టు చేసి సెంట్రల్ జైల్లో నిర్బంధించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతుల కోర్కెను గౌరవించి 2180 ఎకరాల భూములను తిరిగి ఇచ్చేశారు. భారతదేశ చరిత్రలో సేకరించిన భూములను తిరిగి రైతులపరం చేసిన ఏకైక సందర్భం ఇది. వాస్తవాలు ఇలా ఉంటే సెజ్ భూముల్లో జగన్ హయాంలో గోల్‌మాల్ జరిగిందని యెల్లో మీడియా కనికట్టు విద్యల్ని ప్రదర్శిస్తున్నది. ఈ వైఖరిని ఆ ప్రాంత రైతు ప్రతినిధులు శనివారం నాడు సమావేశమై మీడియా సమక్షంలో నిర్ద్వంద్వంగా ఖండించారు. కాకినాడ సెజ్ భాగోతాన్ని 2003లో బాబే ప్రారంభించారు. లాభాల్లో ఉన్న పోర్టును 1999లో ఆయనే కేవీ రావుకు కట్టబెట్టారు. ఆ రోజుల నుంచి విచారణ జరిగితే తప్ప దొరలెవరో, దొంగలెవరో వెల్లడి కాదని విజ్ఞుల అభిప్రాయం.

vardhelli1959@gmail.com

కులదూషణ ఏ సంస్కృతికి ప్రతీక?

అభిప్రాయం



వెలిచాల రాజేందర్‌రావు

ఎన్నికైన ప్రజాప్రతినిధులు పదవీ స్వీకారం రోజున చేసే ప్రమాణాలకు కట్టుబడి ప్రజలకు కుల మతాలకు అతీతంగా సేవలు చేయాలి. బాధ్యతలూ నిర్వర్తించాల్సి ఉంటుంది. రాగ ద్వేషాలకు అతీతంగా వారు ఉండి తీరాల్సిందే. ఏ ఒక్కరిపై విద్వేషపూరితంగా వ్యవహరిస్తూ అనుచిత వ్యాఖ్యలు సైతం చేయకూడదు. అలా చేస్తే రాజ్యాంగాన్ని ధిక్కరించిన వారు అవుతారు. ఇటీవల ఒక ప్రజా ప్రతినిధి ఒక కులాన్ని ఉద్దేశపూర్వకంగా దూషించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఆ ప్రజాప్రతినిధి అలా మాట్లాడవచ్చా? ఎవరో ఏదో చేశారని మొత్తం ఆ కులాన్ని టార్గెట్ చేయడం విస్మయం కలిగిస్తున్నది. ఈ విధానాన్ని అన్ని రాజకీయ పక్షాలూ ముక్తకంఠంతో ఖండించాలి. అప్పుడే ఇలాంటి వారి వైఖరిలో మార్పు వస్తుంది.

ఓ సామాజిక వర్గానికి చెందిన నేత 10 ఏండ్లు పాలించిన మాత్రాన ఆయనపై కోపంతో ఈ ప్రజాప్రతినిధి ఆ నేత కులస్థుల నందరినీ దూషించడం భావ్యమేనా? ఈ ప్రజాప్రతినిధి సొంత పార్టీలో కూడా ఆయన తిట్టిన సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయిన ముగ్గురు అసెంబ్లీ నియోజకవర్గ నేతలకు కూడా ఈ సంబోధన వర్తిస్తుందా అనేది స్పష్టం చేయాలి. అదే పార్టీకి చెందిన పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన ఒక అభ్యర్థి విషయంలో కూడా ఆయన అభిప్రాయం ఇదే అయితే పార్టీని, పార్టీ నిర్ణయాన్ని తప్పు పట్టినట్టే కదా! ఈ విషయంలో వెంటనే స్పందించి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆ ప్రజాప్రతినిధిని వివరణ ఇవ్వాలని ఆదేశించడం శుభపరిణామం. అడ్డదిడ్డంగా మాట్లాడే ప్రజాప్రతినిధులకు ఒక గుణపాఠం కావాలని కోరుకోవడం ఎంతైనా అవసరం.

అన్ని కులాలు, జాతుల వారితోపాటు చివరకు ఆయన దూషించిన కులం వారు కూడా ఆయనకు ఓట్లు వేస్తేనే కదా గెలిచింది? ఆ నియోజకవర్గంలో ఉన్న అన్ని కులాలకూ ఆయనే కదా ప్రజాప్రతినిధి! అలాంటిది ఒక కులాన్ని టార్గెట్ చేస్తూ బెదిరింపులకు దిగడం దేనికి సంకేతం? ఇదేనా ఒక ప్రజాప్రతినిధికి ఉండాల్సిన లక్షణాలు. ఆయనే ఆత్మవిమర్శ చేసుకోవాలి. దీనికి సమాధానం చెప్పి తీరాలి. ఆ ఒక్క కులాన్నే కాదు... ఏ కులాన్ని దూషించే హక్కూ ఎవరికీ లేదు. ఇలా చేస్తే రాజ్యాంగం మీద ఏ మాత్రం గౌరవం లేనట్టే లెక్క. గౌరవం ఉన్న వారు ఇలా ప్రవర్తించరు.

కులాలపై దూషణలకు దిగినా, ద్వేషించినా అన్ని రాజకీయ పార్టీలూ అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలి. ఈ విధమైన సంస్కృతిని ఎవరూ ప్రోత్సహించవద్దు. ఎవరైనా ప్రోత్సహించినా తగిన శాస్తి చేయాలి. ప్రజల్లో హీరోయిజం చూపించేందుకు ఇలాంటి మార్గాన్ని ఎన్నుకోవడం దుందుడుకు చర్య అవుతుంది.

అరవై, డెబ్బై ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీతో అత్యంత అనుబంధం ఉన్న ఆ కులానికి చెందిన నేతలు పెద్ద పెద్ద హోదాల్లో పని చేశారు. కులరహితంగా సేవలందించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా నిత్యం



పాటుపడ్డారు. కులాలను ఎప్పుడూ తక్కువగా చూడలేదు. అందరికీ తోడుగా, నీడగా వ్యవహరించారు. ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా భరోసా కల్పించేవారు. దేశం, తెలంగాణ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించారు. అదే విధంగా మరో జాతీయ పార్టీలో ఆ కులానికి చెందిన నేతలకు ప్రజాప్రతినిధులుగా, గవర్నర్లుగా పనిచేసిన అనుభవం ఉన్నది. ఏతావతా చెప్పొచ్చేదేమిటంటే... అన్ని పార్టీల్లోనూ ఈ కులస్థులు ఉన్నారనే! ఈ ఇంగితాన్ని మరచి ఒక నేత పట్ల ఉన్న ఆక్రోశంతో అతడి కులస్థుల నందరినీ తిట్టి బాధపడేలా చేయడం సరి కాదు కదా! మొత్తం రాజకీయ వాతావరణమే ఈ చర్యతో దెబ్బతిన్నదనేది వాస్తవం.

కుల సంఘాల వారు ఇదే రకమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండి, రాజ్యాంగబద్ధంగా వారి హక్కుల కోసం పోరాడడం మంచి పద్ధతి. అలా కాకుండా సోషల్ మీడియా వేదికలపై ఒకరి కులాన్ని మరో కులంవారు తిడుతూ రెచ్చగొట్టుకోవడం సరికాదు. ఈ విషయంలో అందరూ సంయమనాన్ని పాటించాలి. ప్రజాప్రతినిధుల పైన ఒత్తిడి తెచ్చి, తమ గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన ఇటువంటి ప్రజాప్రతినిధులపైన ఆ పార్టీ పెద్దలు చర్యలు తీసుకునేలా ఒత్తిడి చేయడం సరైన మార్గం. ప్రజల చేత ఎన్నికై, ప్రజల కోసం పని చేసే నేతలు ఆచితూచి మాట్లాడాల్సి ఉంటుంది.

వెలమ జాతి ఒక్కరి సొత్తు కాదు. వారు ఒక్కరి దిక్కు ఒరిగి లేరు. నిజానికి ఆ కులాన్ని తిట్టిన ప్రజాప్రతినిధి పార్టీలోనే ఎక్కువ మంది వెలమలు ఉన్నారు అనే విషయం మరిచిపోకూడదు. గత ఏడు దశాబ్దాలుగా వారు కాంగ్రెస్ వెన్నంటే ఉన్నమాట జగమెరిగిన సత్యం కాదా? ఇవన్నీ మర్చిపోయి ఈ దూషణతో వ్యక్తిగతంగా దిగజారుతూ, పార్టీకి కూడా ఆయన చేసిన పాపం అంటగట్టడం ఎందుకు?

దేశానికి ఆపద వస్తే కులమతాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా నిలిచిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. పార్టీల మధ్య ఎన్ని వైరుద్ధ్యాలు ఉన్నా భారతీయులందరూ దేశ రక్షణ, అభివృద్ధిలో ఏకతాటిపై ఉండడం సహజం. ఇది మన లక్ష్యం. ఈ విషయంలో అది తెలంగాణ అయినా, మన సొంత జిల్లా అయినా, పక్క జిల్లా అయినా అక్కడ ప్రజలు ఆపదలో ఉంటే కులమతాలకు అతీతంగా ఆదుకొని తీరుతాం. సమాజంలో మనుషులంతా సమానమే. కులాలు వేరు వేరు ఉంటాయి. ఆ కులంలో పుట్టాం... ఈ కులంలో పుట్టాం... అని చింతించుకుంటూ పోతే లాభం లేదు. ఒక చిన్న కులంలో పుట్టడం నేరం కాదు. పెద్ద కులంలో పుట్టానని పొంగిపోవడం మంచిది కాదు. ఒక కులంపై విద్వేషం చిమ్మే విధంగా మరొకరు మాట్లాడడం భావ్యం కూడా కాదు. అసలు కుల ప్రస్తావన తేవడం నేరం కిందకే వస్తుంది. కులం పేరిట దూషిస్తూ స్వలాభం పొందడం రోతపుట్టిస్తుంది.

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సర్కారు కులగణనను ఓ వైపు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ప్రజాప్రతినిధి ఓ కులంపై విషం చిమ్మడం దారుణం. అసలు కులగణన ఎందుకు జరిపిస్తున్నారన్న ఎరుక ఈ ప్రజాప్రతినిధికి ఉందా? వివిధ కులాల వారు ఎవరెవరు ఎంతమంది ఉన్నారో తెలుసుకుని వారి వారి జనాభాల నిష్పత్తుల ప్రకారం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడానికే కదా! అంటే అన్ని కులాలనూ సమానదృష్టితో చూడడానికే కదా! మరి ఈ ప్రజాప్రతినిధి ఒక కులంపై ఇంత దారుణ వ్యాఖ్యలు చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సభ్యసమాజంపై ఉంది. ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీలూ, పౌర సమాజం మొత్తం ఇది అర్థం చేసుకొని వ్యవహరించాలి. అప్పుడే సమాజ శ్రేయస్సుకు తోడ్పాటు అందించిన వారు అవుతారు. లేకపోతే సమాజానికే ప్రమాదం.

వ్యాసకర్త కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి । 9849061481

మహద్గంగ

నదులలో గంగానదిది ఉన్నత స్థానం. వేద కాలం నుండి గంగానది మాహాత్మ్యం కొనియాడబడింది. 'సుభద్రా పరిణయం' కావ్యంలో అర్జునుడి చేత గంగానది గొప్పదనాన్ని ఈ కంద పద్యంలో కూచిమంచి జగ్గకవి ఇలా చెప్పాడు: జ్వాలాభీలానలయుత/ హాలాహల మారగించి హరుడటు సోలన్/ నీ లలితామృతలేశము/ మౌళిపయిం జిలికి యతని మనిచితివి గదా.

అమృతం కోసం సురాసురులు సాగించిన క్షీర సాగర మథనంలో అమృతం ఆవిర్భవించడానికి ముందు సాగర గర్భం నుండి హాలాహలం పుట్టింది. సురాసురులు పరుగున వెళ్లి శివుడిని ప్రార్థించారు. హాలాహలంతో ఈ ఆటలేమిటి? అని పార్వతి మనసులోని కించిత్ చింతను లోక కల్యాణం కోసం ఆ మాత్రం సాహసం చేయక తప్పదని సమాధాన పరిచాడు. హాలాహలాన్ని మింగి గరళకంఠుడయ్యాడు. ఈ సందర్భాన్ని ఆధారం చేసుకుని ఒక అందమైన ఊహను పై పద్యంగా మలిచిచెప్పాడు జగ్గకవి. సముద్రం నుండి పుట్టిన హాలాహలం భగభగ మండే మంటలతో కూడి భీకరమైనది. క్షణ క్షణం విస్తరించిన ఆ హాలాహలం ప్రభావానికి అప్పటికే ఎంతోమంది హతులయ్యారు. అటువంటి ఆ అగ్నికీలల గరళాన్ని మొత్తాన్ని సేకరించి ఒక ముద్దగా చేసి శంకరుడు తన గళంలోకి గ్రహించి, గొంతుకలోనే బంధించి పెట్టాడు. అయితే, గొంతుకలో చేరిన గరళపు ముద్ద దాని జ్వాలాభీలత్వాన్ని శంకరుడిపై చూపుతుంది కదా! ఆ విష ప్రభావానికి కొన్ని క్షణాలు సొమ్మసిల్లి పడిపోక తప్పలేదు శంకరుడికి. జరుగుతున్నదంతా తలపైనే కూర్చుని తిలకిస్తున్న గంగమ్మ, తనకు ఏమీ పట్టనట్లు చూస్తూ ఎలా ఉరుకోగలదు? వెంటనే అమృతోపమానమైన తన జలాన్ని శివుడి మీద చిలకరించింది. గంగాజలం తనువును తాకగానే శంకరుడు తేరుకుని కుదుటపడ్డాడని గంగాజల మాహాత్మ్యాన్ని చమత్కరించాడు.



జ్యోతిర్మయం

– భట్టు వెంకటరావు

సీనియర్లు వేధిస్తున్నారని విద్యార్థి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఈసం రుత్విక్

గూడూరు: ఆశ్రమ పాఠశాలలో సీని యర్ విద్యార్థులు తరచూ వేధిస్తుండటంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఎలర్జీ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం ఈ ఘట న జరిగింది. కొత్త గూడ మండలం తిరుమలగండికి చెందిన ఈసం రుత్విక్ 6వ తరగతి చదువుతున్నాడు. అతడిని కొద్ది రోజు లుగా 10, 9వ తరగతికి చెందిన ఇద్దరు విద్యా ర్థులు వేధిస్తున్నారు. రుత్విక్ ఈ విషయాన్ని ఆశ్రమ పాఠశాల వార్డెన్‌కు, ఉపాధ్యాయులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రుత్విక్.. ఇటీవల వైద్యశిబిరంలో గజ్జి, తామర నివారణకు ఇచ్చిన ఎలర్జీ మందు తాగి పడిపోయాడు. వెంటనే గుర్తించిన విద్యార్థులు వార్డెన్‌కు చెప్పగా, సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి అనంతరం మానుకోట ప్రస్తుతం రుత్విక్ పరిస్థితి మెరుగ్గానే ఉందని వార్డెన్ సురేందర్ తెలిపారు.

దాసర్‌పల్లిలో స్వల్పంగా భూ ప్రకంపనలు

చిన్నచింతకుంట/కౌకుంట్ల: మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం దాసర్‌పల్లిలో శనివారం మధ్యాహ్నం అకస్మా త్తుగా భూ ప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 3.0గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదు. ఈ ప్రకంపనలతో గ్రామంలో కొందరికి తల తిరిగినట్లు అనిపించడంతో భయాందోళనకు గుర య్యారు. గ్రామంలో ఎక్కువగా వ్యవసాయంపైనే ఆధా రపడి బోరు, బావులను తవ్వడం వల్ల భూకంపం సంభవించిందా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇది గారడీ సర్కార్


బహిరంగ సభకు హాజరైన బీజేపీ కార్యకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

అని నడ్డా మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన పైనే నమ్మకం లేదని.. అందుకే పూటకోమాట చెప్పి ప్రజల్ని ప్రసన్నం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారని వివర్శించారు. అప్పులు చేస్తూ మనుగడ సాగించే ప్రభుత్వాలు ఎక్కువకాలం ఉండవంటూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

కాంగ్రెస్‌పై పోరాడతాం..

'కాంగ్రెస్ ఏడాది పాలనను ప్రజల ముందే ఎండగట్టేందుకు ఇక్కడికి వచ్చా. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, ఇప్పుడున్న కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడా లేదు. ఉద్యమాలు చేసి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజలు ఇప్పటికీ మోసపోతూనే ఉన్నారు. మాయమాటలతో రైతులు, మహిళలు, యువకులు, కార్మికులను మోసగించిన కాంగ్రెస్‌పై పోరాడాలని నిర్ణయించాం' అని నడ్డా పేర్కొన్నారు.

భవిష్యత్ అంతా బీజేపీదే...

ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓట్ల శాతం భారీగా పెరిగిందని నడ్డా ఉద్ఘాటించారు. 'దేశంలోని 19 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. మరో ఆరు రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలున్నాయి. ఒక్కసారి బీజేపీ అధికారంలోకి వస్తే అది శాశ్వతంగా ఉంటుంది. గత 30 ఏళ్లుగా గుజరాత్‌లో బీజేపీదే అధికారం. అక్కడి ప్రజల గుండెల్లో కేవలం కమలమే ఉంది. రాజస్తాన్‌లో ఆరుసార్లు, గోవాలో మూడుసార్లు, మధ్యప్రదేశ్‌లో మూడుసార్లు, యూపీలో రెండుసార్లు బీజేపీ అధికారం దక్కించుకుంది. మహారాష్ట్రలోనూ మూడోసారి విజయం సాధించింది. ఉత్తరాఖండ్‌లో రెండు, మణిపూర్‌లో మూడు, అస్సాంలో రెండు, హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చింది. ఇకపై దేశ భవిష్యత్ అంతా బీజేపీదే. వచ్చే ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుంది' అని నడ్డా ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణకు ఎన్నో కేంద్ర ప్రాజెక్టులు..

మోదీ ప్రభుత్వంలో తెలంగాణకు ఎంతో అభివృద్ధి జరిగిందని. పన్నుల రూపంలో రూ. 1.60 లక్షల కోట్లు, గ్రాంట్ల ద్వారా రూ.1.12 లక్షల కోట్లు, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు, టెక్స్‌టైల్, రైల్వేకు 20 రెట్ల బడ్జెట్ కేటాయింపులు, వందేభారత్ రైళ్లు, భారత్ మాలా ప్రాజెక్టు కింద హైదరాబాద్ ఇండోర్, సూరత్ చెన్నై, హైదరాబాద్–వైజాగ్ లాంటి జాతీయ రహదారులు, బీబీనగర్‌లోనూ ఎయిమ్స్ నిర్మాణం తదితర ఎన్నో ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయన్నారు.

నిజమైన మార్పు బీజేపీతోనే సాధ్యం: కిషన్‌రెడ్డి

బీఆర్ఎస్ పాలనపై అసంతృప్తితో ఉన్న రాష్ట్ర ప్రజలకు కొత్త హామీలతో కాంగ్రెస్ పార్టీ వల వేసి ఓట్లు వేయించుకొని ఇప్పుడు వాటిని అమలు చేయకుండా మోసగిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. నిజమైన మార్పు కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో మరింత ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని, ఇకపై ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీదే అధికారమని జోస్యం చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు సరైన నాయకుడు లేడని.. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. రేవంత్ పాలనలో భాగ్యనగర్ బంగ్లాదేశ్‌గా మారుతోందని ఆరోపించారు.

హామీలు నెరవేర్చకుండా సంబురాలా?: డీకే అరుణ, కొండా

రాష్ట్రంలో ఒక నియంత గద్దె దిగాడనుకుంటే మరో నియంత వచ్చాడని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వం.. ఏ ముఖంతో సంబురాలు చేసుకుంటోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల భూములను బడా కంపెనీలకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దుయ్యబట్టారు. ప్రపంచ నేతగా గుర్తింపు పొందిన ప్రధాని మోదీపై కాంగ్రెస్ అడ్డగోలు ఆరోపణలు చేస్తోందని.. విదేశీ శక్తులకు తొత్తుగా మారిందని బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ దుష్టపాలనకు చరమగీతం పాడాలని బీజేపీ సీనియర్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.


ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బడికి తాళం వేసి.. ధర్నా చేసి

- ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని తల్లిదండ్రుల డిమాండ్

గంభీరావుపేట (సిరిసిల్ల): తమ ఊరి బడిలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దేశాయిపేటలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు శనివారం తాళం వేసి నిరసన తెలిపారు. బడిలో ఏడో తరగతి వరకు 60 మంది విద్యార్థులు ఉంటే.. ముగ్గురే టీచర్లు ఉన్నారన్నారు. నిబంధనల ప్రకారం ఆరుగురు టీచర్లు ఉండాలని, తెలుగు, హిందీ సబ్జెక్టులు బోధించేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 40 మంది విద్యార్థులుంటే.. ఒక్కరే ఎస్జీటీ ఉన్నారని తెలిపారు. మరో ఎస్జీటీతో సహా ఇద్దరు టీచర్లను బడికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉన్న ముగ్గురు టీచర్లలో ఒకరిని కోళ్లమద్ది పాఠశాలకు పంపించడానికి మండల విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఆ బదిలీని ఆపాలని కోరారు.

రిటైర్డ్ సింగరేణి కార్మికులకు రూ.33 కోట్ల లాభాల వాటా

- 12న వారి ఖాతాల్లో జమ

సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థలో గత ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్యకాలంలో రిటైరైన 2035 మంది అధికారులు, కార్మికు లకు లాభాల్లో వాటాగా రూ.33 కోట్లను చెల్లించనున్నామని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఈనెల 12న వారి ఖాతాల్లో బోనస్ సొమ్ము జమ అవుతుందని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

అకాల వర్షంతో ధాన్యం నీళ్లపాలు

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం


పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి తడిసిన ధాన్యం


సాక్షి, పెద్దపల్లి: అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేశాయి. రెక్కలు ముక్క లు చేసుకొని పండించిన ధాన్యం గింజల్ని నీటిపాలు చేశాయి. పెద్దపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం దంచికొట్టింది. ఉదయం ఎండ కాయడంతో రైతులు రోడ్ల వెంబడి, కల్లాలు, కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులలో ధాన్యం ఆర బెట్టారు. సాయంత్రం ఒక్కసారిగా వర్షం రావడంతో ధాన్యం తడిసింది. ఆరబోసి అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం వాననీటి పాలైంది. కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడం, పలుచోట్ల టార్పాలిన్లు కప్పినా.. వరద ధాటికి ధాన్యం కొట్టుకుపోయింది. దీంతో పెద్ద మొత్తంలో అన్నదాతలు నష్టపోయారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే చివరి దశలో ఉన్న కాసింత పత్తి ఈ దెబ్బకు నేలరాలిపోతుందని రైతులు వాపోతున్నారు. శనగ, కంది పంటల పూత రాలి పోతుంది. బంగాళాఖాతంలో అల్పపీడ నం ప్రభావం వల్ల.. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. మరో 3 రోజులు వర్షం కురిసే సూచనలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

నేడు నెక్లెస్ రోడ్డులో ఎయిర్ షో !

సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు నెక్లెస్ రోడ్డు వద్ద వాయుసేనకు చెందిన 9 సూర్యకిరణ్ విమానాలతో ఎయిర్ షో నిర్వహించను న్నారు. ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర మంత్రులు, వీవీఐపీలు, వాయుసేన సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వాయుసేన గ్రూప్ కెప్టెన్ అజయ్ దాశరథి నేతృత్వంలో ఈ ప్రదర్శన జరగనుంది. అద్భుత వైమానిక విన్యాసాలు చేసే ప్రపంచంలోనే అత్యుత్తమ ఐదు బృందాల్లో ఒకటైన సూర్యకిరణ్ టీం హైదరాబాద్‌లో ప్రదర్శన నిర్వహిస్తుండటంతో ప్రజలు భారీగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం సచివాలయంలో ఆమె సమీక్ష నిర్వహించారు. ఎయిర్ షో అనంతరం రాహుల్ సిప్లిగంజ్ మ్యూజికల్ కన్సర్ట్ నిర్వహిస్తున్నదున.. నెక్లెస్ రోడ్డు, పీవీ మార్గ్‌లో ప్రజల కోసం ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 9వ తేదీన సాయంత్రం 6 గంటలకు సచివాలయంలో నిర్వహించే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి లక్ష మంది మహిళలు హాజరవుతారని సీఎస్ చెప్పారు. అందుకోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి వచ్చేవారి కోసం నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా, గోశాల రోడ్, నిజాం కాలేజ్, పబ్లిక్ గార్డెన్స్ వద్ద పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేశామని హైదరాబాద్ పోలీస్ అదనపు కమిషనర్ విక్రంజీత్ సింగ్ మాన్ తెలిపారు. .

లద్దాఖ్‌లో 'క్వాంటమ్' ఎర్త్ స్టేషన్

అనువైన ప్రాంతంగా గుర్తించిన సైంటిస్టులు




ఉపగ్రహ ఆధారిత క్వాంటమ్ సమాచార ప్రసారాల సాంకేతికతపై భారత్ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. కమ్యూనికేషన్లలో అత్యధిక నాణ్యత, భద్రత కోసం క్వాంటమ్ టెక్నాలజీని వాడుకోవాలని నిర్ణయించింది. సంప్రదాయ శాటిలైట్ కమ్యూనికేషన్ల కంటే శాటిలైట్ ఆధారిత క్వాంటమ్ కమ్యూనికేషన్లు విశిష్టమైనవి. సంప్రదాయ విధానాల్లో అయితే మెగాహెర్ట్జ్(ఎంహెచ్‌జెడ్), గిగాహెర్ట్జ్(జీహెచ్‌జెడ్) ఫ్రీక్వెన్సీల్లో సమాచార మార్పిడి జరుగుతుంది. క్వాంటమ్ కమ్యూనికేషన్లలో మాత్రం టెరాహెర్ట్జ్ (టీహెచ్‌జెడ్) ఫ్రీక్వెన్సీ ఉపయోగిస్తారు. దీంతో డేటా మార్పిడి సామర్థ్యం ఎన్నో రెట్లు పెరుగుతుంది. క్వాంటమ్ ప్రసారాల రంగంలో తదుపరి పరిశోధనలకుగాను గ్రాండ్ స్టేషన్ ఏర్పాటు కోసం రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఆర్‌ఆర్‌ఐ) సైంటిస్టులు అన్వేషణ ప్రారంభించారు. అడ్వాన్స్‌డ్ అబ్జర్వేటరీ కేంద్రాలైన లద్దాఖ్‌లోని హన్లే గ్రామంలో ఉన్న ఇండియన్ ఆస్ట్రానామికల్ అబ్జర్వేటరీ(ఐఏఓ), రాజస్తాన్‌లోని మౌంట్ అబూ అబ్జర్వేటరీ, నైనిటాల్‌లోని ఆర్యభట్ట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్(ఏఆర్‌ఐఈఎస్)ను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని ఓపెన్–సోర్స్ డేటాను విశ్లేషించారు. క్వాంటమ్ సంకేతాలను అంతరిక్షంలోకి పంపించడానికి హన్లేలోని ఇండియన్ ఆస్ట్రానామికల్ అబ్జర్వేటరీ సరిగ్గా సరిపోతుందని తేల్చారు. ఇక్కడే ఎర్త్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. హన్లే గ్రామం సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉన్న ఎడారి ప్రాంతం. ఇక్కడ పొడి వాతావరణం ఉంటుంది. నీరు ఆవిరయ్యే రేటు తక్కువ. క్వాంటమ్ టెక్నాలజీపై పరిశోధనలకు ఈ ప్రాంతం చాలా అనువుగా ఉంటుందని గుర్తించారు. ప్రభావవంతమైన శాటిలైట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఏర్పాటుకు క్వాంటమ్ సంకేతాలను భూవాతావరణం గుండా ఎలాంటి ఆటంకాలు లేకుండా అంతరిక్షంలోకి పంపించడం అత్యంత కీలకం. అందుకు ఇండియన్ ఆస్ట్రానామికల్ అబ్జర్వేటరీ సరిగ్గా సరిపోతుందని సైంటిస్టులు చెబుతున్నారు. క్వాంటమ్ సిగ్నల్స్‌ను ప్రాథమికంగా క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థల్లో ఉపయోగిస్తారు. ఇందులో అత్యంత సూక్ష్మమైన ఫోటాన్లు, ఎలక్ట్రాన్లు, అణువుల ద్వారా సమాచార మార్పిడి జరుగుతుంది కాబట్టి నాణ్యత అత్యున్నత స్థాయిలో ఉంటుంది. డేటా సెక్యూరిటీ విషయంలో క్వాంటమ్ టెక్నాలజీ పాత్ర నానాటికీ పెరుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో అత్యాధునిక క్వాంటమ్ టెక్నాలజీ ప్రాజెక్టులకు ఇండియా కేంద్రస్థానంగా మారుతుందని, ఇక్కడున్న భౌగోళిక వైవిధ్యమే అందుకు కారణమని చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆండ్రోమెడాలో వెలుగుల పున్నమి

నక్షత్ర మండలంలో తొలిసారిగా పరారుణ ఉద్గారాల గుర్తింపు



సువిశాల విశ్వంలో ఎన్నెన్నో నక్షత్ర మండలాలు (గెలాక్సీలు)న్నాయి. మన నక్షత్ర మండలాన్ని పాలపుంత (మిల్కీవే) అంటారన్నది తెలిసిందే. మనకు సమీపంలో ఉన్న అతి పెద్ద నక్షత్ర మండలం ఆండ్రోమెడా. ఈ గెలాక్సీలో అరుదైన దృశ్యాన్ని బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) బృందం కెమెరాలో బంధించింది. గెలాక్సీలోని నక్షత్రాలపై ఉన్నట్టుండి పేలుడు సంభవించి భిన్న రంగులతో కూడిన అత్యధిక కాంతి వెలువడడాన్ని నోహ్వై అంటారు. ఆండ్రోమెడా నక్షత్ర మండలంలో ఇలాంటి నోహ్వై నుంచి పరారుణ ఉద్గారాలను తొలిసారిగా గుర్తించారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ఆస్ట్రోశాట్ ఉపగ్రహంపై అమర్చిన అల్ట్రా వైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ (యూవీఐటీ) ద్వారా ఈ ఉద్గారాలను చిత్రీకరించారు. నోహ్వై సాధారణంగా బైనరీ నక్షత్ర వ్యవస్థలో సంభవిస్తూ ఉంటుంది. భూమి పరిమాణంలో ఉన్న మరుగుజ్జు నక్షత్రం మరో నక్షత్రానికి సమీపంలో పరిభ్రమిస్తున్నప్పుడు ఈ పరిణామాన్ని చూడొచ్చు. ఒక నక్షత్రం తన గురుత్వాకర్షణ శక్తితో మరో నక్షత్రంలోని పదార్థాన్ని ఆకర్షిస్తే శక్తివంతమైన థర్మోన్యూక్లియర్ రియాక్షన్ జరుగుతుంది. దాంతో హఠాత్తుగా మిరుమిట్లు గొలిపే వెలుగుతో నక్షత్రంపై పేలుడు సంభవిస్తుంది. ఆండ్రోమెడా గెలాక్సీలో నోహ్వై నుంచి 42 దాకా అల్ట్రావైలెట్ ఉద్గారాలను గుర్తించడం విశేషం. వీటిపై మరింత అధ్యయనం చేస్తున్నారు. ఈ వివరాలను ఆస్ట్రో ఫిజికల్ జర్నల్‌లో ప్రచురించారు. నక్షత్ర మండలాల గురించి తెలుసుకోవడానికి ఈ సమాచారం తోడ్పడుతుందని భావిస్తున్నారు. నోహ్వై రహస్యాలను ఛేదించడానికి భవిష్యత్తులో అల్ట్రావైలెట్, ఎక్స్–రే మిషన్లలో పరిశోధనలకు సైతం ఉపయోగపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కాంగ్రెస్‌పై కత్తులు!

ఇండియా కూటమిలో లుకలుకలు

- కాంగ్రెస్ తీరుపై భాగస్వాముల్లో తీవ్ర ఆగ్రహం
- సారథ్యం మరొకరికి అప్పగించాలని డిమాండ్లు
- తాను సిద్ధమన్న దీదీ వ్యాఖ్యలపై కలకలం
- మమతకు మద్దతు ప్రకటించిన సమాజ్‌వాదీ
- కూటమిలో విభేదాలు నిజమేనని వ్యాఖ్యలు
- మమత వ్యాఖ్యలు పెద్ద జోక్: కాంగ్రెస్



న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో వరుస పరాజయాల నేపథ్యంలో విపక్ష 'ఇండియా' కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి. కూటమి పార్టీలకు పరస్పరం పొసగడం లేదు. కూటమి భవిష్యత్తు గురించి కొత్త చర్చ మొదలైంది. కూటమిలో అతి పెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ తీరు పట్ల మిత్రపక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నేతలు గొంతు విప్పుతున్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఒకడుగు ముందుకేసి మహారాష్ట్రలో కాంగ్రెస్ సారథ్యంలోని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించింది! అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చకు ఇండియా పక్షాలు చేస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్ పాల్గొనడం లేదు. ఇతర అంశాల్లోనూ భాగస్వాముల మధ్య ఏకాభిప్రాయం కనిపించడం లేదు. పార్లమెంట్ లోపల, బయట కలిసి ఒక్కతాటిపై పని చేస్తున్న దాఖలాలు లేవు. ప్రధానంగా హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కూటమిలో విభేదాలు తారస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఆధిపత్యాన్ని కొందరు నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాభిమానం కోల్పోయి బలహీనపడుతున్న కాంగ్రెస్ విపక్ష కూటమిని ముందుకు నడిపించలేదని కుండబద్దలు కొడుతున్నారు. సారథ్యం నుంచి కాంగ్రెస్ తప్పుకుని సమర్థులకు బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధమన్న పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ వ్యాఖ్యలు కూటమిలో కలకలం రేపాయి. ఇండియా కూటమికి ప్రస్తుతం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చైర్‌పర్సన్‌గా ఉన్నారు.

> "ఇండియా కూటమి తీరు సరిగా లేదు. నాకు చాన్సిస్తే కూటమి సారథ్య బాధ్యతలకు సిద్ధం. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా, కూటమి అధినేతగా కొనసాగడం కష్టమేమీ కాదు. ఆ సామర్థ్యం నాకుంది. విపక్షాలను ఒక్కతాటిపైకి తెచ్చి కూటమి ఏర్పాటు చేశా. ప్రస్తుత సారథులు దాన్ని సమర్థంగా నడిపించగలరో లేదో వాళ్లే చెప్పాలి. లేదంటే ప్రత్యామ్నాయం చూడాలి. అందరినీ కలుపుకొని ముందుకెళ్లాలన్నదే నా సూచన"
>
> – శుక్రవారం మీడియాతో మమత

ఇదేనా పొత్తు ధర్మం?

బీజేపీ హఠావో.. దేశ్ బచావో నినాదంతో లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023 జూన్‌లో 17 పార్టీలతో ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) ఫ్రంట్ ఏర్పాటైంది. బీజేపీని వ్యతిరేకించే పార్టీలు ఒకే వేదికపైకి చేరాయి. కాంగ్రెస్‌తో పాటు భావసారూప్యం కలిగిన పార్టీలు చేతులు కలిపాయి. అయితే, బీజేపీ ఓటమే లక్ష్యంగా ఇండియా కూటమి ఏర్పాటుకు చొరవ తీసుకున్న జేడీ(యూ) చీఫ్, బిహార్ సీఎం నితీశ్ కుమార్ తర్వాత బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలో చేరిపోయారు! ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా పక్షాలు కొన్నిచోట్ల కలివిడిగా, మరికొన్ని రాష్ట్రాల్లో విడివిడిగా పోటీ చేశాయి. అంతిమంగా పరాజయమే మిగిలింది. లోక్‌సభలో స్వీయ బలం పెరగడం ఒక్కటే కాంగ్రెస్‌కు కొంత ఊరట కలిగించింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, హరియాణాలో మిత్రపక్షాలను పక్కనపెట్టి దాదాపుగా ఒంటరిగా పోటీచేయడం వికటించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌వి ఒంటెత్తు పోకడలంటూ భాగస్వామ్య పార్టీలు మండిపడుతున్నాయి. అందరినీ కలుపుకొని వెళ్లడం లేదని, పొత్తుధర్మం పాటించడంలేదని ఆక్షేపిస్తున్నాయి. అన్ని వైపులా ఒత్తిడి పెరుగుతుండడంతో కాంగ్రెస్ ఏం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్ ఆత్మవిమర్శ చేసుకోవాలి

సమాజ్‌వాదీ ఇప్పటికీ ఇండియా కూటమిలోనే ఉందని ఆ పార్టీ ఎంపీ జావెద్ అలీఖాన్ చెప్పారు. అయితే కూటమిలో అభిప్రాయభేదాలు నిజమేనని అంగీకరించారు. లుకలుకలపై కాంగ్రెసే స్పందించి భాగస్వాములను సమాధానపరచాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సూచించారు. మిత్రపక్షాలను లెక్క చేయకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే ఇక కూటమి ఎందుకని ప్రశ్నించారు. ''అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వల్ల సీట్ల పంపకం సక్రమంగా జరగలేదు, అందుకే అవమానాలు ఎదురయ్యాయి'' అని ఆరోపించారు. కూటమి ఒక్కటిగా కలిసి ఉంటుందన్న నమ్మకం తమకు లేదని, ఏ క్షణమైనా అది ముక్కలయ్యే అవకాశం ఉందని జేడీ(యూ) సీనియర్ నేత రాజీవ్ రంజన్ వ్యాఖ్యానించారు. కూటమికి ఎవరు సారథ్యం వహించాలో త్వరలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ తెలిపారు. సారథ్యానికి సిద్ధమన్న మమత ప్రతిపాదనపై దృష్టి పెట్టాలని సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ఉదయ్‌వీర్ సింగ్ కోరారు. ఆమెకు తమ మద్దతు, సహకారం ఉంటాయని స్పష్టంచేశారు. కాంగ్రెస్ మాత్రం మమత వ్యాఖ్యలపై గుర్రుగా ఉంది. తమ కూటమి పెద్దగా మరొకరు అవసరమని భావించడం లేదని కాంగ్రెస్ ఎంపీ వర్ష గైక్వాడ్ తేల్చిచెప్పారు. మమత వ్యాఖ్యలను పెద్ద జోక్‌గా కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాకూర్ కొట్టిపారేశారు.

ఎంవీఏకు సమాజ్‌వాదీ గుడ్‌బై

ముంబై: మహారాష్ట్రలోని ప్రతిపక్ష కూటమి ఎంవీఏతో తెగదెంపులు చేసుకుంటున్నామని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) తెలిపింది. 1992లో జరిగిన బాబ్రీ మసీదు విధ్వంసం ఘటనను కీర్తిస్తూ శివసేన(యూబీటీ) ఇటీవల ఒక పత్రికా ప్రకటన ఇచ్చింది. అదేవిధంగా ఆ పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సన్నిహితుడు, ఎమ్మెల్సీ మిలింద్ నర్వేకర్ మసీదు విధ్వంసాన్ని పొగుడుతూ 'ఎక్స్'లో వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాం'అని మహారాష్ట్ర ఎస్పీ చీఫ్ అబూ అజ్మీ చెప్పారు. ఈ పరిణామంపై శివసేన(యూబీటీ) స్పందించింది. బాబ్రీ మసీదుపై తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని పేర్కొంది. ఈ విషయం తెలుసుకునేందుకు ఎస్పీకి దశాబ్దాలు పట్టిందని వ్యాఖ్యానించింది. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎస్పీకి ఇద్దరు ఎమ్మెల్యేలున్నారు. మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లో కాంగ్రెస్, శివసేన(యూబీటీ), నేషనలిస్ట్ కాంగ్రెస్(ఎస్పీ),ఎస్పీ ఉన్నాయి.

ఇస్కాన్ కేంద్రానికి నిప్పు

బంగ్లాదేశ్‌లో నిరసన మూకల దుశ్చర్య



బంగ్లాలో పరిస్థితులపై జమ్మూలో నిరసనలు

కోల్‌కతా: బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలపై దాడులు కొనసాగుతున్నాయి. రాజధాని ఢాకాలోని ఓ ఇస్కాన్ కేంద్రానికి శనివారం వేకువజామున గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టారు. ధౌర్ గ్రామంలోని నమ్‌హట్టా ప్రాంతంలో ఉన్న శ్రీ రాధా కృష్ణ ఆలయం, శ్రీ మహాభాగ్య లక్ష్మీ నారాయణ ఆలయాలపై ఈ దాడి జరిగిందని ఇస్కాన్ కోల్‌కతా ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ 'ఎక్స్'లో వెల్లడించారు. పెట్రోల్ పోసి నిప్పంటించడంతో శ్రీ లక్ష్మీ నారాయణ విగ్రహంతోపాటు అన్ని వస్తువులు పూర్తిగా కాలిపోయాయన్నారు. హిందూమత పెద్ద చిన్మయ్ కృష్ణ దాస్ బెయిలివ్వకుండా జైలులో ఉంచారంటూ...ఆయన భద్రతపై రాధారమణ్ దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఇస్కాన్ అనుయాయులు బయట తిరిగేటప్పుడు ముందు జాగ్రత్తగా నుదుటన తిలకం ధరించవద్దని కోరారు. మైనారిటీలకు భద్రత కల్పిస్తామని యూనస్ సారథ్యంలోని ఆపద్ధర్మ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఎక్కడా అమలు కావడం లేదని రాధారమణ్ దాస్ ఆవేదన వ్యక్తం చేశారు.



ఫ్రీ ఫాల్ రైడ్‌లో ప్రమాదవశాత్తు మరణించిన శాంప్సన్‌కు వెల్లువెత్తిన నివాళులు

మరణించిన టీనేజర్ కుటుంబానికి రూ. 2,624 కోట్ల పరిహారం

అమెరికా కోర్టు సంచలన తీర్పు

న్యూయార్క్: అమెరికాలో అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో నిట్టనిలువుగా కిందకు దూసుకొచ్చే 'ఫ్రీ ఫాల్ టవర్ డ్రాప్ రైడ్'లో ప్రమాదవశాత్తు పైనుంచి పడిపోయి ప్రాణాలు కోల్పోయిన ఒక టీనేజర్ కుటుంబానికి రూ.2,624 కోట్ల భారీ నష్టపరిహారం ఇవ్వాలని న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఫ్లోరిడా రాష్ట్రంలోని ఐకాన్ పార్క్‌లో ఫన్ టైమ్ హ్యాండిల్స్ అనే సంస్థ ఈ రైడ్‌ను నిర్వహించింది. 400 అడుగుల ఎత్తుకు తీసుకెళ్లి గంటకు 112 కిలోమీటర్లవేగంతో కిందకు దూసుకొస్తుంది. 2022 మార్చిలో 14 ఏళ్ల టైర్ శాంప్సన్ తన తోటి ఫుట్‌బాల్ టీమ్‌తో ఈ రైడ్ ఎక్కాడు. ఆరు అడుగుల ఎత్తు 173 కేజీల బరువున్న శాంప్సన్‌ను నిబంధనలకు విరుద్ధంగా రైడ్‌కు అనుమతించారు. వ్యక్తి 129 కేజీలకు మించి బరువుంటే ఈ రైడ్‌కు అనుమతించకూడదు. రెండుసార్లు పైకీ కిందకు సురక్షితంగా వెళ్లొచ్చిన శాంప్సన్ మూడోసారి పట్టు తప్పి 70 అడుగుల ఎత్తులో టవర్ నుంచి వేగంగా కిందకు పడటంతో అక్కడికక్కడే చనిపోయాడు. 'అధిక బరువు', సేఫ్టీ సీట్ లాక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు శిక్షగా ఫన్‌టైమ్ హ్యాండిల్స్ సంస్థకు 310 మిలియన్ డాలర్ల జరిమానా విధించింది. ఈ మొత్తం నుంచి శాంప్సన్ తల్లిదండ్రులకు తలో 155 మిలియన్ డాలర్లు నష్టపరిహారంగా అందజేయాలని కోర్టు ఆదేశించింది.

డెమాస్కస్ శివార్లకు చొచ్చుకొచ్చిన రెబెల్స్



శనివారం హోమ్స్ నగర శివార్లలో హల్‌చల్ చేస్తున్న తిరుగుబాటుదారులు

డెమాస్కస్: సిరియాలో అస్సాద్ ప్రభుత్వంపై తిరుగుబాటుదార్ల పైచేయి కొనసాగుతోంది. శనివారం రాత్రి వారు హోమ్స్ నగరంలోని శివారు ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడితో ఆగకుండా ఏకంగా రాజధాని డెమాస్కస్ శివార్ల దాకా చొచ్చుకొచ్చారు. దాంతో దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. హోమ్స్‌ను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అస్సాద్ అనుకూల బలగాలు ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం పల్మీరా తదితర ప్రాంతాల నుంచి బలగాలను, సైనిక వాహనాలను రప్పిస్తోంది. అంతకుముందు, దక్షిణ ప్రాంతంలోని నా లుగో నగరం దారాలో తిరుగుబాటుదార్లు తిష్టవేయడం తెల్సిందే. పరిస్థితులు వేగంగా మారుతుండటంతో బషర్ అల్ అస్సా ద్ ప్రభుత్వం యూఏఈ, జోర్డాన్, ఇరాక్ ప్రభుత్వాలను ఆయుధ సాయం, నిఘా సమాచారం అందించాలంటూ కోరినట్లు చెబుతున్నారు. పరిస్థితులు విషమిస్తున్నందున వెంటనే దేశం విడిచి వెళ్లాలని అస్సాద్‌కు అరబ్ నేతలు కొందరు సూచించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.

అమెరికా జోక్యం చేసుకోబోదు: ట్రంప్

సిరియా సంక్షోభంలో తమ దేశం జోక్యం చేసుకోబోదని అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. 'సిరియా సమస్యల్లో చిక్కుకుంది. అయితే, అది మా మిత్ర దేశం కాదు. అమెరికాకు ఆ దేశంతో సంబంధం లేదు. అది మా పోరాటం కాదు. వాళ్లను పోరాడుకోనివ్వండి. మేం తలదూర్చం'అని తెలిపారు. 'ఉక్రెయిన్‌తో యుద్ధంలో తలమునకలుగా ఉన్న రష్యా మిత్ర దేశం సిరియాలో తిరుగుబాటుదార్లను ఆపలేకపోతోందనుకుంటున్నా. సిరియా నుంచి రష్యా బలగాలను వెళ్లగొడితే అది రష్యాకే మంచిది. ఎందుకంటే సిరియాలో ఉండి రష్యా లాభ పడిందేమీ లేదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ప్రపంచ ధ్యాన దినోత్సవంగా డిసెంబర్ 21

ఐక్యరాజ్యసమితి: ఏటా డిసెంబర్ 21వ తేదీన ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరుపుకోవాలన్న భారత్ సహ ప్రతిపాదనను ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవంగా ఆమోదించింది. లీచెన్‌స్టయిన్, భారత్, శ్రీలంక, నేపాల్, మెక్సికో, అండొర్రాలతో కూడిన దేశాల బృందం 193 సభ్య దేశాలతో కూడిన జనరల్ అసెంబ్లీలో శుక్రవారం ఈ తీర్మానం ప్రవేశపెట్టాయని ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ 'ఎక్స్'లో వెల్లడించారు. 'సర్వజనుల శ్రేయస్సు, అంతర్గత పరివర్తన కోసం ఒక రోజు! డిసెంబర్ 21ని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐరాస ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించేందుకు ఇతర దేశాలతో కలిసి భారత్ మార్గదర్శనం చేసిందని తెలిపేందుకు సంతోషిస్తున్నాం'అని హరీశ్ పేర్కొన్నారు.

రికార్డు స్థాయిలో 9.5 టన్నుల కొకైన్ సీజ్

శాంటో డొమింగో(డొమినికన్ రిపబ్లిక్): కరీబియన్ ద్వీప దేశం డొమినికన్ రిపబ్లిక్ అధికారులు అత్యంత భారీ మొత్తంలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.2,100 కోట్ల విలువైన తొమ్మిదిన్నర టన్నుల కొకైన్‌ను పట్టుకున్నారు. రాజధాని శాంటో డొమింగోలోని కౌసెడో నౌకాశ్రయానికి అరటి పండ్ల లోడుతో చేరుకున్న నౌకలో ఇది బయటపడిందని శుక్రవారం వారు చెప్పారు. గ్వాటెమాలా నుంచి వస్తున్న షిప్ బెల్జియం చేరుకోవాల్సి ఉందని మాదకద్రవ్యాల వ్యతిరేక విభాగం అధికారులు వివరించారు. ఇందుకు సంబంధించి పది మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు వివరించారు. డ్రగ్స్ అక్రమ రవాణా దారులకు డొమినికన్ రిపబ్లిక్ అడ్డాగా కొనసాగుతోంది. 2006లో కౌసెడో పోర్టులోని ఓ నౌక నుంచి 2,580 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 47 టన్నుల డ్రగ్స్‌ను పట్టుకున్నారు.

గాజాలో 29 మంది మృతి

జెరూసలేం: గాజా ఉత్తరప్రాంతంలోని కమాల్ అద్వాన్ ఆస్పత్రి చుట్టుపక్కల ప్రాంతాలపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడుల్లో 29 మంది ప్రాణాలు కోల్పోయారు.'ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఆస్పత్రి ప్రాంగణంలోకి ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకు ప్రవేశించడంతో అక్కడున్న వారు భయభ్రాంతులకు లోనయ్యారు. తప్పించుకునేందుకు ఒక్కుమ్మడిగా ప్రహరీపైకి ఎక్కారు. దీంతో, ఆర్మీ వారిపైకి కాల్పులు జరిపింది'అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ రిక్ పీపర్‌కోర్న్ చెప్పారు. మృతుల్లో నలుగురు వైద్య సిబ్బంది, ఐదుగురు చిన్నారులు, ఐదుగురు మహిళలు ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కమాల్ అద్వాన్ ఆస్పత్రి పరిసరాల్లో పరిస్థితి భీతావహంగా ఉందని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సఫియా చెప్పారు. బెయిట్ లహియాలో ఉన్న ఈ ఆస్పత్రి గాజా ఉత్తర ప్రాంతంలో ఇప్పటికీ పనిచేస్తున్న ఏకైక దవాఖాన. ఇజ్రాయెల్ ఆర్మీ దాదాపు రెండు నెలలుగా ఈ ప్రాంతానికి మానవతా సాయం సైతం అందకుండా దిగ్బంధించింది. మిలిటెంట్లు దాక్కున్నారంటూ ఇజ్రాయెల్ ఆర్మీ అక్టోబర్‌లో ఆస్పత్రిపై దాడి చేసి మెడికల్ సిబ్బంది సహా పలువురిని అరెస్ట్ చేసింది. ఇజ్రాయెల్ ఆర్మీ గత వారం కూడా ఇందులోని వారందరినీ ఖాళీ చేసి బయటకు రావాల్సిందిగా హుకుం జారీ చేసింది.

నేడు మళ్లీ ఢిల్లీ చలో

రైతు నేత సర్వాన్ సింగ్ పాంథర్ వెల్లడి



రైతు సంఘాల నిర్ణయాన్ని శనివారం మీడియాకు వెల్లడిస్తున్న నేతలు

చండీగఢ్: కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కి చట్టబద్ధత సహా పలు డిమాండ్ల సాధనకు రైతు సంఘాలు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం ఆదివారం తిరిగి మొదలవుతుందని రైతు సంఘం నేత సర్వాన్ సింగ్ పాంథర్ చెప్పారు. శంభు నుంచి శుక్రవారం మొదలైన ర్యాలీపై హరియాణా పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో మొత్తం 16 మంది గాయపడ్డారని, వీరిలో ఒకరు వినికిడి శక్తి కోల్పోయారని ఆయన వివరించారు. క్షతగాత్రుల్లో నలుగురు చికిత్స పొందుతుండగా మిగతా వారు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారన్నారు. ఈ పరిణామంతో శనివారం ర్యాలీని నిలిపివేశామని ఆయన శంభు వద్ద మీడియాకు తెలిపారు. తమ డిమాండ్లపై చర్చలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆహ్వానం అందలేదని పాంథర్ చెప్పారు. తమతో చర్చలు జరిపే ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదన్నారు. అందుకే, 101 మంది రైతుల బృందంతో కూడిన జాతాను ఆదివారం మధ్యాహ్నం నుంచి శాంతియుతంగా తిరిగి ప్రారంభించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శుక్రవారం రైతులపైకి పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అసలు స్వరూపం బట్టబయలైందని ఆయన వ్యాఖ్యానించారు.

ద.కొరియా అధ్యక్షుడికి ఉపశమనం

వీగిపోయిన అభిశంసన తీర్మానం



సియోల్: ఎమర్జెన్సీ ప్రకటిస్తూ తీసుకున్న అనూహ్య నిర్ణయంతో ఇంటాబయటా విమర్శలను ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు పదవీగండం కొద్దిలో తప్పింది. ఎమర్జెన్సీ(మార్షల్ లా) విధిస్తూ నిర్ణయం తీసుకుని దేశంలో రాజకీయ సంక్షోభానికి తెరలేపారని ఆరోపిస్తూ ఆయనపై విపక్షాలు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం వీగిపోయింది. 300 మంది సభ్యులున్న జాతీయ అసెంబ్లీలో అభిశంసన తీర్మానం నెగ్గాలంటే మూడింట రెండు వంతుల మంది సభ్యులు అంటే కనీసం 200 మంది మద్దతు పలకాల్సి ఉంటుంది. శనివారం చేపట్టిన ఓటింగ్‌లో అభిశంసనను సమర్థిస్తూ కేవలం 192 ఓట్లు పడ్డాయి. యూన్‌కు చెందిన పీపుల్స్ పవర్ పార్టీ ఓటింగ్‌ను బహిష్కరించింది. వచ్చే బుధవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సెషన్‌లో మరోమారు అభిశంసన తీర్మానాన్ని పెట్టాలని విపక్ష పార్టీలు పట్టుదలగా ఉన్నాయి. అంతకుముందు యూన్ మార్షల్ లా విధించడం తప్పేనంటూ ప్రజలకు బహిరంగ క్షమాపణ తెలిపారు.

మీ సేవలతో దేశానికే గుర్తింపు


బాప్స్ నారాయణ్‌పై మోదీ ప్రశంసలు



అహ్మదాబాద్: బోచసన్వాసి అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ సంస్థ (బాప్స్) స్వచ్ఛంద సేవకుల సేవాగుణం, కృషి వల్ల భారత్ ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపగలుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. అహ్మదాబాద్‌లోని మోదీ మైదానంలో శనివారం జరిగిన బాప్స్ వలంటీర్ల 'కార్యకార్ సువర్ణ మహోత్సవ్'ను ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ''స్వామి నారాయణ్ బోధలను బాప్స్ సేవకులు కోట్లాది మంది అణగారిన వర్గాలకు చేరువ చేసి వారి బతుకులను బాగుచేశారు. బాప్స్ సేవలు దేశానికీ శక్తినిచ్చాయి. సేవ పరమో ధర్మః అన్నది మన జీవన విధానం. కోవిడ్ సంక్షోభం, కేరళ, ఉత్తరాఖండ్‌లో ప్రకృతి విలయాల్లో బాప్స్ వలంటీర్లు వెంటనే రంగంలోకి దిగి ఆదుకున్నారు. ఉక్రెయిన్ నుంచి పోలండ్‌కు వస్తున్న భారతీయులకు సాయపడాలని అర్ధరాత్రి వేళ బాప్స్ గురువులను కోరా. తక్షణం యూరప్‌వ్యాప్తంగా ఉన్న వలంటీర్లను పోలండ్ రప్పించి సాయపడ్డారు'' అని మోదీ గుర్తు చేసుకున్నారు. ''బాప్స్ సేవకులు 28 దేశాల్లో 1,800కు పైగా స్వామి నారాయణ్ ఆలయాలు నిర్మించారు. 21,000కి పైగా ఆధ్యాత్మిక కేంద్రాలు నెలకొల్పారు. ఎన్నో రంగాల్లో సేవలందిస్తున్నారు'' అని కొనియాడారు.

సామాన్యులపై భారం.. సంపన్నులకు అందలం

కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వం సామాన్యులపై పన్నుల భారం పెంచుతూ సంపన్నులకు మాత్రం రాయితీలిస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజలపై మరింత భారం మోపేందుకు జీఎస్టీలో మరో స్లాబ్‌ను తెచ్చేందుకు రంగం సిద్ధం చేసిందని చెప్పారు. జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి ఇప్పటికే రికార్డు స్థాయిలో ఆదాయం లభిస్తోందన్నారు. బిలియనీర్లకు భారీగా రుణ మాఫీలు, పన్ను నుంచి మినహాయింపులు ఇచ్చేందుకు పేద, మధ్య తరగతి ప్రజలు కష్టపడి సంపాదించుకున్న ప్రతి పైసాపైనా మోదీ ప్రభుత్వం పన్ను వేస్తోందని ఆయన ఆరోపించారు. నిత్యం వినియోగించే వస్తువులపై అత్యధిక పన్నులు మోపుతూ ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

'అయోధ్య' తీర్పులో లౌకికవాదమేదీ?

జస్టిస్ ఆర్.ఎఫ్.నారీమన్ ఆక్షేపణ



న్యూఢిల్లీ: రామజన్మభూమి–బాబ్రీ మసీదు అంశంపై 2019లో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎఫ్.నారీమన్ విమర్శలు గుప్పించారు. ఆ తీర్పు న్యాయాన్ని అవహేళన చేసినట్లుగా ఉందన్నారు. లౌకికవాద సూత్రాన్ని ప్రతిబింబించలేదని తప్పుపట్టారు. 'జస్టిస్ ఎ.ఎం.అహ్మదీ మెమోరియల్ లెక్చర్'లో లౌకికవాదం, భారత రాజ్యాంగం అనే అంశంపై జస్టిస్ నారీమన్ మాట్లాడారు. మతపరమైన కట్టడాలు, ప్రదేశాలపై వివాదాలకు ముగింపు పలకడానికి 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు. బాబ్రీ మసీదును కూల్చివేయడం చట్టవిరుద్ధం అయినప్పుడు ఆ వివాదాస్పద స్థలాన్ని వేర్వేరు వర్గాలు పంపిణీ చేయాలని కోర్టు తీర్పు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మసీదు కూల్చివేత కేసులో నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించిన ప్రత్యేక సీబీఐ న్యాయమూర్తి సురేంద్ర యాదవ్‌కు పదవీ విరమణ అనంతరం ఉత్తరప్రదేశ్ ఉప లోకాయుక్త పదవి దక్కిందని గుర్తుచేశారు. దేశంలో ప్రస్తుతం పరిస్థితులిలా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

ఆటోల బంద్ విజయవంతం

తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లావ్యాప్తంగా ప్యాసింజర్ ఆటో కార్మికులు శనివారం బంద్ పాటించారు. ఆటోలను నిలిపివేసి నిరసనకు దిగారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఎక్కడికక్కడే ఆటోలు నిలిపివేయగా.. ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఓ వైపు శుభకార్యాలు.. ఇతర పనుల నిమితం వచ్చినవారు ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు, ద్విచక్రవాహనాలపై గమ్యస్థానాలకు వెళ్లారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



ప్రైవేటు టాక్సీ వాహనాన్ని ఆశ్రయిస్తున్న మహిళలు

న్యూస్‌రీల్

'ఏడాది కాంగ్రెస్ పాలనలో ఏ మార్పూ రాలే'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో మారింది పాలకులేనని, పాలనలో మార్పు రాలేదని, ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం శాతవాహన యూనివర్సిటీ నుంచి టవర్‌సర్కిల్ వరకు భారీ వాహన ర్యాలీ చేపట్టి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రజల తరఫున బీజేపీ పోరుబాట చేపట్టిందన్నారు. మోసం చేయడం కాంగ్రెస్ నైజం అని, అందుకే మోసాలను నిలదీయడానికి బీజేపీ పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కళ్లెం వాసుదేవ రెడ్డి, కన్న కృష్ణ, ఎర్రబెల్లి సంపత్‌రావు, కోలగని శ్రీనివాస్, గుంజేటి శివకుమార్, ఎండీ ముజీబ్, వాసాల రమేశ్ పాల్గొన్నారు.

ఇందిరా మహిళాశక్తితో ఆర్థిక పురోగతి



మాట్లాడుతున్న స్వరూపారాణి

కరీంనగర్ కార్పొరేషన్: ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు తమ వ్యాపార అభివృద్ధి చేసుకోవాలని నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి సూచించారు. శనివారం నగరపాలకసంస్థ కార్యాలయంలో సిరి, మల్లికార్జున పట్టణ సమాఖ్యల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలన్నారు. సిరి సమాఖ్య లాభం రూ.7,46,215, మల్లికార్జున సమాఖ్య లాభం రూ.4,00,417గా ఉన్నట్లు సమాఖ్య ప్రతినిధులు వెల్లడించారు.

ఆల్ ది బెస్ట్ రేవతి..



ఆర్థికసాయం అందిస్తున్న ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్‌స్పోర్ట్స్: జాతీయస్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణం సాధించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలకు చెందిన రేవతి త్రిపురలోని అగర్తలలో ఈనెల 12 నుంచి 15వరకు జరిగే 68వ జాతీయస్థాయి పాఠశాలల అండర్–17 జూడో పోటీలకు ఎంపికైంది. వెంకట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంప వెంకట్ అదనపు కలెక్టర్ చేతుల మీదుగా రేవతికి ఆర్థికసాయం అందించారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పెద్దపల్లి జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్, కోచ్ సాయిరాం యాదవ్ పాల్గొన్నారు.

ఏఈఈల నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

తిమ్మాపూర్: తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల సంఘం జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. చొప్పదండి డివిజన్‌కు చెందిన వి.అభినవ్‌రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘంలో ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల ఇంజినీర్లు సభ్యులుగా ఉన్నారు. రమేశ్‌నాయక్ (అసోసియేట్ ప్రెసిడెంట్), సురేశ్(ప్రధాన కార్యదర్శి), రఘురామ్ నాయక్(ఖజాంచీ)గా ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్షుడు డి.సమర్సన్ గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతుండగా, బి.పరశురాంగౌడ్ సలహాదారుగా నియామకం అయ్యారు. ఇంజినీర్లు బి.ఉపేందర్, ఎన్.నరేశ్, పి.రమేశ్, ఎం.కరుణాకర్, ప్రీతిపాండే, కృష్ణ చేతనరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ కావాలని..



సండే స్పెషల్

- కలలు కన్నారు.. కొలువు కొట్టారు

పోలీస్ కావాలన్నది వారి కల. ఖాకీ డ్రెస్ వేసుకుంటే ఆ ఫీలింగే వేరు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత చదువులు చదివిన వారు సైతం రూ.లక్షల జీతం ఇచ్చే కార్పొరేట్ ఉద్యోగాల వైపు వెళ్లకుండా సర్కారు నౌకరి వైపు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే భవిష్యత్‌కు భరోసా ఉంటుందనే నమ్మకంతో కష్టపడుతున్నారు. అలా కష్టపడి పోలీస్ కొలువు కొట్టిన నూతన కానిస్టేబుళ్లు ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధుల్లో చేరారు. వీరిలో చాలామంది ఉన్నత చదువులు చదివిన వారు ఉండగా.. మరికొందరు వారి కుటుంబంలోని వారిని స్ఫూర్తిగా తీసుకున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చి పోలీస్ కొలువు కొట్టి.. ఆదర్శంగా నిలిచారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విధుల్లో చేరిన పలువురు కానిస్టేబుళ్లపై సండేస్పెషల్..!!

- 8లో ▸

కల్లోలిత ప్రాంతం నుంచి..




సిరిసిల్లక్రైం: మాది వ్యవసాయం కుటుంబం. అమ్మానాన్న లక్ష్మి–లచ్చయ్య పొలం పనులు చేస్తారు. బీటెక్ పూర్తవగానే ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నాలు చేసిన. అన్నయ్య టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌గా ఉన్నారు. ఎస్సై ఉద్యోగం కోసం పరీక్ష రాస్తానని చెబితే ప్రోత్సహించి కరీంనగర్‌లోని ఓ అకాడమీలో చేర్పించారు. ఎస్సై రాకపోయిన కానిస్టేబుల్ వచ్చింది. తొలి ప్రయత్నంలో రావడం, ఇంట్లో ఇద్దరం పోలీసులం ఉండడంతో తల్లిదండ్రులకు ఆనందంగా ఉంది. కరీంనగర్‌లో శిక్షణ పూర్తయింది. సిరిసిల్ల ఠాణాలో విధుల్లో చేరిన. ఎస్సై కోసం ప్రయత్నిస్తా. ఒకప్పు డు కోనరావుపేట అంటేనే కల్లోలిత నక్సలైట్ ప్రాంతం. కానీ ఇప్పుడు తీరు మారింది. పోలీసు ఉద్యోగం చేయడానికి తల్లిదండ్రులు ఒప్పుకుంటున్నారు. నాలాగా మరింత మంది పోలీసు డ్యూటీలోకి రావాలని ఆకాంక్ష.

– కె.శిరీష, కోనరావుపేట

‘విదేశీ విద్యానిధి’ అందుకోండి

- విదేశాల్లో ఉన్నత చదువులకు చేయూతనిస్తున్న పథకం
- రూ.20 లక్షల రుణ సాయం చేస్తున్న ప్రభుత్వం
- మైనారిటీ విద్యార్థుల దరఖాస్తుకు 31 వరకు గడువు



కరీంనగర్:

డిగ్రీ పూర్తి చేసి, విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలన్న ఆసక్తి ఉండి, ఆర్థిక పరిస్థితులు అనుకూలించని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం విదేశీ విద్యానిధి పథకం ద్వారా చేయూతనిస్తోంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి, మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ ఉపకార వేతనం, బీసీల విద్యార్థుల చదువుకు మహాత్మా జ్యోతిబాపూలే విద్యానిధి పథకాలతో భరోసా ఇస్తోంది. ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల రుణాన్ని రెండు విడతల్లో అందించి, వారికి తోడ్పాటునిస్తోంది. ప్రస్తుతం మైనారిటీ విద్యార్థుల దరఖాస్తుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉంది.

అవగాహన లేకపోవడంతో దూరం..

విదేశీ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ కొందరే సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లా నుంచి ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం ద్వారా 2018 నుంచి ఇప్పటివరకు 51 మంది విద్యార్థులే విదేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లారు. వీరిలో కొంతమంది చదువు పూర్తి చేసుకొని, అక్కడే ఉద్యోగులుగా స్థిరపడ్డారు.

1,300 పైగా కళాశాలలు..

జిల్లా నుంచి ఏటా వేలాది మంది డిగ్రీ పట్టాలు పొందుతున్నారు. 1,300కు పైగా ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. కళాశాలల యాజమాన్యాలతోపాటు అధికారులు విద్యార్థులకు విదేశీ విద్యపై అవగాహన కల్పిస్తే చాలా మంది విదేశాల్లో చదువుకునే అవకాశం ఉంది.

అర్హతలు ఇవీ..

- ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజిక శాస్త్ర కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.
- 60 శాతం మార్కులు సాధించాలి.
- టోఫెల్‌లో 60 శాతం, ఐఈఎల్‌టీఎస్‌లో 8.0 మార్కులు, జీఆర్ఈ, జీమ్యాట్‌లో ఉత్తీర్ణత సాధించి, పీటీఈలో 50 శాతం అర్హత మార్కులు ఉన్నవారికి అవకాశం.
- విద్యార్థుల వయసు 35 ఏళ్లలోపు ఉండాలి.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలి.

10 దేశాల్లో అవకాశం..

దక్షిణ కొరియా, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, న్యూజిలాండ్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ దేశాల్లో మాత్రమే పథకం కింద ఉన్నత విద్యకు అవకాశం ఉంది.

దరఖాస్తుకు కావాల్సిన సర్టిఫికెట్లు..

కులం, ఆదాయం, జనన ధ్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డు, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ మార్కుల జాబితాలతోపాటు టోఫెల్, ఐఈఎల్, టీఎస్‌జీఆర్ఈ, జీమ్యాట్, పీటీఈ అర్హత కలిగి ఉండాలి. విదేశాల్లో విద్యాభ్యాసం చేయడానికి సంబంధిత కళాశాల ప్రవేశ అనుమతిపత్రం, ప్రవేశ రుసుం చెల్లించిన రశీదు, బ్యాంకు ఖాతా పుస్తకాలు. వీటి ఆధారంగా మీసేవ కేంద్రంలో గానీ, తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్‌లో గానీ దరఖాస్తు చేసుకోవాలి. 2024 ఆగస్టు 1వ తేదీ నుంచి డిసెంబర్ 31 మధ్య కాలంలో విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందినవారు అర్హులు. మరిన్ని వివరాలకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ లేదా 08782957085 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలి.

సద్వినియోగం చేసుకోవాలి

ఆసక్తి ఉన్న మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా రూ..20 లక్షల రుణసాయం చేస్తోంది. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. – పి.పవన్‌కుమార్, డీఎండబ్ల్యూవో

చెప్పింది చేసి చూపిస్తాం

- అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం
- 20 ఏళ్లలో జరగని పనులు ఏడాదిలోనే పూర్తిచేశాం
- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాం
- నియోజకవర్గంలో రూ.280 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం
- ఏడాది ప్రజాపాలనపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



గోదావరిఖని: ‘ప్రజాప్రభుత్వంలో ప్రజలకు చెప్పింది చేసి చూపించాం’ అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ప్రజాపాలన ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ‘సాక్షి’కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రామగుండం గత 20ఏళ్లుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటూ వచ్చిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక అహర్నిశలు శ్రమించి నియోజకవర్గ అభివృద్ధికి రూ.280 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. పనులు ప్రారంభమయ్యాయని, ఏడాదిన్నరలోగా ఫలితాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ సంస్థల సహకారంతో పారిశ్రామిక ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చుదిద్దుతామని ఆయన తెలిపారు.

సాక్షి : ఏడాది పాలనలో అభివృద్ధి ఎలా ఉంది?
ఎమ్మెల్యే: ప్రజాపాలనలో రామగుండం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. ఇందుకోసం రూ.280 కోట్లు మంజూరయ్యాయి. కొన్ని పనులు ప్రారంభమయ్యాయి. మరి కొన్ని ప్రారంభ దశలో ఉన్నాయి.

సాక్షి : ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణపై దృష్టి పెట్టారా?
ఎమ్మెల్యే: ఎల్లంపలి ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రూ.354 కోట్లతో పాలకుర్తి, ఎల్లంపల్లి ఆధునికీకరణపై డీపీఆర్ సిద్ధం చేశాం. ఇది పూర్తయితే పాలకుర్తి, అంతర్గాం ప్రాంతాలకు మూడు పంటలకు సాగునీరు అందుతుంది.

సాక్షి : ఏడాది పాలనలో మీకు సంతృప్తి ఇచ్చినవేమిటి?
ఎమ్మెల్యే: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సేవలను మా ప్రజాప్రభుత్వం గుర్తించింది. వారికి రూ.5వేలు లాభాల బోనస్ చెల్లించాం. రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సహకారంతో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి జీవో 22 అమలు చేసేలా చూస్తాం. ‘రుడా’ అమలులోకి వస్తే ఒక్కో కార్మికుడి వేతనం నెలకు రూ.4వేల వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

సాక్షి : సింగరేణి కార్మిక వాడల కోసం ఏం చేశారు?
ఎమ్మెల్యే: సింగరేణి సంస్థ కేటాయించిన రూ.22 కోట్లతో సింగరేణి ఎస్టీపీ(సీవరేజ్ ప్లాంట్), రూ.5 కోట్లతో అంతర్గత రహదారుల ఆధునికీకరణ ప్రారంభమైంది. నీటిశుద్ధి ప్లాంటు పనులు కూడా కొనసాగుతున్నాయి.

సాక్షి : ఎన్టీపీసీ ద్వారా ఎన్ని నిధులు మంజూరు చేయించారు?
ఎమ్మెల్యే: అభివృద్ధి పనుల కోసం రూ.3 కోట్లు ఎన్టీపీసీ కేటాయించింది. మరో రూ.7 కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. రూ.20 కోట్లు కావాలని మేం ప్రతిపాదించాం. ఆర్ఎఫ్‌సీఎల్ ద్వారా రూ.3 కోట్లు మంజూరయ్యాయి.

సాక్షి : నర్సింగ్, డెంటల్ కాలేజీల పనుల ప్రగతి ఎలా ఉంది?
ఎమ్మెల్యే: మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కళాశాల మంజూరైంది. దీనికోసం రూ.26 కోట్లు కేటాయించారు. వీటితోపాటు డెంటల్ కాలేజీ కూడా మంజూరవుతుంది.

సాక్షి : ఎలాంటి అభివృద్ధిపై దృష్టి సారించారు?
ఎమ్మెల్యే: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారించాం. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ సహకారంతో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభమయ్యాయి. అంతర్గత రోడ్లు, యూడీసీలు, ఎస్టీపీలు, పట్టణ సుందరీకరణ, గ్రీన్‌యార్డులు, నర్సింగ్, డెంటల్ కాలేజీలు, ‘రుడా’ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాం.

సాక్షి : రాబోయే నాలుగేళ్లలో వేటికి ప్రాధాన్యం ఇస్తారు?
ఎమ్మెల్యే: నా ఏడాది పాలనలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా పోరాటం చేశా. వచ్చే ఏడాదిలోగా వీటి ఫలితం కనిపిస్తుంది. నా నియోజకవర్గంలోని ప్రధాన నగరం గోదావరిఖనిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతా. సింగరేణి సహకారంతో పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

సాక్షి : ‘రుడా’ ఎప్పుడు అమలవుతుంది?
ఎమ్మెల్యే: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్.. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)గా కావాలనేదే నా లక్ష్యం. దీనికోసం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దాని అమలుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

సాక్షి : సింగరేణి రోడ్ల అభివృద్ధి ఎలా ఉంది?
ఎమ్మెల్యే: అధ్వానంగా ఉన్న ఫైవింక్లయిన్ – సెంటినరీకాలనీ రోడ్డు అభివృద్ధికి సింగరేణి రూ.15 కోట్లు కేటాయించింది. ఫైవింక్లయిన్ – జీడీకే–11గని –మంథని మధ్య రోడ్డును మరింత విస్తరిస్తాం. అంతర్గత రోడ్లనూ అభివృద్ధి చేసే చర్యలు వేగవంతమయ్యాయి.

సాక్షి : రోడ్ల విస్తరణ కోసం సింగరేణి క్వార్టర్లు, దుకాణాల కూల్చివేతపై విమర్శలొస్తున్నాయి?
ఎమ్మెల్యే: మేం దుకాణాలు తొలగించడం లేదు. ఆక్రమణలను ప్రభుత్వం లేదా సింగరేణి స్వాధీనం చేసుకుంటున్నాయి. వీటిని ప్రజావినియోగంలోకి తీసుకొస్తాం. చిరువ్యాపారులకు నష్టం జరగలేదు. నిజమైన నిర్వాసితులు ఉంటే న్యాయం చేస్తాం.

సాక్షి : పర్యాటకంపై ప్రతిపాదనలు ఉన్నాయా?
ఎమ్మెల్యే: ప్రజాప్రభుత్వంలో పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించాం. రామునిగుండాలు, బుగ్గరామస్వామి, జనగామ త్రిలింగేశ్వరస్వామి ఆలయం, ఎల్లంపల్లి ప్రాజెక్టు, కోటిలింగాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం.

సాక్షి : యువతకు ఉపాధి కల్పన ఎలా ఉంది?
ఎమ్మెల్యే: నేను ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా స్థానికులకే ఉద్యోగాలు నినాదానికి కట్టుబడి ఉన్నా. ఇప్పటికే ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీలో ఈవిధానం అమలు చేశా. సింగరేణి ప్రైవేట్ ఓబీలోని స్థానికేతరులను వారి స్వస్థలాలకు పంపించి వేశాం. వందశాతం స్థానికులకే ఉపాధి కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశాం.

సాక్షి : గోదావరి నది తీరంలో కరకట్ట నిర్మాణం ప్రగతి ఎలా ఉంది?
ఎమ్మెల్యే: గోదావరి నదిపై నిర్మించిన సుందిళ్ల బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో కొన్ని ప్రాంతాలకు ముంపు ముప్పు ఉంది. దాన్ని తప్పించేందుకు గోదావరి వెంట కరకట్ట నిర్మించేందుకు రూ.280 కోట్లతో గతంలో ప్రతిపాదనలు చేశారు. దాని అంచనా వ్యయం రెట్టింపైంది. ఈవిషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

విపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పక్కన నరేందర్‌రెడ్డి, సత్తు మల్లేశం, ఆరెపల్లి మోహన్

- ఏడాదిలోనే ప్రజల్లో విశ్వాసం పెరిగింది
- మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత ఇంద్రకరణ్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: ఏడాదిలోనే ప్రజల్లో విశ్వాసం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టాలని మాజీ మంత్రి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ విజయోత్సవాల కో ఆర్డినేటర్ అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగ్యారంటీలు అమలు చేస్తుండడంతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం పెరిగిందన్నారు. కార్యకర్తలు నిరాశ చెందాల్సిన పనిలేదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరికి అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటికప్పుడు ఎన్నికలు జరిగితే..అంటూ మాట్లాడుతున్నారని, ఇప్పుడు ఎందుకు ఎన్నికల్లో వస్తాయో చెప్పాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో రూపాయి పనిచేస్తే ఎమ్మెల్యే 99 పైసలు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రూ.60 లక్షలతో అయ్యే ఇందిరాచౌక్ జంక్షన్‌ను రూ.1.30 కోట్లకు పెంచుకొన్నారన్నారు. కేంద్రమంత్రి అయిన తరువాత కూడా రూపాయి తీసుకురాని బండి సంజయ్, ప్రధాన మంత్రి అయితే నిధులు తెస్తాడా అని నిలదీశారు.

అప్పటి ఉత్సాహం ఇప్పుడేది?: సభలో నాయకుల ఆవేదన

కాంగ్రెస్ విజయోత్సవ సభ కాస్తా నాయకుల ఆవేదనను వెల్లగక్కే వేదికగా మారింది. సభలో మాట్లాడిన నాయకులు కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని, కష్టపడ్డ వారికి గుర్తింపు ఇవ్వాలంటూ కోరారు. అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. పార్టీ గెలిచినప్పుడు ఉన్న ఉత్సాహం ఇప్పుడు లేదని రాంరెడ్డి పేర్కొన్నారు. కష్టపడ్డ కార్యకర్తలకు అన్యాయం జరిగిందని, యూత్ కాంగ్రెస్ ఎన్నికలు సరిగా జరగలేదని అబ్దుల్ రెహమాన్ ఆరోపించారు. ఎన్నడూ లేని నిరుత్సాహం ఈ రోజు కనిపిస్తోందని చర్ల పద్మ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



నియామక పత్రం అందిస్తున్న వీసీ

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన మెగాజాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, శాతవాహన వీసీ ఉమేశ్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ చరిత్రలో జాబ్‌మేళా నిర్వహించడం మొదటిసారి అన్నారు. జాబ్‌మేళాకు 2,649 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 845 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. 427మందికి నియామక పత్రాలు అందించారు. షార్ట్‌లిస్ట్‌లో ఉన్నవారికి నియామక పత్రాలు అందిస్తామని ప్లేస్‌మెంట్ డైరెక్టర్ మనోహర్ తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జమ్మికుంట మార్కెట్ కమిటీపై హైకోర్టు స్టే

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నియామకంపై హైకోర్టు స్టే విధించింది. చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించారు. వావిలాలకు చెందిన పుల్లూరి స్వప్నను ప్రభుత్వం చైర్‌పర్సన్‌గా నియమించింది. స్వప్న బీసీ మహిళ అని, ఆమె నియామకం చెల్లదంటూ నాగం కృష్ణ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కుల నిర్ధారణపై ఈ నెల 11వ తేదీ వరకు విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజాభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం

- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు



వినతిపత్రం ఇస్తున్న బీసీ సంఘం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుపై వివిధ సంఘాల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిస్తామని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో శనివారం బీసీ డెడికేటెడ్ కమిషన్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లు, దామాషాపై రాజకీయ పార్టీలు, వివిధ సంఘాలు, ప్రజల నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అభ్యర్థనలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వివిధ కుల సంఘాలు, ప్రతినిధుల నుంచి 25 విజ్ఞప్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంటింటి సర్వే వివరాలు వచ్చిన తరువాత ప్రభుత్వానికి తుది నివేదిక అందిస్తామన్నారు. తమలో ఉన్న ఐదు వృత్తుల కులాలను విశ్వబ్రాహ్మణలుగా ఒకటిగా పరిగణించాలని విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కోరారు. బీసీ ముస్లింలకు రిజర్వేషన్లు వర్తింపజేయాలని ఎంఐఎం నాయకులు వినతి పత్రం అందించారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో తీవ్రంగా నష్టపోతున్నామని, రద్దు చేయాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. కమిషన్ సెక్రటరీ బి.సైదులు, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేశ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి అనిల్ ప్రకాశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో ఓ వ్యక్తి ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ కథనం మేరకు.. నగునూరుకు చెందిన మోదుంపల్లి శివకుమార్(23) ఓ ఆస్పత్రిలో పనిచేసి జీతం సరిపోకపోవడంతో మూడు నెలల క్రితం పనిమానేశాడు. ప్రస్తుతం స్థానికంగా ప్లంబర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పని లేకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బావిలో దూకి మహిళ..

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని గోధూర్‌కు చెందిన తెలుకంటి శ్యామల (50) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై అనిల్ కథనం ప్రకారం.. కొంత కాలంగా శ్యామల మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో తీవ్రంగా కృంగిపోయిన్న శ్యామల శనివారం ఉదయం సొంత వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని నుస్తులాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన తమ్మనవేని కనుకయ్య(63) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. శుక్రవారం ఉదయం కనుకయ్య గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి తీసుకొస్తుండగా, నుస్తులాపూర్ స్టేజీ వద్ద వెనుక నుంచి వచ్చిన ఆటో అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కనకయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి కొడుకు సంపత్ ఫిర్యాదు మేరకు శనివారం ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కోడం విజయ 15 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి మహారాష్ట్ర వెళ్లింది. కాగా శనివారం ఇంటి తాళం పగులగొట్టి ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలికి చోరీ విషయం తెలుపడంతో బీరువాలో రూ.లక్ష నగదు పోయినట్లు గుర్తించింది. ఎస్సై రామ్మోహన్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

పోలీస్ కావాలని..

- కలలు కన్నారు.. కొలువు కొట్టారు
- లక్షల ప్యాకేజీలు వదిలి కొందరు..
- ప్రభుత్వ ఉద్యోగం కాదని మరికొందరు
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యావంతులు
- ఖాకీ ఉద్యోగానికి మొగ్గు
- ఆయా ఠాణాల్లో విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు

పోలీస్ ఉద్యోగంపై మక్కువ.. సమాజ సేవ చేయడమే ధ్యేయంగా.. ఉన్నత చదువులు చదివి పట్టుదలతో ఖాకీ కొలువు సాధించారు. ఇందులో కొందరు ప్రైవేట్ కంపెనీల్లో లక్షల రూపాయల ప్యాకేజీలు.. ఇంకొందరు ప్రభుత్వ ఉద్యోగాలను వదులకున్నారు. మరికొందరు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో లక్ష్యాన్ని చేరుకున్నారు.. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని పలు పోలీస్ స్టేషన్లలో విధుల్లో చేరిన కానిస్టేబుళ్లపై కథనం.

సమాజ సేవ అంటే ఇష్టం



జ్యోతినగర్(రామగుండం): అమ్మానాన్న లక్ష్మి–రాజేశంకు మేము ముగ్గురం కూతుళ్లం. నాన్న చిన్న వ్యాపారం చేస్తూ అందరినీ చదివిపించారు. బీటెక్ పూర్తి చేసిన. సమాజ సేవ అంటే ఇష్టం. ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే తపనతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను. ఈ క్రమంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. హైదరాబాద్‌లోని అప్పాలో శిక్షణ పూర్తయింది. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరిన. పోలీసు ఉద్యోగంతో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

– తూర్పాటి సాయిలత, నారాయణపూర్, సుల్తానాబాద్

పట్టుదలతో చదివిన..



మాది గోదావరిఖని. అమ్మ లక్ష్మి గృహిణి. నాన్న శంకర్ లారీ యజమాని. ఇద్దరం కూతుర్లం. కాకతీయ యూనివర్సిటీలో ఎంబీఏ చేశాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదల ఏర్పడింది. ఈ క్రమంలో కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు హాజరయ్యాను. ఎంపికై హైదరాబాద్‌లో శిక్షణ పొందాను. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరిన.

– మాదాసు సౌమ్య, మహిళా కానిస్టేబుల్, ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్

చిన్ననాటి నుంచి..



తల్లిదండ్రులతో వెంకటేశ్

జగిత్యాలక్రైం: చిన్ననాటి నుంచి పోలీసు కావాలనే లక్ష్యంతో చదివా. గ్రూప్–4 ఉద్యోగం వచ్చినా వదులుకుని కానిస్టేబుల్ కొలువు సాధించా. నాన్న మల్లేశం కల్లుగీత కార్మికుడు. అమ్మ వ్యవసాయం చేస్తూ నన్ను బీటెక్ వరకు చదివించారు. ఆదిలాబాద్ పీటీసీలో 9 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న. జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మొదటి పోస్టింగ్ వచ్చింది.

– గర్వంద వెంకటేశ్, గుల్లకోట, వెల్గటూర్

పదిలక్షల ప్యాకేజీ వదులుకున్న



కుటుంబ సభ్యులతో వంశీ

ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఉద్దేశంతో చిన్ననాటి నుంచి అమ్మానాన్న వెంకటేశ్–లత వ్యవసాయం చేసుకుంటూ చదివించారు. బీటెక్ పూర్తికాగానే ఓ ప్రైవేటు సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ.10 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. కానీ నేను దానిని వదిలిపెట్టి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. ఆదిలాబాద్ పీటీసీలో 9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న. శిక్షణలో జగిత్యాల జిల్లా మొదటి స్థానం సాధించి ప్రశంసాపత్రాలు అందుకున్న. జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరిన.

– బాదినేని వంశీ, పెంబట్ల, సారంగాపూర్

గ్రూప్–4 ఉద్యోగం వదిలి..



చిన్ననాటి నుంచి అమ్మానాన్న నర్సింహారెడ్డి–రాధ వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. పట్టుదలతో బీటెక్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ.6 లక్షల ప్యాకేజీతో రెండేళ్లు పనిచేసిన. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని గ్రూప్–4 కొలువు కొట్టిన. దానిని వదులుకుని కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. 9 నెలల పాటు ఆదిలాబాద్ పీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న. జగిత్యాల పట్టణ పీఎస్‌లో విధుల్లో చేరిన.

– ఎమ్మిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వట్టెంల, వేములవాడరూరల్, రాజన్న సిరిసిల్ల

నాడు దేశసేవ.. నేడు ప్రజాసేవ



గోదావరిఖని(రామగుండం): మాది రామగిరి మండలం ఆదివారంపేట. దేశ సరిహద్దుల్లో 17 ఏళ్ల పాటు విధులు నిర్వహించి సేవ చేసిన. కానిస్టేబుల్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించా. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న.

– కొమ్ము సతీశ్, గోదావరిఖని వన్‌టౌన్

అండగా నిలిచిన తైక్వాండో



కోచ్‌తో లహరి,

చొప్పదండి: మాది చొప్పదండి పట్టణం. నాన్న జుంజూరి శంకరయ్య ఆటో డ్రైవర్. అమ్మ బీడీ కార్మికురాలు. ఒక చెల్లి చదువుకుంటోంది. పాఠశాల స్థాయి నుంచి ఆత్మరక్షణకు నేర్చుకున్న విద్య ప్రభుత్వ కొలువు సాధించేందుకు దోహదపడింది. తైక్వాండో శిక్షణ పొందడమే కాకుండా, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన. ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఉద్యోగాలకు క్రీడా విభాగంలో అర్హత ఉండటంతో దరఖాస్తు చేసిన. పట్టుదలతో చదివి కానిస్టేబుల్ కొలువు సాధించా. హైదరాబాద్‌లో శిక్షణ పొంది, కరీంనగర్ టూటౌన్‌లో విధుల్లో చేరిన.

– లహరి, చొప్పదండి

పోలీస్ ఉద్యోగం అంటే మక్కువ



సుల్తానాబాద్(పెద్దపల్లి): బీకాం చదివి 2012 బ్యాచ్‌లో హోంగార్డుగా ఎంపికయిన. భర్త ప్రోత్సాహంతో కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసి కొలువు సాధించా. పోలీస్ ఉద్యోగం అంటే మా ఇంట్లో అందరికీ ఇష్టం. హైదరాబాద్‌లో శిక్షణ పూర్తయింది. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరిన. భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

– మిట్టపల్లి రేణుక, సుల్తానాబాద్

తండ్రి ఆశయం కోసం



గన్నేరువరం(మానకొండూర్): మాది కరీంనగర్‌లోని రేకుర్తి. తల్లిదండ్రులు అస్తపురం రాజనర్సయ్య–వసంత దంపతులకు ఇద్దరు కూతుర్లం. ఎంఎస్ మ్యాథమెటిక్స్ చేసిన. తండ్రి ప్రోత్సాహంతో తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. ఉద్యోగం కోసం పెళ్లి కూడా వాయిదా వేసుకున్న. ఆగస్టులో హైదరాబాద్‌లో శిక్షణలో ఉండగానే నాన్న అనారోగ్యంతో మృతిచెందారు. నాన్న ఆశయం నేరవెర్చినందుకు సంతోషంగా ఉంది. అలాగే కొడుకులు లేని లోటు తీర్చానని అమ్మ కూడా ఆనందంగా ఉంది.

– అస్తపురం శ్రీలత, కానిస్టేబుల్ గన్నేరువరం

పట్టువీడని సంకల్పం



శంకరపట్నం(మానకొండూర్): పోలీస్ ఉద్యోగం చేయాలన్న నా సంకల్పం రెండో ప్రయత్నంలో నెరవేరింది. మాది మానకొండూర్ మండలం చెంజర్ల. తల్లిదండ్రులు సూదగోని రాజమల్లు–లక్ష్మి. ఎంటెక్ చదివిన. ప్రైవేట్ టీచర్‌గా ఉద్యోగం చేస్తూ గతంలో కానిస్టేబుల్ కొలువుకు ప్రిపేర్ కాగా రాలేదు. ప్రస్తుతం రెండో ప్రయత్నంలో ఉద్యోగం సాధించి హైదరాబాద్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న. కేశవపట్నం ఠాణాలో విధుల్లో చేరిన.

– సూదగోని సమత

వేములవాడలో కోడెల వార్

- ఈవో చాంబర్ ముట్టడించిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

వేములవాడ: రాజన్నకు భక్తులు భక్తితో సమర్పించే కోడెలపై వార్ నెలకొంది. గోశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఒకే రైతుకు 60 కోడెలు ఇవ్వడాన్ని నిరసిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆందోళనకు దిగారు. ఈవో చాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా జరిగిన ఘటనపై నాయకులకు ఏఈవో శ్రవణ్ వివరించారు. అనంతరం ఇరుపార్టీల నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు.

నిబంధనల మేరకు పంపిణీ

: కొండ సురేఖ, మంత్రి

రాజన్న ఆలయంలో నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్న కమిటీ సూచనల మేరకు కోడెల పంపిణీ జరుగుతుందని, తమపై గిట్టనివారు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి కొండ సురేఖ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు నేరుగా అందించే కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం చేపట్టిందని స్పష్టం చేశారు. గోశాల అభివృద్ధికి నిధులు సైతం కేటాయించామని తెలిపారు.



రాజన్న ఆలయ ఈవో చాంబర్ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

బాధ్యులపై చర్యలు తీసుకోండి

రెండుమూడు రోజులుగా పత్రికల్లో వస్తున్న కథనాల ద్వారా గీసుకొండ మండలం మనకొండ గ్రామంలో రాజన్న కోడెలను అనామకమైన గోశాలకు కేటాయించడం సరికాదు. వాటిని కబేళాలకు తరలించారని వస్తున్న వార్త కథనాలు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి సిఫారసు లెటర్‌తో రాజన్న కోడెలను వేములవాడ నుంచి తరలించడం దారుణం. ఈ ఘటనపై కలెక్టర్‌చే విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– రేగుల సంతోష్‌బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు

విచారణ తర్వాతే అప్పగిస్తున్నం

రాజన్నకు సమర్పించుకునే నిజ కోడెలను తమకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాతే వాటి చెవికి ట్యాగ్ ఏర్పాటు చేసి జిల్లా అధికారుల కమిటీ సూచనల మేరకు రైతులకు అప్పగిస్తున్నాం. గోసంరక్షణ సూచనల మేరకే తాము నిబంధనలు పాటిస్తున్నాం. సొసైటీలకు అప్పగించడం లేదు. ఎక్కడైనా మిస్‌యూజ్ జరిగితే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. సంరక్షించే పరిస్థితి లేకుంటే తిరిగి తమకే అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సంరక్షించే కోడెలు చనిపోతే లాంఛనం ప్రకారం ఖననం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– కొప్పుల వినోద్‌రెడ్డి, ఈవో

కోడెలను రక్షించాలి

రైతులు, భక్తులు ఎంతో భక్తితో సమర్పించే కోడెలను రక్షించాల్సిన ఆలయ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఒక్క వ్యక్తికే రాజన్న కోడెలను అందించడాన్ని తాము తీవ్రంగా నిరసిస్తున్నాం. జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఈవో వినోద్‌రెడ్డికి పార్టీ తరఫున వినతిపత్రం సమర్పించాం.

– మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

దేశాభివృద్ధికి తోడ్పడాలి

రామగిరి(మంథని): ఇంజినీరింగ్ విద్యార్థులు ఇన్నోవేషన్స్‌పై ప్రత్యేక దృష్టిసారించి దేశాభివృద్ధికి తోడ్పడాలని సింగరేణి రెస్క్యూ జీఎం కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెండురోజులుగా రామగిరిలో జేఎన్టీయూ కళాశాలలో మెకానికల్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తున్న ఆర్థోబోటిక్స్ రోబోటిక్స్ జాతీయస్థాయి వర్క్‌షాపు శనివారం ముగిసింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీఎం హాజరై ప్రసంగించారు. మైనింగ్‌లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేలా ఇంజినీరింగ్ విద్యార్థులు రోబోలను తయారు చేయాలన్నారు. ముఖ్యంగా భూగర్భ గనుల్లో పైకప్పు కూలుతున్న సమయంలో ఉద్యోగులను రక్షించడం, ఫైర్ నుంచి కాపాడడం, విష వాయువుల నుంచి బయటకు తీసుకురావడం, వరదల సమయంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కాపాడేలా రోబోలను తయారు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్‌ను ఉపయోగించుకొని ఎలా అద్భుతాలు పోషించవచ్చో రెండు రోజులు నిర్వహించిన వర్క్‌షాపు ద్వారా విద్యార్థులు నేర్చుకున్నారని వివరించారు. తక్కువ సమయంలో రోబోలను తయారు చేసిన రెండు గ్రూపులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన ఇన్నోవియన్స్ టెక్నాలజీ శిక్షకులు సతీశ్‌వచినాలా, ఫ్యాకల్టీ అడ్వయిజర్ స్వప్న, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ లోకేశ్, శ్రీనాథ్, ఎం.సంగీత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

హత్య కేసులో నిందితుల అరెస్ట్

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన మానాల శ్రీనివాస్ హత్య కేసులో నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మానాల శ్రీనివాస్ తమ గ్రామంలోని కనుకయ్య అనే చేపల వ్యాపారికి చెందిన వ్యాన్‌పై డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నాడనే కారణంతో శ్రీనివాస్‌ను కనుకయ్య విధుల నుంచి తొలగించి అతడి స్థానంలో గ్రామానికి చెందిన చింతల ప్రశాంత్‌ను పెట్టుకున్నాడు. అప్పటి నుంచి ప్రశాంత్‌పై శ్రీనివాస్ కోపం పెంచుకుని తరచూ అతడిని దుర్భాషలాడేవాడు. ఈ క్రమంలో ఈనెల 5న రాత్రి 7గంటల సమయంలో ప్రశాంత్ దారివెంట వెళ్తుండగా శ్రీనివాస్ అతడిని తిట్టడంతో ఇద్దరూ ఘర్షణపడ్డారు. అనంతరం గొడవ విషయాన్ని ప్రశాంత్ ఇంటికి వెళ్లి తన సోదరుడు ప్రవీణ్‌కు తెలిపాడు. కాగా, మానాల శ్రీనివాస్ కుటుంబసభ్యులతో అసభ్యకరంగా ప్రవర్తించాడనే కారణంగా ప్రవీణ్‌పై 2015లో కేసు నమోదైంది. అప్పటి నుంచి ప్రవీణ్ కూడా శ్రీనివాస్ కుటుంబంపై కక్ష పెంచుకున్నాడు. ఈనేపథ్యంలో గ్రామశివారులో శ్రీనివాస్ ఒంటరిగా ఉండటాన్ని గమనించిన ప్రశాంత్, ప్రవీణ్ కర్ర, బండరాయితో అతడి తలపై మోది హత్యచేసి పారిపోయారు. మృతుడి సోదరుడు మానాల నగేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై స్వామి

ఢిల్లీలో సిరిసిల్ల వ్యాపారి అదృశ్యం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం నెహ్రూనగర్‌కు చెందిన వ్యాపారి వడ్డెపల్లి లక్ష్మీకాంత్(36) హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటూ.. హోటల్, రెస్టారెంట్ వ్యాపారం నిర్వహిస్తారు. అతను ఇటీవల ఢిల్లీకి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఢిల్లీ నుంచి వస్తున్నానని భార్య అర్పితకు ఈ నెల 4న ఫోన్ చేసిన లక్ష్మీకాంత్ ఇంటికి రాలేదు. దీంతో అతడి భార్య హైదరాబాద్‌లోని అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఫోన్ కాల్ డేటా ఆధారంగా విచారణ జరుపుతున్నారు. లక్ష్మీకాంత్ అదృశ్యమైనట్లు తెలియడంతో సిరిసిల్లలో అతన్ని నమ్మి అప్పులు ఇచ్చినవారు ఆయన ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను వాకబు చేసినట్లు సమాచారం. లక్ష్మీకాంత్‌కు రూ.లక్షల్లో అప్పులు ఇచ్చిన వారు సిరిసిల్ల పోలీసులను ఆశ్రయించారు. సిరిసిల్ల పాత బస్టాండులోనూ ఓ రెస్టారెంట్‌ను ఇటీవలే ప్రారంభించిన లక్ష్మీకాంత్ అది నడవకపోవడంతో ఆర్థికంగా నష్టపోయినట్లు భావిస్తున్నారు. హైదరాబాద్, గజ్వేల్ ప్రాంతాల్లోనూ హోటళ్లను పెట్టాడు. మొత్తంగా రూ.కోట్లలో నష్టపోయిన సదరు వ్యాపారి ఇప్పుడు అదృశ్యం కావడంతో అతన్ని నమ్మి అప్పులు ఇచ్చిన వారు ఆందోళనకు గురవుతున్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో మహేశ్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పూణెలో నవంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించిన నేషనల్ లెవల్ కరాటే పోటీల్లో మండలంలోని వెన్నంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి గోల్డ్ మెడల్ సాధించారు. బంగారు పతకాలు గెలుచుకున్న వెల్తూరి నిహారిక, ఈర్ల శ్రీనితను శనివారం ఎంఈవో మహేశ్, హెచ్ఎం దయాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యాపారుల నిజాయతీ



సీఐకి నగదు ఇస్తున్న వ్యాపారులు

మెట్‌పల్లి(కోరుట్ల): ఇద్దరు వ్యాపారులకు రోడ్డుపై దొరికిన రూ.3లక్షలను పోలీసులకు అప్పగించి తమ నిజాయతీ చాటుకున్నారు. వివరాలు.. స్థానిక పాత బస్టాండ్ వద్ద చావిడ్ రోడ్‌లో సామ మారుతి, కంభంపాటి కిరణ్‌కుమార్ మసాలా దుకాణం నడుపుతున్నారు. అయితే శనివారం వారి దుకాణం ముందు రోడ్డుపై ప్యాక్ చేసి ఉన్న వస్తువు పడి ఉండడాన్ని గమనించారు. అక్కడకు వెళ్లి చూడగా అందులో రూ.500 నోట్లు కనిపించాయి. మొత్తం రూ.3 లక్షలు ఉండగా, వాటిని సీఐ నిరంజన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా అంత మొత్తంలో దొరికిన డబ్బును అప్పగించడంపై వ్యాపారులను సీఐ అభినందించారు. సదరు డబ్బు పోగొట్టుకున్న వారు పూర్తి ఆధారాలతో పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

ఎమ్మెస్సీ అగ్రికల్చర్‌లో గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన సాయికీర్తి

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రానికి చెందిన పొన్నం సాయికీర్తి ఎమ్మెస్సీ అగ్రికల్చర్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. భువనేశ్వర్(ఒడిస్సా)లో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చేస్తుంది. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు గోల్డ్‌మెడల్ అందజేశారు. ఈసందర్భంగా సాయికీర్తి తల్లిదండ్రులు పొన్నం ముక్తేశ్వర్, రేణుక ఆనందం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో దివ్యాంగురాలు మృతి



రాజేశ్వరి మృతదేహం

రామగుండం: అనుమానాస్పద స్థితిలో దివ్యాంగురాలు మృతిచెందిన ఘటన శనివారం రామగుండంలోని అయోధ్యనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సంధ్యారాణి కథనం ప్రకారం.. రైల్వేలో రిటైర్డ్ ఉద్యోగి జక్కనబోయిన లక్ష్మి, మీనయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, కూతురు సంతానం. కుమారులకు పెళ్లయ్యింది. కూతురు రాజేశ్వరి దివ్యాంగురాలు కావడంతో తండ్రి మరణానంతరం ఆయన పెన్షన్ రూ.18వేలు వస్తోంది. శ్రీరాంపూర్‌లో ఉంటున్న సోదరుడు మల్లయ్య వద్ద ఉంటున్న ఆమె.. మూడు నెలల క్రితం అయోధ్యనగర్‌లో ఉంటున్న రెండో సోదరుడు కనకయ్య వద్దకు వచ్చింది. ప్రత్యేక రేకుల షెడ్డులో నివాసం ఉంచి పనిమనిషిని సమకూర్చారు. కనకయ్య తన భార్య ఆరోగ్యం సరిగాలేకపోవడంతో నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ తీసుకెళ్లాడు. శనివారం పని మనిషి వచ్చి చూడగా రాజేశ్వరి షెడ్డులో మెడకు చున్నీ ఉండి.. కింద పడుకోబెట్టినట్లు రక్తపు మడుగులో కనిపించింది. వెంటనే 100 డయల్ చేసి సమాచారం అందించడంతో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఆమెను ఎవరో హత్య చేసినట్లు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. రాజేశ్వరి పెద్ద సోదరుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉపాధి వేటలో ఆగిన గుండె



రమేశ్ (ఫైల్)

కొండగట్టు(చొప్పదండి): ఉపాధి వేటలో ఓ గుండె ఆగింది. కొడిమ్యాల మండలం నెమలికొండ గ్రామానికి చెందిన సింగరేణి రమేశ్ (35) గల్ఫ్‌లో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాలు.. రమేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి వచ్చి ఇటీవలే మళ్లీ వెళ్లాడు. గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లే క్రమంలో గుండెలో నొప్పి రావడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య రేణుక, కొడుకు భరత్, కూతురు భవిజ్ఞ ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పాలల్లో కల్తీ.. అనారోగ్యం పాలైన కుటుంబం

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రం కృష్ణానగర్‌లోని ఓ కాలనీవాసులకు మైదం మల్లయ్య అనే వ్యక్తి నిత్యం పాలు పోస్తుంటాడు. శనివారం లావణ్య–ప్రసాద్ కుటుంబానికి పాలు పోయగా అవి వాసన రావడంతో పాటు వారు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కమిషనర్‌కు సమాచారం అందించగా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి పాలను తనిఖీ చేశారు. అంతే కాకుండా మల్లయ్య గ్రామం మేడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటలో కూడా తనిఖీ చేశారు. అతడు రోజూ పాలల్లో బేకింగ్ సోడా కలుపుతున్నాడని తెలిసింది.

విచారిస్తున్నాం : ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష

పాల శాంపిల్స్ తీసుకున్నామని, మల్లయ్యపై విచారణ చేస్తున్నట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష తెలిపారు. ప్రస్తుతం అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కవర్లలో పాలను ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్న వారిపై నిఘా పెట్టామని, ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలన్నారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



పాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష



అంజన్నకు మొక్కులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధిలో శనివారం రద్దీ నెలకొంది. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలైన్ల ద్వారా స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఏఈవో అంజయ్య, అధికారులు హరిహరనాథ్, ఉమామహేశ్వర రావు, చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.



రాజన్నకు వీకెండ్ తాకిడి

వేములవాడ: రాజన్నను శనివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వీకెండ్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈవో శ్రవణ్, పర్యవేక్షకులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. సీఐ వీరప్రసాద్, ఎస్సై అంజయ్య బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

క్రిస్మస్ వేడుకలు



విద్యార్థులతో అదనపు కమిషనర్ సువార్త

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ప్రభుత్వ బధిరుల పాఠశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సువార్త ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. బధిర విద్యార్థుల నడుమ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నా రు. యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది సంబరాలు



కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ ఆకుల నర్మద

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా నగరంలోని 11వ డివిజన్ కట్టరాంపూర్‌లో కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో డివిజన్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకుపోతామని తెలిపారు.

రెడ్ కలర్ డే



రెడ్ కలర్ డ్రెస్సుల్లో విద్యార్థులు

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని కోరా జాన్సన్ పాఠశాలలో శనివారం రెడ్ కలర్ డే నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు రెడ్ కలర్ దుస్తుల్లో వివిధ వేషధారణలతో పాల్గొని ఆటపాటలతో అలరించారు. పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌పై అవగాహన



కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: రేకుర్తిలోని సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్(సీబీఎస్‌ఈ)లో విద్యార్థులకు శనివారం కూరగాయల మార్కెట్ ప్రాముఖ్యతను తెలుపుతూ అవగాహన కల్పించినట్లు ప్యారడైజ్, సెయింట్ జార్జ్ విద్యా సంస్థల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. విద్యార్థులు వివిధ రకాల పండ్లు, కూరగాయలు తీసుకొచ్చి వాటిని విక్రయించే విధంగా వేషధారణలతో కూరగాయల మార్కెట్ నిర్వహించామన్నారు. విద్యార్థులకు జీవనశైలిలో ముఖ్యమైన భాగమైన మార్కెట్‌లో తాజా, పోషక పదార్థాలతో నిండిన పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉంటాయని, రైతులు తమ పండ్లు, కూరగాయలను ప్రత్యక్షంగా విక్రయించడంతో వినియోగదారులకు నాణ్యత గల ఉత్పత్తులు తక్కువ ధరలకు లభిస్తాయని వివరించినట్లు తెలిపారు. అనంతరం కూరగాయలను శ్రీశివ సాయి వృద్ధుల సేవా కేంద్రంలో అందజేశామని ఇన్‌చార్జి సంగీత అన్నారు.

ఎన్‌సీఆర్‌టీఈ సదస్సుకు 'పారమిత' ఉపాధ్యాయుడు



సాహూను అభినందిస్తున్న ప్రసాదరావు

కొత్తపల్లి: న్యూఢిల్లీలో జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు జరిగే ఎన్‌సీఆర్‌టీఈ జాతీయ సదస్సు–2025కు కరీంనగర్‌లోని పారమిత విద్యా సంస్థల సీనియర్ ఉపాధ్యాయుడు, ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ హెడ్ లలిత్ మోహన్ సాహూ ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ టీఎస్‌వీ రమణ తెలిపారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ అండ్ మ్యాథమెటిక్స్‌లో విద్యాశాఖ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో ప్రదర్శన కోసం సాహూ తయారు చేసిన పరిశోధనా పత్రం 'కారకాల అధ్యయనం కింద ఇంటర్ డిసిప్లినరీ ప్రాజెక్ట్–ఆధారిత అభ్యాస విధానం ద్వారా ఫైలోటాక్సీ, ఫైబొనాక్సీ సీక్వెన్స్'తో దాని సహసంబంధాన్ని ప్రభావితం చేస్తుందని తెలిపారు. సాహూను శనివారం పారమిత విద్యా సంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు సత్కరించారు. డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, రాకేశ్, అనుకర్ రావు, వినోద్‌రావు, ప్రసాద్, హన్మంత రావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, కో ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో హోమం



దుర్గాభవానీ ఆలయంలో కల్యాణం

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి షష్టి

కరీంనగర్‌తోపాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లోని పలు ఆలయాల్లో శనివారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని హరిహరక్షేత్రం అయ్యప్పస్వామి ఆలయంలో 108 కలశాలతో విశేష, ఫలపంచామృత అభిషేకం చేశారు. వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ, మంగళంపల్లి రాజేశ్వరశర్మల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి సుబ్రహ్మణస్వామి కల్యాణం జరిపారు. ఆలయ ఈవో కాంతారెడ్డి, చాణక్య, శ్రీనివాసశర్మ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభవానీ ఆలయంలో..

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో కొలువై ఉన్న వల్లిదేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి వారల కల్యాణ వేడుకలు నిర్వహించారు. వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారలకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి, పూజలు చేశారు. ఆలయ ఫౌండర్ వంగళ లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, రాచమల్ల ప్రసాద్, పల్లెర్ల శ్రీనివాస్, తొడుపునూరి వేణుగోపాల్, కార్పొరేట్ వంగళ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలోని శివాలయంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహానికి అభిషేకం

కొత్తపల్లి శివాలయంలో..

కొత్తపల్లి: కొత్తపల్లిలోని శివాలయం (శ్రీసీతారామ ఆంజనేయస్వామి (సహిత) సాయిబాబా ఆలయం)లో అర్చకులు వాసాలమర్రి నాగరాజు శర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం జరిపించారు. ఫల పంచామృత అభిషేకం, పుష్పార్చన, హారతి, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు దర్శించుకొని అభిషేకలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

- గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శన



ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల జాబితాను అంటించిన ఎంపీడీవో, ఎంపీవో

కరీంనగర్‌రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీల ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా శనివారం అధికారులు పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేశారు. కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డిలు గ్రామాల వారీగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితాను నోటీసుబోర్డులో అంటించారు. అదే విధంగా 17 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాబితాను కార్యదర్శులు ఏర్పాటు చేశారు. కరీంనగర్ మండలంలో మొత్తం ఓటర్లు 40,424 ఉండగా, పురుషులు 19,713, మహిళలు 20,710, ఇతరులు 1 ఉన్నారు. మొత్తం 184 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా అత్యధికంగా బొమ్మకల్‌లో 28 కేంద్రాలున్నాయి. అయితే కరీంనగర్ కార్పొరేషన్‌లో శివారు పంచాయతీలైన బొమ్మకల్, గోపాల్‌పూర్, దుర్శేడ్, చింతకుంట, మల్కాపూర్, కొత్తపల్లి మున్సిపాలిటీలను విలీనం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్ పమేలా సత్పతికి ప్రతిపాదన చేశారు. అయితే ప్రభుత్వం నుంచి విలీనంపై ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

12 వరకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం

ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. శనివారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఫిర్యాదు చేసే వీలుంది. 12న మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం, 17న తుది పోలింగ్ కేంద్రాల జాబితాను అధికారులు ప్రకటిస్తారు.

ఎలగందులలో సీఎం కప్ పోటీలు



వాలీబాల్‌లో తలపడుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ ఆటల పోటీలను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఎం టి.ఆనందంలు శనివారం ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో క్రీడాంశాల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్ విద్యార్థులతో పాటు గ్రామ యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, నిర్వహణ కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, పీడీ హరీశ్, పంచాయతీ కార్యదర్శి గురువయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ కార్డుతో అందుబాటులోకి వైద్యం



ఫ్యామిలీ కార్డు విడుదల చేస్తున్న కమిషనర్

కరీంనగర్‌టౌన్: మెడికవర్ ఆసుపత్రి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ కార్డుతో రోగులకు ఆర్థికపరమైన ఇబ్బందులు తప్పడంతో పాటు వైద్యం అందుబాటులోకి వస్తుందని కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ అన్నారు. శనివారం మెడికవర్ ఆసుపత్రి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ కార్డును విడుదల చేసి మాట్లాడారు. పేషంట్ ఒక్కసారి ఆసుపత్రి నుంచి ఫ్యామిలీ కార్డు పొందితే డాక్టర్ కన్సల్టేషన్‌పై 25 శాతం, రక్త పరీక్షలపై 15 శాతం, డేకేర్, క్యాష్ అడ్మిషన్ సేవలపై 10 శాతం, హెల్త్ కేర్ సేవలపై 30శాతం, మందులపై 20 శాతం, హెల్త్ చెకప్స్‌పై 10 శాతం రాయితీ ఇవ్వడంతో పాటు 10 కిలోమీటర్ల లోపు ఉచిత అంబులెన్స్ సదుపాయం ఉంటుందని వెల్లడించారు. కార్డు పొందినవారు దేశంలోని ఏ మెడికవర్ హాస్పిటల్‌కు చికిత్స కోసం వెళ్లినా సౌకర్యాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో న్యాయవాది తిరుపతిరెడ్డి, మాదాని చంద్రశేఖర్, ఆసుపత్రి మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్‌ను సమపాళ్లలో ఉపయోగించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈవో రవీందర్

కరీంనగర్‌రూరల్: ఆరోగ్యకరమైన ఆహారంలో అయోడిన్‌ను సమపాళ్లలో ఉపయోగించాలని ఎంఈవో కె.రవీందర్ అన్నారు. ఎల్‌జీడీ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా శనివారం కరీంనగర్ మండలం నగునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో అయోడిన్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం చెడిపోతుందని తెలిపారు. అయోడిన్ లోపంతో కలిగే నష్టాలను ఎల్‌జీడీ జిల్లా కోఆర్డినేటర్ మెట్టపల్లి లిటిల్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు, సంస్థ ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, ఎల్లాదాసు, నవీన్‌కుమార్, అర్చన, స్వాతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి

విద్యానగర్(కరీంనగర్): వెలమ కులాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పద్మనాయక వెలమ సంఘం అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే రాగద్వేషాలకు అతీతంగా ప్రవర్తించాల్సింది పోయి తమ కులాన్ని కించపర్చేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు.

కించపరిచేలా మాట్లాడటం సరికాదు

వెలమ సామాజిక వర్గాన్ని కించపర్చేలా షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ మాట్లాడటం సరికాదని రైతు, ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు అన్నారు. కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలు ఓసీల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కొత్తకొండ రవీందర్రావు, పెండ్యాల రాంరెడ్డి, తీగల లక్ష్మణరావు, అండెం రమణారెడ్డి, జిల్లాల అంజయ్య, శ్రీరాంభట్ల దీపకాబాబు, జనగామ చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

విద్యానగర్: ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కరీంనగర్ ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్, జిల్లా సహాయ కార్యదర్శి భోగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం, సురేశ్, ఆకాశ్, నాయకులు మానస, అక్షయ్ విష్ణు, నవదీప్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు 11కేవీ శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలోని శ్రీరాంనగర్, ఆదిత్యనగర్, సాలంపుర, కొత్తయాస్వాడ, విద్యానగర్, శాతవాహన యూనివర్సిటీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.లావణ్య తెలిపారు. అదేవిధంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 11కేవీ ఎల్లమ్మ ఫీడర్ పరిధిలోని డంప్ యార్డు, బీఎస్ఎన్ఎల్ టవర్, కోతిరాంపూర్, ఆటోనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ పి.శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

సమాచారం

నేటి నుంచి బీరప్ప, మహంకాళి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో బీరప్ప, మహంకాళి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఆదివారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శ్రీమాన్ నంబి నృసింహచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిష్ఠామూర్తులతో గ్రామప్రదక్షిణ చేసి నూతన ఆలయంలోకి ప్రవేశించి పూజలు నిర్వహిస్తారు. 9న యాగశాల ప్రవేశం, ద్వార తోరణం, దీపారాధన తదితర పూజలు, 10న మాల మంత్రహవనం, జలాధివాస హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం, 11న యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, మహాబలిహరణం, శాంతి కల్యాణం తదితర పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో శ్రీపాల్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మహారాష్ట్ర పూణేలోని ఛత్రపతి స్పోర్ట్స్ స్టేడియంలో ఇటీవల జరిగిన 27వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో కరీంనగర్ మంకమ్మతోటలోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు. కటాస్ కమిటీ విభాగాల్లో రుద్విమెరున్, సాకేత్, తేజాస్‌రెడ్డిలు ప్రతిభ కనబరిచి బంగారు, రజత, కాంస్య పతకాలు పొందారు. పతకాలు సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత దాసరి శ్రీపాల్‌రెడ్డితో పాటు ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్‌రూరల్: మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అల్ఫోర్స్‌లో రెండోరోజు చండీ హోమం



లింగాభిషేకంలో నరేందర్ రెడ్డి దంపతులు

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్‌లో శత చండీ మహాయాగం వైభవోపేతంగా కొనసాగుతోంది. మహా యాగంలో భాగంగా రెండో రోజు ఆదివారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి, డాక్టర్ వి.వనజారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా.. గోపూజతో మొదలై గురువందన, రిత్వికుల వేద ఘోష మధ్య అమ్మవారి పారాయణం కొనసాగించారు. చండీ మాత హవనం వైభవంగా జరిగింది. నగర పురప్రముఖులు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించారు. యాగం ముగింపులో భాగంగా ఆదివారం మధ్యాహ్నం మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు వీఎస్ఆర్ తెలిపారు. అనంతరం విశిష్ట అతిథి శ్రీవిశ్వంజీ విశ్వగురు అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు.



ఘనంగా మహా దండి పట్నం

కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని శ్రీకొచ్చగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో మహాదండి వారం పురస్కరించుకుని శనివారం దండి పట్నం వేశారు. ఒగ్గు పూజారి సాయిల్ల శివయ్య ఆధ్వర్యంలో పెద్ద గొల్ల ఆసిరి మల్లేశం నివాసం నుంచి పూజాసామగ్రితో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం పట్నం వేసి మల్లన్న కల్యాణం వైభవంగా నిర్వహించి ఒగ్గుకథను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు మహిళలు పాల్గొన్నారు. – కరీంనగర్‌రూరల్

ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి మినహాయించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

కరీంనగర్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి మినహాయించాలని కోరుతూ శనివారం పంచాయతీ కార్యదర్శులు కరీంనగర్ ఎంపీడీవో సంజీవరావును కలిసి వినతిపత్రం అందజేశారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు, పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పనులతో కార్యదర్శులపై ఒత్తిడి పెరిగిందని తెలిపారు. గ్రామపంచాయతీ నిర్వాహణ పనులతో పాటు సర్వేల పేరిట ప్రభుత్వం కార్యదర్శులపై భారం మోపుతుందని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే నుంచి కార్యదర్శులను మినహాయించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు హిదైతుల్లా, విజయలక్ష్మి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఆటోల బంద్ విజయవంతం



నగునూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ పిలుపు మేరకు శనివారం కరీంనగర్ మండలంలో చేపట్టిన ఆటోల బంద్ విజయవంతమైంది. చర్లభూత్కూర్ ఆస్పత్రి, దుర్శేడ్, మొగ్దుంపూర్, నగునూరు, చామనపల్లి, చెర్లభూత్కూర్ తదితర గ్రామాల్లో ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా ఆటోల బంద్‌లో పాల్గొన్నారు. నగునూరులో ఆటో డ్రైవర్లు మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయారని చొప్పదండి, ధర్మారం ఆటో యూనియన్ అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం అన్నారు. ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఇవ్వాలని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు కొత్తకొండ సుభాశ్, బుచ్చాల కొమురయ్య, రాజు, సతీశ్, నర్సయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ మనందరి బాధ్యత



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

విద్యానగర్(కరీంనగర్): బాలల పరిరక్షణ మనందరి బాధ్యత అని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. శనివారం కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ కిసాన్‌నగర్ సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో దుర్గమ్మ గుడి వద్ద నిర్వహించిన బాల్ వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్ని కష్టాలు ఎదురైన పేదరికం వెంటాడిన పిల్లలను మాత్రం తప్పకుండా చదివించాలన్నారు. బాల్య వివాహాలు చేసి వారి జీవితాలను, భవిష్యత్‌ను నాశనం చేయొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ కళావతి, చైల్డ్ హెల్ప్‌లైన్ మహేశ్, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, పద్మజ, ఆయాలు గౌరమ్మ, పద్మ , కవిత, ఆశా తదితరులు పాల్గొన్నారు.

బాలల గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి



సత్తు మల్లేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న కిరణ్‌కుమార్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో బాలల గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఏ.కిరణ్‌కుమార్ శనివారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు మల్లేశ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో ఒకేఒక బాలల గ్రంథాలయం కొనసాగుతుందని, కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ఎంతో అభివృద్ధి చెంది ఏటా 15 కిలోమీటర్ల వరకు విస్తరించినప్పటికీ బాలల కోసం ప్రత్యేక గ్రంథాలయాలు లేవన్నారు. గ్రేటర్ కరీంనగర్‌గా రూపుదిద్దుకుంటున్నప్పటికీ ఇప్పటి వరకు బాలల కోసం ఒక గ్రంథాలయమే ఉందన్నారు. ఈ విషయంలో దృష్టి సారించి బాలల కోసం డివిజన్లలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో యువజన సంఘాల సమితి ప్రతినిధి బోనాల అశోక్ తదితరులున్నారు.

బాలికలు గుర్తింపు పొందాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ

విద్యానగర్(కరీంనగర్): బాలికలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగంలో స్థిరపడి మంచి గుర్తింపు పొందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ అన్నారు. శనివారం నగరంలోని గంజ్ హైస్కూల్‌లో ఐసీడీఎస్, డీహెచ్‌ఈడబ్ల్యూ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మిషన్ కో ఆర్డినేటర్ శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, అంగన్‌వాడీ టీచర్లు వనజ, పద్మావతి, యం పద్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, ఉపన్యాస పోటీలు



మెమొంటో అందుకుంటున్న విద్యార్థి

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని కుమ్మరివాడి ప్రభుత్వ పాఠశాలలో శనివారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'అవినీతి నిర్మూలనలో విద్యార్థులు, పౌరుల పాత్ర' అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మెమొంటోలు అందజేశారు. సంస్థ సభ్యులు గోగురి శ్రీధర్ రెడ్డి, ఉదయ్, దేవిప్రసాద్, హిమసాయి. హెచ్ఎం లక్ష్మణ్ పాల్గొన్నారు.

కనికట్టు కుట్ర 'పచ్చ' పన్నాగమే!

డ్రగ్స్ కథ క్లోజ్.. ఆ కంటైనర్‌కు సీబీఐ క్లీన్ చిట్

ఎన్నికల్లో ఓటర్లను మోసగించేందుకు టీడీపీ అండ్ కో దుష్ప్రచారం

- బ్రెజిల్ నుంచి విశాఖ వచ్చిన నౌకలో డ్రగ్స్ ఉన్నాయని గగ్గోలు
- రాష్ట్రం డ్రగ్స్ అడ్డాగా మారిపోయిందని ఎల్లో మీడియా రాద్ధాంతం
- ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసేందుకు తప్పుడు కథనాలు
- ఇప్పుడు ఆ నౌకలో డ్రగ్స్ లేవని సీబీఐ దర్యాప్తులో వెల్లడి
- దీంతో తేలిపోయిన పచ్చకుట్ర
- భూముల రీసర్వేపైనా అప్పట్లో విషం చిమ్మిన టీడీపీ..
- ప్రజల భూములు కబ్జా చేస్తారంటూ ఊదరగొట్టిన ఎల్లో గ్యాంగ్
- ఇప్పుడు మాట మార్చి.. రీసర్వే కొనసాగిస్తామన్న సీఎం చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పు చేసిందని దుష్ప్రచారం
- ఇలా నెలకో అబద్ధానికి రెక్కలు కట్టి ప్రచారం చేసిన వైనం

ఆ రోజు డ్రై ఈస్ట్ బ్యాగుల్లో డ్రగ్స్ అవశేషాలున్నాయని ఎందుకు ఊరూరా ఊదరగొట్టారు? ఇది విష ప్రచారం కాదా? డ్రైఈస్ట్‌లో కొకైన్, హెరాయిన్, ఓపియం, కొడైన్, మెథలాక్విన్ తదితర డ్రగ్స్ అవశేషాలున్నాయని ఎందుకు చెప్పినట్లు? ఇప్పుడు అవన్నీ మాయమైపోయాయా? ఈ దందాలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు భాగస్వామ్యం ఉండటం వాస్తవం కాదా? అధికారంలోకి రాగానే 'కుడి ఎడమైతే పొరపాటు లేదని' సమర్థించుకుంటున్నారా? వేల కోట్ల డ్రగ్స్ అంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విష ప్రచారం చేసి, వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు ఆరోపణలు గుప్పించింది కూటమి నేతలు కాదా? వీటన్నింటిపై ఇప్పుడు ఏమంటారు?


డ్రగ్స్ వచ్చాయంటూ సీజ్ చేసిన కంటైనర్ ఇదే

సాక్షి, అమరావతి/ సాక్షి, విశాఖపట్నం : 'అడ్డదారిలో అధికారమే చంద్రబాబు జెండా.. అందుకు దుష్ప్రచారమే అజెండా' అని మరోసారి నిరూపితమైంది. ఎన్నికల్లో ప్రజల్ని మోసగించేందుకు టీడీపీ కూటమి పన్నిన కుట్రలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల పేరిట ప్రజల్ని వంచించారన్నది ఇప్పటికే స్పష్టమైంది. అంతేకాదు ఎన్నికల ముందు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు ముఠా చేసిన విష ప్రచారం అంతా కుట్రేనన్నది నిరూపితమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం డ్రగ్స్ అడ్డాగా మారిపోయిందని టీడీపీ కూటమి చేసిన దుష్ప్రచారం.. అందుకు వంత పాడిన ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియా రాద్ధాంతం అంతా కుతంత్రమేనని నిగ్గు తేలింది. బ్రెజిల్ నుంచి నౌకలో విశాఖపట్నానికి వేల టన్నుల డ్రగ్స్‌ను దిగుమతి చేశారన్న ప్రచారం కేవలం చంద్రబాబు కుతంత్రమేనని నిర్ధారణ అయ్యింది. విశాఖపట్నంకు వచ్చిన నౌకలో అసలు ఎలాంటి డ్రగ్స్ లేవని కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దర్యాప్తులో వెల్లడైంది. దీంతో అక్రమంగా ఓట్లు కొల్లగొట్టేందుకు చంద్రబాబు ముఠా చేసిన విష ప్రచారమేనని స్పష్టమైంది. అదే కాదు.. భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేపై కూడా టీడీపీ కూటమి ఎన్నికల ముందు పెట్టిన గగ్గోలు అంతా దుష్ప్రచారమే తప్ప.. అందులో ఏమాత్రం వాస్తవం లేదన్నదీ తేటతెల్లమైంది. రీసర్వేను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని చంద్రబాబే వెల్లడించడం అందుకు తార్కాణం. నేరుగా వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేమని గ్రహించే చంద్రబాబు ఎన్నికల ముందు ఈ దుష్ప్రచార కుతంత్రాలతో ప్రజల్ని తప్పుదారి పట్టించారన్నది తాజా పరిణామాలు తేల్చి చెబుతున్నాయి. ఇలా నెలకో అబద్ధానికి రెక్కలు కట్టి విష ప్రచారం చేస్తుండటం చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, వదినమ్మ పురందేశ్వరి, ఈనాడు, టీవీ–5.. ఇతర ఎల్లో మీడియాకే చెల్లింది. రాష్ట్ర అప్పులు మొదలు.. శ్రీవారి లడ్డూ, విజయవాడ వరదలు, అదానీ వ్యవహారం, కాకినాడ పోర్టు వరకు.. ఎప్పటికప్పుడు వివాదాలు లేవనెత్తుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది.

డ్రగ్స్ అడ్డాగా ఏపీ.. ఇదీ పచ్చ ముఠా దుష్ప్రచారం

- చంద్రబాబు 2024 ఎన్నికల అక్రమాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయి. ప్రజల్ని మభ్యపెట్టందే, భయభ్రాంతులకు గురి చేయందే ఎన్నికల్లో గెలవలేమని గుర్తించిన ఆయన పక్కా పన్నాగంతో దుష్ప్రచార కుట్రకు తెగించారు. అందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మారిపోయిందని పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశారు.
- చంద్రబాబుకు కొమ్ముకాసే ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియా ఆ ప్రచారాన్ని ఊరూ వాడా ఊదరగొట్టి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించాయి. పోలింగ్‌కు కచ్చితంగా నెలన్నర ముందు డ్రగ్స్ దందా కుట్రను పతాక స్థాయికి తీసుకువెళ్లాలని చంద్రబాబు భావించారు. అప్పటికే తమతో జట్టుకట్టిన జనసేన, బీజేపీ నేతల సహకారంతో అందుకోసం పక్కా కుట్రకు తెరతీశారు. అందులో భాగంగానే బ్రెజిల్ నుంచి 25 వేల టన్నుల డ్రై ఈస్ట్‌ను తీసుకువచ్చిన 'ఎస్‌ఈకేయూ 4375380' అనే నౌకలో డ్రగ్స్ అక్రమంగా తీసుకువస్తున్నారంటూ ఢిల్లీలోని సీబీఐ కార్యాలయానికి ఆకాశరామన్న తరహాలో తప్పుడు సమాచారం అందించారు.
- అనంతరం కొందరు అధికారులను ప్రభావితం చేశారు. దాంతో ఢిల్లీ నుంచి సీబీఐ అధికారులు ఆగమేఘాల మీద విశాఖపట్నం చేరుకుని మార్చి 21న ఆ నౌకలో తనిఖీలు చేశారు. విశాఖపట్నం కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే సంధ్యా ఆక్వా అనే సంస్థ దిగుమతి చేసుకున్న 25 వేల టన్నుల డ్రై ఈస్ట్‌ను జప్తు చేశారు. అందుకోసం ముందుగానే కాచుకుని కూర్చున్న టీడీపీ.. ఆ వెంటనే డ్రై ఈస్ట్ పేరుతో కొకైన్ అనే డ్రగ్స్ అక్రమంగా దిగుమతి చేశారనే దుష్ప్రచారాన్ని వ్యాప్తిలోకి తెచ్చింది.
- వెయ్యి టన్నుల కొకైన్ ధర రూ.వెయ్యి కోట్లని.. ఆ లెక్కల ప్రకారం రూ.25 వేల కోట్లు విలువ చేసే 25 వేల టన్నుల కొకైన్‌ను రాష్ట్రంలోకి తీసుకువచ్చారంటూ ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశాయి. చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు, పవన్ కళ్యాణ్, దగ్గుబాటి పురందేశ్వరి.. ఇలా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వరుసగా మైకులు పట్టుకుని అదే తప్పుడు ప్రచారాన్ని తీవ్రతరం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలే డ్రగ్స్‌ను రాష్ట్రంలోకి తీసుకువచ్చారంటూ విష ప్రచారం చేశారు.
- ఆ షిప్‌లో డ్రగ్స్ దిగుమతి అయినట్టు సీబీఐ అధికారికంగా ప్రకటించనే లేదు. ఇంకా తనిఖీలు చేయాల్సి ఉందని, ఆ డ్రై ఈస్ట్‌ను ల్యాబొరేటరీకి పంపించి పరీక్షించాల్సి ఉందని సీబీఐ చెప్పినా సరే చంద్రబాబు ముఠా ఏమాత్రం పట్టించుకోలేదు. కేవలం ఎన్నికల ముందు ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా రాష్ట్రం డ్రగ్స్‌కు అడ్డాగా మారిపోయిందంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నించారు. ఏకంగా నెల రోజులపాటు ఇదే దుష్ప్రచారాన్ని కొనసాగించడం పక్కా చంద్రబాబు పన్నాగమే.

భూముల రీసర్వేపై కూడా విషప్రచారం

- భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేపై కూడా చంద్రబాబు, ఆయన ముఠా ఇదే రీతిలో దుష్ప్రచారం చేశాయి. వైఎస్సార్‌సీపీ నేతలు సామాన్యుల భూములను కబ్జా చేసేందుకు రీసర్వేను నిర్వహిస్తున్నారంటూ ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియా ద్వారా విషం చిమ్ముతూ అందర్నీ భయాందోళనలకు గురి చేసేందుకు యత్నించాయి.
- తాత, తండ్రుల నుంచి వారసత్వంగా వస్తున్న భూములను బలవంతంగా తమ పేరిట రాయించేసుకుంటారని, ఆ మేరకు రీసర్వే నివేదికల్లో నమోదు చేసేస్తారని బురద జల్లడం ద్వారా సామాన్య ప్రజానీకాన్ని బెంబేలెత్తించాయి. టీడీపీ చేస్తోందంతా దుష్ప్రచారమేనని వైఎస్సార్‌సీపీ ఎంతగా వివరించేందుకు యత్నించినా సరే టీడీపీ కూటమి మాత్రం తమ కుట్రలను మరింత తీవ్రతరం చేసింది.
- ఎప్పుడో బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో వందేళ్ల క్రితం రాష్ట్రంలో భూముల సర్వే చేసిన తర్వాత ఇప్పటి వరకు ఎవరూ సర్వే చేయలేదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివరించింది. దాంతో భూ వివాదాలు అంతకంతకూ పెరుగుతుండటంతో సామాన్యులు పడుతున్న అవస్థలకు పరిష్కార మార్గంగానే రీసర్వే చేపట్టినట్టు ఎంతగానో చెప్పుకొచ్చింది. భూముల రీసర్వేను కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదించిందని వివరించింది. కానీ టీడీపీ కూటమి ప్రజల్ని మభ్యపెట్టేందుకు పోలింగ్ వరకు తమ దుష్ప్రచారాన్ని కొనసాగించింది.
- తీరా అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. భూముల రీసర్వేను తాము కొనసాగిస్తామని ప్రకటించడం గమనార్హం. భూ వివాదాల పరిష్కారానికి రీసర్వేనే పరిష్కారమని ఆయన ప్రకటించారు. తద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే సరైన చర్యేనని అధికారికంగా ఆమోదించారు. అంటే కేవలం ఎన్నికల్లో ప్రజల్ని మోసగించి అక్రమంగా ఓట్లు కొల్లగొట్టేందుకే తాము దుష్ప్రచారం చేశామని చంద్రబాబు అంగీకరించినట్టే కదా!

అందులో డ్రగ్స్ లేవట!

ఒకటి కాదు.. రెండు కాదు.. **వేల కోట్ల రూపాయల విలువ చేసే** డ్రగ్స్ కంటైనర్‌లో దొరికాయంటూ నాడు హడావుడి చేశారు. అబ్బే.. అందులో డ్రగ్స్ ఏమీ లేవు.. తొలి రోజు దొరికిన **ఆనవాళ్లే** ఉన్నాయంటూ చేతులు దులిపేసుకున్నారు. విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ (వీసీటీపీఎల్)లో 25 వేల కిలోల డ్రైఈస్ట్‌తో పాటు పెద్ద ఎత్తున డ్రగ్స్ దిగుమతి అయ్యాయని ఈ ఏడాది మార్చి 19న సీబీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంటర్‌పోల్ నుంచి సమాచారం రావడంతో ఈ రాకెట్ గుట్టు రట్టయిందని చెప్పింది. సంధ్య ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్‌కు వెయ్యి బ్యాగులొచ్చాయని, అందులో 70 శాతం బ్యాగుల్లోని డ్రైఈస్ట్‌లో కొకైన్, హెరాయిన్, ఓపియం, కొడైన్, మెథలాక్విన్ తదితర డ్రగ్స్ అవశేషాలున్నాయని వెల్లడించింది. పరీక్షలు చేసినా దొరక్కుండా 30 శాతం బ్యాగుల్లో పూర్తి స్థాయిలో డ్రైఈస్ట్ లోడ్ చేసి పక్కా ప్రణాళికతోనే డ్రగ్స్ తెచ్చినట్లు చెప్పింది. డ్రగ్స్ మూలాలపై దర్యాప్తు చేస్తామంటూ సీబీఐ బృందం బ్రెజిల్ కూడా వెళ్లింది. శాంటోస్ పోర్టుకు డ్రైఈస్ట్ తరలించిన ఓషన్ నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్ సంస్థతో పాటు కార్గో షిప్ వచ్చిన మార్గం, నౌక ఆగిన పోర్టుల్లో సీసీటీవీ ఫుటేజ్ సేకరిస్తున్నట్లు చెప్పింది. షిప్‌లోకి కంటైనర్‌ను ఎక్కించిన శాంటోస్ పోర్టులో డ్రగ్స్ వచ్చిన కంటైనర్ నంబర్ ఎస్ఈకేయూ–4375380తోనే మరో కంటైనర్ కూడా ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఒకే నంబర్‌తో రెండు కంటైనర్లని తీసుకొచ్చి, తనిఖీల్లో డ్రగ్స్ లేని కంటైనర్‌ను చూపించి, నౌకలోకి డ్రగ్స్ ఉన్న దానిని ఎక్కించినట్లు సీబీఐ లీకుల ద్వారా వెల్లడైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దర్యాప్తులో వేగం మందగించింది. ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కి శాంపిల్స్ పంపించామని, అక్కడి నుంచి రిపోర్టులు రాలేదంటూ చెబుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ వ్యవహారంలో సూత్రధారిగా భావించిన సంధ్య ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్‌కు సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చేసింది. బ్రెజిల్ నుంచి విశాఖపట్నం వచ్చిన నౌకలో అసలు డ్రగ్స్ లేనే లేవని సీబీఐ తేల్చి చెప్పింది. కంటైనర్ క్లియరెన్స్ వాస్తవమేనని కస్టమ్స్ అధికారులు ధృవీకరించారు.. సీజ్ చేసిన కంటైనర్‌ను సదరు సంస్థకు అప్పగించేందుకు సీబీఐ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చిందని కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్ తెలిపారు. పూర్తి ఆధారాలతో సీబీఐ కోర్టులో నివేదిక సమర్పించిన తర్వాత.. కోర్టు అనుమతించిన పత్రాల్ని తమకు ఇచ్చారని ఆయన వెల్లడించారు.

ఇలాంటి కుట్రలు ఎన్నెన్నో..

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం రూ.14 లక్షల కోట్లు అప్పులు చేసిందని టీడీపీ కూటమి విష ప్రచారం చేసింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.6.50 లక్షల కోట్లేనని వెల్లడించింది. 2014–19లో చంద్రబాబు హయాంలో అప్పుల పెరుగుదల శాతం కంటే 2019–24లో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో అప్పుల పెరుగుదల శాతం తక్కువేనని ఆర్థిక శాఖ నివేదిక వెల్లడించింది. అంటే టీడీపీ ప్రభుత్వం కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పులు తక్కువేనని నిరూపితమైంది.
- రాష్ట్రంలో ఏకంగా 34 వేల మంది బాలికలు, మహిళలను వలంటీర్ల ద్వారా అపహరించి అక్రమ రవాణా చేశారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ మేరకు తనకు కేంద్ర హోమ్ శాఖ వర్గాలు తెలిపాయంటూ ఎన్నికల సభల్లో పదే పదే దుష్ప్రచారం చేశారు. కానీ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయంపై ఆయన ఒక్క మాట మాట్లాడలేదు. కనిపించకుండా పోయారని చెప్పిన 34 వేల మందిని తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ సవాల్ విసురుతున్నా ఆయన స్పందించడమే లేదు. ఎందుకంటే అది అవాస్తవం కాబట్టే. అసలు అంత మంది కనిపించలేదన్న ప్రశ్నే ఉత్పన్నం కాలేదని ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలోని హోమ్ శాఖ తెలిపింది. అంటే ఇదంతా ఓటర్లను తప్పుదారి పట్టించేందుకు చేసిన దుష్ప్రచారమేనని నిగ్గు తేలింది.

3 లక్ష్యాలతో ఆర్టీసీకి జవసత్వాలు

'సాక్షి' ఇంటర్వ్యూలో బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: 'ప్రజల జీవితంలో అంతర్భాగంగా ఉన్న ఆర్టీసీని పరిరక్షించడమే మా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ఆర్టీసీని ఉన్నతంగా నిర్వహించే విషయంలో మూడు లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాం. సంస్థ పరిపుష్టి, ప్రయాణికులకు మెరుగైన సేవలు, సిబ్బంది సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తూ చర్యలు ప్రారంభించాం. తీవ్ర నష్టాలు, అస్తవ్యస్త విధానాలతో మూతబడే దుస్థితిలో ఉన్న ఆర్టీసీని మళ్లీ లాభాలబాట పట్టించడమే కాకుండా ప్రజలకు మరింత చేరువ చేశాం. ఇకపై సంస్థను విస్తరిస్తాం, పటిష్టపరుస్తాం, ఆధునీకరిస్తాం' అని బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివిధ అంశాలను పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

'మహాలక్ష్మి'తో మహర్దశ...

మా ప్రభుత్వం కొలువుదీరిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాం. ఇది రాజకీయ హామీ కాదు.. సంస్థ గతిని మార్చే గొప్ప పథకం. కేవలం సంవత్సర కాలంలో ఏకంగా 116 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించడం ద్వారా దాదాపు రూ. 4 వేల కోట్లను ఆదా చేసుకున్నారు. ఆ మొత్తం ఆయా కుటుంబాలకు మరో రకంగా లబ్ధి చేకూర్చేందుకు కారణమైంది. కేవలం సిబ్బంది గొప్ప కృషి వల్లే ఈ పథకం ఇంతటి విజయం సాధించింది. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ నేరుగా కోల్పోయే టికెట్ ఆదాయాన్ని రీయింబర్స్ చేయడం ద్వారా ఆ నష్టాన్ని పూడుస్తున్నాం. ప్రతినెలా ఆ మొత్తాన్ని చెల్లిస్తుండటంతో సంస్థకు ఆర్థిక చేయూత కలుగుతోంది. ఇది సంస్థ విస్తరణకు దోహదపడుతోంది. ఈ పథకం వల్ల ఆర్టీసీ బస్సుల్లో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 30 లక్షల నుంచి 60 లక్షలకు పెరిగింది. వారిలో మహిళల సంఖ్య దాదాపు 36 లక్షలు.

గత ప్రభుత్వం ఆర్టీసీని చంపేసింది...

హైదరాబాద్‌లో ఒకప్పుడు దాదాపు 6 వేల సిటీ బస్సులు తిరిగేవి. కానీ గత ప్రభుత్వం ఒకేసారి 3 వేల బస్సులను తొలగించింది. ఖాళీలు భర్తీ చేయకుండా ఉన్న సిబ్బందిపై భారం పెంచింది. ప్రయాణికులకు వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేసింది. ఇలా అన్ని రకాలుగా సంస్థను దెబ్బతీసింది. ఇప్పుడు వాటన్నింటినీ సరిదిద్దుకుంటూ మేం సంస్థను బలోపేతం చేస్తున్నాం. మేము వచ్చాక దశలవారీగా 1,500 కొత్త బస్సులు సమకూరాయి.

ఇప్పుడు మహిళా సంఘాలు సొంతంగా బస్సులను సంస్థకు అద్దెకివ్వడం ద్వారా ఆయా కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ సంఘాల ఆధ్వర్యంలో 600 బస్సులు ఆర్టీసీకి సమకూరనున్నాయి. అద్దె బస్సుల సంఖ్య నియంత్రణలోనే ఉండేలా చూస్తాం. ఆర్టీసీని ప్రైవేటీకరించే యోచనే లేదని స్పష్టం చేస్తున్నా. ఎవరూ ఈ విషయంలో ఆందోళన చెందక్కర్లేదు.

త్వరలో నియామకాలు..

ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న ఖాళీల భర్తీకి 3 వేల కొత్త నియామకాలు చేపట్టబోతున్నాం. టీజీపీఎస్సీ, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు, మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డుల ద్వారా నియామకాల ప్రక్రియ మొదలైంది. సాంకేతిక కారణాలతో జరుగుతున్న జాప్యాన్ని నివారించి త్వరలో ఆ పోస్టులు భర్తీ అయ్యేలా చూస్తాం.

బకాయిలు చెల్లిస్తాం..

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రెండు వేతన సవరణలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఒకటి 2017 నాటిది. వెంటనే దానికి సంబంధించి 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి అమలు చేశాం. 2013 నాటి వేతన సవరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బాండ్ల బకాయిలు చెల్లించాం. బకాయి ఉన్న డీఏను చెల్లించాం. ఇలా ఒక్కొక్కటిగా బకాయిలు చెల్లిస్తూ వస్తున్నాం. మిగతావి కూడా ఇదే క్రమంలో క్లియర్ అవుతాయి. చనిపోయిన లేదా మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చే కారుణ్య నియామకాలను కూడా చేపట్టాం.



కాలుష్య నియంత్రణ చర్యలు ఆర్టీసీతో మొదలు..

వాయు కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నందున ఆ దుస్థితి హైదరాబాద్‌కు పట్టకూడదన్న ఉద్దేశంతో ప్రస్తుతం నగరంలో తిరుగుతున్న డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు సమకూరుస్తున్నాం. వచ్చే రెండేళ్లలో అవి విడతలవారీగా అందుబాటులోకి వస్తాయి.

ఈవీ పాలసీ కాలుష్యానికి విరుగుడే..

భాగ్యనగరంలో లక్షలాదిగా పెరుగుతున్న వాహనాల రూపంలో వెలువడుతున్న కాలుష్యాన్ని నియంత్రించే క్రమంలో ఈవీ పాలసీ తీసుకొచ్చాం. పెట్రోల్, డీజిల్ వాహనాల బదులు ఎలక్ట్రిక్ వాహనాలు కొన్న వారికి పన్ను మినహాయింపు రూపంలో ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. దీన్ని అందుబాటులోకి తెచ్చాక విద్యుత్ వాహనాల కొనుగోలు మూడు రెట్లు పెరిగిందని గుర్తించాం. ఇదే కోవలో వాహన తుక్కు విధానాన్ని కూడా ప్రారంభించాం. దీనివల్ల 15 ఏళ్లు పైబడ్డ వాహనాలను తుక్కుగా మార్చేందుకు వీలుపడుతుంది. తుక్కుగా మార్చే సెంటర్ల ఏర్పాటుకు ఇటీవలే రెండు సంస్థలకు అనుమతి ఇచ్చాం.

బస్సుల తరహాలో ఎలక్ట్రిక్ ఆటోలు..

ఆర్టీసీ డీజిల్ బస్సులను తొలగించిన తరహాలోనే నగరం నుంచి డీజిల్ ఆటోలను కూడా తొలగించే ఆలోచన ఉంది. వాటి స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెడతాం. ఈ మేరకు ఆటో డ్రైవర్లను త్వరలోనే చైతన్యపరిచే కసరత్తు మొదలుపెడతాం. కొత్తగా ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసే విషయంలో ఆటోవాలాలకు చేయూత అందించనున్నాం. అది ఏ రూపంలో అనే విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం.

రాజకీయ రిజర్వేషన్లకే కులగణన పరిమితం....

కులగణన ప్రస్తుతానికి రాజకీయ రిజర్వేషన్లకు మాత్రమే పరిమితం. డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది కూడా అందుకోసమే. కమిషన్ నివేదిక సమర్పించాక చర్చించి కామారెడ్డి డిక్లరేషన్ మేరకు 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు అమలు చేస్తాం. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపులో న్యాయపరమైన అంశాలు ఇమిడి ఉంటాయి. వాటన్నింటినీ కూలంకషంగా చర్చించాల్సిన అవసరం ఉంది. కులగణనలో ప్రజలు పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వట్లేదని మా దృష్టికి కూడా వచ్చింది. అందరూ సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం. తద్వారా పథకాల అమలు సులువవుతుంది. సమాచారం ఇవ్వని ప్రజలు తెలంగాణ వారు కాదన్నట్టు.. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయమని గత ప్రభుత్వం బెదిరించినట్లు మేం బెదిరించట్లేదు. అందరూ సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

ఫుడ్ పాయిజన్ ఘటనలపై కఠినచర్యలు..

జ్యోతిబా పూలే విద్యానిధి పథకం కింద 300 మంది విద్యార్థులకు వర్తించే పథకాన్ని 800 మందికి పెంచాం. త్వరలోనే వారందరికీ నిధులు మంజూరు చేస్తాం. హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లోనూ ఈ విషయం స్పష్టం చేశాం. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు వారికి ఇచ్చే మెస్‌చార్జీలు పెంచాం. వివిధ బీసీ కార్పొరేషన్లకు రూ. 50 కోట్ల చొప్పున కేటాయించినా ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఇవ్వలేకపోయాం. త్వరలోనే వాటికి నిధులు ఇస్తాం.

టీఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా దిల్‌రాజు

- సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన దిల్‌రాజు


దిల్‌రాజును అభినందిస్తున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ నిర్మాత, పంపిణీదారుడు దిల్‌రాజు (వెంకటరమణారెడ్డి)ను తెలంగాణ ప్రభుత్వం టీఎఫ్‌డీసీ (తెలంగాణ చలనచిత్రాభివృద్ధి సంస్థ) చైర్మన్‌గా నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాలపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. తనను టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి దిల్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన 'దిల్'రాజు తొలుత ఆటోమొబైల్ వ్యాపారంలో రాణించారు. 'పెళ్లి పందిరి' సినిమాతో పంపిణీదారుగా ఫిల్మ్ ఇండస్ట్రీలో దిల్‌రాజు కెరీర్ మొదలైంది. పంపిణీదారుగా సక్సెస్ అయిన తర్వాత ఆయన శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌ను ఆరంభించి, తొలి సినిమాగా 'దిల్' (2003)ను నిర్మించారు. ఈ మూవీ సూపర్‌హిట్ కావడంతో ఆయన పేరు 'దిల్'రాజుగా మారింది. దిల్‌రాజు ప్రొడక్షన్స్, దిల్‌రాజు డ్రీమ్స్ పేరిట నూతన బ్యానర్స్‌ను స్థాపించి, యంగ్ ఫిల్మ్ మేకర్స్‌ను ఆయన ప్రోత్సహిస్తున్నారు. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలోని 'యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్'లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) చైర్మన్‌గానూ దిల్‌రాజు గతంలో బాధ్యతలు నిర్వర్తించారు.

తెలంగాణకు ఇద్దరు కొత్త ఐఏఎస్‌లు

- వివిధ రాష్ట్రాలకు మొత్తం 32 మంది ఐఏఎస్‌ల కేటాయింపు


సౌరభ్ శర్మ


సలోని ఛబ్రా

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇద్దరు కొత్త ఐఏఎస్ అధికారులను కేటాయించింది. దేశవ్యాప్తంగా 2023 బ్యాచ్‌కు చెందిన 32 మంది ఐఏఎస్‌లను వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించారు. ఈ మేరకు డీవోపీటీకి చెందిన డిప్యూటీ కార్యదర్శి చారులత సోమల్ ఉత్తర్వులు జారీ చేశారు. 32 మందిలో బిహార్ కేడర్‌కు చెందిన సౌరభ్ శర్మ, హరియాణాకు చెందిన సలోని ఛబ్రాను తెలంగాణకు కేటాయించారు. అలాగే తెలంగాణ కేడర్‌కు చెందిన దోనూరు అనన్య రెడ్డి, నంద్యాల సాయికిరణ్‌లకు మహారాష్ట్రలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ కేటాయింపులపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సమాచారాన్ని అందించినట్లు చారులత ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తప్పుడు చానళ్లపై కేసులు వేస్తా: ఆర్జీవీ



సాక్షి, హైదరాబాద్: తనపై తప్పుడు ప్రచారం చేస్తూ పరువుకు భంగం కలిగించిన టీవీ5, ఏబీఎన్, మహాటీవీ సహా మరికొన్ని చానళ్లపై పరువు నష్టం కేసులు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మ (ఆర్జీవీ) తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ తనపై, తన భాగస్వామి రవివర్మపై దుష్ప్రచారాన్ని సహించేది లేదని అన్నారు. వ్యూహం సినిమాకు దాసరి కిరణ్‌కుమార్ నిర్మాత కాగా, శ్రీకాంత్ ఫైనాన్స్ సహకారం అందించారని, భాగస్వామి రవివర్మ సొంతంగా శ్రీకాంత్ నుంచి ఏపీ ఫైబర్‌నెట్ ప్రసార హక్కులను కొనుగోలు చేశారని, రవి వర్మ నుంచి ఏపీ ఫైబర్‌నెట్ రూ.2 కోట్లకు కొనుగోలు చేసి, కోటి రూపాయలు మాత్రమే ఇచ్చిందని ఆర్జీవీ తెలిపారు. 60 రోజులపాటు ఏపీ ఫైబర్‌నెట్‌కు హక్కులు ఇస్తే, లక్షన్నర వరకు వ్యూస్ వచ్చాయని చెప్పారు. టీడీపీ ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసారాలు నిలిపేశారని, కానీ తనకు రావాల్సిన మిగిలిన మొత్తం కోసం రవివర్మ సివిల్ కోర్టులో దావా వేశారని ఆర్జీవీ చెప్పారు. వాస్తవాలను కప్పిపుచ్చుతూ తనతో పాటు రవివర్మపై తప్పుడు ప్రచారం చేస్తున్న చానళ్లను చట్టప్రకారం ఎదుర్కొంటానని ఆర్జీవీ తన ప్రకటనలో హెచ్చరించారు.

ఏపీకి సాగర్ నుంచి 12 టీఎంసీలు

- 15.86 టీఎంసీలను కోరిన ఏపీ.. 12 టీఎంసీలతో సరిపెట్టిన కృష్ణా బోర్డు

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు అవసరాలకు డిసెంబర్ 1 నుంచి జనవరి 31వ తేదీ వరకు 15.86 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేయగా, కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 12 టీఎంసీల జలాల విడుదలకు మాత్రమే అనుమతిచ్చింది. ఇప్పటికే సాగర్ నుంచి ఏపీ వాడుకున్న జలాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఈ మేరకు కృష్ణా బోర్డు ఈ నెల 5న ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావుకు లేఖ రాసింది. కృష్ణా ట్రిబ్యునల్–1 జరిపిన కేటాయింపుల ప్రకారం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా 32.25 టీఎంసీల జలాలను వాడుకోవడానికి తమకు అర్హత ఉందని అంతకుముందు కృష్ణా బోర్డుకు రాసిన లేఖలో ఏపీ తెలిపింది. గత నెల 25వ తేదీ నాటికి 9.55 టీఎంసీల జలాలను వాడుకున్నామని, మరో 15.86 టీఎంసీలను డిసెంబర్ 1 నుంచి జనవరి 31 వరకు విడుదల చేయాలని కోరింది.

పారిశ్రామిక వాడకు ఓకే


- భూములిచ్చేందుకు 73 మంది రైతుల అంగీకారం


రెవెన్యూ సిబ్బందికి అంగీకారపత్రాలు అందిస్తున్న రైతులు

దుద్యాల్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు భూములు ఇచ్చేందుకు శనివారం పలువురు రైతులు అంగీకారం తెలిపారు. ఈ మేరకు హకీంపేట్ రైతులు తహసీల్దార్‌కు సమ్మతి పత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన 73 మంది రైతులు 146 ఎకరాల భూములు ఇచ్చేందుకు సమ్మతించారని తహసీల్దార్ వెల్లడించారు. మిగిలిన వారు కూడా స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ గ్రామంలో దాదాపు 360 ఎకరాల అసైన్డ్, 145 ఎకరాల పట్టా భూముల సేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారంతా అసైన్డ్ రైతులేనని తెలుస్తోంది. ఇదిలా ఉండగా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండతండా, పులిచర్లకుంట తండా గ్రామాల్లోని 1,178 ఎకరాల భూమిని పారిశ్రామిక వాడ కోసం సేకరించనున్నారు.

పశువుల మందపై పులి దాడి

- జాడలేని రెండు పశువులు


గాయాలతో ఇంటికి వచ్చిన పశువు

వేమనపల్లి: కొద్దిరోజులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాని పులులు హడలెత్తిస్తున్నాయి. తాజాగా మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో పెద్దపులి కలకలం సృష్టించింది. శనివారం ఒడ్డుగూడెం అటవీ బీట్, సుంపుటం అటవీ ప్రాంతంలోని పాలపారక దారి ప్రాంతం వద్ద పశువుల మందపై పులి విరుచుకుపడింది. సుంపుటం గ్రామానికి చెందిన కుబిడె హన్మయ్య ఆవుపై దాడి చేయగా తప్పించుకుని తీవ్ర గాయాలతో కొంతదూరం పరుగెత్తి పడిపోయింది. అనంతరం పులి మిగతా పశువులపై దాడి చేసింది. పులి గాండ్రింపులతో పశువులు బెదిరిపోయి పరుగులు తీశాయి. పశువుల కాపరులు కుబిడె గణపతి, కొండగొర్ల రాజన్న, దందెర తిరుపతి పెద్దగా కేకలు వేస్తూ పులి దాడిచేసిన వైపు పరుగెత్తారు. అప్పటికే పులి మందను వదిలి వెళ్లిపోయింది. దీంతో పశువుల కాపరులు గ్రామస్తులు, అటవీ అధికారులకు సమాచారం చేరవేశారు. చెల్లాచెదురైన పశువులు సాయంత్రం ఇంటికి చేరాయి. గ్రామానికి చెందిన కొండగొర్ల రాజన్న లేగదూడ, దుబ్బుల వెంకన్నకు చెందిన దూడ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పులి కళేబరాలను పొదల్లోకి లాక్కెళ్లిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటన స్థలాన్ని కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్, డిప్యూటీ రేంజ్ అధికారి రూపేశ్, ఎఫ్ఎస్ఓ బేగ్, ఎఫ్‌బీఓ సఫీయాబేగం, బేస్‌క్యాంపు సిబ్బంది పరిశీలించి పులి పాదముద్రలు సేకరించారు. ప్రజలు ఒంటరిగా అడవిలోకి వెళ్లకూడదని సూచించారు.

ఎప్పటిలాగే 2024 సంవత్సరానికి కూడా ప్రపంచవ్యాప్తంగా 100 మంది ప్రభావవంత మహిళలను బీబీసీ ఎంపిక చేసి ప్రకటించింది.
వారిలో ముగ్గురు భారతీయ మహిళలు.
సామాజిక కార్యకర్త అరుణా రాయ్
కుస్తీ యోధురాలు వినేష్ ఫొగట్
అనాథ శవాల అంతిమ సంస్కారాలు చేసే పూజా శర్మ...
ఈ ముగ్గురి ఎంపిక ఎందుకో బీబీసీ ఇలా తెలిపింది.



బిబిసి 100 విమెన్ 2024

నూరులో ఆ ముగ్గురు

బి.బి.సి బి.బి.సి 2024 సంవత్సరానికి 'బీబీసీ 100 విమెన్' లిస్ట్‌ను విడుదల చేసింది. ప్రపంచ దేశాల నుంచి ఎంతో వడపోత తర్వాత ఈ 100 మందిని ఎంపిక చేయడం ఆనవాయితీ. పర్యావరణం, సంస్కృతి-విద్య, వినోదరంగం-క్రీడారంగం, రాజకీయ రంగం, సైన్స్-హెల్త్ అండ్ టెక్నాలజీ విభాగల నుంచి సమాజం మీద విస్తృతమైన ప్రభావం ఏర్పరిచిన స్త్రీలను ఎంపిక చేసింది. వీరిలో వ్యోమగామి సునీతా విలియమ్స్, రేప్ సర్వైవల్ గిసెల్ పెలికట్, నటి షెరాన్ స్టోన్, ఒలింపిక్ అథ్లెట్ బెబాక అంద్రాడె, నోబెల్ శాంతి విజేత నాడియా మురాద్, రచయిత్రి క్రిస్టీనా రివెరా గర్జా తదితరులు ఉన్నారు. అలాగే మన దేశం నుంచి అరుణా రాయ్, వినేష్ ఫొగట్, పూజాశర్మలను ఎంపిక చేసింది. 'ఓర్పు, పోరాట పటిమతో నిలబడి తమ తమ రంగాలలో, సమూహాలలో మార్పు కోసం కృషి చేస్తున్న ధీరలు వీరంతా' అని బీబీసీ ఈ సందర్భంగా అంది. మన దేశం నుంచి ఎంపికైన ముగ్గురు ఎందుకు ఎంపికయ్యారు?



వినేష్ ఫొగట్

క్రీడారంగంలో లైంగిక వేధింపులను ధైర్యంగా వెలుగులోకి తెచ్చిన, దేశానికి పతకాలు తెచ్చి కీర్తి పెంచిన కుస్తీ యోధురాలిగా వినేష్ ఫొగట్‌కు విశేష గుర్తింపు దక్కింది. రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ మీదే ఆమె ఆరోపణలు ఎక్కుపెట్టడంతో ఈ ఉదంతం దేశాన్ని ఊపేసింది. రాజకీయంగా, సామాజికంగా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా ఆమె వెరవలేదు. అదే సమయంలో దేశవ్యాప్తంగా మద్దతు కూడగట్టగలిగింది. ఇక ఇటీవలి ఒలింపిక్స్‌లో దాదాపు పతకం అంచుకు వెళ్లి కేవలం 100 గ్రాముల 'బరువు మతలబు'తో ఆమె పతకం కోల్పోయినా దేశం ఆమెను పతకం తెచ్చినంత ఘనంగా గౌరవించింది. క్రీడలలో మనలేనని గ్రహించి వినేష్ ఇటీవలి హర్యాణ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని నుంచి సీటు పొంది 'జులానా' నుంచి ఎం.ఎల్.ఏగా ఘన విజయం సాధించింది. స్త్రీలకు ఎన్ని సవాళ్లు ఎదురైనా నిరూపించింది. అందుకే ఆమెకు బీబీసీ 100లో చోటు.

అరుణా రాయ్

అరుణా రాయ్ (74) తన జీవితం ఆరంభం నుంచి నేటి వరకూ అట్టడుగు వర్గాల జీవనమార్పు కోసం పోరాడుతూనే ఉన్నారు. 'పెద్ద ముందంజలు కాదు... ఇరుగు పొరుగువారి చిన్న చిన్న ముందడుగులు అవసరం' అనే ఆమె తన జీవితమంతా ఆదర్శాల కోసం నిలబడ్డారు. మద్రాసులో పుట్టి పెరిగిన అరుణ బాల్యం నుంచి ఛాందస భావాలను నిరోధించారు. తన 21 ఏళ్ల వయసులో 1967లో ఐ.ఏ.ఎస్ పరీక్ష రాసి ఎంపికయ్యారు. ఆ రోజుల్లో ఐ.ఏ.ఎస్ రాసే మహిళలే లేరు దేశంలో. 1967లో 10 మాత్రమే ఎంపికైతే వారిలో ఒకరు అరుణ. తమిళనాడులో కలెక్టర్‌గా పని చేసిన అరుణ గ్రామాలు బాగుపడాలంటే తన ఉద్యోగం పనికిరాదని అట్టడుగు వర్గాల చైతన్యం ముఖ్యమని, వారి ఆర్థిక స్వావలంబన తప్పదని భావించి ఉద్యోగానికి రాజీనామా చేసి తన భర్త సంజిత్ రాయ్‌తో కలిసి 'బేర్‌ఫుట్ కాలేజ్' స్థాపించి గ్రామీణుల కోసం పని చేశారు. 'మజ్దూర్ కిసాన్ సంఘటన్','నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్' వీటన్నింటిలో ఆమెవి కీలక బాధ్యతలు. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ఉనికిలోకి రావడానికి అరుణ కూడా ఒక కారణం. చైతన్యవంతమైన సమాజం, స్త్రీల హక్కుల కోసం ఆమె చేస్తున్న ఎడతెగని కృషి ఆమెను బీబీసీ 100 విమెన్‌కు చేర్చింది.





పూజా శర్మ

ఢిల్లీకి 27 సంవత్సరాల పూజాశర్మ తల ఒంచక న్యాయం వైపు నిలబడి పోరాడటం వల్లే ముందుకు వెళ్లగలరు అని ఈ విధానం వినేష్ కు 'చనిపోయిన వ్యక్తిని సగౌరవంగా సాగనంపే సేవ' చేయాలని తన జీవితంలోని సొంత విషాదం వల్ల గట్టిగా అనిపించింది. ఆమె సోదరుణ్ణి మూడేళ్ల క్రితం ఒక కొట్లాటలో చంపేశారు. ఆ గొడవ వల్ల అతని దహన కార్యక్రమాలకు ఎవరూ ముందుకు రాలేదు. అప్పుడు పూజాశర్మ తానే పూనుకొని దహన సంస్కారాలు చేసింది. ఇలాంటి సందర్భాలలోనే పేదరికం వల్ల, ప్రమాదాల వల్ల అనారోగ్యం వల్ల దహన సంస్కారాలకు నోచుకోని అనాథ శవాలను, దిక్కూమొక్కూ లేని శవాలను తానే గౌరవంగా సాగనంపాలని నిర్ణయించుకుంది. వెంటనే 'బ్రైట్ ది సోల్ ఫౌండేషన్' స్థాపించి ఇప్పటికి వందల శవాలకు దహన సంస్కారాలు స్వయంగా నిర్వహించింది. ఇందుకు మొదట్లో కొంతమంది నుంచి విమర్శలు ఎదురైనా, ఇది ఆడవాళ్ల పని కాదు అని ఆమెను వారించినా, ఆమె చేసే పనులు సోషల్ మీడియా ద్వారా మద్దతు కూడగట్టుకున్నాయి. సేవారంగంలో ఎంతో మానవీయమైన ఆమె కృషికి నేడు దక్కిన గౌరవం బిబిసి 100లో చేరిక.

కుట్టుతో కనికట్టు

స్ఫూర్తి

'చేతిలో విద్య ఉంటే ఎడారిలో కూడా బతికేయవచ్చు' అంటారు పెద్దలు. ఉద్యోగం కోల్పోయిన మంజూషకు కుట్టుపని బాగా తెలుసు. ఆ విద్యతో అతి తక్కువ పెట్టుబడితో ఫ్యాబ్రిక్ డిజైన్‌లకు సంబంధించిన 'తోఫా' బ్రాండ్‌కు శ్రీకారం చుట్టింది ముంబైకి చెందిన మంజూష ఆ బ్రాండ్ ద్వారా ఇప్పుడు లక్షలు అర్జించే స్థాయికి ఎదిగింది. ఎంతో మంది మహిళలకు ఉపాధి ఇస్తోంది.

యాభై రెండేళ్ల వయసులో మంజూష ఉద్యోగం కోల్పోయింది. బతకడానికి, కుమార్తెను చదివించడానికి మరో ఉద్యోగం వెదుక్కోక తప్పని పరిస్థితి. 'ఈ వయసులో నాకు ఉద్యోగం ఎవరు ఇస్తారు?' అనుకుంది.

అయితే మంజూషకు ఒక లా కంపెనీలో ఉద్యోగం వచ్చింది. రోజూ గంటల తరబడి ప్రయాణం చేసి ఆఫీసుకు వెళ్లాలి. నీరసంగా ఉండేది, నిస్పృహగా ఉండేది. అయినప్పటికీ 'ఇల్లు గడుస్తుందిలే' అనే చిన్న సంతృప్తితో ఉద్యోగం చేసేది.

కొన్నిసార్లు ఉద్యోగం మానెయ్యాలని ఒక నిర్ణయానికి వచ్చేది. ఇంతలో కూతురు చదువు గుర్తుకు వచ్చి తన నిర్ణయాన్ని మార్చుకునేది.

తల్లి మానవేదనను గమనించిన కూతురు ఆమెతో వివరంగా మాట్లాడింది.

'నాకు ఉద్యోగం చేయాలని లేదు. కానీ తప్పదు' అన్నది మంజూష.

'ఉద్యోగం లేకుండా బతకలేమా!' అన్నది కూతురు నజూక.

'ఎలా?!' అన్నది తల్లి.

'కుట్లు అల్లికలు నీ హాబీ. మనం హాయిగా బతకడానికి ఈ విద్య చాలు' అన్నది నజూక ఆత్మవిశ్వాసంతో.

ఇంటిలో ఒక మూలన వన్స్ అపాన్ ఏ టైమ్ కుట్టుమిషన్ ఉంది. 'నీ కూతురు చెప్పింది నిజమే. ముందుకు వెళ్లు' అన్నట్లుగా అభయం ఇచ్చింది ఆ పాత కుట్టు మిషన్.

కుమార్తె నజూకా జేవియర్‌తో కలిసి 'తోఫా'కు శ్రీకారం చుట్టింది మంజూష.

'ఒకవేళ ఈ వ్యాపారంలో విఫలమైతే! ఏదో ఒక ఉద్యోగం చేసుకునే అవకాశం వస్తుందా....' ఇలా రకరకాల సందేహాలు వచ్చేవి మంజూషకు. అయితే ఒక్కసారి పనిలో మునిగిపోయాక ఆ సందేహాలు దూరం అయ్యేవి. ఎంతో ధైర్యం వచ్చేది.

చెన్నైలో జరిగిన ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న తరువాత తనపై తనకు ఎంతో నమ్మకం వచ్చింది. ఇంటి అలంకరణలు, ఫ్యాబ్రిక్ డిజైన్లకు సంబంధించి తన బ్రాండ్‌కు అక్కడ మంచి స్పందన వచ్చింది. రెండు వేల రూపాయల పెట్టుబడితో మొదలు పెట్టిన ఈ బ్రాండ్ ఇప్పుడు లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

'సొంతంగా ఏదో ఒకటి చేయాలని ఎప్పటినుంచో అనుకునేదాన్ని. కాని ఆర్థిక ఇబ్బందుల వల్ల చేయలేకపోయాను. మరిచి పోయాను అనుకున్న కళ మళ్లీ నా దగ్గరకు వచ్చింది. కుట్టుపని నాలో ఆత్మవిశ్వాసాన్ని, నా జీవితంలో వెలుగుల్ని నింపింది' అంటుంది మంజూష.

మార్కెంటింగ్‌లో పట్టా పుచ్చుకున్న కూతురు నజూక బ్రాండ్ రూపకల్పనలో, విజయవంతం చేయడంలో తల్లికి సహాయం అందించింది.

'అమ్మ దుబారా ఖర్చు చేసేది కాదు. పొదుపునకు ప్రాధాన్యత ఇచ్చేది. చిన్నప్పుడు నాకోసం బట్టలు కొనేది కాదు. పాత చీరలు, ఇతర దుస్తుల నుంచి నాకు అందమైన డ్రెస్‌లు కుట్టేది. అప్పటి ఆ విద్య వృథా పోలేదు. మాకు కొత్త జీవితాన్ని ఇచ్చింది' అంటుంది నజూక.

'కుమార్తె రూపంలో యువ తరంతో కనెక్ట్ కావడం వల్ల ఎన్నో విషయాలను తెలుసుకోగలిగాను. అప్‌డేట్ అయ్యాను. మా వ్యాపారంలో ఇప్పటి వరకు ప్లాస్టిక్ వాడలేదు' అంటుంది మంజూష.

'తోఫా' ద్వారా తాను ఉపాధి పొందడమే కాదు ఎంతోమంది చేతి వృత్తి కళాకారులకు ఉపాధిని ఇస్తోంది మంజూష.

వ్యాపారంలోకి అడుగు పెట్టాలనుకుంటున్న మహిళలను ఉద్దేశించి... 'భయం, సందేహాలు ఎప్పుడూ ఉండేవే. అయితే అవి మన దారికి అడ్డుపడకుండా చూసుకోవాలి' అంటుంది.



మంజూష



కుమార్తె నజూకతో మంజూష



కొంతమంది అదేపనిగా, చాలాకాలంగా సిగరెట్స్ తాగుతూనే ఉంటారు. పొగ తాగడమన్నది కొద్దిగానైనా లేదా చాలా ఎక్కువగానైనా అది దేహం మీద దుష్ప్రభావం చూపుతూనే ఉంటుంది. స్మోకింగ్ దుష్ప్రభావం ఊపిరితిత్తుల మీద ఎక్కువని చాలామంది అనుకుంటుంటారు గానీ... ఈ అందమైన లోకాన్ని మనకు చూపించే కళ్ల మీద కూడా ఉంటుందని అనుకోరు. స్మోకింగ్ వల్ల కళ్ల మీద పడే దుష్ప్రభావాలు అన్నీ ఇన్నీ కావు. వాటి గురించి తెలుసుకొని, ఆ తర్వాత నుంచైనా పొగ తాగే అలవాటుకు దూరంగా ఉండడం కోసమే ఈ కథనం.

కంటికి 'మంట' పెట్టేస్తది

• సిగరెట్ అంటించకండి

కొంతమంది చాలా కాలం నుంచి పొగతాగే అలవాటు కలిగి ఉంటారు. వీళ్లనే 'క్రానిక్ స్మోకర్స్' అంటారు. దీర్ఘకాలంగా పొగతాగడం వల్ల కంటికి వచ్చే సమస్యలు ఒకటి రెండూ కాదు సరికదా ఈ జాబితా చాలా పెద్దది.

కారణం: పొగాకులో దాదాపు 6,000కు పైగా హానికరమైన విషపదార్థాలు ఉంటాయి. సిగరెట్ కాల్చినప్పుడు వాటిల్లోని అత్యంత హానికరమైనవీ, క్యాన్సర్‌ను కలగజేసేవీ దాదాపు 69 విషపదార్థాల పొగ నేరుగా కంటికీ, ఒంటికీ తాకడం వల్ల అనేకానేక సమస్యలు వచ్చే అవకాశముంది. ఇందులో ఈ కింద ఉన్నవి ముఖ్యమైనవీ, కేవలం కొన్ని మాత్రమే.



అర్లీ క్యాటరాక్ట్ : కొందరిలో వయసు పెరుగుతున్న కొద్దీ కంట్లో ఉండే లెన్స్... తమ పారదర్శకతను కోల్పోవడంతో క్యాటరాక్ట్ అనే సమస్య రావడం తెలిసిందే. పొగతాగేవారిలో ఇది చాలా త్వరగా వచ్చేస్తుంది.

టొబాకో ఆంబ్లోపియా : పొగాకులోని 'నికోటిన్' ప్రభావంవల్ల 'టుబాకో ఆంబ్లోపియా' అనే సమస్య వస్తుంది. ఇలా ఆంబ్లోపియా సమస్య వచ్చినవాళ్లలో కంటి నరం (ఆప్టిక్ నర్వ్) దెబ్బతిని ఎదుటునున్న వారి క్లియర్ ఇమేజ్ స్పష్టంగా కనిపించకపోవచ్చు. ఒక్కోసారి అది కేవలం ఓ స్కెచ్ లాగానో లేదా నెగెటివ్ లాగానో కనిపించవచ్చు. ఎదుటి దృశ్యం నెగెటివ్‌లా కనిపించడాన్ని ఘోస్ట్ ఇమేజ్ అంటారు.

ఏజ్ రిలేటెడ్ మాక్యులార్ డీ-జనరేషన్ : ఈ సమస్యలో రెటీనా పొరలోని కీలక భాగమైన 'మాక్యులా' దెబ్బతింటుంది. దృష్టిజ్ఞానాన్ని ఇవ్వడంలో ఈ మాక్యులాది కీలకపాత్ర. పొగతాగడం వల్ల ఇది చాలా త్వరగా వస్తుంది.

ఆప్టిక్ న్యూరోపతి : మనందరి దృష్టిజ్ఞానానికి కారణమయ్యే అత్యంత సంక్లిష్టమైన నరం 'ఆప్టిక్ నర్వ్' అనే ఈ నరం దెబ్బతినడంతో వచ్చే సమస్యే 'ఆప్టిక్ న్యూరోపతి'. విచక్షణ లేకుండా యాంటీబయాటిక్ మందులు, డ్రగ్స్, విషపదార్థాలు వాడటం దీనికి కారణం. సిగరెట్ పొగలోనూ ఉండేవి చాలా హానికారకవిషపదార్థాలతో 'ఆప్టిక్ న్యూరోపతి' వచ్చే అవకాశాలెక్కువ.



రెటినల్ ఇస్కీమియా : రెటీనాకు తగినంత రక్తసరఫరా జరగకపోవడం వల్ల వచ్చే వ్యాధి ఇది. పొగతాగేవారిలో... పొగలోని విషపదార్థాలు, కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డైయాక్సైడ్ కారణంగా రక్తకణాలకు ఆక్సిజన్‌ను తీసుకెళ్లే సామర్థ్యం దెబ్బతింటుంది. ఫలితంగా అన్ని కణాల్లో లాగే కంటి కణాలకూ పోషకాలూ, ఆక్సిజన్ అందకపోవడంతో 'రెటినల్ ఇస్కీమియా' వ్యాధి వచ్చి... అది అంధత్వానికి దారితీసే ప్రమాదం చాలా ఎక్కువ.



డాక్టర్ రవికుమార్ రెడ్డి
సీనియర్ కంటి వైద్యులు

థైరాయిడ్ ఆప్తాల్మోపతి : థైరాయిడ్ ఐ డిసీజ్ అంటూ పిలిచే ఈ వ్యాధిని గ్రేవ్స్ ఆప్తాల్మోపతి అని కూడా అంటారు. సొంత వ్యాధి నిరోధక శక్తి తమ సొంత కణాలను దెబ్బతీసే ఆటో ఇమ్యూన్ సమస్య అయిన ఇది... పొగతాగేవారిలో చాలా ఎక్కువ.

కార్నియల్ ఎపిథీలియల్ సమస్యలు : కంట్లో ఉండే నల్ల గుడ్డును కార్నియా అంటారు. చూపుజ్ఞానం కలిగించడంలో ఈ నల్లగుడ్డు భూమిక చాలా కీలకం. ఈ నల్లగుడ్డు మీద పారదర్శకమైన ఒక పైపొర ఉంటుంది. దాన్ని 'ఎపిథీలియమ్' అంటారు.

సిగరెట్ అంటించడం కోసం తరచూ అగ్గిపుల్ల లేదా లైటర్ వెలిగించినప్పుడు, ఆ మంట ప్రభావం కంటికీ ఎంతో కొంత తాకే అవకాశం ఉంటుంది. ఆ మంట మాటిమాటికీ అలా తగులుతుండటం లేదా వేడి సెగగానీ, సిగరెట్ పొగగానీ తరచూ తగులుతుండటంతో ఈ 'ఎపిథీలియమ్' పొర దెబ్బతినడానికి అవకాశాలెక్కువ. ఎపిథీలియమ్ దెబ్బతింటే కంట్లోంచి నీరు కారడం, కన్ను ఎరుపెక్కడం, వెలుగు చూడలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

పొగతాగడం వల్ల వచ్చే దుష్ప్రభావాలు కేవలం ఊపిరితిత్తుల మీదనో లేదా క్యాన్సర్ల రూపంలోనో మాత్రమే కాకుండా ఇలా కంటి మీద కూడా పడటమే కాదు... ఏకంగా చూపును దూరం చేసే అవకాశమూ ఉన్నందువల్ల ఆ దురలవాటును తక్షణం మానేయాలి.

ఇవే కాకుండా గర్భవతుల్లో ఒకవేళ పొగతాగే అలవాటు ఉంటే కడుపులో ఉన్న చిన్నారికీ అనేక కంటి సమస్యలు రావచ్చు. ఉదాహరణకు కనుగుడ్లు నమ్మలేనంత చిన్నవిగా మారిపోయే 'మైక్రో ఆఫ్తాల్మోస్' అనే వ్యాధి, కళ్లు బాగా ఎర్రబారిపోవడమే కాకుండా కొందరిలో కనురెప్పలు బూడిద రంగులో కనిపించడం (గ్రేయిష్ అప్పియరెన్స్ ఆఫ్ ఐలిడ్స్) వంటి సమస్యలూ రావచ్చు. **లక్షణాలు:** కంటి సమస్య వచ్చినవారిలో కళ్లు ఎర్రబారడం, కళ్లవాపు, మంటలు, కనుగుడ్లు చిన్నగా మారడం, చూపు సరిగా కనిపించకపోవడంతో పాటు నెగెటివ్‌ను చూస్తున్నట్లుగా కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఏజింగ్ ప్రక్రియతో కంటి చుట్టూ ముడతలు : పొగతాగడం వల్ల కంటి చుట్టూ నల్లగా మారడం, వయసుతో పాటు వచ్చే ముడతల్లాగా (ఏజింగ్ స్కిన్ ఫోల్ట్స్) రావడం కూడా ఎక్కువ. క్రానిక్ స్మోకర్స్‌లో పెదవులు కూడా నల్లగా, బండగా మారిపోతాయి.

చికిత్స : పొగతాగడం వల్ల వచ్చిన ఏ కంటి సమస్య అయినప్పటికీ, చూపులో ఏదైనా తేడా కనిపించిన వెంటనే కంటి వైద్యనిపుణులకు చూపించడం అవసరం. లేకపోతే అది అంధత్వానికి దారితీసే ప్రమాదమూ లేకపోలేదు. అందుకే డాక్టర్‌కు చూపిస్తే... వచ్చిన సమస్యను బట్టి కంటికి అవసరమైన వైద్యచికిత్స అందిస్తారు. కొందరికి అవసరాన్ని బట్టి కొన్ని విటమిన్ సప్లిమెంట్స్ (అందునా మరీ ముఖ్యంగా బి1, బి2, బి12, బి6 వంటి విటమిన్లు) ఇస్తూ సమస్యను చక్కబరిచేందుకు ప్రయత్నిస్తారు.

• అటోపిక్ డర్మటైటిస్

కిడ్స్‌పై 'కోల్డ్' వార్

• 'పొడి' చెయ్యనియ్యొద్దు



చలికాలంలో చిన్నారుల చర్మాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాల్సి ఉంటుంది. వాళ్లు చిన్న పిల్లలు కావడంతో తమ చర్మం గురించి ఎరుక, శ్రద్ధ వాళ్లలో ఉండదు. కానీ పిల్లల్లో ముఖం, పెదవులు పగలడం, కాళ్ల దగ్గరా పగుళ్లు రావడం వంటి అంశాలతో తల్లిదండ్రులు వారికోసం ఆందోళన పడుతుంటారు. ఇది చలికాలం కావడంతో టీనేజీ లోపు చిన్నారులకు వచ్చే చర్మ సమస్యల గురించి అవగాహన కోసం ఈ కథనం.

చలికాలంలో చర్మం పొడిబారడం, పగుళ్లు పిల్లలందరిలోనూ... ఆ మాటకొస్తే చాలా మంది పెద్దవాళ్లలోనూ కనిపించేదే.

కొందరు పిల్లల్లో జన్యుపరంగానే కొన్ని ప్రోటీన్లలోపం వల్ల చర్మం పొడిబారడం, ఎర్రబారడమన్నది ఎక్కువగా జరుగుతుంటుంది. మామూలుగా చర్మం బయటి కాలుష్యాలూ, వాతావరణం ప్రభావం, రాపిడి వంటి వాటి నుంచి రక్షణ కల్పిస్తుందన్నది తెలిసిందే. అయితే ఇలా పొడిబారి, ఎర్రగా మారడంతో.. కల్పించాల్సినంత రక్షణ కల్పించలేదు. ఇలా జరగడాన్ని 'అటోపిక్ డర్మటైటిస్'గా చెబుతారు. అయితే ఈ సమస్య తీవ్రత అందరిలోనూ ఒకేలా ఉండక... చిన్నారి చిన్నారికి మారుతుంది. పిల్లల్లో సాధారణంగా కనిపించే ఈ చర్మ సమస్య, పరిష్కారాలు తెలుసుకుందాం.

ఇటీవల వాతావరణంలో కాలుష్యాలు బాగా పెరగడం, పిల్లలు గతంలోలా ఆరుబయట మట్టిలో ఆడకపోవడం, అనవసరంగా యాంటీబయాటిక్స్ వాడటం, తల్లిపాలకు బదులు డబ్బాపాలపై ఆధారపడటం, పిల్లలు సిజేరియన్ ప్రక్రియతో పుట్టడం వంటి కారణాలతో చిన్నారుల్లో వ్యాధి నిరోధక వ్యవస్థ (ఇమ్యూనిటీ) సరైనవిధంగా నియంత్రితం కావడం లేదు. దాంతో డాక్టర్లు పిల్లల్లో అటోపిక్ డర్మటైటిస్‌ను ఎక్కువగా చూస్తున్నారు.

ఈ సమస్యలో మొదట చర్మం పొడిబారి, ఎర్రగా మారి దురద వస్తుంటుంది. పిల్లలు పదే పదే గీరుతుండటంతో చర్మం కాస్త మందంగా మారుతుంది. ఆ తర్వాత దురద మరింతగా పెరుగుతుంది. ఈ రెండు ప్రక్రియలూ ఒక సైకిల్ (ఇచ్-స్క్రాచ్ సైకిల్)లా నడుస్తుంటాయి. ఈ అటోపిక్ డర్మటైటిస్ అన్నది నెలల పిల్లలు మొదలుకొని, ఏడాది వయసు వారి వరకు కనిపించవచ్చు

పిల్లల్లో 12 నెలల వయసు వరకు... ప్రభావితమయ్యే భాగాలు

చర్మం ఎర్రబారడమన్నది ముఖంపై కనిపిస్తుంటుంది గాని నిజానికి చర్మంపై శరీరంలోని ఏ భాగంలోనైనా ఇలా జరగవచ్చు. పాకే పిల్లల్లో సాధారణంగా వాళ్ల మోకాళ్లు నేలతో ఒరుసుకుపోతుంటాయి కాబట్టి వీళ్లలో మోకాళ్ల వద్ద ఎటోపిక్ డర్మటైటిస్ కనిపిస్తుంటుంది.

ఏడాదీ రెండేళ్ల పిల్లల్లో...

ఈ వయసు పిల్లల్లో చర్మం ప్రభావితం కావడమన్నది చర్మం ముడుతలు పడే ప్రాంతాల్లో ఎక్కువ.

రెండు నుంచి ఆరేళ్ల పిల్లల్లో...

ఈ వయసు పొడిబారడం మోకాళ్ల కిందనున్న చర్మంలో చాలా ఎక్కువ. ముఖం మీద చర్మం పెద్దగా పగలదు. పెదవులు చీలినట్లుగా కావడం, కంటి చుట్టూ నల్లటి ముడతలు, మెడ మురికిపట్టినట్లుగా నల్లగా కనిపించడం, కాళ్ల వేళ్లకింద పగుళ్లు (ఫిషర్స్), చేతి గీతలు కాస్త ప్రస్ఫుటంగా కనిపించడం, వెంట్రుకలు ఉన్నచోట బొబ్బల్లా రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఏడు నుంచి పద్నాలుగేళ్ల పిల్లల్లో...ఏడు కంటే తక్కువ వయసు పిల్లలతో పోలిస్తే ఏడు నుంచి పద్నాలుగేళ్ల వారిలో అటోపిక్ డర్మటైటిస్ లక్షణాల తీవ్రత తగ్గే అవకాశముంది. ఈ సమస్య ఉన్నవారిలో చర్మం పగిలి ఉండటంతో తరచూ వైరల్ ఇన్ఫెక్షన్లు... ఉదాహరణకు హెర్పిస్ సింప్లెక్స్ వంటివి; అలాగే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ ఉదాహరణకు స్టెఫాలోకోకల్ వంటివి కనిపించవచ్చు.

నివారణ / మేనేజ్‌మెంట్ అండ్ చికిత్స

• స్నానం చేయించే వ్యవధి ఎంత తక్కువైతే అంత మంచిది. గోరు వెచ్చని నీళ్లతోనే స్నానం చేయించాలి • స్నానం చేసిన వెంటనే పూర్తిగా తుడవకుండా టవల్‌తో అద్దుతూ ఆ తేమ మీదనే మాయిశ్చరైజర్ పట్టించాలి • కాళ్లు, చేతులు ఎక్కువగా పొడిబారతాయి కాబట్టి మాయిశ్చరైజర్‌ను రోజుకు రెండు మూడుసార్లయినా పట్టించడం మంచిది • ఉలెన్ దుస్తుల వల్ల పిల్లలకు ఇరిటేషన్ ఎక్కువగా వస్తుంటుంది. అందుకే వాటికి బదులు కాటన్ దుస్తులు ధరింపజేయడం మేలు • దోమల వల్ల కూడా పిల్లల చర్మంపై దుష్ప్రభావం పడే అవకాశముంది. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి • స్కూలుకు వెళ్లే వయసు పిల్లలకు షూజ్‌తో కాటన్ సాక్స్ వాడటం, గట్టి చెప్పులకు బదులు కాస్త మెత్తటి పాదరక్షలు వాడితే కాళ్ల పగుళ్ల వల్ల కలిగే బాధలు తగ్గుతాయి • సమస్య మరింత తీవ్రమైతే డర్మటాలజిస్టులను కలవాలి. సమస్య తీవ్రతను బట్టి వారు తగిన చికిత్స అందిస్తారు.



డాక్టర్ శ్రుతి కారెడ్డి
కన్సల్టెంట్ డర్మటాలజిస్ట్





వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో మరో 'డ్రా'

భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్, డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ మధ్య జరుగుతున్న వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ పోరులో 'డ్రా'ల పరంపర ఆగడం లేదు. శనివారం జరిగిన పదో గేమ్ కూడా సమంగానే ముగిసింది. తొలి గేమ్‌లో లిరెన్, మూడో గేమ్‌లో గుకేశ్ గెలవగా...ఆ తర్వాత ఇది వరుసగా ఏడో 'డ్రా' కావడం గమనార్హం. నల్ల పావులతో ఆడిన గుకేశ్ లిరెన్ కూడా ఎలాంటి దూకుడైన ఎత్తులకు ప్రయత్నించలేదు. ఇద్దరూ డిఫెన్స్‌కే ప్రాధాన్యతనివ్వడంతో 36 ఎత్తుల తర్వాత 'డ్రా' ఖాయమైంది. పది గేమ్‌లు ముగిసిన తర్వాత గుకేశ్, లిరెన్ చెరో 5 పాయింట్లతో సమంగా కొనసాగుతున్నారు. ఈ 14 గేమ్‌ల పోరులో ముందుగా 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు విజేతగా నిలుస్తాడు. మిగిలిన 4 గేమ్‌ల ద్వారా మరో 2.5 పాయింట్లు ఎవరు సాధిస్తారనేది ఆసక్తికరం. నల్లపావులతో ఆడి గేమ్‌ను 'డ్రా'గా ముగించడం సంతృప్తిగా ఉందన్న గుకేశ్... రాబోయే నాలుగు గేమ్‌లు ఉత్కంఠభరితంగా సాగుతాయని ఆశిస్తున్నానన్నాడు.


స్టార్క్ బౌలింగ్‌లో గిల్ క్లీన్‌బౌల్డ్

భారత్‌కు 'హెడ్'పోటు...

ట్రవిస్ హెడ్ మెరుపు సెంచరీ



- డే అండ్ నైట్ టెస్టులో కష్టాల్లో టీమిండియా
- రెండో ఇన్నింగ్స్‌లో 128/5
- తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 337

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్...వన్డే వరల్డ్ కప్ ఫైనల్...గతంలో రెండు కీలక సందర్భాల్లో భారత్ ఓటమిని శాసించిన ట్రవిస్ హెడ్ మరోసారి మనపై చెలరేగిపోయాడు. టీమిండియా బౌలర్లపై విరుచుకుపడిన అతను మెరుపు సెంచరీతో రెండో టెస్టులో ఆస్ట్రేలియాకు విజయావకాశం కల్పించాడు. 157 పరుగులు వెనుకబడి రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన రోహిత్ సేన ఇంకా ఆ లోటును పూడ్చుకోకుండానే సగం వికెట్లను కోల్పోయింది. ప్రస్తుతానికి ఆసీస్‌దే పూర్తి ఆధిపత్యం కాగా... పంత్, నితీశ్ పోరాటంపైనే ఆదివారం భారత్ ఆశలు మిగిలి ఉన్నాయి.

అడిలైడ్: గులాబీ బంతితో డే అండ్ నైట్ టెస్టులో భారత్ వైఫల్యం రెండో ఇన్నింగ్స్‌లోనూ కొనసాగింది. ముందుగా తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యంతో అదరగొట్టగా... టీమిండియా ఓటమిని తప్పించుకునేందుకు పోరాడుతోంది. రెండో రోజు ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో 87.3 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. ట్రవిస్ హెడ్ (141 బంతుల్లో 140; 17 ఫోర్లు, 4 సిక్స్‌లు) భారీ సెంచరీతో విజృంభించగా... మార్నస్ లబుషేన్ (126 బంతుల్లో 64; 9 ఫోర్లు) అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. దీంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 157 పరుగుల ఆధిక్యం సాధించింది. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం శనివారం ఆట ముగిసే సమయానికి రోహిత్‌సేన రెండో ఇన్నింగ్స్‌లో 24 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (24; 4 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (28; 3 ఫోర్లు) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. రిషభ్ పంత్ (25 బంతుల్లో 28 బ్యాటింగ్; 5 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (15 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. చేతిలో 5 వికెట్లు ఉన్న భారత్... కంగారూల తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 29 పరుగులు వెనుకబడి ఉంది.

లబుషేన్ అర్ధ సెంచరీ...

ఓవర్‌నైట్ స్కోరు 86/1తో ఆసీస్ రెండో రోజు ఆటను కొనసాగించింది. మరోసారి బుమ్రా చెలరేగిపోతూ 13 బంతుల వ్యవధిలో మెక్‌స్వీనీ (109 బంతుల్లో 39; 6 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (2)లను పెవిలియన్ పంపించాడు. అయితే లబుషేన్, హెడ్ భాగస్వామ్యంలో ఆసీస్ కోలుకుంది. భారత బౌలర్లను వీరిద్దరు సమర్థంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా హర్షిత్ రాణా భారీగా పరుగులిచ్చుకున్నాడు. చాన్నాళ్లుగా ఫామ్‌లేమితో సతమతమవుతున్న మార్నస్ లబుషేన్ ఎట్టకేలకు 114 బంతుల్లో అర్ధ శతకంతో టచ్‌లోకి వచ్చాడు. రాణా ఓవర్లో అతను మూడు ఫోర్లు బాదడం విశేషం. ఎట్టకేలకు లబుషేన్‌ను అవుట్ చేసి నితీశ్ ఈ జోడీని విడదీయగా... మరో ఎండ్‌లో హెడ్ తనదైన శైలిలో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. అశ్విన్ బౌలింగ్‌లో రెండు భారీ సిక్స్‌లు కొట్టిన అతను 63 బంతుల్లోనే హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. మిచెల్ మార్ష్ (9), క్యారీ (15) కొద్ది సేపు హెడ్‌కు అండగా నిలిచారు. అశ్విన్ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చిన మార్ష్ అంపైర్ నిర్ణయం కోసం కూడా చూడకుండా వెళ్లిపోయాడు. రీప్లేలో బంతి బ్యాట్‌కు తాకలేదని తేలింది! వికెట్లు పడినా మరో వైపు జోరు తగ్గించని హెడ్‌కు హాఫ్ సెంచరీ నుంచి శతకం అందుకునేందుకు 48 బంతులు సరిపోయాయి. రాణా వరుస ఓవర్లలో రెండేసి ఫోర్లు కొట్టిన అతను 111 బంతుల్లో కెరీర్‌లో ఎనిమిదో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం రాణా మరో ఓవర్లో అతను మళ్లీ మూడు ఫోర్లు కొట్టాడు. భారత్ కొత్త బంతిని తీసుకున్న తర్వాత హెడ్ సహా 27 పరుగుల వ్యవధిలో ఆస్ట్రేలియా చివరి 4 వికెట్లు కోల్పోయింది. రెండో రోజు 54.3 ఓవర్లు ఆడిన ఆ జట్టు 251 పరుగులు జోడించింది.

కోహ్లి, రోహిత్ విఫలం...

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియాకు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. అప్పటికే ప్రత్యర్థికి భారీ ఆధిక్యం సమర్పించుకున్న భారత్... నాలుగో ఓవర్‌లోనే కేఎల్ రాహుల్ (7) వికెట్ కోల్పోయింది. అయితే యశస్వి జైస్వాల్, గిల్ నిలకడగా ఆడటంతో మళ్లీ ఆశలు చిగురించగా... బోలండ్ టీమిండియాను దెబ్బకొట్టాడు. మొదట జైస్వాల్‌ను అవుట్ చేసిన అతడు... కాసేపటికి విరాట్ కోహ్లి (11)ని కూడా వెనక్కి పంపాడు. ఆ తర్వాత గిల్‌ను అద్భుత బంతితో స్టార్క్ క్లీన్ బౌల్డ్ చేయగా...కమిన్స్ వేసిన పదునైన ఇన్‌స్వింగర్ కెప్టెన్ రోహిత్ శర్మ (6) స్టంప్స్‌ను ఎగరగొట్టింది. క్రీజ్‌లో ఉన్నంత సేపు కొన్ని చక్కటి షాట్లు ఆడిన పంత్, నితీశ్ మరో 19 బంతుల పాటు వికెట్ పడకుండా ఆటను ముగించారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 180; **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** ఖ్వాజా (సి) రోహిత్ (బి) బుమ్రా 13; మెక్‌స్వీనీ (సి) పంత్ (బి) బుమ్రా 39; లబుషేన్ (సి) జైస్వాల్ (బి) నితీశ్ రెడ్డి 64; స్మిత్ (సి) పంత్ (బి) బుమ్రా 2; హెడ్ (బి) సిరాజ్ 140; మార్ష్ (సి) పంత్ (బి) అశ్విన్ 9; క్యారీ (సి) పంత్ (బి) సిరాజ్ 15; కమిన్స్ (బి) బుమ్రా 12; స్టార్క్ (సి) హర్షిత్ (బి) సిరాజ్ 18; లయన్ (నాటౌట్) 4; బోలండ్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (87.3 ఓవర్లలో ఆలౌట్) 337. వికెట్ల పతనం:** 1-24, 2-91, 3-103, 4-168, 5-208, 6-282, 7-310, 8-332, 9-332, 10-337, **బౌలింగ్:** బుమ్రా 23-5-61-4; సిరాజ్ 24.3-5-98-4; హర్షిత్ 16-2-86-0; నితీశ్ రెడ్డి 6-2-25-1; అశ్విన్ 18-4-53-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) క్యారీ (బి) బోలండ్ 24; రాహుల్ (సి) క్యారీ (బి) కమిన్స్ 7; గిల్ (బి) స్టార్క్ 28; కోహ్లి (సి) క్యారీ (బి) బోలండ్ 11; పంత్ (బ్యాటింగ్) 28; రోహిత్ (బి) కమిన్స్ 6; నితీశ్ రెడ్డి (బ్యాటింగ్) 15; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (24 ఓవర్లలో 5 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1-12, 2-42, 3-66, 4-86, 5-105, **బౌలింగ్:** స్టార్క్ 9-0-49-1; కమిన్స్ 8-0-33-2; బోలండ్ 7-0-39-2.

మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



హెడ్ X సిరాజ్

అడిలైడ్ ట్రవిస్ హెడ్ సొంత మైదానం ...చుట్టూ 51,642 మంది ప్రేక్షకులు...99.29 స్ట్రైక్‌రేట్‌తో చేసిన మెరుపు సెంచరీతో స్టేడియం ఊగిపోతోంది...ఎట్టకేలకు ఆసీస్ ఆధిక్యం 130 పరుగులకు చేరాక ఒక ఫుల్‌టాస్ యార్కర్‌తో హెడ్‌ను సిరాజ్ బౌల్డ్ చేసి తన ఆవేశాన్ని ప్రదర్శించాడు. అంతటితో ఆగిపోకుండా పెవిలియన్ వైపు వెళ్లమంటూ రెండు సార్లు సైగ కూడా చేశాడు. హెడ్ కూడా ఏదో చెబుతూ నిష్క్రమించాడు. కానీ ఫ్యాన్స్ ఊరుకోలేదు. తమ బ్యాటర్‌తో తలపడిన సిరాజ్‌ను ఒక్కసారిగా అంత భారీ సమూహం గేలి చేసింది. తర్వాతి బంతికి స్టార్క్ ఫోర్ కొట్టడంతో ఇది మరింత పెరిగింది. ఆ ఓవర్ మాత్రమే కాదు...ఆ తర్వాత అతను వేసిన ప్రతీ అడుగుకు ఇలాగే స్పందించారు. సిరాజ్ డీప్ థర్డ్‌మ్యాన్ వద్ద ఫీల్డింగ్ చేస్తుండగా ప్రేక్షకుల హేళన ఇంకా పెరిగిపోవడంతో రోహిత్ అతడిని లోపలి వైపు పాయింట్ వద్దకు మార్చాల్సి వచ్చింది. సిరాజ్ బౌలింగ్‌లో హెడ్ 4 ఫోర్లు, ఒక సిక్స్ కొట్టాడు. ఆ సిక్స్ తర్వాతి బంతికే వికెట్ దక్కింది. హెడ్ 76 పరుగుల వద్ద ఉన్నప్పుడు సిరాజ్ క్యాచ్ వదిలేశాడు కూడా. దాంతో సహజంగానే హైదరాబాదీ తన భావోద్వేగాన్ని చూపించాడు. అయితే ఏకంగా 140 పరుగులు చేసిన తర్వాత ఇలాంటి సైగలు చేయడాన్ని మాజీ క్రికెటర్ గావస్కర్ కూడా తప్పుపట్టాడు.

2023 నుంచి అన్ని ఫార్మాట్‌లలో కలిపి ట్రవిస్ హెడ్ భారత్‌పై 19 ఇన్నింగ్స్‌లలో 61.9 సగటుతో 1052 పరుగులు చేయడం విశేషం. ఇందులో 3 సెంచరీలు, 4 అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇతర జట్లపై మాత్రం 54 ఇన్నింగ్స్‌లలో కేవలం 36.8 సగటుతో 1875 పరుగులు మాత్రమే చేయగలిగిన అతను 3 సెంచరీలు, 10 అర్ధసెంచరీలు సాధించాడు.



హెడ్

సినిమా

జైపూర్‌కు కూలీ


● రజనీకాంత్

జైపూర్ వెళ్లనున్నారు కూలీ. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ'. ఈ చిత్రంలో నాగార్జున, శ్రుతీహాసన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్, హీరోయిన్ రెబ్బా మోనికా జాన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ జైపూర్‌లో జరగనుందని, ఈ షెడ్యూల్‌లో రజనీకాంత్, ఆమిర్ ఖాన్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారని సమాచారం. ఈ షెడ్యూల్‌తో సినిమా దాదాపు పూర్తవుతుందట. కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. 'కూలీ' సినిమాను కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1న రిలీజ్ చేసే ఆలోచనలో యూనిట్ ఉందని సమాచారం.

ఆ విషయాన్ని నిజాయతీగా చెప్పాను

- సుబ్బు మంగాదేవి



''బచ్చల మల్లి' మూవీ క్యారెక్టర్ బేస్డ్ కథ. ఇందులో తండ్రికి సంబంధించిన భావోద్వేగ అంశాలు ప్రధానంగా ఉంటాయి. కరోనా టైమ్‌లో నా తల్లిని కోల్పోయాను. ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక పొరపాటు జరుగుతూ ఉంటుంది. జీవితంలో వెనక్కి వెళ్లి సరిదిద్దుకోలేని తప్పులు మూర్ఖత్వంతో చేయొద్దనే విషయాన్ని చాలా నిజాయతీగా చెప్పాను'' అని డైరెక్టర్ సుబ్బు మంగాదేవి అన్నారు. 'అల్లరి' నరేశ్, అమృతా అయ్యర్ జంటగా నటించిన చిత్రం 'బచ్చల మల్లి'. 'సోలో బ్రతుకే సో బెటర్' మూవీ ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఈ నెల 20న ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా సుబ్బు మంగాదేవి విలేకరులతో మాట్లాడుతూ– ''రాజేష్ దండాగారికి నేను చెప్పిన 'బచ్చల మల్లి' కథ నచ్చడంతో, నరేశ్‌గారికి చెప్పమన్నారు. కథ విన్న నరేశ్‌గారు వెంటనే సినిమా చేద్దామన్నారు. 'పుష్ప 1'లో అల్లు అర్జున్‌గారిది కూలీ పాత్ర. ఇందులో బచ్చల మల్లి అనే ట్రాక్టర్ డ్రైవర్‌గా చేశారు నరేశ్‌గారు. అలా ఆయన గెటప్ విషయంలో పోలిక తప్ప కథ విషయంలో కాదు. 'బచ్చల మల్లి' కథని ఎమోషనల్‌గా చెప్పాలనుకున్నాం. ఇందులో మంచి ప్రేమకథ ఉంది. నేను 1990లలో ఊర్లో పెరిగాను. అప్పటి మనుషులు ఎలా ప్రవర్తించేవారో నాకు తెలుసు. అందుకే 1990 నేపథ్యంలో ఈ కథ చెప్పాలనుకున్నాను. బచ్చల మల్లి పాత్రకి నరేశ్‌గారు పూర్తి న్యాయం చేశారు. నా తర్వాతి ప్రాజెక్ట్స్ కోసం కొన్ని స్టోరీ లైన్స్ ఉన్నాయి. 'బచ్చల మల్లి' రిలీజ్ తర్వాత వాటిపై దృష్టి పెడతాను'' అన్నారు.

ఫియర్ సరికొత్త అనుభూతినిస్తుంది

- దర్శకురాలు డా. హరిత గోగినేని



''రెగ్యులర్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాలకు భిన్నంగా మా 'ఫియర్' ఉంటుంది. సాధారణంగా సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలను కుటుంబ ప్రేక్షకులు చూసేందుకు ఇష్టపడరు. కానీ, మా సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. పిల్లలు కూడా బాగా ఎంజాయ్ చేస్తారు. అన్ని వర్గాల వారికీ 'ఫియర్' సరికొత్త అనుభూతినిస్తుంది'' అని డైరెక్టర్ డా. హరిత గోగినేని చెప్పారు. హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో, అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో నటించిన చిత్రం 'ఫియర్'. డా. వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించారు. సుజాత రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హరిత గోగినేని మాట్లాడుతూ– ''మూడేళ్ల క్రితం 'ఫియర్' ఆలోచన మొదలైంది. అయితే అప్పుడు 'లక్కీ లక్ష్మణ్' సినిమా చేస్తుండటంతో అది పూర్తయ్యాక 'ఫియర్' మీద దృష్టి పెట్టాం. ఈ కథ విన్న వెంటనే వేదిక ఒప్పుకున్నారు. 'ఫియర్'ని ఇతర భాషల్లోనూ విడుదల చేయాలనుకుని, అన్ని భాషలకు సరిపడేలా ఈ టైటిల్ పెట్టాం. అయితే ముందు తెలుగులోనే రిలీజ్ చేస్తున్నాం'' అని చెప్పారు.


● నవీన్ ఎర్నేని, అల్లు అర్జున్, సుకుమార్, యలమంచిలి రవిశంకర్

సుకుమార్‌కి రుణపడి ఉంటాను

- అల్లు అర్జున్

''దేశం నలుమూలల నుంచి మా 'పుష్ప 2' యూనిట్‌కి సపోర్ట్ చేసిన అందరికీ ధన్యవాదాలు. ప్రపంచంలో ఉన్న తెలుగువారికి, భారతీయులకు థ్యాంక్స్. ఒక సినిమా ఇంత పెద్ద విజయం సాధించడానికి కారణం డైరెక్టర్ కాబట్టి సుకుమార్‌గారికి థ్యాంక్స్. నన్ను ఎక్కడో ఒక స్థాయిలో నిలబెట్టినందుకు ఆయనకు రుణపడి ఉంటాను'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా నటించిన చిత్రం 'పుష్ప 2 : ది రూల్'. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై యలమంచిలి రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 6 భాషల్లో ఈ నెల 5న విడుదలైంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'పుష్ప 2' వైల్డ్ ఫైర్ సక్సెస్‌మీట్‌లో అల్లు అర్జున్ మాట్లాడుతూ– ''పుష్ప 2' వసూళ్లు చూస్తుంటే సినిమాను ఎంత మంది ప్రేక్షకులు చూశారో అర్థం అవుతోంది. చిత్రబృందం తరఫున, తెలుగువారందరి తరఫున ప్రపంచ సినీ ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. మా సినిమాకి ఎంతో సహకారం అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిగారికి, అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారికి, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌గారికి థ్యాంక్స్. దేశంలో మా సినిమాకు సపోర్ట్ ఇచ్చిన అన్ని సినిమా ఇండస్ట్రీలకు ధన్యవాదాలు'' అన్నారు.

ఆ సంఘటన చాలా బాధ కలిగించింది

''నేను 'పుష్ప 2' చేయడానికి ముఖ్య కారణం ఈ సినిమా తెలుగువారందరూ గర్వంగా చెప్పుకునేలా చేస్తుందనే నమ్మకంతోనే. అనుకోకుండా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన సంఘటనలో రేవతిగారి మృతి మమ్మల్ని ఎంతగానో కదిలించింది. గత ఇరవయ్యేళ్లుగా అభిమానులతో కలిసి సినిమా చూస్తున్నాను. అయితే ఎప్పుడూ ఇలా జరగలేదు. డిసెంబరు 4న వేసిన ప్రీమియర్ షోకి ఎక్కువ జనం ఉండటంతో ఇబ్బంది అవుతుందని థియేటర్ యాజమాన్యం చెప్పగానే నేను వెళ్లిపోయాను. ఇంటికి వచ్చిన తర్వాత రేవతిగారి సంఘటన తెలిసి చాలా బాధ కలిగింది. ఆ కుటుంబం కోసం 25 లక్షలు కేవలం ఒక సాయంగా ఇస్తున్నాను. అయినా ఒక మనిషి లేని లోటు ఎవరూ తీర్చలేం. ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటా. అంతా కుదుటపడిన తర్వాత వ్యక్తిగతంగా వెళ్లి ఆ కుటుంబాన్ని కలుస్తాను'' అని పేర్కొన్నారు అల్లు అర్జున్.

సుకుమార్ మాట్లాడుతూ– ''ముందుగా రాజమౌళిగారికి థ్యాంక్స్ చెప్పాలి. ఈ సినిమాను ఇంతగా ప్రోత్సహించింది, పాన్ ఇండియా రిలీజ్ చేయాలని చెప్పింది ఆయనే. 3 గంటల పాటు ప్రేక్షకులు మా సినిమాను చూడాలని నేను, నా చిత్ర బృందం చాలా కష్టపడి చేశాం. 10 నిమిషాల్లో ఓ సన్నివేశం రాసే వాళ్లు నా దర్శకత్వ టీమ్‌లో ఉన్నారు. నా టీమ్‌లోని వారంతా సుకుమార్‌లే.. అందరూ నాలాంటి దర్శకులే. ఈ విజయానికి కారణం చిత్రబృందం అందరిదీ. మూడు రోజులుగా నేను ఆనందంగా లేను. ఎందుకంటే జరిగిన ఘటన (రేవతి మృతి) అలాంటిది. వారి కుటుంబానికి మేము ఎప్పుడూ అండగా ఉంటాం'' అని తెలిపారు.

''మా సినిమాని ఇంతగా ఆదరించిన తెలుగు ప్రజలందరికీ థ్యాంక్స్. వేగంగా రూ. 500 కోట్లు వసూలు చేసిన సినిమాగా 'పుష్ప 2' రికార్డు సృష్టించింది. ఈ సినిమా ఇంతటి విజయం సాధించడం భారతీయులందరికీ గర్వకారణం'' అన్నారు **నవీన్ ఎర్నేని**. ''పుష్ప 2' రెండు రోజులకు రూ. 500 కోట్లకు పైగా వసూలు చేసినందుకు ఆనందంగా ఉంది. టికెట్ ధర 800 ప్రీమియర్ షోకి మాత్రమే.. ఆ తర్వాత సాధారణ ధరలతోనే అందుబాటులో ఉన్నాయి. అందరూ కచ్చితంగా సినిమాని చూడాలి'' అని **యలమంచిలి రవిశంకర్** కోరారు.

సస్పెన్స్.. హారర్... థ్రిల్

అమిత్ రావ్ హీరోగా సస్పెన్స్ హారర్ థ్రిల్లర్ మూవీ 'జిన్' ఆరంభమైంది. చిన్మయ్ రామ్ దర్శకత్వంలో నిఖిల్ ఎమ్. గౌడ నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి ప్రముఖ రచయిత రామజోగయ్య శాస్త్రి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇచ్చారు. రామజోగయ్య శాస్త్రి, రాజ్ కందుకూరి కలిసి యూనిట్‌కు స్క్రిప్ట్‌ను అందించారు. ''ఈ సినిమాకు డైలాగ్స్ రాసిన వరదరాజ్ నాకు మంచి మిత్రుడు. ఈ ద్విభాషా చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు రామజోగయ్యశాస్త్రి. ''కథ బాగా వచ్చేందుకు చాలా సమయం తీసుకున్నాను. నా మిత్రుడు పర్వీజ్‌తో కలిసి కథ రెడీ చేశా'' అన్నారు చిన్మయ్ రామ్. ''ఈ కథ కొత్తగా ఉంటుంది'' అని తెలిపారు డైలాగ్ రైటర్, సహ–నిర్మాత వరదరాజ్ చిక్కబళ్లాపుర. ''వచ్చే వారం చిత్రీకరణ ఆరంభిస్తాం'' అని చెప్పారు నిఖిల్ ఎమ్. గౌడ.


● అమిత్ రావ్, రాజ్ కందుకూరి

ఓటీటీ – ఇది చూడొచ్చు

అభిమానులకు నయనానందకరం

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హీరోయిన్ నయనతార జీవితంపై రూపొందిన 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.

తెర మీద కనపడే తారలపై ప్రేక్షకులకు మక్కువ ఎక్కువ. మరీ ముఖ్యంగా సినీ ప్రేక్షకులు ఈ తారలపై అపరిమిత అభిమానాన్ని పెంచుకుంటూ వారి వ్యక్తిగత జీవితాలను గురించి కూడా తెలుసుకోవాలని ఆరాటపడతుంటారు. ప్రస్తుత వినోద రంగంలో వాణిజ్య విప్లవమైన ఓటీటీ వేదికలు అడపాదడపా కొంతమంది కళాకారుల వ్యక్తిగత జీవితాలను డాక్యుమెంటరీ రూపంలో ప్రేక్షకులకు అందుబాటులోకి తెస్తున్నాయి. వీటికి సదరు నటీనటులకు ఓటీటీ సంస్థలు భారీ మొత్తంలో పారితోషికం ముట్టజెప్పి డాక్యుమెంటరీలు రూపొందిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ప్రముఖ నటి నయనతార డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' రిలీజ్ అయింది. బెంగళూరు నగరంలో పుట్టిన నయనతార అనతి కాలంలోనే తన సినిమా కెరీర్‌లో అత్యున్నత స్థాయికి ఎదిగారని చెప్పవచ్చు. సౌత్ ఇండియా క్వీన్ అని ఫ్యాన్స్ పిలుచుకునే ఈ బ్యూటీ ప్రతిష్ఠాత్మక పత్రిక ఫోర్బ్స్‌లో 'ఇండియాలో సెలబ్రిటీ 100 లిస్ట్'లో ప్రచురింపబడ్డ ఒకే ఒక్క దక్షిణాది నటి. అంతటి నటి డాక్యుమెంటరీ అంటే ఇక చెప్పేదేముంది అభిమానులకు పండగే. ఈ డాక్యుమెంటరీ మొత్తం నయనతార జీవితాన్ని చూసినట్టుగా కాదు, అనుభూతి పొందినట్టుగా ఉంటుంది. నయనతార పుట్టుక నుండి తన పెరుగుదల, చదువు ఆ తరువాత తన సినిమా ప్రస్థానం ఇవన్నీ ఎంతో చక్కగా చూపించారు. వీటితో పాటు నయనతార గురించి సినీ ప్రముఖులు, ఆమె ఆప్తుల అభిప్రాయాలతో కూడిన విశ్లేషణ ఇవ్వడం మరో హైలైట్. జీవితమంటే సాఫీగా సాగే ప్రయాణమే కాదు. ఒడిదుడుకులుంటాయి. సినిమా స్టార్ అయినా సాధారణ మనిషైనా ఎవ్వరికైనా జీవితం జీవితమే. అలాగే నయనతార ఎంత ఎత్తుకు ఎదిగినా తన జీవితంలో కూడా ఒడిదుడుకులు, ఎత్తుపల్లాలెన్నో ఉన్నాయి. అవన్నీ కూడా తానే వివరిస్తూ తన సినిమా జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని ప్రేక్షకులకు సవివరంగా వివరించారు. నయనతార గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే ఈ డాక్యుమెంటరీ చూడాల్సిందే. ఏదేమైనప్పటికీ టైటిల్‌లో ఉన్నట్లు ఈ డాక్యుమెంటరీ అంతకు మించి... అందుకే ఇది నయనానందకరం.



– ఇంటూరు హరికృష్ణ

ఈ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



వైశ్య/రెండవ పెళ్లి / 27y/5'9" / B.Tech / బిజినెస్/2 Lakhs PM, *35y/5'7"/Job/30Cr Property, * 34y/5'10"/Job/20L PA, *38y/5'10"/SWE కంపెనీ వరులకు వధువులు కావలెను. M. సునీత, DSNR, Ph: 9346019313 [H-782726]

దూదేకుల/27y/5'7"/Job/40K/PM/అంధ్రాలో పొలాలు, ఇల్లు, వెల్ సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. శ్రీ గణేష్ మ్యారేజ్ బ్యూరో 1వ, 2వ సంబంధాలు అన్ని మతాల వారికి 20 రోజుల్లో చూడబడును. రిజిస్ట్రేషన్ ఫ్రీ. Ph: 7075036010 [H-782726]

విశ్వబ్రాహ్మణ /కట్నం ప్రసక్తి లేదు/గుడ్ లుకింగ్/30/5'10"/ B.Tech / సాఫ్ట్‌వేర్/1 Lakh PM/కోట్ల ఆస్తి గుడ్ ఫ్యామిలీ గల వరుడికి వధువు కావలెను. 8367619529 [HA-15333]

రెడ్డి /హ్యాండ్సమ్/కట్నం ప్రసక్తి లేదు/ 29/5'11"/B.Tech/ సాఫ్ట్‌వేర్/2 Lakhs PM/50 కోట్ల ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 8367619529 [HA-15333]

కాపు /కుల పట్టింపు లేదు/గుడ్ లుకింగ్/ 35/5'11"/Ph.D / గుడ్ జాబ్/1 Lakh PM/కోట్ల ఆస్తి గల వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వరునికి వధువు కావలెను. 8367619529 [HA-15333]

SC మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/29/5'10"/ B.Tech(IIT)/Incometax Officer Govt. 1.50 Lakh PM/వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8074766368 [HA-15333]

SC మాల/27/5'8"/Fair / B.Tech, MBA/ SWE Infosys/1,00,000/-PM వెల్ సెటిల్డ్ గల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9346675639 [HA-15333]

దేవాంగ (CAST No Bar)/41y, 5'5"/ Fair/ M.Tech, MCA, IRPM, Govt. Job Sal: 1,00,000/-(PM), ఆస్తి 4 కోట్లు, వరునికి, వధువు కావలెను. (డైరెక్ట్). Ph: 7036361292 [HA-15333]

యాదవ /కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ Govt. బ్యాంక్ మేనేజర్ / యూనియన్ బ్యాంక్/ 80,000/-PM / 5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 7075953400 [HA-15334]

విశ్వబ్రాహ్మణ / B.Tech / C.Govt. JTO / BSNL / 72000/-PM / 5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph : 9515942275 [HA-15334]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ Very BIG Business/ B.Tech/ MS/MBA/Handsome Boy / 1994 / 6'/ 1000Cr-Hyd- *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA/Bitspilani *1993/5'11"/240K/30Cr *1995/ 5'7"/ 300K *1993/5'9"/200K/20Cr *Cont: K.C. Reddy - Hyd- Ph: 9347807015

Reddy/BS(USA) MBA (ISB)Hyd/ 1995/ 5'7"/2000Cr *(Business)/ MBA/ 1989/ 5'11"/500Cr *B.Tech/ 1990/6'/1000Cr * Cont. K.C. Reddy- Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/MS/USA/1997/6'/ 400 Cr *1998/6'/300Cr *1991/5'11"/200 Cr * 1998/6'/80Cr * Cont : K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/IIT/B.Tech/MS *1996/6' *1996/ 6'/25Cr *1996/5'7" *1994/5'9" *30Cr * 1995/ 5'7" *1994/6'/400K * Cont: K.C. Reddy Mar Bureau-Hyd-Ph: 9849321309

Reddy /Business/ B.Tech/1989/6'/ 40Cr *1994/5'11"/100Cr *1996/5'11"/ 65Cr *1993/5'7"/50Cr * Cont : K.C. Reddy - Hyd. Ph : 9347807015/9849321309

Reddy/Business *1994/70Cr *B.Tech/ MBA *1995/6'/150Cr *1994/5'10"/100Cr *1997/ 5'11"/100Cr *1993/5'7"/50Cr * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/ MBBS / PG *1995/5'10"/400Cr *96 / 6' / 50Cr *94/5'10"/70Cr *93/ 5'10"/ 50Cr *94/5'9"/30Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/USA Doctors/MBBS/MD/ 1992/ 6'/50Cr *1995/5'8"/10Cr *1998/ 5'8"/ 50Cr *1989/5'9" *1992/5'11" * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/Divorcee *B.Tech/MS/MBA * 1990 / 5'9"/230K/40Cr *1981/5'8"/500Cr * 1986/ 5'11"/70L/yr/Hyd *95 / 5'9" / 230K / 25 Cr * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/Australian Citizen *BE/ MS/ 1994/5'4"/150K / 25Cr *1995/ 5'5"/ 50Cr *2000/5'3"/ 30Cr * Cont :K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA/Most Beautiful/1994/5'4"/ 260K/ *1997/ 5'4"/200K *1995/5'6"/200K * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/IIT/B.Tech/*2000/5'7"/45L/yr *98/5'4"/70L/yr *97/5'4"/200K *1995/ 5'6"/200K * Cont : K.C.Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/Most Beautiful *1995/ 5'5"/ 100Cr *99/5'7"/100Cr *2000/ 5'5"/ 100Cr *95/5'5"/100Cr *97/5'4"/ 150Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/MBA/Most Beautiful *1994/5'3"/ 300Cr *93/5'7"/100Cr *88 / 5'3"/ 300Cr *1993/5'3"/500Cr * Cont : K.C. Reddy - Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/PG *2000/ 5'6"/100Cr *98/5'7"/100Cr *97/5'6"/500Cr *93/5'3"/ 50Cr *90/5'6"/100Cr *94/5'4"/50Cr * Cont. K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/2002/5'6"/20Cr *94/ 5'4"/ 20Cr *94/5'4"/15Cr *2001/5'3"/ 20Cr *91/ 5'7"/10Cr *94/5'10"/60Cr *97/ 5'5"/ 25Cr * Cont : K.C. Reddy -Hyd-Ph: 9347807015

Reddy/B.Tech / 1995 / 5'8" / 100Cr *91/ 5'4"/10Cr *96/5'7"/50Cr *99/5'8"/15Cr *98/5'5"/50Cr *95/5'3"/50Cr *Cont: K.C. Reddy-Hyd.Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1997/ 5'4"/ 100Cr *99/5'6"/100Cr *99/5'7"/100Cr *97/ 5'5"/60Cr *92/5'7"/100Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Divorcee/B.Tech/1989/5'3"/100Cr *85/5'5"/400Cr *88/5'6"/30Cr *92/5'5"/50Cr *93/5'6"/50Cr *87/5'6"/15Cr *86/5'6"/30Cr * Cont : K.C. Reddy- Hyd-Ph: 9849321309

[D-560]

SC మాల & క్రిస్టియన్ /కట్నం ప్రసక్తి లేదు / M.Tech/Govt.డిప్యూటీ మేనేజర్/ SBI/ 85000/-PM/5'8" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-15334]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/ M.Tech / NIT/ Govt.A.E.E. / ఇరిగేషన్ Dept / 18 Lakhs. PA/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093, 9515755529 [HA-15334]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 6' 1", Engineer, 100 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", SWE, 210 K, 30 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 31, 5' 8", 50 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", SWE, 160 K, 15 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 2", 100 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 27, 5' 3", 18 L P/A, 18 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 25, 5' 6", SWE, 100 K, H1, USA, Rich, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 23, 5' 4", SWE, 6 L P/A, 5 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Pune BE (IIIT), MSc, 30, 5' 10", Analyst, 30 L P/A, 20 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, BE, MS, 25, 5' 8", Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 6' 1", PG Doctor, Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 9", Business Analyst, 185 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 27, 5' 3", Analyst, 12 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, MBA, 26, 5' 5", Analyst, 11.6 L P/A, 25 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 28, 5' 8", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 4", SWE, 200 K, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

మాల/M.Tech, IIT / C.Govt.Asst. మేనేజర్ / IOCL / 1 Lakh. PM/ 5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 7416584304 [HA-15334]


మాదిగ/B.Tech / C.Govt.మేనేజర్/ కెనరా బ్యాంక్/98000/-PM / 5'10" ఎత్తు / 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7780299703 [HA-15334]

37 సం. గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డౌరీ. Ph: 9866724586, 6301943220 [H-783653]

డైరెక్ట్ 44 సం॥రాల BC వరుడికి వధువు కావలెను. కుల పట్టింపు లేదు. 1వ లేదా 2వ సంబంధం ఐనా కూడా సంప్రదించగలరు:7993094344 [Y-798494]

SC Mala/Hindu/2nd Marriage/40y/ PG/ 5'10"/SWE/1.6L PM/Wants Hindu Bride only. From Hyderabad & Telangana areas ony Direct Cont: 8187861989 [H-782791]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/డిగ్రీ/ 30Y/సొంత బిజినెస్/అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము అయినా OK)/1st, 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9515673252 [HA-15335]

కుల, ఆస్తి పట్టింపు లేదు/జాబ్, వ్యాపారం, ఫ్లాట్స్, 5L/PM/5 కోట్ల ప్రాపర్టీ గల అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. ముఖా ముఖి కల్పించి త్వరగా కుదుర్చబడును. Ph: 8309968631 [H-783653]

డైవర్సీ /36yrs/Govt.ఎంప్లాయ్/3,00,000/- (pm)/ కుల ప్రసక్తి లేని వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి వరుడు కావలెను. సంప్రదించండి : Ph: 9505422536 [H-783653]

రెడ్డి /50yr/2nd మ్యారేజ్/కుల పట్టింపు లేదు/ Govt.ఎంప్లాయ్/4,00,000/- (PM) / వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 4 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర : 8374802603 [H-783653]

కమ్మ /28y/5'4"/Architecture/మైనింగ్ బిజినెస్/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9676585199 [H-782726]

కులపట్టింపు లేదు /విడో/46y/ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్/1L PM/Own House/28 ఎ॥ ల్యాండ్/కోట్ల కమర్షియల్ ఆస్తులు గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph : 9059819737 [H-782791]

రెండో పెళ్ళి /విడో/50y/ Fair/విజయవాడ/ Hydలో Own House (Rents), Lands వెల్ సెటిల్ పిల్లలులేని ఏ బాదరబందీలేని వధువుకు FC/BC వరుడు కావలెను. Ph : 8519803423 [H-782791]

కుల పట్టింపు లేదు/48y/C.Govt. Job/70K PM/ Own 1 Gram Gold Business/2 L PM/20 ఎ॥ పొలాలు, శోటలు/కోట్ల ప్రాపర్టీ గల ఫ్యామిలీ కోల్పోయినవధువుకు వరుడు కావలెను (ఇల్లరికం), పిల్లలు ఉన్నా OK. Ph : 7702043224 [H-782791]

FC/ విడో / ప్రభుత్వ పెన్షనర్ / రెండు ఇళ్లు గల సాంప్రదాయ వధువుకు స్నేహపూర్వకమైన వరుడు కావలెను. Ph: 9581105737 [H-783510]

రెడ్డి/విడో/49/5'5"/V.Fair/Govt. H.M Rtd సొంత అపార్ట్‌మెంట్స్ & రెంట్స్/30 ఎకరాల కొబ్బరితోట షాపింగ్ కాంప్లెక్స్ కలిగిన వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 8499909096 [H-783510]

తెలగ/విడో/50y/సొంత వ్యాపారం/సొంత ఇల్లు/వ్యవసాయ భూములు గల మంచి ఆర్థిక స్తోమత గల వధువుకు మంచి వ్యక్తిత్వం గల వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 7893664129 [H-783510]

FC/విడో/5'4"/V.Fair/ Govt.ఎంప్లాయ్ / సొంత ఇల్లు & రెంట్స్ సిటీ దగ్గరలో 8 ఎకరాల పొలం గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. 7416249467 [H-783510]

రెడ్డి/కుల పట్టింపు లేదు/26y/5'4"/ B.Tech/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 9133640971 [HA-15333]

కుల పట్టింపు లేదు/21y&23y&25y&27y& 29y&31y&33y&34y&35y&37y&39y&40y&41y& 43y&45y&46y&48y&50y/"మా సేవ" మ్యారేజ్ బ్యూరో (Since 1998) : PH/WA: 9291503949 [HA-15333]

రెడ్డి/చాలా అందమైన/2వ పెళ్లి/పిల్లలు లేరు/28/5'4"/MCA/కోట్ల ఆస్తి/గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [HA-15333]

SC హిందూ/గుడ్ లుకింగ్/27/5'4"/ PG/ గుడ్ జాబ్/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [HA-15333]

క్రిస్టియన్ మాల/2వ పెళ్లి/(హిందూ OK)/ MBBS, PG/Govt. మెడికల్ ఆఫీసర్/1 Lakh. PM/5'5"ఎత్తు/29 సం॥ల అందమైన వధువుకు Any Govt/PG వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15334]

మాదిగ/B.Tech / C.Govt.Jr.Asst./ పంచాయతీరాజ్ Dept/42000/-PM/5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7780299703 [HA-15334]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech (సివిల్)/ C. Govt. Asst. మేనేజర్ / యూనియన్ బ్యాంక్/45000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల వధువుకు వరుడు కావలెను. 9491555252 [HA-15334]

రజక/B.Tech/C.Govt. బ్యాంక్ క్లర్క్ & క్యాషియర్/ SBI/ 45000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15334]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/B.Com/Pvt. Job. అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము అయినా OK)/ All Cast marriages Available. Ph: 8121347478 [HA-15335]

రెడ్డి/2nd మ్యారేజ్ (కుల, ఆస్తి) పట్టింపు లేదు/Age: 33 (జాబ్, ల్యాండ్, ఓన్ హౌస్) వధువుకి, వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st-2nd సంబంధాలు కలవు. Ph: 9059099496 [HA-15335]

2వ పెళ్ళి/4,00,000 pm. బాగా స్థిరపడిన అందమైన అమ్మాయికి, అందమైన వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. ఇల్లరికం. పిల్లలు ఉన్నా OK. కోట్ల ప్రాపర్టీ ఉంది. సంప్ర : 9381696641 [H-783653]

మాల 26Yrs / 5'4" / B.Tech / IIT/ PSU Cent Govt. Officer/Sal: 20 Lacs, P/A, వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9493285326 [H-783361]

వేదికలు



మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్, PO, Govt. ఆఫీసర్స్, USA, UK. 7416094972, 9502216460 [H-783510]

రజక/ డాక్టర్స్, ఇంజినీర్స్, లాయర్స్, ఇండియా, అబ్రాడ్, గవర్నమెంట్ జాబ్ వధూవరుల వివాహ సంబంధాలకై సంప్ర॥ కోట్ల శ్రీనివాస్. Ph: 9391265304/8106303155 [H-782726]

అన్ని కులాల, డాక్టర్స్, ఇంజినీర్స్ /Govt. Jobs/ బిజినెస్/ Abroad సంబంధాలకై సంప్రదించండి. Ph: 9100357969, 9640876803 [H-782726]

కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును. Ph: 7702526428 [H-782791]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15335]

Madiga - Mala-Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15335]

కాపు/మున్నూరు కాపు వధూవరుల స్వయంవరం Free Register 15/Dec/2024న కమలానగర్ వెల్ఫేర్ ఆఫీస్, ECIL, Hyderabad నందు. Ph: 9704656103, 9533608887 Whatsapp [HA-1194]

ఐదుగురు యువకులు జలసమాధి



కలకోటి అక్షయ్ కుమార్(బల్లు) | వీరమల్ల విఘ్నేశ్వర్ | జెల్ల వినయ్ | ఇంద్రపల్లి హర్షవర్ధన్ | తీగుళ్ల వంశీగౌడ్

▶ మొదటి పేజీ తరువాయి

జ్యోతినగర్ కాలనీకి చెందిన మేడబోయిన మణికంఠయాదవ్ (21) స్నేహితులు. శుక్రవారం రాత్రి వీరంతా ఎల్‌బీ నగర్‌లో కలసి పార్టీ చేసుకుందామని అనుకున్నారు. తీగుళ్ల వంశీగౌడ్ తన ఇంటి వద్ద ఓ స్నేహితుడు పెట్టివెళ్లిన కారు ఉండటంతో.. దానిని తీసుకొని శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో బయలుదేరారు. మార్గమధ్యలో అంబర్‌పేట వద్ద మద్యం తాగారు. అక్కడే రెండు గంటల పాటు గడిపారు. ఆ సమయంలో వారికి ఈతకల్లు తాగాలని కోరిక పుట్టింది. దీనితో సుమారు 3.30 గంటల సమయంలో భూదాన్ పోచంపల్లికి వచ్చారు. ఇంకా చీకటిగానే ఉండటంతో అక్కడే టీ తాగారు. టిఫిన్ చేసి వద్దామనుకుని కొత్తగూడెం ఎక్స్‌రోడ్డు వద్దకు వెళ్లారు. టిఫిన్ సెంటర్లు తెరవకపోవడంతో తిరిగి పోచంపల్లికి బయలుదేరారు. మద్యం మత్తులో ఉన్న వంశీ కారు నడుపుతున్నాడు. అయితే మధ్యలో అటవీ ప్రాంతం కావడం, తెల్లవారుజాము సమయం కావడంతో పొగమంచు దట్టంగా కప్పుకొంది. దానితో రోడ్డు సరిగా కనిపించక వంశీ ఒక్కసారిగా కారు హ్యాండ్ బ్రేక్ వేశాడు. వేగంగా ఉన్న కారు దీనితో అదుపుతప్పి పక్కనే ఉన్న జలాల్‌పురం చెరువులోకి బోల్తా కొట్టింది.

ఈత రాక, బయటపడలేక..

కారులో డ్రైవర్ పక్కన సీట్లో కూర్చున్న మణికంఠ కారు సైడ్ అద్దం కొద్దిగా తెరిచి ఉండటంతో దానిని కాలుతో తన్ని పగులగొట్టి బయటికి వచ్చాడు. ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. కారు నడుపుతున్న వంశీ, వెనుక సీట్లో కూర్చున్న అక్షయ్, వినయ్, హర్షవర్ధన్, విఘ్నేశ్వర్ నీట మునిగి ప్రాణాలు వదిలారు. ఒడ్డుకు చేరిన మణికంఠ రోడ్డుపై వెళ్తున్న పాల వ్యాపారిని ఆపి ప్రమాదం గురించి చెప్పాడు. ఆ వ్యాపారి 100కు, స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్థానిక ఎస్సై భాస్కర్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొన్నారు. నీట మునిగిన కారును జేసీబీతో వెలికితీయించి.. అందులోని మృతదేహాలను బయటికి తీశారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఇతర అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అంతా పేద కుటుంబాల వారే

జల సమాధి అయిన ఐదుగురు యువకులు కూడా పేద కుటుంబాలకు చెందినవారే. ఇందులో వంశీగౌడ్ ఇంటర్ పూర్తి చేసి ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. అతడి తండ్రి శంకర్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తుండగా తల్లి గృహిణి. ఇక అక్షయ్‌కుమార్ ఇంటర్ పూర్తి చేసి జాబ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడి తండ్రి నర్సింహాచారి కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు. జెల్ల వినయ్ ఇంటర్ చదివాడు. అతడి తండ్రి జగన్నాథం చేనేత కార్మికుడు. హర్షవర్ధన్ డిగ్రీ పూర్తి చేశాడు. ర్యాపిడో బైక్ నడుపుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. వీరమల్ల విఘ్నేశ్వర్ ఇంటర్ పూర్తి చేశాడు. అతడి తండ్రి సత్యనారాయణ ఆర్టీసీ కండక్టర్ అని తెలిసింది.

అద్దాలు పగులగొట్టుకొని బయటికి వచ్చాను



పార్టీ చేసుకొందామని ఫ్రెండ్స్ చెబితే రాత్రి ఎల్‌బీనగర్‌కు వచ్చాం. వంశీ కారు తీసుకొచ్చాడు. ఆరుగురం కలసి రాత్రి 12 గంటలకు బయలుదేరాం. రామోజీ ఫిల్మ్‌సిటీ వద్ద ఏదో యాక్సిడెంట్ అయి ట్రాఫిక్ జామైతే గంటపైగా అక్కడే ఉన్నాం. కల్లు దొరుకుతుందని రాత్రి 3.30 గంటలకు పోచంపల్లికి వచ్చాం. ఇంకా తెల్లారకపోయేసరికి టిఫిన్ చేయడానికి కొత్తగూడెం ఎక్స్‌రోడ్డుకు వచ్చి తిరిగి పోచంపల్లికి వెళ్తుంటే ప్రమాదం జరిగింది. పొగమంచుతో రోడ్డు సరిగ్గా కనబడక సడన్‌గా హ్యాండ్ బ్రేక్ వేసిండు. కారు పల్టీ కొట్టి చెరువులో బోల్తా పడింది. డోర్లు తెరుచుకోలేదు. ముందు సీట్లో ఉన్న నేను కారు సైడ్ అద్దాన్ని కాలితో తన్ని పగులగొట్టి బయటికి వచ్చాను. డోర్లు తెరుచుకుని ఉంటే అంతా ఎలాగోలా బయటపడేవారు.

\- మణికంఠ యాదవ్

రాత్రి 11 గంటల దాకా ఇంటివద్దే ఉన్నాడు



మేం ముగ్గురం అన్నదమ్ములం. వంశీ రెండోవాడు. పెళ్లిళ్లకు ఫొటోలు, వీడియోలు తీస్తుంటాడు. రాత్రి 11 గంటల వరకు అంతా ఇంటి వద్దే ఉన్నారు. ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లారు. ఉదయం నేను జిమ్‌కు వెళ్తుంటే తెలిసినవారు మీ తమ్ముడు చనిపోయాడని, స్నాప్‌చాట్‌లో ఫొటోలు వచ్చాయని చెప్పడంతో చూసి షాక్ అయ్యాం.

\- తీగుళ్ల ఉదయ్‌కుమార్ (మృతుడు వంశీ సోదరుడు)

భారత్ శాశ్వత సభ్యత్వానికి చైనాయే అడ్డంకి

- ఐక్యరాజ్యసమితి భారత మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్
- భారత్ సొంతంగా చేసిన ఒక్క పౌరవిమానం లేదు: రష్యాలో భారత మాజీ రాయబారి బాల వెంకటేశ్ వర్మ



సాక్షి, హైదరాబాద్: ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం విషయంలో చైనా రూపంలో అతిపెద్ద సవాల్ ఎదురౌతోందని భారత మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ పేర్కొన్నారు. అందువల్ల ఈ సభ్యత్వం మనదేశానికి అంత సులభంగా వచ్చే అవకాశాలు లేవన్నారు. నగరంలోని గురుస్వామి సెంటర్‌లో శనివారం 'ఇండియాస్ ప్లేస్ ఇన్ ద ఎమర్జింగ్ వరల్డ్ ఆర్డర్–రిఫార్మ్ ఆఫ్ యూఎన్ఎస్‌సీ అండ్ మల్టీలెటరల్ ఫోరమ్స్' అనే అంశంపై నిర్వహించిన చర్చా గోష్ఠిలో ఆయన మాట్లాడారు.

ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు తీసుకురావాలన్న చర్చ.. ఆ సంస్థ ఏర్పడినప్పటి నుంచి జరుగుతోందన్నారు. కానీ భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వంతోనో, 'వీటో పవర్' వినియోగంతోనో ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు పరిమితం కాబోవని స్పష్టం చేశారు. 1980లో.. ప్రపంచంలో పదో పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉన్న భారత్.. 2075 నాటికి రెండో స్థానానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నామన్నారు. ప్రపంచంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులు చేర్పులను గమనిస్తే.. రాబోయే రోజుల్లో ఎలన్‌మస్క్ స్పేస్ ఎక్స్ సంస్థ.. ప్రయోగించే వేలాది ఉపగ్రహాల ద్వారా అనేక అంశాలపై ప్రపంచాధిపత్యాన్ని ప్రదర్శించబోతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో అన్నిదేశాలవి కలిపి 8 వేల ఉపగ్రహాలుంటే.. స్పేస్ ఎక్స్ సంస్థవే 30 వేల మేర ఉండబోతున్నాయన్నారు.

రష్యాలో భారత మాజీ రాయబారి బాల వెంకటేశ్ వర్మ మాట్లాడుతూ.. భారత్ వద్ద అణ్వాయుధాలు, మిస్సైల్స్, ఉపగ్రహాలు వంటివి ఉన్నా.. పౌరవిమానయానం కోసం సొంతంగా ఇక్కడే తయారు చేసిన ఒక్క విమానం కూడా లేదని గుర్తు చేశారు. సమన్వయకర్తగా వ్యవహరించిన ప్రముఖ ఆర్థికవేత్త, పబ్లిక్ పాలసీ నిపుణుడు మోహన్ గురుస్వామి మాట్లాడుతూ.. ఇప్పటిదాకా 68 దేశాలు మద్దతు తెలిపినా భద్రతామండలిలో భారత్ సభ్యత్వం వాస్తవరూపం దాల్చలేదన్నారు. సమావేశానికి సీనియర్ జర్నలిస్ట్ సోమశేఖర్ ములుగు అధ్యక్షత వహించారు.

ఆ మలుపులో ఎన్నో ప్రమాదాలు!

కారు చెరువులో బోల్తా పడిన ప్రదేశంలో తరచూ దుర్ఘటనలు

అసలే ఇరుకు రోడ్డు.. ప్రమాదకరంగా మలుపు.. ఆ పక్కనే చెరువు

ఇప్పటికైనా సరిదిద్దాలని గ్రామస్తుల డిమాండ్

భూదాన్ పోచంపల్లి: అసలే ఇరుకు రోడ్డు.. దానిపై ప్రమాదకరంగా మూల మలుపు.. దాని పక్కనే చెరువు.. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురంలో శనివారం కారు చెరువులో బోల్తా కొట్టిన ప్రాంతం దుస్థితి ఇది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక, పక్కనే చెరువు ఉన్నట్టు ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేక, ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు వాహనాలు చెరువులోకి దూసుకెళ్లాయి. పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇంత జరుగుతున్నా అధికారులు అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలతో నిత్యం రద్దీ ఉన్నా..

పోచంపల్లి పర్యాటక కేంద్రం, చేనేతకు ప్రసిద్ధికావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేవారు వస్తుంటారు. వాహనాల రద్దీ ఉంటుంది. అయితే ఈ రోడ్డుపై జలాల్‌పురం చెరువు కట్ట వద్దకు రాగానే ఇరువైపులా పెద్ద మూల మలుపులు ఉన్నాయి. ఇరువైపులా చెట్లు, పొదలు పెరిగి, ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చేంత వరకు సరిగా కనిపించవు. చెరువుకు రక్షణ గోడ కూడా లేదు. ఇవన్నీ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూల మలుపుల సమీపంలో సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, చెరువుకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని... చెట్లు, పొదలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై శనివారం ధర్నా కూడా చేశారు. చెరువు సమీపంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయని, ఎన్నో ప్రమాదాలు జరిగినా ఎవరికీ పట్టింపులేదని జలాల్‌పురం గ్రామానికి చెందిన పాలకూర్ల జంగయ్య మండిపడ్డారు.



జలాల్‌పురం చెరువుకట్ట వద్ద..

చెరువులోకి దూసుకెళ్తున్న వాహనాలు

- ఈ ఏడాది జూలై 17న ఇటుకల లోడుతో వెళ్తున్న లారీ మూలమలుపు వద్ద అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.
- 2023 జూలై 24న చెరువు కట్టపై పండ్ల లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా పడింది. అదే ఏడాది డిసెంబర్‌లో జరిగిన ప్రమాదంలో ప్రశాంత్ అనే యువకుడు మృతిచెందాడు.
- 2020 జూలై 24న హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌కు చెందిన జింక వంశీ, తన స్నేహితులతో కలిసి పోచంపల్లి మండలం రాంలింగంపల్లిలోని బంధువులకు పెళ్లి పత్రిక ఇవ్వడానికి వస్తుండగా... ఇదే మలుపు వద్ద కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. వంశీ మృతిచెందగా, మిగతావారు బయటపడ్డారు.
- 2020 జూన్ 26న చెరువు కట్ట మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చిన కారు, బైక్ ఢీకొన్నాయి. కారు చెరువులోకి దూసుకెళ్లింది.
- ఇక పదుల సంఖ్యలో ద్విచక్రవాహనలు అదుపుతప్పి చెరువులో పడి చాలా మంది గాయాలపాలయ్యారు.

ఉద్యమ నేతకు కన్నీటి వీడ్కోలు

రాణాపూర్‌లో మావోయిస్టు మల్లయ్య అంత్యక్రియలు

పాలకుర్తి (రామగుండం): భూమి కోసం, భుక్తి కోసం, పెత్తందారీ వ్యవస్థ నిర్మూలనకు అడవి బాటపట్టిన మావోయిస్టు నేత ఏగోళపు మల్లయ్య మూడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం ముగిసింది. వారం క్రితం ములుగు జిల్లా ఏటూరునాగారం చెల్పాక అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన మల్లయ్యకు స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్‌లో అశ్రునయనాల మధ్య కుటుంబసభ్యులు అంత్యక్రియలు పూర్తిచేశారు. విప్లవ రచయితలు, పౌరహక్కుల సంఘాల నేతలు, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు, గ్రామస్తులు సమీప పల్లెల్లోని ప్రజలు, మావోయిస్టు సానుభూతిపరులు భారీసంఖ్యలో అంత్యక్రియలకు హాజరై మృతదేహానికి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామానికి చెందిన మావోయిస్టు నేతల సమాధుల సమీపంలోనే మల్లయ్య దహన సంస్కారాలు నిర్వహించారు. ఆయన భార్య మీనాతోపాటు సోదరులు, అక్కాచెల్లెళ్లు, కుటుంబసభ్యులు కలిసి చితికి నిప్పంటించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నక్క నారాయణరావు, సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య వివిధ సంఘాల నేతలు, మావోయిస్టు సానుభూతిపరులు అధికసంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు అంతిమయాత్రను వీడియోలో చిత్రీకరించారు. కాగా, బూటకపు ఎన్‌కౌంటర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని పౌరహక్కుల సంఘాల నేతలు డిమాండ్ చేశారు.



రాణాపూర్‌లో మల్లయ్య అంతిమయాత్ర



గరుడ దళంతో గగన నిఘా!

త్వరలో తెలంగాణ పోలీస్‌లో చేరనున్న 'ఈగిల్ స్క్వాడ్'
డ్రోన్ల గుర్తింపు, గగనతలం నుంచి నిఘాపై 4 గద్దలకు శిక్షణ
ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటివద్ద ప్రయోగాత్మక పరిశీలన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి, ప్రధాని, సీఎం వంటి వీవీఐపీలు పాల్గొనే సభలు, సమావేశాలకు భద్రతా బలగాలు పటిష్ట భద్రతను కల్పిస్తాయి. మఫ్టీలో ఉండే బలగాలు అదనం. అయినా కొత్త సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లతో దాడికి అవకాశాల నేపథ్యంలో.. గగనతలం నుంచీ భద్రత కల్పించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందుకోసం తెలంగాణ పోలీసులు త్వరలో 'గరుడ దళం (ఈగిల్ స్క్వాడ్)'ను రంగంలోకి దింపనున్నారు. ఇప్పటికే 4 గద్దలకు మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనుమానాస్పద డ్రోన్లను నేలకూల్చడం, ఆకాశం నుంచి నిఘా పెట్టడంపై తర్ఫీదు ఇచ్చారు. ఇటీవలే ఈ 'గరుడ దళం' సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద డెమోను సైతం ఇచ్చింది. సుశిక్షితమైన ఈ గరుడ దళాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇది అంతర్గత భద్రత విభాగం (ఐఎస్‌డబ్ల్యూ)లో భాగంగా ఉంటూ తెలంగాణలో వీవీఐపీ రక్షణను పర్యవేక్షించనుంది.

గగనతలం నుంచి నిఘా నేత్రాలుగా..

దేశంలోనే తొలిసారిగా తెలంగాణ పోలీస్ శాఖలో గరుడ దళాన్ని ప్రవేశపెడుతున్నారు. ఈ ప్రత్యేక శిక్షణకు మూడేళ్ల క్రితమే అంకురార్పణ జరిగింది. ఎన్నో ప్రతికూల పరిస్థితుల మధ్య నాలుగు గద్దలకు విజయవంతంగా శిక్షణ ఇచ్చారు. చిన్న పక్షి పిల్లలను తెచ్చి, వాటిని పోషిస్తూ, తర్ఫీదు ఇస్తూ వచ్చారు. ఈ ప్రాజెక్టు కోసం ఇద్దరు పోలీస్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారితోపాటు కోల్‌కతా నుంచి వచ్చిన ప్రత్యేక ఇన్‌స్ట్రక్టర్‌తో గద్దలకు డ్రోన్లను నేలకూల్చడం, అనుమానాస్పద వ్యక్తులను గమనించడం తదితర అంశాల్లో శిక్షణ ఇప్పించారు. అదే సమయంలో వీటికి అమర్చిన ప్రత్యేక నిఘా కెమెరాల సాయంతో భద్రతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతారు.

అనుమానం రాకుండా...

సాధారణంగా గగనతలం నుంచి డ్రోన్లతో నిఘా పెట్టవచ్చు. కానీ డ్రోన్ల నుంచి వెలువడే శబ్దం, వాటి కదలికలను కింద ఉన్నవారు సులువుగా గుర్తించవచ్చు. దీనితో నేరస్తులు అప్రమత్తమై తప్పించుకోవడం, లేదా తాము చేసేది గమనించలేకుండా చేయడం వంటివాటికి పాల్పడే చాన్స్ ఉంటుంది. అదే గద్దల ద్వారా నిఘా పెడితే పసిగట్టడం సాధ్యం కాదు. ఈ క్రమంలోనే వీఐపీల భద్రతతోపాటు మావోయిస్టు ఆపరేషన్లకు, వారి కదలిక లను పసిగట్టేందుకు కూడా ఈ గరుడ స్క్వాడ్‌ను వాడే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అంతేగాక డ్రోన్లను ఎక్కువసేపు వినియోగించుకునే అవకాశముండదు. వాటి వేగమూతక్కువ. అదే 'గరుడ స్క్వాడ్'తో ఈ సమస్యలు ఉండవని అంటున్నారు.



శిక్షణ పొందిన గద్దలు

2040లో మన పాలిట యముళ్లు

రోజురోజుకు మారిపోతున్న టెక్నాలజీలు, కొత్తగా అందుబాటులోకి వైద్య చికిత్సలు ఒకవైపు.. మారుతున్న జీవనశైలి, కాలుష్యం వంటివి మనుషుల మరణం తీరును మార్చేస్తున్నాయి. భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాద మరణాలు, టీబీ, ఎయిడ్స్ వంటివాటితో జరిగే మరణాలు బాగా తగ్గిపోతే.. అల్జీమర్స్, కిడ్నీ వ్యాధులు, డయాబెటిస్ కారణంగా మరణాలు పెరిగిపోతాయని ఓ అధ్యయనం తేల్చింది. 2016లో నమోదైన మరణాలకు (సహజ మరణాలు కాకుండా..) కారణాలను పరిశీలించడంతో పాటు 2040లో మరణాలకు కారణమయ్యే 20 ప్రధాన అంశాలను అంచనా వేసింది. భవిష్యత్తులో గుండె జబ్బులు, మధుమేహం, వివిధ రకాల కేన్సర్లు పెరుగుతాయని... జీవన శైలిలో మార్పులు చేసుకోవడం, తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆ ముప్పును తప్పించుకోవచ్చని పేర్కొంది. సైన్స్ జర్నల్ లాన్సెట్‌లో ఈ అధ్యయన నివేదిక తాజాగా ప్రచురితమైంది.

మరణాలకు కారణమయ్యే టాప్-20 అంశాలివే..

2016లో		2040 నాటికి అంచనా
కరోనరీ డిసీజ్	1	కరోనరీ డిసీజ్
స్ట్రోక్	2	స్ట్రోక్
శ్వాస ఇన్ఫెక్షన్లు	3	శ్వాస ఇన్ఫెక్షన్లు
డయేరియా వ్యాధులు	4	సీఓపీడీ (క్రానిక్ పల్మనరీ)
రోడ్డు ప్రమాదాలు	5	క్రానిక్ కిడ్నీ డిసీజ్
మలేరియా	6	అల్జీమర్స్ (మెదడు దెబ్బతినడం)
గర్భస్థ శిశు మృతి	7	మధుమేహం
హెచ్ఐవీ/ఎయిడ్స్	8	రోడ్డు ప్రమాదాలు
సీఓపీడీ (క్రానిక్ పల్మనరీ)	9	లంగ్ కేన్సర్
పుట్టుకతోనే మెదడువాపు	10	డయేరియా వ్యాధులు
టీబీ	11	ఆత్మహత్య
పుట్టుకతోనే ఉన్న లోపాలు	12	హెచ్ఐవీ/ఎయిడ్స్
ఊపిరితిత్తుల కేన్సర్	13	లివర్ కేన్సర్
ఆత్మహత్య	14	హెచ్‌హెచ్‌డీ
మధుమేహం	15	కోలోరెక్టల్ కేన్సర్
క్రానిక్ కిడ్నీ డిసీజ్	16	టీబీ
పుట్టుకతోనే వచ్చే ఇతర సమస్యలు	17	పుట్టుకతోనే ఉన్న లోపాలు
అల్జీమర్స్ (మెదడు దెబ్బతినడం)	18	గర్భస్థ శిశు మరణాలు
శిశువులకు వచ్చే సెప్సిస్	19	రొమ్ము కేన్సర్
లివర్ కేన్సర్	20	ఎత్తు నుంచి పడిపోయి జరిగే ప్రమాదాలు

నిరాడంబరమూర్తి.. ఉద్యమస్ఫూర్తి

భావితరాలకు ఆమే అభయహస్తం..
బహుజనుల పోరాట పిడికిళ్లే విగ్రహ పీఠం
'సాక్షి'తో నూతన తెలంగాణ తల్లి విగ్రహ రూపకర్త ప్రొఫెసర్ గంగాధర్, కాంస్య విగ్రహ రూపశిల్పి ఎం.వి.రమణారెడ్డి
పాత, కొత్త విగ్రహాల్లో ఉన్న తేడాల గురించి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: నూతన తెలంగాణ తల్లి విగ్రహం నిరాడంబరతకు, తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొన్న సాధారణ మహిళకు ప్రతీక అని విగ్రహ రూపకర్త ప్రొఫెసర్ గంగాధర్, కాంస్య విగ్రహ రూపశిల్పి ఎం.వి.రమణారెడ్డి అభిప్రాయపడ్డారు. ఆకుపచ్చ చీర ధరించి కొంగు నడుముకు చుట్టి పోరాట పటిమను సమున్నతంగా ఆవిష్కరిస్తున్న మాతృమూర్తిగా అభివర్ణించారు. భావితరాలకు భరోసా ఇచ్చేలా అభయహస్తంతో దర్శనమిచ్చే నిరాడంబరమూర్తి తెలంగాణ తల్లి అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు సిద్ధం కావడం తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. పాత, కొత్త తెలంగాణ తల్లి విగ్రహాల రూపకర్త ప్రొఫెసర్ గంగాధరే కావడం విశేషం. ఈ నేపథ్యంలో కొత్త విగ్రహం విశేషాలతోపాటు గతంలో రూపొందిన విగ్రహం వెనుక ఉన్న ఆంతర్యాన్ని ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. ఒక చిత్రకారుడిగా, శిల్పిగా తన కర్తవ్యాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఏ శిల్పాన్నైనా, చిత్రాన్నైనా కళాత్మకత, సౌందర్యాత్మక దృష్టితో వీక్షించాలని కోరారు. ఆ నాటి శిల్పం ఆడంబరానికి రూపమైతే నేటి శిల్పం నిరాడంబరతకు నిదర్శమన్నారు.

సాధారణ తెలంగాణ మహిళ...

'తెలంగాణ తల్లి విగ్రహం ఎలా ఉండాలనే అంశంపై సుమారు 3 నెలలపాటు విస్తృతమైన, లోతైన చర్చ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు దఫాలు చర్చించి తెలంగాణలోని ఒక సాధారణ మహిళను ప్రతిబింబించేలా విగ్రహం ఉండాలని చెప్పారు. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఎందరో ఉద్యమకారులు అమరులయ్యారు. బహుజనులు, సబ్బండవర్గాల ప్రజలు ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ప్రజలందరి భాగస్వామ్యాన్ని చాటే విధంగా విగ్రహం ఉండాలనే లక్ష్యంతో ఈ విగ్రహానికి రూపకల్పన చేశాం. ఒక సాధారణ తెలంగాణ తల్లి ఉద్యమంలో పాల్గొంటే ఎలా ఉంటుందో విగ్రహం కూడా అలాగే ఉంటుంది'అని గంగాధర్ చెప్పారు.

ఏ పండుగనూ ప్రత్యేకంగా భావించలేదు

తెలంగాణలో అన్ని పండుగలకు ఎంతో విశిష్టత ఉంది. బతుకమ్మ, బోనాలు, మేడారం, సదర్ ఉత్సవాల వంటివన్నీ ముఖ్యమైనవే. అందుకే ఏ పండుగను ప్రత్యేకంగా భావించ లేదు. అందుకనుగుణంగానే విగ్రహాన్ని తీర్చిదిద్దాం. మరోవైపు అన్ని రకాల మతాలు, నమ్మ కాలను ప్రతిబింబించేలా విగ్రహం ఉంది'అని గంగాధర్ పేర్కొన్నారు. ఒక కళాకారుడిగా అప్పటి విగ్రహం, ఇప్పటి విగ్రహంపై తాను ఎలాంటి వ్యాఖ్యానం చేయబోనని, ఎవరు ఏవిధంగానైనా అర్థం చేసుకోవచ్చన్నారు.

అది పిడికిళ్లెత్తిన పోరాట పీఠం...

'కోటి గొంతుకలు ఒక్కటై జై తెలంగాణ నినాదాలు చేశాయి. కోట్లాది చేతులు పిడికిళ్లెత్తి కదిలాయి. తొలి, మలిదశ ఉద్యమాల్లో కలసి వచ్చిన అన్ని వర్గాల పిడికిళ్లే తెలంగాణ తల్లి విగ్రహానికి పీఠంగా రూపొందించా. ఆ పోరాట పిడికిళ్లే తెలంగాణ తల్లిని రక్షిస్తాయి. అవే పోరాడి సాధించుకున్న తెలంగాణను ప్రతిబింబిస్తాయి. అందుకే ఆ పిడికిళ్ల పీఠంపై తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించా'అని గంగాధర్ వివరించారు.

తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు నాడు, నేడు ఇలా..

నాడు..



- భరతమాతను ప్రతిబింబించేలా విగ్రహం
- తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన బతుకమ్మలా దేవతా రూపం
- తలపై కిరీటం, మెడలో కంటె, బంగారు హారం, నడుముకు వడ్డాణం,
- జరీ అంచు గులాబీ పట్టుచీర, బంగారు గాజులు, వెండి మెట్టెలు
- ఎడమ చేతిలో బతుకమ్మ, కుడిచేతిలో మొక్కజొన్న కంకులు

నేడు..



- ఆకుపచ్చ తెలంగాణను ప్రతిబింబించేలా విగ్రహం
- సాధారణ మాతృమూర్తిలా, తెలంగాణ ఉద్యమంలో నడుంబిగించిన మహిళలా రూపం
- మెడలో కంటె, బంగారు గొలుసు, చేతికి ఆకుపచ్చ గాజులు, కాళ్లకు పట్టీలు, మెట్టెలు
- ఎడమ చేతిలో వరి, జొన్న, మొక్కజొన్న కంకులు, కుడి చేత్తో అభయహస్తం, కొంగుముడితో ఆకుపచ్చని చీర
- తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో సబ్బండవర్గాల భాగస్వామ్యానికి గుర్తుగా విగ్రహ పీఠంలో పిడికిళ్లు

నాటి విగ్రహం భరతమాతలా ఉండాలని కేసీఆర్ చెప్పారు



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని చిత్రీకరించే సమయంలో భరతమాతను ప్రతిబింబించే విధంగా ఉండాలని అప్పటి సీఎం కేసీఆర్ చెప్పారని ప్రొఫెసర్ గంగాధర్ పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా బతుకమ్మను చిత్రీకరించాలని సూచించారని గుర్తుచేసుకున్నారు. ఆయన సూచన మేరకు కిరీటంతో ఎంతో ఆడంబరమైన విగ్రహాన్ని రూపొందించినట్లు వివరించారు.


అభయహస్తం ఎందుకంటే: రమణారెడ్డి



'భావితరాలకు అది భరోసా. దాన్ని కాంగ్రెస్ గుర్తుగానో, మరొకటిగానో భావించడానికి వీల్లేదు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి, భద్రతకు, హామీ ఉంటుందనే భావన మాత్రమే. ఇది ప్రజల తెలంగాణ, ఏ ఒక్క పార్టీకి చెందిన తెలంగాణ కాదు. రాజకీయ కోణంలో విగ్రహాన్ని చూడొద్దు'అని రమణారెడ్డి కోరారు. దేవతామూర్తికి సాధారణంగా గుడులు, గోపురాలు ఉంటే మాతృమూర్తి ప్రజల మధ్యనే ఉంటుందన్నారు. కన్నతల్లితో మమేకమైనట్లుగానే తెలంగాణ తల్లితో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని ఎం.వి.రమణారెడ్డి కోరారు. కళాత్మక దృష్టితో మాత్రమే విగ్రహాన్ని చూడాలని సూచించారు.

రేపు చలో అసెంబ్లీకి సర్పంచుల జేఏసీ పిలుపు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతి



సాక్షి, హైదరాబాద్: శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈనెల 9న చలో అసెంబ్లీకి తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపునిచ్చింది. గ్రామాల అభివృద్ధి నిమిత్తం సర్పంచ్ లుగా తాము సొంత డబ్బుతో పాటు అప్పులు చేసి మరీ చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడం సరికాదని తెలిపింది. ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతి పత్రాలు అందిస్తామని జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ వెల్లడించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమ సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలకు రావాల్సిన పెండింగ్ నిధులు చెల్లించాలని కోరతామ న్నారు. ఏడాది నుంచి బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే, ఏడాది పాలన ఉత్సవాలు జరుపుకుంటున్నారని మండిపడ్డారు. తమ పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే గ్రామాల్లో ఎమ్మెల్యేలను తిరగనివ్వమన్నారు. తమ నిరసనలను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం గన్ పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కేశబోయిన మల్లయ్య, జూకంటి బాల స్వామి, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. పుష్పయాగం



జాజులు, సంపెంగలు, తామరలు, కలువలు, మల్లెలు, పారిజాతాలు, చేమంతులు, గన్నేరు, నందివర్ధనాలు, మందారాలు, దేవదారు, పొగడలు, సురపొన్నలు, మొగిలిరేకులు తదితర సుగంధాలు వెదజల్లే 4 టన్నుల పుష్పాలు, మరువం, దవనం, బిల్వం, తులసి, కదిరిపచ్చ, పన్నీరు పత్రా లతో తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి శనివారం పుష్పార్చన చేశారు. నేత్ర పర్వంగా జరిగిన ఈ పుష్పయాగాన్ని భక్తులు వీక్షించి తరించారు. ఇటీవల జరిగిన కార్తీక బ్రహ్మోత్సవాల్లో తెలిసీ, తెలియక జరిగిని దోషాల ప్రాయశ్చిత్తం కోసం టీటీడీ పుష్పయాగం నిర్వహించింది. – చంద్రగిరి

ఈ 'భీష్మ' ధర పంతొమ్మిది లక్షలు



ఒంగోలు జాతికి చెందిన ఈ గిత్త పేరు భీష్మ. బరిలో దిగితే ప్రత్యర్థి బలాదూర్. బండలాగుడులో దీనికి సాటి మరోటి లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటూ పలు ఇతర రాష్ట్రాల్లో జరిగిన బండలాగుడు పోటీల్లో పతకాల పంట పండించింది. పల్నాడు జిల్లా, నాదెండ్ల గ్రామానికి చెందిన పశుపోషకులు దేవభక్తుని నరేంద్రబాబు, శేఖర్ దీన్ని పెంచుతున్నారు. ఆరు పళ్ల విభాగం, న్యూ కేటగిరి, బండలాగుడు పోటీల్లో ఎన్నో బహుమతులు కైవసం చేసుకుంది. ప్రస్తుతం సబ్ జూనియర్ సైజులో ఉన్న గిత్తను రూ.19,01,116కు అనంతపురం జిల్లా ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన రైతు షేక్ మహబూబ్ బాషా కొనుగోలు చేశారు. శనివారం గిత్తను తన స్వగ్రామానికి తీసుకెళ్లారు. – నాదెండ్ల

తెలంగాణ తల్లి విగ్రహ మార్పును ఆపండి..



రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాలను మార్చకుండా ప్రభుత్వాన్ని ఆదేశించండి
రూ. 150 కోట్ల ప్రజాధనం వృథాను నివారించండి
హైకోర్టులో ప్రముఖ రచయిత జూలూరి గౌరీశంకర్ పిల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలను మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల రూ. 150 కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని ప్రముఖ రచయిత జూలూరి గౌరీశంకర్ పేర్కొన్నారు. అందువల్ల ఆ విగ్రహాలను మార్చకుండా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ప్రస్తుత తెలంగాణ తల్లి విగ్రహం ఉందని ఆయన ఆక్షేపించారు. విగ్రహాల మార్పు అనవసర భారాన్ని మోపుతుంది. ప్రజాధనాన్ని ప్రజా ప్రయోజనం లేని వాటిపై ఖర్చు చేయడం ఆమోదనీయం కాదని అభిప్రాయపడ్డారు.విగ్రహాల మార్పు కోసం కేటాయిస్తున్న రూ. 150 కోట్లను ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయవచ్చని సూచించారు.

ప్రభుత్వ నిర్ణయం రాజకీయ ప్రేరేపితం..

'కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం రాజకీయ ప్రేరేపితం. డిసెంబర్ 9 కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ జన్మదినం అయినందున ఆమెను ప్రసన్నం చేసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. విగ్రహాల తొలగింపు ప్రతీకార రాజకీయం. ఈ నేపథ్యంలో విగ్రహాల మార్పును అడ్డుకొని ప్రజాధనం వృథాను అరికట్టాలి' అని జూలూరి తన పిటిషన్‌లో కోరారు.

రేపు విచారణకు అవకాశం..

ఈ పిల్‌కు కోర్టు రిజిస్ట్రీ రెగ్యులర్ నంబర్ కేటాయిస్తే ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టే అవకాశం ఉంది. పిటిషనర్ తరఫు న్యాయవాది 9న సీజే ధర్మాసనం ముందు మెన్షన్ చేసే అవకాశం ఉంది. మరోవైపు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కాంట్రాక్టు పనులను నామినేషన్ ప్రాతిపదికన ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ నగేశ్ భీమపాక కొట్టేశారు.

వేటకొడవళ్లతో శునకాన్ని నరికి చంపారు..

- తిరుపతి నగరంలో దారుణం
- మొరుగుతోందంటూ మూగజీవి ప్రాణం తీశారు..
- కన్నీటిపర్యంతమవుతున్న యజమాని
- ఫిర్యాదు చేసేందుకు వెళితే.. కుక్క తల్లిదండ్రులు ఎవరంటూ పోలీసుల వెటకారం



విలపిస్తున్న లావణ్య

తిరుపతి క్రైం: తిరుపతి నగరంలోని ఫిష్ మార్కెట్ ఎదురుగా ఉన్న స్కావెంజర్స్ కాలనీలో ఓ పెంపుడు శునకాన్ని అదే కాలనీకి చెందిన ఇద్దరు వేటకొడవళ్లతో అతి కిరాతకంగా నరికి చంపేశారు. కాలనీలో నివాసముంటున్న లావణ్య కొన్నేళ్లుగా శునకాన్ని పెంచుకుంటోంది. శుక్రవారం తిరుచానూరు పంచమి సందర్భంగా ఆమె గుడికి వెళుతూ శునకాన్ని ఇంటి వద్దే వదిలి వెళ్లింది. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన ఇద్దరు వేటకొడవళ్లతో ఆ మూగజీవి ప్రాణం తీశారు. రోడ్డుపై వెళుతున్న వారిని చూసి శునకం మొరిగిందన్న నెపంతో శివకుమార్, సాయిలు దారుణంగా హత్య చేశారని లావణ్య భోరున విలపించారు. దీనిపై ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా కుక్కకు తల్లిదండ్రులు ఎవరు? వారి పేర్లేంటి? అంటూ పోలీసులు వెటకారంగా మాట్లాడారని కన్నీటిపర్యంతమయ్యారు. మూగజీవులు, పెంపుడు జంతువులపై పైశాచికత్వాన్ని ప్రదర్శించిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

'దేవుడి మనిషి' అంబులెన్స్ ఎత్తుకెళ్లాడు!

- 60 కిలోమీటర్ల వరకు పోలీసుల చేజింగ్
- చిట్యాల వద్ద ఏఎస్ఐని ఢీకొట్టిన మతిస్థిమితం లేని వ్యక్తి
- సూర్యాపేట జిల్లా టేకుమట్ల వద్ద పట్టుకున్న పోలీసులు



నిందితుడు చోరీ చేసిన అంబులెన్స్. (ఇన్‌సెట్)లో పట్టుబడిన రావుల వెంకటనర్సయ్య

కేతేపల్లి/బయ్యారం: తనకుతాను దేవుని బిడ్డగా చెప్పుకుంటూ మతిస్థిమితం లేకుండా తిరిగే ఓ వ్యక్తి అంబులెన్స్ వాహనాన్ని దొంగలించి హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై హల్‌చల్ చేశాడు. నల్లగొండ జిల్లా కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారానికి చెందిన రావుల వెంకటనర్సయ్య అలియాస్ కాలభైరవుడు (57) హైదరాబాద్‌లోని హయత్‌నగర్ రంగనాయకులగుట్టలో ఉంటూ చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రి ముందున్న 108 అంబులెన్స్‌ను చోరీ చేసి విజయవాడ వైపు బయలుదేరాడు. గమనించిన సిబ్బంది హయత్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో హయత్‌నగర్ పోలీస్ సిబ్బంది హైవేపై ఉన్న పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించి అలర్ట్ చేశారు. హయత్‌నగర్ నుంచి సూర్యా పేట జిల్లా టేకుమట్ల వరకు అంబులెన్స్ నడిపిన వ్యక్తి.. సైరన్‌తో రయ్‌రయ్‌మంటూ అతివేగంగా వెళ్తూ.. చిట్యాల వద్ద అంబులెన్స్ అడ్డుకునేందుకు వచ్చిన ఏఎస్ఐ జాన్‌రెడ్డిని ఢీకొట్టి పారిపోయాడు. తీవ్రగాయాలైన జాన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో పోలీస్ సిబ్బంది ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కేతేపల్లి పోలీసులు కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద బారికేడ్స్ అడ్డుగా పెట్టగా.. గమనించిన దొంగ రాంగ్ రూట్‌లో వెళ్లి గేటును ఢీకొట్టి టోల్‌ప్లాజా దాటి వెళ్లాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అంబులెన్స్ వాహనాన్ని క్రాస్‌చేసి టేకుమట్ల బ్రిడ్జి అవతల ఉన్న డివైడర్ వద్ద హైవేకు అడ్డంగా లారీలను పెట్టారు. లారీలను, పోలీసు సిబ్బందిని చూసిన దొంగ.. అంబులెన్స్‌ను హైవే పక్కకు నడిపాడు. దీంతో వాహనం రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. వెంటనే పోలీసులు దొంగను అదుపులోకి తీసుకొని కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో నిందితుడికి స్వల్ప గాయాలయ్యాయి. వెంకటనర్సయ్యపై గతంలో పలు చోరీ కేసులు ఉన్నాయని.. అతడిని హయత్‌నగర్ పోలీసులకు అప్పగించామని ఎస్ఐ శివతేజ తెలిపారు. ఇదిలా ఉండగా అంబులెన్స్ చోరికి ముందు పోలీస్టేషన్ సమీపంలో పార్క్ చేసిన పోలీసు వాహనం 4 టైర్లలో గాలి తీసేసినట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో కూడా కాలభైరవుడు ఇలాగే అంబులెన్స్‌ను చోరీ చేసినట్లు సమాచారం. అంబులెన్స్ డ్రైవర్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దేవుడి మనిషిగా చెప్పుకుంటూ...

రావుల వెంకటనర్సయ్యది మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని లక్ష్మీనర్సింహాపురం గ్రామం. ఇతను మొదటినుంచీ వివాదాస్పదుడే. పదేళ్ల క్రితం వరకూ ఆయుర్వేద మందులు విక్రయించేవాడు. ఆ తరువాత తనకు తానే దేవుని బిడ్డ కాలభైరవుడిగా చెప్పుకుంటూ మతిస్థిమితం లేకుండా వ్యవహరించేవాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో పార్క్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లి పెట్రోల్ అయిపోయాక అక్కడే వదిలిపెట్టి వచ్చేవాడు. డయల్ 100కు వెంకటనర్సయ్య తరచూ ఫోన్ చేసేవాడని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతడి కుటుంబ సభ్యులు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లారు.

దొంగతనం నెపంతో ఇద్దరు మహిళలపై దాష్టీకం

స్తంభానికి కట్టేసి కొట్టిన దంపతులు

మహబూబాబాద్ రూరల్: దొంగతనం చేశారని ఆరోపిస్తూ ఇద్దరు మహిళలను సిమెంటు స్తంభానికి కట్టేసి కొట్టారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఉత్తర తండా జీపీ పరిధిలోని నేతాజీ తండాలో శనివారం చోటు చేసు కుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబా బాద్ మండలం నేతా జీ తండాకు చెందిన గుగులోత్ వీరన్న, సాలి దంపతులు కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. లక్ష్మి, కమ్లీ అనే ఇద్దరు అదే తండావాసులు దుకాణంలో రూ.15 వేలు నగదు ఎత్తుకెళ్లారని అనుమానిస్తూ వారిని వీరన్న, సాలి సిమెంటు స్తంభానికి కట్టేసి కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. గాయపడిన వారిలో కమ్లీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరన్న, సాలిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వెళ్లినంత తేలిక కాదు..
వెనక్కి రావడం

- బస్తర్ జంగిల్‌లో జనతన సర్కార్ స్థాపన
- ప్రత్యేక రాష్ట్రం వచ్చాక తెలంగాణలో పట్టుకు యత్నాలు
- అయినా ఫలించని మావోయిస్టుల ప్రయత్నాలు

వరంగల్ మీదుగా బస్తర్‌లోకి మావోయిస్టులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:

మావోయిస్టు పార్టీ సైన్యంగా పేర్కొనే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) 24వ వారోత్సవాలు ఈనెల 8తో ముగియనున్నాయి. ఒకప్పుడు పీఎల్‌జీఏ వారోత్సవాలంటే ఉత్తర తెలంగాణ పల్లెల్లో ఉద్రిక్తత నెలకొనేది. ఒకవైపు పటిష్ట పోలీసు నిఘా, మరోవైపు ఆ నిఘా నేత్రాల కళ్లుగప్పి మావోయిస్టులకు మద్దతు పలికేవారు కనిపించేవారు. ఇప్పుడా పరిస్థితిలో మార్పు వచ్చింది. పదేళ్లుగా తెలంగాణపై పట్టు కోసం మావోయిస్టులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. తెలంగాణ నుంచి బస్తర్ వెళ్లిన మావోయిస్టులు.. తిరిగి తెలంగాణలో ప్రభావం చూపించేందుకు చేస్తున్న ప్రయత్నాలు కష్టతరమవుతున్నాయి.


మావోయిస్టుల దాడిలో తునాతునకలైన వాహనం (ఫైల్)

బస్తర్ వైపు అడుగులు

శ్రీకాకుళం జిల్లాలో మొదలైన నక్సల్బరీ ఉద్యమం 80వ దశకంలో ఉత్తర తెలంగాణ జిల్లాలను ఊపు ఊపింది. అప్పటి ప్రభుత్వాలపై అసంతృప్తితో ఉన్న జనాలు అన్నలకు అండగా నిలిచారు. యువకులు అడవుల బాట పట్టేందుకు ఉత్సాహం చూపారు. వందలు, వేలుగా వస్తున్న యువతరానికి దళాలుగా శిక్షణ ఇస్తూ భవిష్యత్ లక్ష్యాల దృష్ట్యా తెలంగాణ సరిహద్దులో ఉన్న బస్తర్ అడవులకు పీపుల్స్‌వార్ గ్రూపు పంపింది. జనతన సర్కార్ పేరుతో బస్తర్‌లో అన్నలు సమాంతర పాలన స్థాపించారు. దీంతో మావోయిస్టుల దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను 2009లో కేంద్రం చేపట్టింది. పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, డీఆర్‌జీ, కోబ్రా దళాలు నలువైపులా బస్తర్ అడవులను జల్లెడ పడుతున్నాయి. దీంతో మావోయిస్టులకు కొత్త స్థావరం అవసరమైంది.

తెలంగాణ వైపు..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా వస్తే మావోయిస్టులు పాగా వేస్తారంటూ ఆంధ్రప్రదేశ్ విభజనపై కేంద్రం నియమించిన శ్రీకృష్ణ కమిటీ అభిప్రాయపడింది. అందుకు తగినట్టుగానే తెలంగాణ వచ్చాక మావోయిస్టులు ఇటువైపు దృష్టి సారించారు. ఈ క్రమాన తొలి ఎన్‌కౌంటర్ భద్రాచలం సమీపాన ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పరిధిలో 2015 జూన్ 15న జరిగింది. ఆ తర్వాత అప్పటి వరంగల్ జిల్లా ములుగులో మావోయిస్టుల పేరుతో కరపత్రాలు, బ్యానర్లు రావడం మొదలైంది. అనంతరం నిర్మాణ పనుల్లో ఉన్న భారీ యంత్రాలను మావోయిస్టులు తగలబెట్టారు. ముందుగా తమ ఉనికి చాటుకుని.. ఆ తర్వాత దాన్ని సుస్థిరం చేసుకునే యత్నంలో ఉండగా 2015 సెప్టెంబర్ 15న గోవిందరావుపేట మండలం రంగాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. దీంతో ఇక్కడ మావోయిస్టుల కదలికలు నెమ్మదించాయి.

పదేళ్లలో 98 మంది..

తెలంగాణ వచ్చాక 2015లో జరిగిన రంగాపూర్ ఎన్‌కౌంటర్ మొదలు నిన్నమొన్నటి కరకగూడెం, ఏటూరునాగారం ఎన్‌కౌంటర్ల వరకు మొత్తం 98 మంది మావోయిస్టులు చనిపోయారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 44 సార్లు మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. పట్టుమని ఆరు నెలలు కూడా దళాలు ఇక్కడ ఆయుధాలతో సంచరించే పరిస్థితి లేదు. పోలీసుల నిఘా పటిష్టంగా ఉండడం ఒక కారణమైతే.. ఏజెన్సీలు, అడవి సమీప గ్రామాల ప్రజల నుంచి గతంలో లభించిన స్థాయిలో మావోయిస్టులకు ఇప్పుడు మద్దతు దొరకడం లేదు. ఫలితంగా తెలంగాణలోకి చొచ్చుకుని వచ్చేందుకు ప్రయత్నించిన ప్రతీసారి మావోయిస్టులకు ఎదురుదెబ్బలే తగులుతున్నాయి. దీనికి తోడు వారు కోవర్టుల పేరుతో సృష్టిస్తున్న రక్తపాతం మరింత చేటు తెచ్చింది. చివరకు మావోయిస్టులు తమ గ్రామాల వైపు రావొద్దంటూ ప్రజలు ర్యాలీలు నిర్వహించే పరిస్థితి ఏర్పడింది.

కాళేశ్వరం మీదుగా..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు 2016లో మొదలైన తర్వాత రెండు రాష్ట్ర సరిహద్దులో మావోయిస్టుల కార్యకలాపాలు పెరిగాయి. ఈ నేపథ్యాన ముందుగా మావోయిస్టు సానుభూతిపరులు, ఆ తర్వాత దళాలు మహదేవపూర్ అడవుల్లోకి రాకపోకలు సాగించడం మొదలైంది. అయితే, మహదేవపూర్ - ఏటూరునాగారం ఏరియా పరిధిలో పెద్దగా హింసాత్మక ఘటనలు మాత్రం చోటు చేసుకోలేదు. కానీ, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా జిల్లాలతో సరిహద్దు పంచుకుంటున్న వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో తరచూ కరపత్రాలు పంచడం, మందుపాతరలను అమర్చడం వంటివి చేస్తూ వచ్చారు. ఈ క్రమాన 2017 డిసెంబర్ 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు, ఆ తర్వాత 2020 సెప్టెంబర్‌లో చర్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృతి చెందారు.



అడవిలో కవాతు చేస్తున్న మావోయిస్టులు (ఫైల్)

వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవాలకు పూర్తి సహకారం

వీసీ జానయ్యకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హామీ



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం ఆయన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యతో సమావేశమయ్యారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అపార అనుభవం ఉన్న బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా నియమించడం అభినందనీయమని ప్రకాశ్‌గౌడ్ అన్నారు. వీసీ జానయ్య, రిజిస్ట్రార్ డి.శివాజీ ఇతర విశ్వవిద్యాలయ అధికారులతో ఆయన పలు అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించి, తెలంగాణ పేరును విశ్వవ్యాప్తం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. విశ్వవిద్యాలయం భూములు, ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. భూముల రక్షణకు ప్రహరీ గోడలను నిర్మించాలన్నారు. కాగా, ఈ నెలలో నిర్వహించనున్న వజ్రోత్సవాల గురించి వివరించి, వేడుకలకు హాజరుకావాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను వీసీ జానయ్య ఆహ్వానించారు. అదేవిధంగా వజ్రోత్సవ పైలాన్ ఏర్పాటుకు అవసరమయ్యే సుమారు 30 లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. ఆ మొత్తాన్ని తన శాసనసభ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మంజూరు చేస్తానని ప్రకాశ్‌గౌడ్ హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ కార్యకర్తను హతమార్చిన మావోలు


మావోయిస్టుల చేతిలో హతమైన లక్ష్మి మృతదేహం

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తోందనే కారణంతో మావోయిస్టులు ఓ అంగన్‌వాడీ కార్యకర్తను దారుణంగా హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. తిమ్మాపూర్‌లో పద్దం లక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తోంది. శుక్రవారం రాత్రి 8 గంటలకు ఆమె ఇంటికి వచ్చిన ఐదుగురు మావోయిస్టులు.. లక్ష్మిని బయటకు పిలిచి కర్రలతో కొట్టారు. దీనికి ఆమె కుమారుడు అడ్డు రాగా అతడిని పక్కకు నెట్టేసి లక్ష్మిని కత్తులతో పొడిచారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష్మి పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తుండటంతో గతంలో రెండు సార్లు హెచ్చరించినా ఖాతరు చేయలేదని, అందుకే హతమార్చామని మావోయిస్టు పార్టీ బాసగూడ ఏరియా కమిటీ పేరిట లేఖ వదిలారు.

మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పోలీసు బలగాలు మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను గుర్తించాయి. నారాయణపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ, బీఎస్‌ఎఫ్ బలగాలు శనివారం చేపట్టిన కూంబింగ్‌లో వాలా – గంగూర్ మధ్య ఈ డంప్ లభ్యమైంది. ఇందులో తుపాకుల తయారీకి వినియోగించే లేత్ మిషన్, గ్యాస్ వెల్డింగ్ మిషన్లు, సిలిండర్లు, డిటోనేటర్లు, సోలార్ ప్లేట్లు, డీజిల్ టిన్నులు, మావోయిస్టుల యూనిఫాంలు, నిత్యావసర వస్తువులను గుర్తించారు. ఈ తరహాలో డంప్ లభించడం ఇదే తొలిసారి కాగా, మరిన్ని డంప్‌లు ఉండొచ్చనే అనుమానంతో తనిఖీలు విస్తృతం చేసినట్లు నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్‌కుమార్ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లు

అన్ని వైద్య కళాశాలల్లో
ఏఆర్‌టీ కేంద్రాలు

ఆదేశాలు జారీ చేసిన జాతీయ వైద్య కమిషన్

- ప్రస్తుతం రాష్ట్రంలో 22 కేంద్రాలు.. త్వరలో మరో 34 సెంటర్లు అందుబాటులోకి..
- ఇకపై హెచ్‌ఐవీ పరీక్షలు, బాధితులకు నెలవారీ మందులు సులభం

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులను గుర్తించడంతోపాటు వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించేందుకు రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) కేంద్రాలను ఏర్పాటు చేయాలని జాతీయ వైద్య కమిషన్ ఇటీవల ఆదేశించింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం తొలుత కొత్తగా ఏర్పాటు చేసిన అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఏఆర్‌టీ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

దీంతో ఇప్పుడున్న 22 కేంద్రాలకు అదనంగా మరో 34 ఏఆర్‌టీ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. వాస్తవానికి ఉస్మానియా, గాంధీ, కింగ్‌కోఠి ఆస్పత్రులతోపాటు రాష్ట్రంలోని 22 ఏఆర్‌టీ కేంద్రాల్లో హెచ్‌ఐవీ పరీక్షలతోపాటు బాధితులకు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రతి నెలా మందులు అందించే ఏర్పాట్లు చేస్తోంది. అయితే 33 జిల్లాల్లో పరీక్షల నిర్వహణ, హెచ్‌ఐవీ బాధితులకు సకాలంలో మందుల సరఫరా ఇబ్బందిగా మారుతుండటంతో వైద్య కళాశాలల్లో ఏఆర్‌టీ కేంద్రాల ఏర్పాటుకు జాతీయ వైద్య కమిషన్ ఆదేశించింది.



ఏడు నెలల్లో 9.56 లక్షల మందికి హెచ్‌ఐవీ పరీక్షలు..

రాష్ట్రంలో ప్రస్తుతం 1.20 లక్షల మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులు ఉండగా ఏఆర్‌టీ కేంద్రాల్లో 1.04 లక్షల మంది క్రమం తప్పకుండా మందులు తీసుకుంటున్నారు. మరోవైపు ఈ ఏడాది ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు నెలల్లో 9.56 లక్షల మందికి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించగా మొత్తంగా 5,363 మంది హెచ్‌ఐవీ బారినపడ్డట్లు గుర్తించారు. అయితే గత ఆర్థిక సంవత్సరంలో 20 లక్షలకుపైగా పరీక్షలు నిర్వహించగా అందులో 11,806 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో 33 జిల్లాల్లో పరీక్షల సంఖ్యను పెంచాలని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్ణయించింది. ఇప్పుడు 22 ఏఆర్‌టీ సెంటర్లలో జరుగుతున్న పరీక్షలు ఇకపై వైద్య కళాశాలల్లోనూ జరిగే అవకాశం ఉండటంతో హెచ్‌ఐవీ కేసుల సంఖ్య పెరగొచ్చని భావిస్తున్నారు. అలాగే పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్న హైదరాబాద్‌తోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో పరీక్షల సంఖ్యను ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మరింత పెంచనుంది.

చేతులెత్తేసిన పీహెచ్‌సీలు, టీడీ హబ్‌లు

గతంలో అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లో ర్యాపిడ్ కిట్లతో హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించి తుది నిర్ణయం కోసం ఏఆర్‌టీ కేంద్రాలకు పంపేవారు. అయితే గత కొన్నాళ్లుగా ఈ కేంద్రాల్లో హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించట్లేదు. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్ ల్యాబ్స్ (టీడీ హబ్స్)లలో కూడా పరీక్షల ఊసేలేదు. ఈ నేపథ్యంలో టీడీ హబ్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో కూడా ర్యాపిడ్ కిట్లతో పరీక్షలు చేయాలని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వైద్యారోగ్య శాఖకు లేఖ రాసింది.

వారంతా డైరెక్టర్లుగా అనర్హులే..

'సత్యం'కు సంబంధించిన కేసులో ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: గతంలో సత్యం, మేటాస్ సంస్థల్లో డైరెక్టర్లుగా ఉన్న వారిలో కొందరు ఇతర కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉండటానికి అర్హులేనని జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) స్పష్టం చేసింది. కంపెనీల చట్టం, 1956లోని నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని చూపడంలో కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విఫలమైందని పేర్కొంది.

అందుకే ప్రతివాదులు ఏ ఇతర కంపెనీలో డైరెక్టర్‌గా కొనసాగడానికి అనుమతించకూడదంటూ కేంద్రం కేసు నమోదు చేయలేదని వ్యాఖ్యానిస్తూ, పిటిషన్లలో విచారణ ముగించింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ సత్యం షేర్లలో వ్యాపారం చేయడానికి రాజు డమ్మీ ఖాతాలను ఉపయోగించారు. నిధులను పక్కదారి పట్టించేందుకు ఈ ఖాతాలే కారణమని ఆరోపణలున్నాయి. కంపెనీ నగదు నిల్వలను రూ.7 వేల కోట్లకు పెంచినట్లు ఆయన అంగీకరించారు. జనవరి, 2009న సత్యం బోర్డు నుంచి రాజీనామా చేశారు. అదే సంవత్సరం వేలం ప్రక్రియలో సత్యం కంపెనీని టెక్ మహీంద్రా గెలుచుకుంది. తర్వాత మహీంద్రా సత్యంగా పేరు మార్చింది. అయితే నాటి సత్యం, మేటాస్‌లో డైరెక్టర్లుగా ఉన్న వారు ఇప్పుడు పలు కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉండటాన్ని సవాల్ చేస్తూ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్లు దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై డాక్టర్ వెంకటరామకృష్ణ బద్రీనాథ్ నందుల (జ్యుడీషియల్), చరణ్‌సింగ్ (టెక్నికల్) విచారణ చేపట్టి ఉత్తర్వులు జారీ చేశారు.


ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న తెలంగాణ సచివాలయం

క్లుప్తంగా...

కాకినాడలో విమానాశ్రయం నిర్మించాలి
ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు రామారావు

కాకినాడ సిటీ: కాకినాడ నగరం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నందున కాకినాడ పరిసర ప్రాంతాల్లో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు వైడీ రామారావు పేర్కొన్నారు. శనివారం కాకినాడ గాంధీభవన్‌లో తూర్పుగోదావరి జిల్లా, కోకనాడ సిటీ ప్రయాణికుల సంఘం సర్వసభ్య సమావేశం రామారావు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ అన్నవరం–కాకినాడ–కోటిపల్లి–నరసాపురం–బాపట్లకు కొత్త రైలు మార్గం నిర్మించాలని గతం నుంచి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. కాకినాడ నుంచి కోల్‌కతా, జోద్‌పూర్, ఢిల్లీ వయా వారణాసి కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలన్నారు. సర్కార్ ఎక్స్‌ప్రెస్, శేషాద్రి ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయాన్ని కుదించాలన్నారు. కాకినాడ ఏడీబీ రోడ్డు నుంచి ఉప్పుటేరు మీద వంతెన నిర్మించి గురజనాపల్లికి రింగ్ రోడ్డు వేయాలన్నారు. కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌కు బదులుగా కాకినాడ సిటీ జంక్షన్‌గా పేరు మార్చాలన్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం జనార్దన్ కాలనీలో ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. రూరల్ సీఐ చిన్న గోవింద తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా బిట్రగుంటకు చెందిన అనిత, కావలికి చెందిన శృతి తమ భర్తలతో విభేదాలు రావడంతో తమ తల్లులతో కలిసి జనార్దన్ కాలనీలో ఉంటున్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు వారి తల్లులు పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి రాగా.. వారు ఇంట్లో కనిపించ లేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

నాడు ‘కొకైన్’పై ఇంటర్‌పోల్ సమాచారం తప్పా?
మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గత ఎన్నికల ముందు విశాఖలో 25 వేల కిలోల కొకైన్ పట్టుబడిందని, అది మీదంటే, మీదంటూ నాడు అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేసుకున్నాయని...ఇప్పుడు ల్యాబ్ టెస్ట్‌లో నెగెటివ్ వచ్చినట్లు కేంద్రం ప్రకటించడం, సరకును సంబంధీకులకు అప్పగించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలోని సమావేశ భవనంలో శనివారం దాయన మీడియాతో మాట్లాడారు. ఇంటర్‌పోల్ ఇచ్చిన సమాచారం మేరకు సీబీఐ సరకును పట్టుకుందని గుర్తు చేశారు. నేరుగా కొకైన్ పట్టుబడినప్పుడు పాజిటివ్ రిపోర్ట్ ఇచ్చి, ఇప్పుడు ఎలా అది నెగిటివ్‌గా మారిపోతుందని ప్రశ్నించారు.

ఉద్యోగుల హనిమూన్ ముగిసింది: మంత్రి టీజీ భరత్



కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగుల ఆరు నెలల హనిమూన్ ముగిసిందని, ఇక నుంచి పని చేయకపోతే సస్పెండ్ చేస్తామని మంత్రి టీజీ భరత్ హెచ్చరించారు. శనివారం ఆయన కర్నూలులో జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో పాల్గొనగా..ఆయనకు విద్యార్థుల తల్లిదండ్రులు పలు సమస్యలపై నిలదీశారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన మంత్రి..అక్కడున్న ఉద్యోగులపై మండిపడ్డారు.

నాడు-నేడుతో బడులు గోదాములయ్యాయి
మంత్రి అచ్చెన్నాయుడు



టెక్కలి: గత ప్రభుత్వ హయాంలో ‘నాడు-నేడు’తో లక్షలు ఖర్చు చేసి పాఠశాలలకు చెక్క సున్నాలు చేసి రంగులు వేసి ఆయా పాఠశాలలను ఎత్తేయడంతో అవి గోదాములుగా మారాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ సమావేశంలో భాగంగా మంత్రి మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ నియామకం గానీ ఒక్క కొత్త పాఠశాల గానీ ఇవ్వలేదన్నారు.

జీవన గమనం.. పట్నం పయనం!

పల్లెలు మెల్లిమెల్లిగా ఖాళీ అవుతున్నాయి. కుటుంబాలకు కుటుంబాలే గ్రామాలు వదిలి వెళ్తుండటంతో జనం లేక కళతప్పుతున్నాయి. మారిన జీవన గమనంలో వివిధ అవసరాల నిమిత్తం పల్లెజనం పట్నం బాట పడుతున్నారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ ఉన్నదాంట్లోనే సర్దుకుపోతున్నారు.



- ఉద్యోగ, ఉపాధి బాటలో పట్టణాలకు ప్రజలు
- పల్లెల కంటే పట్టణాల్లో 1.5 శాతం ఎక్కువ జనాభా
- పదేళ్లలో మున్సిపాలిటీల్లో 1.35 లక్షల మంది పెరుగుదల
- జనాభాకనుగుణంగా వసతులు లేక అవస్థలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రజల మొగ్గు పట్టణాల వైపే కనిపిస్తోంది. పట్టణాల్లో స్థిరపడేందుకే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. కొన్నేళ్ల క్రితంతో పోలిస్తే జిల్లాలోని పట్టణాల్లో జన సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. పల్లెల నుంచి వలసలు ఎక్కువగా ఉంటున్నాయి. రూ.15 వేలు అంతకంటే తక్కువ వేతనం ఉన్న ప్రైవేటు ఉద్యోగులు సైతం పట్టణాల్లో స్థిరపడుతున్నారు. ప్రాథమిక స్థాయి నుంచే తమ పిల్లలను పట్టణాల్లో చదివించేందుకు ఎక్కువమంది తల్లిదండ్రులు వస్తున్నట్లు తేలింది.

పదేళ్లలోనే లక్షన్నర మంది..

అనంతపురం జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం వీటి పరిధిలో 6.27 లక్షల మంది మాత్రమే నివసించేవారు. తాజా అంచనాల ప్రకారం ఈ సంఖ్య సుమారు 7.72 లక్షలకు చేరింది. ఒక్క అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే 80 వేలకు పైగా జనాభా పెరిగినట్లు తేలింది. తాడిపత్రి, గుంతకల్లు మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

పల్లెల్లో ఉపాధి కరువై..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో ఎక్కువ మంది పట్టణాలకు వలస వస్తున్నట్టు తేలింది. ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువ మంది కూలి పనులకు వచ్చి పట్టణ ప్రాంతాల్లో స్థిరపడుతున్నారు. మరికొంతమంది పల్లెల్లో వ్యవసాయం చేసుకుంటూనే పిల్లల చదువుల కోసం పట్టణాలకు వస్తున్నారు. ఈ క్రమంలో అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి లాంటి పట్టణాల్లో ఇంటి అద్దెలు భారీగా పెరిగాయి. ప్రభుత్వాలు జనాభాకు అనుగుణంగా వసతులు కల్పించలేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

అనంతపురం జిల్లాలోని మున్సిపాలిటీల్లో జనాభా వివరాలు

మున్సిపాలిటీ	2011 జనాభా	ప్రస్తుత జనాభా (అంచనా)
అనంతపురం	2,61,004	3,40,613
గుంతకల్లు	1,26,479	1,39,179
తాడిపత్రి	1,08,117	1,39,679
రాయదుర్గం	62,017	74,420
గుత్తి	37,814	38,230
కళ్యాణదుర్గం	32,328	39,737

సమస్యలెన్నో..

మున్సిపాలిటీల్లో జనాభా పెరుగుతున్న కొద్దీ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. రోజు రోజుకూ ప్లాస్టిక్ వాడకం ఎక్కువై అనర్థాలకు దారి తీస్తున్నాయి. చిన్న చిన్న మున్సిపాలిటీల్లో నిధులు సమకూరకపోవడంతో వ్యర్థాల నిర్వహణ చాలా అధ్వానంగా తయారైంది. ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇవ్వడం సాధ్యపడటం లేదు. ఆరు మున్సిపాలిటీల పరిధిలో 1.88 లక్షల గృహాలుండగా ఇంకా 80 వేల గృహాలకు నీటి కొళాయి కనెక్షన్ అందించాల్సి ఉంది. రోడ్లు, నీటి కొళాయిలు, డ్రైనేజీ వ్యవస్థలు కూడా సరిగా లేక పట్టణ పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వనరులు చాలడం లేదు

ప్రజలు పల్లెటూళ్ల నుంచి పట్టణాలకు రావడానికి ప్రధాన కారణం ఉద్యోగాలు, పిల్లల చదువులే. దీంతో పట్టణ జనాభా విపరీతంగా పెరుగుతోంది. అందుకు తగ్గట్టు మున్సిపాలిటీల్లో వసతులు సమకూర్చాలంటే ప్రస్తుతం ఉన్న ఆదాయ వనరులు సరిపోవడం లేదు. మున్సిపాలిటీలు ఆదాయ మార్గాలను చూసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి.

–నాగరాజు, మున్సిపల్ కమిషనర్, అనంతపురం

“

జీవనం కష్టంగా మారింది



నా భార్యతో కలిసి రెండున్నరేళ్ల క్రితం కళ్యాణదుర్గం వచ్చా. ప్రస్తుతం పట్టణంలోని శంకరప్ప తోట కాలనీలో నివాసముంటున్నాం. ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. పట్టణంలో ఇంటి బాడుగలు అధికమయ్యాయి. ఇటీవల ప్రభుత్వం కరెంటు చార్జీలను సైతం పెంచేసింది. మా లాంటి వారు జీవించాలంటే కష్టంగా ఉంది.

– మోహన్, శెట్టూరు

పల్లెల్లో పనులు లేవు..



మా స్వగ్రామం గుమ్మఘట్ట మండలం కలుగోడు. మొదట్లో గ్రామంలోనే ఉండేవాళ్లం. అక్కడ పనులేవీ దొరక్క పదేళ్ల క్రితం రాయదుర్గం పట్టణానికి వలస వచ్చాం. నా భార్య టైలరింగ్ పనులు చేస్తుంది. నేను హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. నాలాగే చాలామంది పల్లెలు వదిలి పట్టణాల్లో జీవనం సాగిస్తున్నారు.

– షమీవుల్లా, రాయదుర్గం

టీ కొట్టుతో జీవనం



మాది కణేకల్లు మండలం ఎర్రగుంట గ్రామం. నా చిన్నప్పుడే ఊరు వదిలి బళ్లారిలోని ఓ హోటల్‌లో కార్మికుడిగా చేరా. ఆదాయం సరిపోక రాయదుర్గం వచ్చి టీ కొట్టు ప్రారంభించా. 20 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నా. నా కుటుంబ సభ్యులు కూడా ఇక్కడే ఉంటున్నారు. పల్లెల నుంచి పట్నం చేరే వారి సంఖ్య క్రమంగా ఎక్కువైంది. అనేక కారణాలతో ప్రజలు గ్రామాలను వీడుతున్నారు.

– రంగప్ప, రాయదుర్గం

భలే భలే ఏరోనీరో

గాల్లో నీరు పుడుతుందే.. తాగితే మస్తుగుంటుందే



సాక్షి, విశాఖపట్నం

ఏంటీ మిషన్. వాటర్ ప్యూరిఫయరా..?

యస్.. ఇది స్వచ్ఛమైన నీటిని అందించే మిషన్..

అరె.. దీనిలో నీరు నింపేందుకు పైప్ కనెక్ట్ చెయ్యలేదెందుకు.?

అవన్నీ మీకెందుకు..? మీకు కావాల్సింది నీరే కదా..

అవును తాగాలని ఉంది. కానీ...!!!!

నీ సందేహంతో పాటు.. దాహం కూడా తీరుతుందిలే. ఆ గ్లాస్ పట్టుకొని.. ట్యాప్ కింద పెట్టి చూడు..

అరే.. నీరు వస్తుంది.. ఇదెలా సాధ్యం..?

అదే మ్యాజిక్కు.. మాయా లేదు.. మంత్రం లేదు.. నీటిపైపూ లేదు.. శ్రమా లేదు.. నేను గానీ.. గ్లాస్ పట్టానంటే.. ఈ ప్యూరిఫయర్ నుంచి నీరు రావాల్సిందే...

బాబూ... ఆ ట్రిక్ ఏంటో చెప్పు..!!!

చెప్తా.. ఈ ప్యూరిఫయర్‌కు నీటి పైప్ అవసరం లేదు. కేవలం గాలిలో ఉన్న తేమను ఆక్సిజన్‌ని తీసుకొని.. నీటిగా మార్చేసుకుంటుంది. మనకు ఎంచక్కా అందించేస్తుంది.

అవునా.. నిజమా..!!


నిజం. ఇది కొత్త టెక్నాలజీ.. నీటి ఎద్దడి లేకుండా.. రాబోయే తరాలకు స్థిరమైన భవిష్యత్తును అందించడమే లక్ష్యం అనే కాన్సెప్ట్‌తో అమెరికాలో స్థిరపడ్డ ఇండియన్ దుర్గా దాస్ ఆవిష్కరణ. ఈమె ఒకప్పటి భారత క్రికెట్ క్రీడాకారిణి కూడా. అమెరికా వెళ్లిపోయిన తర్వాత.. యూఎస్ మహిళా టీమ్‌కు కెప్టెన్‌గా కూడా వ్యవహరించారు. ఆమె ఆలోచనల నుంచి పుట్టిందే ఏరోనీరో.

మరి.. గాల్లో ఎన్నో రకాల విష వాయువులు కూడా ఉంటాయి కదా.. మరి అందులోంచి తయారైన నీటిలో ఆ విషం ఉండదా.?

అదేం ఉండదు. ఇందులో నాలుగు అంచెల వ్యవస్థ ఏర్పాటు చేయడంతో గాలిలోని తేమను పోర్టబుల్ డ్రింకింగ్ వాటర్‌గా మారుస్తుంది. తొలుత ఎయిర్ ప్యూరిఫికేషన్ జరుగుతుంది. దీని ద్వారా గాల్లో మలినాలు తొలగిపోతాయి. అక్కడి నుంచి కార్బన్ ప్యూరిఫికేషన్ ద్వారా అసహ్యకరమైన రుచి, వాసన, రంగు తొలగిపోతాయి. అప్పుడు నీటిగా మారుతుంది. ఆ నీటిని యూవీ ప్యూరిఫికేషన్ చేసి బ్యాక్టీరియాని నాశనం చేస్తాయి. అప్పుడు మినరల్స్ మిళితమవుతాయి. దీని ద్వారా పీహెచ్ లెవల్స్ 7 నుంచి 8.5 పీహెచ్‌గా ఉంటాయి. అంటే.. పూర్తి ఆల్కలిన్ వాటర్‌గా గాలిలో తేమ మారి.. స్వచ్ఛమైన నీటిని అందిస్తుంది.

గాలిలో తేమ నుంచి నీటిని అందించే వాటర్ ప్యూరిఫయర్

భలేభలే.. మరి రోజుకు ఎన్ని లీటర్లు ఇస్తుంది ఏరోనీరో..?



ఇందులో భిన్నమైన రకాలున్నాయంట. 10 నుంచి 25 లీటర్ల వరకూ ఇంట్లో వినియోగించే ప్యూరిఫయర్లున్నాయి. ఇప్పటి వరకూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో వాడుతున్నారు. ఈ ప్యూరిఫయర్ల అమ్మకాల లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ 1,71,50,920 లీటర్ల నీటిని తయారు చేశారంట. అంతేకాదు.. 6,86,03,680 లీటర్ల నీటిని ఆదా చేశారంట. సంస్థ వినూత్న ఆలోచన, నీటిని ఆదా చేస్తున్న విధానాన్ని మెచ్చి.. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు కూడా పొందారు.

అద్భుతం కదా.. మరి మీకెక్కడ తారసపడిందీ స్పెషల్ ప్యూరిఫయర్..?

ఓ.. అదా.. నగరంలో డీప్‌టెక్ కాంక్లేవ్ జరుగుతోంది కదా.. అక్కడ టెక్ ఎక్స్‌పోలో సంస్థ ప్రతినిధులు దీన్ని ప్రదర్శనకు ఉంచారు. చూస్తే.. అద్భుతమనిపించింది. మేం మాత్రమే తెలుసుకుంటే సరిపోదు కదా.. అందుకే.. ‘సాక్షి’ పాఠకులకీ అందిస్తున్నాం. ఇప్పుడు సరదాగా ఈ ప్యూరిఫయర్‌ను చూసి.. గాల్లో నీరు పుడుతుందే.. తాగితే మస్తుగుంటుందే.. అని పాడుకుందామా....!!

జనవరి 13 నుంచి మహా కుంభ్‌మేళా

- ఫిబ్రవరి 26 వరకు ఉత్సవాలు
- దేశవ్యాప్తంగా ప్రచారం చేపట్టిన యూపీ ప్రభుత్వం
- విజయవాడలో పాల్గొన్న యూపీ డిప్యూటీ సీఎం కేశవప్రసాద్ మౌర్య



యూపీ డిప్యూటీ సీఎం కేశవప్రసాద్ మౌర్యకు అమరావతిలో స్వాగతం పలుకుతున్న అర్చకులు

సాక్షి, అమరావతి/లబ్బీపేట(విజయవాడ తూర్పు)/అమరావతి: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో పవిత్ర గంగా, యమున, సరస్వతి నదుల సంగమం ఒడ్డున జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభ్ ఉత్సవాలు జరగనున్నాయి. యూపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్–2025 ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య, ప్రయాగ్‌రాజ్ స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ వ్యవహారాల పరిశీలకులుగా పనిచేసిన సిద్ధార్థనాథ్ సింగ్ విజయవాడలో జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి మహాకుంభ్ మేళా ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేశవ్ ప్రసాద్ మౌర్య మాట్లాడుతూ ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా అభివృద్ధి పరుగులు పెడుతోందని చెప్పారు. కాగా, కేశవప్రసాద్ మౌర్య అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

యువత ఆవిష్కరణలకు సిద్ధం కావాలి

- టెక్నాలజీలో ఇండియా భేష్
- ఎల్‌అండ్‌టీ, జీఎంఆర్ గ్రూప్ చైర్మన్‌లు సుబ్రహ్మణ్యన్, జీఎం రావు



సభలో ప్రసంగిస్తున్న ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణ్యం


విశాఖ విద్య: యువత ఆవిష్కరణలకు సిద్ధం కావాలని ఎల్ అండ్ టి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎన్ సుబ్రహ్మణ్యన్ అన్నారు. విశాఖలోని ఏయూ కన్వెన్షన్ హాల్లో శనివారం జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ రంగంలో వస్తున్న మార్పులు నూతన అవకాశాలకు నాందిగా నిలుస్తాయన్నారు. డిజిటల్ రంగంలో యువత నైపుణ్యత పెంపొందించుకోవటం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చన్నారు. ప్రపంచం ఎంతో మార్పుకు లోనవుతోందని, అవకాశాలకు వేదికగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్శిటీ అంతర్జాతీయ స్థాయిలో మేటిగా నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వ పరంగా తోడ్పాటు అందిస్తామన్నారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక డాక్టర్ జి ఎం రావు మాట్లాడుతూ 2025లో ఏయూ శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం కావాలన్నారు. భారత్‌లో జరుగుతున్న అభివద్ధి టెక్నాలజీలో ముందుకు వెళుతున్న విధానం అనేక అభివద్ధి చెందిన దేశాలను సైతం అధిగమించే విధంగా ఉండడం శుభపరిణామం అన్నారు.

మంత్రి సుభాష్‌కు కోడ్ పట్టదా!



పామర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల మెగా సీటీఎంలో పాల్గొన్న మంత్రి సుభాష్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఉభయగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, మంత్రి సుభాష్ మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో పాల్గొని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. కె.గంగవరం మండలం పామర్రు, కోటిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించి, మంచి ఫలితాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ డే సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితాలు ఈ నెల 11న నిర్వహించనున్నారు. అప్పటి వరకు కోడ్ అమల్లో ఉంటుందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకులను పేరెంట్ టీచర్ మీట్‌లకు పిలవరాదని ఉన్నతాధికారులు పాఠశాలల హెచ్ఎంలకు సూచించారు. అయినప్పటికీ మంత్రి సుభాష్ ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో ఎన్నికల కమిషన్ ఏ చర్యలు తీసుకుంటుందా అని చర్చ జరుగుతోంది.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,782 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.2.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే , దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు భగవద్గీత కంఠస్థ పోటీలు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ అన్నమాచార్య కళామందిరంలో విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు జరుగనున్నాయి. టీటీడీ విద్యాసంస్థలు, తిరుపతిలోని పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత ఆరో అధ్యాయం ధ్యానయోగం లో పోటీలు నిర్వహిస్తారు. 6,7 తరగతుల విద్యార్థులు ఒక విభాగంగా, 8, 9 తరగతుల విద్యార్థులు మరో విభాగంగా ఈ పోటీలు నిర్వహిస్తారు. 700 శ్లోకాలు కంఠస్థం వచ్చిన వారిలో 18 ఏళ్లలోపు ఉన్నవారికి ఒక విభాగంగా, 18 ఏళ్ల పైబడిన వారికి మరో విభాగంగా పోటీలు జరుగనున్నాయి. ఆసక్తి గల విద్యార్థులు ఆదివారం ఉదయం 9 గంటలకు అన్నమాచార్య కళామందిరానికి చేరుకోవాల్సి ఉంటుంది.

వేంకటేశ్వర స్తోత్రం ఆడియో ఆవిష్కరణ



తిరుమల: వేంకటేశ్వర స్తోత్రం ఆడియో ఆల్బమ్‌ను టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు తిరుమలలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. బాలగాయని నియార నాగ సుంకరినేని ఈ పాటను ఆలపించారు. ఈ పాటకు నిటార నాగ సుంకరినేని అనే చిన్నారి వాద్య సహకారం అందించింది. ఈ ఆల్బమ్ కు డాక్టర్ కె.స్వరూపా సంగీత సమర్పకులుగా వ్యవహరించారు. శ్రావ్యమైన సంగీతంతో పాటను మధురంగా గానం చేశారని చిన్నారులను చైర్మన్ అభినందించారు.

నేడు ఏడుగంగల జాతర చాటింపు

శ్రీకాళహస్తి: పట్టణంలో ఏడు గంగమ్మల జాతర చాటింపు ఆదివారం అర్ధరాత్రి నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తిలో మాత్రమే ఏడు ప్రాంతాల్లో ఏడుగురు గంగమ్మలను కొలువుదీర్చి జాతర నిర్వహించనున్నారు. ఈ నెల 11వ తేదీ ఏడుగంగల జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి చాటింపు నిర్వహిస్తారు. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున సారె సమర్పిస్తారు. బుధవారం ఉదయం అమ్మవార్లు ఆయా ప్రాంతాల్లో కొలువు దీరనున్నారు. రాత్రి 8 గంటలకు నిమజ్జనం కార్యక్రమం జరుగుతుంది. ఇందుకోసం ఆయా గంగమ్మలను కొలువు దీర్చే ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

లక్ష్మీనరసింహుడికి 60 వేల అమెరికన్ డాలర్లు బహూకరణ



రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన దేవస్థానంలో లడ్డూ పోటు నిర్మాణానికి ఓ దాత 60 వేల(రూ.50లక్షలు) అమెరికన్ డాలర్లు బహూకరించారు. వైఎస్సార్‌జిల్లాకు చెందిన సానేపల్లి చిన్న పెంచలరెడ్డి, కీర్తిశేషులు లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సానేపల్లి రామ్మోహన్‌రెడ్డి శనివారం ఈ మొత్తాన్ని అందజేసినట్లు దేవస్థానం ఏసీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. దాతకు 3 ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి, తీర్థప్రసాదాలు అందించినట్లు తెలిపారు.

కనుల పండువగా షష్ఠి తిరునాళ్ల

అత్తిలి: పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి తీర్థ మహోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. జిల్లా నలుమూలలనుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. ప్రత్యేక దర్శనానికి కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు కాలువలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీనాగేంద్రుని సర్పానికి మహిళలు పూజలు చేశారు. స్వామివారి ఆశీస్సులతో సంతానం కలిగిన దంపతులు తమ చిన్నారుల శిరస్సుపై నుంచి బూరెలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

Gold Memories



మాస్ మెచ్చిన క్లాస్ సినిమా స్వాతిముత్యం

హీరో మానసికంగా ఎదగనివాడు... హీరోయిన్ అప్పటికే ఓ పిల్లాడికి తల్లైన విడో. అనుకోని పరిస్థితుల్లో వీరిద్దరికీ ముడిపడితే? ఇలాంటి కథతో సినిమా తీయడమంటే రిస్కులకే రిస్కు. కానీ ఆ ప్రయోగాన్ని క్లాస్‌తో పాటు మాస్ కూడా మెచ్చేలా చేశారో దర్శకుడు. పైపెచ్చు బాక్సాఫీస్ వద్ద ఆ ఏటి ఇండస్ట్రీ హిట్‌గా నిలిపారు. అది ఓ క్రియేటివ్ జీనియస్ మాత్రమే చేయగల అరుదైన విన్యాసం. ఆ అద్భుతం చేసిన దర్శక కళాస్రష్ట కె.విశ్వనాథ్. ఒకరికి ఆరుగురు తెలుగు స్టార్ హీరోలు హిట్స్ మీద హిట్స్ ఇస్తున్న సందర్భంలో కమల్‌హాసన్ లాంటి ఓ పరభాషా హీరోతో, నిర్మాత ఏడిద నాగేశ్వరరావుకు దక్కిన ఆ బ్లాక్‌బస్టర్ అద్భుతం ఈ 'స్వాతిముత్యం'. 1985లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో ఓ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది.



ఆయన ఆ అర్ధరాత్రి కమల్‌హాసన్‌కు ఫోన్ చేసి, తన మనసులో మాట చెప్పారు. కానీ, తర్వాత ఎందుకనో అది కుదరలేదు. అయితే... మూడేళ్ల తర్వాత అనిల్ కపూర్, విజయశాంతి జంటగా 'ఈశ్వర్' పేరుతో కె. విశ్వనాథ్ దర్శకత్వంలోనే హిందీలో రీమేక్ చేశారు. అక్కడా హిట్ అయింది. తెలుగు వెర్షన్ రిలీజైన కొద్ది నెలలకే 'స్వాతిముత్యం'ను తమిళ, మలయాళంలో డబ్ చేయగా మంచి విజయం సాధించాయి. అయితే 2003లో సుదీప్ కన్నడలో రీమేక్ చేయగా అది ఆకట్టుకోలేకపోయింది.

కమల్‌హాసన్ ట్యూన్... గానం

మద్రాసుతో పాటు మైసూరు, రాజమండ్రి, తొర్రేడు, తాడికొండ, పట్టిసీమ ప్రాంతాల్లో షూట్ చేసిన ఈ సినిమాకు కమల్‌హాసన్, రాధిక నటనతో పాటు ఇళయరాజా సంగీతం, రీ రికార్డింగ్ ప్రాణం పోశాయి. ఆత్రేయ, సినారె రాసిన పాటలు మరో అద్భుతం. ఈ సినిమా పాటల రచనలోనూ విశ్వనాథ్ హస్తం ఉంది. హీరో చిన్నపిల్లాడి మనస్తత్వం. స్క్రీన్‌పై ఎస్టాబ్లిష్ చేయడానికి విశ్వనాథ్ అప్పటికప్పుడు అనుకొని జానపద శైలిలో 'పట్టు చీర తెస్తనని..' అనే పాట రాత్రికి రాత్రి రాశారు. మరునాడు షూటింగ్ కోసం వెళ్తుండగా మార్గ మధ్యంలో కమల్‌హాసనే ఆ పాటకు ట్యూన్ కట్టి పాడారు. ఆ వెర్షన్‌తోనే షూటింగ్ చేశారు. ఆ తర్వాత బాలు, శైలజలతో పాడించారు. ఇక 'వటపత్రసాయికి...' పాట పల్లవి లైన్లు కథా చర్చల్లో భాగంగా సినారెకు స్నేహపూర్వకంగా విశ్వనాథ్ సమకూర్చినవే. ఇదే పాట సినిమా చివరలో విషాదంగా వస్తుంది. ఆ రెండో వెర్షన్‌ను సీతారామశాస్త్రితో రాయించారు. 'సిరివెన్నెల' కన్నా ముందే ఈ సినిమా, ఈ పాటతో సీతారామశాస్త్రి పేరు తెరమీదకు వచ్చింది.

రాజ్‌కపూర్ హార్ట్ టచ్ అయిన వేళ

బాలీవుడ్ రారాజు రాజ్ కపూర్ మనసు దోచిందీ సినిమా. 'శంకరాభరణం' నుండి ఏ సినిమా తీసినా బొంబాయిలో రాజ్ కపూర్‌కు చూపించడం కె. విశ్వనాథ్‌కు అలవాటు. అలాగే 'స్వాతిముత్యం' కూడా చూశారాయన. సినిమా అవగానే నిశ్శబ్దంగా కూర్చుండిపోయిన రాజ్ కపూర్ వెనక్కి తిరిగి విశ్వనాథ్‌తో... మీరు నా హార్ట్ టచ్ చేశారు. దేర్ ఈజ్ ఎ లాట్ ఆఫ్ హానెస్టీ ఇన్ దిస్ ఫిల్మ్ అంటూ తెగ మెచ్చుకున్నారు. కమల్‌హాసన్, విశ్వనాథ్‌లతోనే 'స్వాతిముత్యం' హిందీ రీమేక్ చేయాలనీ రాజ్ కపూర్ ముచ్చటపడ్డారు. శతదినోత్సవానికి వచ్చిన

కమల్ మనవడిగా అల్లు అర్జున్

'స్వాతిముత్యం'లో మరో విశేషం ఉంది.. ఇందులో రాధిక కొడుకుగా జానపద హీరో కాంతారావు మనవడు మాస్టర్ కార్తీక్ నటించగా... కమల్‌హాసన్ మనవడిగా అల్లు అరవింద్ కొడుకు ఇప్పటి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించారు. మనవరాళ్లుగా అరవింద్ మేనకోడళ్లు విద్య, దీపు తెరపైకి వచ్చారు. అల్లు అర్జున్ చిన్నప్పటి ఆ తీపి జ్ఞాపకాల్ని ఇప్పటికీ ఆత్మీయంగా గుర్తు చేసుకుంటూ ఉంటారు. ఇక.. ఆ ఏడాది (1985) తెలుగులో ఆరుగురు స్టార్ హీరోలు పోటీలో ఉన్నారు. కృష్ణ తెలుగులో తొలి 70 ఎంఎం సినిమా 'సింహాసనం'తో సంచలనం రేపారు. శోభన్‌బాబు 'శ్రావణసంధ్య'తో హిట్ కొట్టారు. అదే ఏడాది బాలకృష్ణ ఆరు వరుస హిట్లతో జోరుమీదున్నారు. బాక్సాఫీస్ ఖైదీ చిరంజీవి అగ్రస్థానం కోసం 'కొండవీటి రాజా, రాక్షసుడు' లాంటి హిట్స్‌తో పోటీపడుతున్నారు. నాగార్జున 'విక్రమ్'తో, వెంకటేశ్ 'కలియుగ పాండవులు'తో మాస్ హీరోలుగా ఎంట్రీ ఇచ్చారు. వీరందరినీ అధిగమించి, ఓ పరభాషా నటుడితో, నాన్ కమర్షియల్ రిస్కీ కథతో ఆ ఏటి ఇండస్ట్రీ హిట్టయింది 'స్వాతిముత్యం'. అదీ... వెండితెరపై విశ్వనాథ్ సమ్మోహనం.

స్వాతిముత్యం.... ఓ నిరంతర స్ఫూర్తి

తెలుగులో ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'స్వాతిముత్యం' కేంద్ర ప్రభుత్వ రజత కమలం అందుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా బంగారు నందిని సాధించింది. విశ్వనాథ్ ఉత్తమ దర్శకుడిగా, కమల్‌హాసన్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఆస్కార్స్‌కు అఫీషియల్ ఇండియన్ ఎంట్రీగా పంపిన ఫస్ట్ సౌతిండియన్ ఫిల్మ్ కూడా ఇదే. ఎప్పుడైనా సరే... కమర్షియల్ సూత్రాలను ఛేదించి మరీ ఆడిన చిత్రాలే అరుదైన చరిత్ర అవుతాయి. చెరగని ఆ చరిత్ర గురించే భావితరాలకు చెప్పుకోవాల్సింది. ఆ రకంగా... కె. విశ్వనాథ్ 'స్వాతిముత్యం' అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ ఓ చిరస్మరణీయ చరిత్ర. ప్రయోగాలు చేయదలుచుకున్న సినీ సృజనశీలురకు నిరంతర స్ఫూర్తి.

- దాచేపల్లి సురేష్‌కుమార్





• ప్రభాస్

మెగా స్పీడ్

హీరో చిరంజీవి మెగా స్పీడ్‌తో వరుస సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ప్రస్తుతం ఆయన 'విశ్వంభర' సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే వేసవిలో ఈ చిత్రం రిలీజ్‌కు రెడీ అవుతోంది. కాగా ఆయన నెక్ట్స్ చిత్రం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఉంటుందని, షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ సినిమాను నిర్మించనున్నారని, వచ్చే ఏడాదిలో ఈ మూవీ సెట్స్‌కు వెళ్తుందని సమాచారం. ఇక ఈ చిత్రం పూర్తయిన తర్వాత 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలోని సినిమా సెట్స్‌లో చిరంజీవి జాయిన్ అవుతారని తెలిసింది. అలాగే తనతో 'గాడ్‌ఫాదర్' సినిమా తీసిన దర్శకుడు మోహన్‌రాజాతో సినిమాకి కూడా చిరంజీవి పచ్చ జెండా ఊపారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఇంకా 'అర్జున్ రెడ్డి, యానిమల్' చిత్రాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో చిరంజీవి ఓ సినిమా చేయనున్నారని, ఆయన ప్రస్తుతానికి కమిటైన సినిమాల షూటింగ్స్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత, చిరంజీవి-సందీప్ కాంబోలోని సినిమా ప్రకటన ఉండొచ్చని సమాచారం.




• చిరంజీవి

జైల్లో ఫౌజి


ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) ఓ హిస్టారికల్ యాక్షన్ డ్రామా రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఇమాన్వీ ఎస్మాయిల్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో ప్రారంభం కానుందని తెలిసింది. ఈ షెడ్యూల్ చిత్రీకరణ రెండు వారాల పాటు కొనసాగుతుందట. ఈ షెడ్యూల్ చిత్రీకరణ కోసం కోల్‌కత్తా బ్యాక్‌డ్రాప్ సెట్, జైలు సెట్ వేశారని తెలిసింది. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

అరకులో మాస్ జాతర



• రవితేజ

అరకులో మాస్ జాతర చేయనున్నారు హీరో రవితేజ. ఆయన కెరీర్‌లో రూపొందుతున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. హిట్ ఫిల్మ్ 'సామజవరగమన'కు ఓ రైటర్‌గా పనిచేసిన భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత రవితేజ, హీరోయిన్ శ్రీలీల కలిసి నటిస్తున్న సినిమా ఇది. ఈ చిత్రంలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఆఫీసర్ లక్ష్మణ్ భేరీ పాత్రలో రవితేజ నటిస్తున్నారని తెలిసింది. ఈ సినిమా తాజా షెడ్యూల్ డిసెంబరు మూడో వారంలో అరకులో ప్రారంభం కానుందని సమాచారం. ముఖ్యంగా అరకు, ఆ తర్వాత పాడేరు, ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు లొకేషన్స్‌లో 'మాస్ జాతర' చిత్రీకరణ జరగనుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొంటారు. కొంత టాకీ పార్టుతో పాటు, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ప్లాన్ చేశారు మేకర్స్. రాజేంద్రప్రసాద్, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మే 09న విడుదల కానుంది.



నేనేంటో వారికే తెలుసు - ధనుష్

''నన్ను అర్థం చేసుకోవడం చాలా కష్టం. అయితే, నాతో సన్నిహితంగా ఉండేవారికి నేనేంటో తెలుసు'' అంటున్నారు హీరో ధనుష్. ప్రస్తుతం తమిళ చిత్ర పరిశ్రమలో ధనుష్-నయనతారల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. మరోవైపు ఐశ్వర్యా రజనీకాంత్‌తో ధనుష్ వివాహ బంధానికి కూడా ఎండ్ కార్డు పడింది. ఇటీవలే వీరిద్దరికి విడాకులు మంజూరైన సంగతి తెలిసిందే. ఇలా తన జీవితంలో వరుస సెన్సేషనల్ ఘటనలు చోటు చేసుకున్న వేళ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ధనుష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''నేను ఎవరికీ అంత సులభంగా దగ్గర కాను. నన్ను అర్థం చేసుకోవడం కష్టమే. అందుకు కొన్ని రోజుల సమయం పడుతుంది. అయితే నాతో సన్నిహితంగా ఉండేవారికి నేను ఏంటో తెలుసు. నాతో చాలా కాలం పరిచయం ఉన్నవారే నన్ను అర్థం చేసుకుంటారు'' అని పేర్కొన్నారు ధనుష్. ఆయన చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. అయన ఎవరి గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేశారు? అనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా జరుగుతోంది. ఇదిలా ఉంటే... ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెలుగులో 'కుబేర' సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో నాగార్జున మరో హీరోగా నటిస్తుండగా రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే ధనుష్ లీడ్ రోల్‌లో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న తమిళ చిత్రం 'ఇడ్లీ కడై'. ఈ మూవీలో నిత్యా మీనన్, షాలినీ పాండే హీరోయిన్లుగా నటిస్తున్నారు.

కల్యాణం కమనీయం

'కలర్ ఫొటో' సినిమా దర్శకుడు సందీప్ రాజ్ కల్యాణం చేసుకున్నారు. ఆ చిత్రంలో కీలక పాత్రలో నటించిన హీరోయిన్ చాందినీ రావుని ఆయన వివాహమాడారు. వీరి వివాహం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం జరిగింది. 'కలర్ ఫొటో' చిత్రీకరణ సమయంలో సందీప్ రాజ్-చాందినీ రావు మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇరు కుటుంబ పెద్దల అంగీకారంతో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వివాహానికి నటులు సుహాస్, వైవా హర్ష తదితరులు హాజరై, నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు నెటిజన్లు ఈ జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే... సుహాస్ హీరోగా సందీప్ రాజ్ దర్శకత్వం వహించిన 'కలర్ ఫొటో' సినిమా ఉత్తమ తెలుగు చిత్రం విభాగంలో జాతీయ పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. సందీప్ రాజ్ ప్రస్తుతం రాజీవ్ కనకాల తనయుడు రోషన్ హీరోగా 'మోగ్లీ' అనే సినిమా రూపొందిస్తున్నారు.



• సందీప్ రాజ్, చాందినీ రావు

డబ్బింగ్ డన్



• అజిత్

అజిత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'విడా ముయర్చి'. త్రిష హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో అర్జున్, రెజీనా ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా 2025 సంక్రాంతి సందర్భంగా రిలీజ్ కానుంది. ఆల్రెడీ ఈ సినిమా టీజర్‌ను కూడా విడుదల చేశారు. తాజాగా ఈ సినిమా డబ్బింగ్ వర్క్‌ను పూర్తి చేశారు హీరో అజిత్. రిలీజ్ సమయం దగ్గర పడుతుండటంతో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను వేగవంతం చేసింది చిత్ర యూనిట్. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ చిత్రకథ విషయానికొస్తే... విహార యాత్రకు విదేశాలకు వెళ్తుంది హీరో ఫ్యామిలీ. అక్కడ అతని భార్య, కూతుర్ని కిడ్నాప్ చేస్తారు. మరి... హీరో తన ఫ్యామిలీని ఎలా కాపాడాడు? అనే కోణంలో 'విడా ముయర్చి' సినిమా కథనం ఉంటుందని కోలీవుడ్ టాక్.



ఏ మహిళకూ ఇలాంటి కష్టం రాకూడదు - హీరోయిన్ ప్రగ్యా నగ్రా

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు హీరోయిన్ ప్రగ్యా నగ్రా. ఇంతకీ ఏం జరిగిందంటే... హీరోయిన్ ప్రగ్యా నగ్రా డీప్ ఫేక్ వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో తనది కాదని చెప్పినా కూడా పదే పదే తన పేరుతో ఈ వీడియో వైరల్ అవుతుండటం పట్ల ప్రగ్యా మనోవేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తన బాధను 'ఎక్స్' వేదికగా షేర్ చేశారామె. ''ఓ చెడ్డ కల (డీప్ ఫేక్ వీడియో ప్రచారం అవడాన్ని ఉద్దేశించి) నుంచి మేల్కోవాలని అనుకుంటున్నాను. సాంకేతికత అనేది మనకు సహాయం చేసేందుకు ఉపయోగపడాలి. మన జీవితాలను క్లిష్టతరం చేసేందుకు కాదు. దుర్మార్గపు ఆలోచనలతో ఏఐ (కృత్రిమ మేధస్సు)ని దుర్వినియోగం చేస్తూ కంటెంట్‌ను సృష్టించిన వారిపట్ల, ఈ వీడియో వైరల్ అయ్యేందుకు సహకరిస్తున్న వారి పట్ల జాలి చూపగలరా? ఈ కఠిన సమయాల నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను. ఈ సమయంలో నాకు తోడుగా ఉన్న వారికి ధన్యవాదాలు. మరే మహిళకు కూడా ఇలాంటి కష్టాలు రాకూడదని, మీరుందరూ సేఫ్‌గా ఉండాలని కోరుకుంటున్నాను'' అంటూ పేర్కొన్నారు ప్రగ్యా నగ్రా. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని కొంతమంది నెటిజన్లు ప్రగ్యాకు సోషల్ మీడియా మాధ్యమాల్లో సపోర్ట్ చేస్తున్నారు. గతంలో రష్మికా మందన్నా, ఆలియా భట్ వంటి నటీమణుల డీప్ ఫేక్ వీడియోస్ కూడా వైరల్ అయ్యాయి. ఇక ఈ ఏడాది వచ్చిన 'లగ్గం' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అయ్యారు హీరోయిన్ ప్రగ్యా నగ్రా. సాయి రోనక్ హీరోగా నటించిన ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్, రోహిణి ఇతర కీలక పాత్రలు పోషించారు.

బిజినెస్ రీల్

సియట్ చేతికి క్యామ్‌సో ఓహెచ్‌టీ వ్యాపారం



ముంబై: మిషెలిన్‌కి చెందిన క్యామ్‌సో బ్రాండ్ ఆఫ్-హైవే టైర్స్ (ఓహెచ్‌టీ), ట్రాక్స్ వ్యాపారాన్ని కొనుగోలు చేయనున్నట్లు టైర్ల తయారీ దిగ్గజం సియట్ వెల్లడించింది. ఈ డీల్ విలువ 225 మిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 1,905 కోట్లు) ఉండనుంది. ఇందుకోసం మిషెలిన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. 6-9 నెలల వ్యవధిలో ఈ డీల్ పూర్తి కాగలదని సంస్థ భావిస్తోంది. భారీ మార్జిన్లు ఉండే ఓహెచ్‌టీ విభాగంలో అంతర్జాతీయంగా ఎదిగేందుకు ఈ కొనుగోలు డీల్ సియట్‌కు ఉపయోగపడనుంది. దీని ప్రకారం మూడేళ్ల లైసెన్సింగ్ వ్యవధి అనంతరం క్యామ్‌సో బ్రాండ్ గ్లోబల్ ఓనర్‌షిప్, రెండు తయారీ ప్లాంట్లు సియట్‌కి లభిస్తాయి. నిర్మాణ రంగ వాహనాలు మొదలైన వాటిలో ఉపయోగించే టైర్లు, ట్రాక్‌లకు సంబంధించి క్యామ్‌సో ప్రీమియం బ్రాండ్‌గా కొనసాగుతోంది.

3 రోజుల్లోగా పెట్టుబడులు వెనక్కి

క్లయింట్ ఖాతాల సెటిల్‌మెంట్‌పై సెబీ తాజా ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: గత 30 రోజుల్లో క్లయింట్ ఎలాంటి లావాదేవీలను చేపట్టని సందర్భంలో తదుపరి సెటిల్‌మెంట్‌లో మూడు రోజుల్లోగా ఖాతాలోని నిధులను వెనక్కి ఇవ్వవలసిందిగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా ప్రతిపాదించింది. ఖాతాల నెలవారీ రన్నింగ్ సెటిల్‌మెంట్ సైకిల్‌కు సంబంధించి స్టాక్ బ్రోకర్లకు సెబీ తాజా మార్గదర్శకాలను ప్రతిపాదించింది. రానున్న సెటిల్‌మెంట్ రోజులకు ఇది వర్తించనున్నట్లు కన్సల్టేషన్ పేపర్‌లో పేర్కొంది. దీనికి క్వార్టర్లీ సెటిల్‌మెంట్‌గా సైతం పిలిచే సంగతి తెలిసిందే. ఇన్వెస్టర్ల పరిరక్షణతోపాటు.. సరళతర బిజినెస్ నిర్వహణకు వీలు కల్పించే బాటలో సెబీ తాజా మార్గదర్శకాలకు ప్రతిపాదించింది. వెరసి క్లయింట్ల నిధుల సెటిల్‌మెంట్‌ను తప్పనిసరి చేయనుంది. ఈ అంశాలపై ఈ నెల 26వరకూ సెబీ ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించనుంది.

లారస్ బయోకు రూ.120 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బయోమాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో ఉన్న లారస్ బయో తాజాగా ఈక్విటీ రూపంలో రూ.120 కోట్ల పెట్టుబడి అందుకున్నట్లు లారస్ ల్యాబ్స్ శుక్రవారం తెలిపింది. ఎయిట్ రోడ్స్ వెంచర్స్, ఎఫ్-ప్రైమ్ క్యాపిటల్ ఈ మొత్తాన్ని సమకూర్చాయి. అదే విలువకు అదనంగా రూ.40 కోట్లు పెట్టుబడి చేస్తున్నట్లు లారస్ ల్యాబ్స్ ప్రకటించింది. లారస్ ల్యాబ్స్ లేదా ఎయిట్ రోడ్స్ వెంచర్స్ అదే విలువకు రూ.35 కోట్ల వరకు 2025 డిసెంబర్‌లోగా ఇన్వెస్ట్ చేసేందుకు హక్కులు ఉన్నాయి. లావాదేవీ పూర్తి అయితే లారస్ ల్యాబ్స్‌కు 75, ఎయిట్ రోడ్స్ వెంచర్స్‌కు 14, లారస్ బయో ప్రమోటర్లకు 9 శాతం వాటా ఉంటుంది. నూతనంగా అందుకున్న నిధులను ఫెర్మెంటేషన్ ఆధారిత తయారీ సామర్థ్యాల పెంపునకు వెచ్చించనున్నట్లు కంపెనీ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-12-2024

విశాఖ	610-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620-00
విజయవాడ	620-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620-00
వరంగల్	622-00
రిటైల్ ధర	6.80

టీవీఎస్ సరికొత్త రోనిన్

- జనవరిలో మార్కెట్లోకి రాక
- గివీతో కంపెనీ భాగస్వామ్యం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ 2025 ఎడిషన్ రోనిన్ మోటార్‌సైకిల్ ఆవిష్కరించింది. గోవాలో జరుగుతున్న టీవీఎస్ మోటోసోల్ 4.0 కార్యక్రమంలో ఈ సరికొత్త మోడల్ తళుక్కుమంది. 225 సీసీ ఇంజన్‌తో ఇది తయారైంది. 20 బీహెచ్‌పీ, 19 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. 5 స్పీడ్ గేర్‌బాక్స్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, బ్లూటూత్ కనెక్టివిటీ, ఎల్ఈడీ లైటింగ్, సైడ్ స్టాండ్ కట్-ఆఫ్ సెన్సార్, సైలెంట్ స్టార్టర్ వంటి హంగులు ఉన్నాయి. టీవీఎస్ రోనిన్ మిడ్-వేరియంట్ రైడర్‌ల భద్రత, స్థిరత్వాన్ని పెంపొందించడానికి డ్యూయల్-ఛానల్ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్‌తో రూపొందింది. బేస్ వేరియంట్‌కు సింగిల్ చానెల్ ఏబీఎస్ ఏర్పాటు చేశారు. 'ఈ అప్‌గ్రేడ్ టీవీఎస్ రోనిన్ యొక్క మూడు వేరియంట్‌లలో మరింత స్థిరమైన భేదాన్ని సృష్టిస్తుంది. ఇది రంగు, గ్రాఫిక్స్‌లో మాత్రమే కాకుండా కార్యాచరణలో కూడా స్పష్టమైన వ్యత్యాసాలను అందిస్తుంది' అని కంపెనీ తెలిపింది. గ్లేసియర్ సిల్వర్, చార్‌కోల్ ఎంబర్ అనే రెండు కొత్త రంగులను కంపెనీ పరిచయం చేసింది. ఈ కొత్త రంగులు రోనిన్ మోడల్‌లలో ఇప్పటికే ఉన్న డెల్టా బ్లూ, స్టార్‌గేజ్ బ్లాక్‌లను భర్తీ చేస్తాయి.

గివీతో టీవీఎస్ జోడీ..

ఈ సందర్భంగా మోటార్‌సైకిల్ లగేజ్ సిస్టమ్‌లో ప్రపంచ అగ్రగామిగా ఉన్న గివీతో టీవీఎస్ మోటార్ కంపెనీ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం వివిధ రైడింగ్ స్టైల్స్, స్టోరేజ్ అవసరాలకు అనుగుణంగా సమగ్రమైన ప్రీమియం లగేజ్ సొల్యూషన్‌లను అందజేస్తుందని టీవీఎస్ వివరించింది. ప్రత్యేకంగా టీవీఎస్ ద్విచక్ర వాహనాల కోసం కస్టమ్-డిజైన్ చేయబడిన ఫ్రేమ్‌లు, మౌంట్‌లను గివీ అభివృద్ధి చేస్తుంది. ఈ భాగస్వామ్యం ద్విచక్ర వాహనాల యాక్సెసరీల విభాగంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని, ఆధునిక మోటార్‌సైక్లిస్ట్‌లకు అత్యాధునిక డిజైన్, సౌకర్యాన్ని అందిస్తుందని టీవీఎస్ వివరించింది.

మహీంద్రా ఎలక్ట్రిక్ బ్రాండ్ 'బీఈ 6'

- వివాదం నేపథ్యంలో పేరు మార్పు
- ట్రేడ్‌మార్క్‌పై పోరాడతామని స్పష్టం

న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తన కొత్త ఎలక్ట్రిక్ వాహనాల బ్రాండ్‌ను 'బీఈ 6'గా మార్చాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. అయితే 'బీఈ 6ఈ' ట్రేడ్‌మార్క్ కోసం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌తో కోర్టులో గట్టి పోటీని కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్.. 6ఈ వినియోగంపై మహీంద్రా అండ్ మహీంద్రాపై కోర్టుకెక్కిన సంగతి తెలిసిందే. 'మా ఉత్పాదనను మార్కెట్‌కు తీసుకువెళ్లేటప్పుడు కస్టమర్లకు అద్భుతమైన అనుభవాన్ని అందించడంపై మా ప్రాధాన్యత, దృష్టి ఉంది. భారత్‌లో ఎలక్ట్రిక్ ఆధారిత రవాణాను ప్రాచుర్యంలోకి తీసుకురావాలనే మా సంకల్పం నుండి దృష్టి మరల్చడం మాకు ఇష్టం లేదు.



రెండు పెద్ద భారతీయ బహుళజాతి సంస్థలు అపసవ్య, అనవసర సంఘర్షణలో నిమగ్నమవ్వడం కూడా మేము అనాలోచితంగా భావిస్తున్నాం. వాస్తవానికి మనం ఒకరి పెరుగుదల, విస్తరణలో ఒకరినొకరు సమర్థించుకోవాలి. అందుకే కంపెనీ తన ఉత్పత్తిని 'బీఈ 6'గా బ్రాండ్ చేయడానికి నిర్ణయం తీసుకుంటోంది. అయితే ఇండిగో చేస్తున్న వాదన నిరాధారమైనదని మేము విశ్వసిస్తున్నాము. మా గుర్తు విలక్షణం, విభిన్నమైనది. సవాలు చేయకపోతే అక్షరాలు, అంకెలతో కూడిన గుర్తింపులను గుత్తాధిపత్యం చేయడంలో అనారోగ్యకర ఉదాహరణగా నిలుస్తుంది. ఇది పరిశ్రమలు, రంగాలలోని అన్ని కంపెనీలకు చాలా అడ్డంకిగా ఉంటుంది. మేము దీన్ని కోర్టులో గట్టిగా పోటీ చేయడం కొనసాగిస్తాం. 'బీఈ 6ఈ' బ్రాండ్ పేరుపై మా హక్కును కాపాడుకుంటాం' అని మహీంద్రా స్పష్టం చేసింది.

ఎన్‌జే బయోలో సువెన్‌కు వాటా

- సువెన్‌కు దక్కనున్న 56% వాటా
- డీల్ విలువ 64.4 మిలియన్ డాలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న సువెన్ ఫార్మాస్యూటికల్స్ యూఎస్‌కు చెందిన ఎన్‌జే బయో ఇంక్‌లో నియంత్రణ వాటాను కొనుగోలు చేస్తున్నట్లు శనివారం తెలిపింది. డీల్ విలువ 64.4 మిలియన్ డాలర్లు. 56 శాతం వాటాను దక్కించుకుంటున్నట్లు సువెన్ ఫార్మా వెల్లడించింది. డిసెంబరు చివరిలోగా ఈ డీల్ పూర్తి అవుతుందని భావిస్తున్నారు. ఈ లావాదేవీ ఏడీసీల వంటి అభివృద్ధి చెందుతున్న పద్ధతుల్లో ఎండ్-టు-ఎండ్ పరిష్కారాలను అందించే సాంకేతికతతో కూడిన కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీగా (సీడీఎంవో) ఉండాలనే కంపెనీ దృష్టికి అనుగుణంగా ఉందని సువెన్ ఫార్మాస్యూటికల్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వివేక్ శర్మ తెలిపారు. 'ఎన్‌జే బయో యొక్క సామర్థ్యాలు, స్థిరపడిన కస్టమర్ సంబంధాలు ఈ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏడీసీ/ఎక్స్‌డీసీ విభాగంలో గ్లోబల్ లీడర్‌గా సువెన్ ప్రయాణాన్ని వేగవంతం చేస్తాయి. ఇది చాలా ముఖ్యమైన విధానాల్లో ఒకటిగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే 1,00,000 మందికి పైగా రోగుల జీవితాలను మెరుగుపరిచింది' అని ఆయన తెలిపారు. కంపెనీ గత కొన్ని సంవత్సరాలుగా సంక్లిష్టమైన ఏడీసీ సవాళ్లను పరిష్కరించడం ద్వారా ఖాతాదారులకు అపారమైన విలువను సృష్టించిందని ఎన్‌జే బయో వ్యవస్థాపకుడు, సీఈవో నరేష్ జైన్ వివరించారు.

ఆర్గానిక్ వరల్డ్ 30 కొత్త స్టోర్లు

ఏడాది కాలంలో హైదరాబాద్‌లో ఏర్పాటు

హైదరాబాద్: ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయించే 'ది ఆర్గానిక్ వరల్డ్' హైదరాబాద్‌లో మరింత విస్తరించనుంది. 2025 చివరి నాటికి 30 స్టోర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించింది. బెంగళూరుకు చెందిన నిమిడా గ్రూప్ కంపెనీ అయినా ఆర్గానిక్ వరల్డ్ కర్నాటక వెలుపల తొలి స్టోర్‌ను హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌లో ఏర్పాటు చేయడం గమనార్హం. 2025 మార్చి నాటికి రూ. 100 కోట్ల ఆదాయం సాధించాలన్నది ఈ సంస్థ లక్ష్యం. దేశవ్యాప్తంగా టైర్-2, 3 పట్టణాలకు తన కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రకటించింది. సౌకర్యం, క్విక్‌కామర్స్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఆర్డర్ చేసిన 2 గంటల్లో డెలివరీ చేసే సేవలను ప్రారంభించాలని భావిస్తోంది.

పేపేలో పేటీఎం వాటాల విక్రయం

రూ.2,000 కోట్లుగా అంచనా



న్యూఢిల్లీ: పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ అప్రధాన్య వ్యాపారాల నుంచి క్రమంగా తప్పుకుంటోంది. సినిమా, ఈవెంట్ టికెట్లను విక్రయించే పేటీఎం ఇన్‌సైడర్‌ను ఇటీవలే జొమాటోకు విక్రయించడం ద్వారా రూ.2,048 కోట్లు సమకూర్చుకున్న పేటీఎం.. తాజాగా జపాన్‌కు చెందిన పే పే కార్పొరేషన్‌లో తనకున్న వాటాలను విక్రయించాలని నిర్ణయించింది. ఈ వాటాల వలువ 236 మిలియన్ డాలర్లు (సుమారు రూ.2,000 కోట్లు) ఉంటుందని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల అంచనా. పే పే కార్పొరేషన్‌లో వన్97 కమ్యూనికేషన్స్‌కు 7.2 శాతం వాటా ఉంది. ''జపాన్‌కు చెందిన పే పే కార్పొరేషన్‌లో స్టాక్ అక్విజిషన్ రైట్స్ (ఎస్ఏఆర్)ను విక్రయించాలని బోర్డు నిర్ణయం తీసుకున్నట్టు వన్97 కమ్యూనికేషన్ సింగపూర్ ప్రైవేటు లిమిటెడ్ నుంచి సమాచారం వచ్చింది''అని స్టాక్ ఎక్స్ఛేంజీలకు పేటీఎం వెల్లడించింది.

అన్నపూర్ణ ఫైనాన్స్‌కు నిధులు



న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలకు రుణాలను సమకూరుస్తున్న అన్నపూర్ణ ఫైనాన్స్ తాజాగా సుమారు రూ.927 కోట్లు సేకరించినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈసీబీ విధానంలో ఈ సామాజిక రుణ మొత్తాన్ని అందుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఆగ్నేయాసియా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికాకు చెందిన 10 ఆర్థిక సంస్థల నుండి ఈ నిధులను సేకరించినట్లు ఒడిశాకు చెందిన అన్నపూర్ణ ఫైనాన్స్ ప్రకటించింది. అదనంగా సుమారు రూ.338 కోట్లు సేకరించడానికి కంపెనీకి వెసులుబాటు ఉంది. గ్రామీణ మహిళలు, వెనుకబడిన వర్గాలకు రుణాలు ఇవ్వడానికి ఈ నిధులను ఉపయోగించనున్నట్లు కంపెనీ తెలిపింది. ఆర్థిక సేవలను అన్ని ప్రాంతాలకు విస్తరించడం, ఆర్థిక భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం, భారత్‌లో బ్యాంకు సేవలు లేని ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేయడం లక్ష్యంగా చేసుకున్నట్లు వివరించింది. స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఈ రుణ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. అన్నపూర్ణ ఫైనాన్స్ 21 రాష్ట్రాల్లోని 424 జిల్లాల్లో 1,500 శాఖల ద్వారా 29 లక్షల మందికిపైగా రుణగ్రహీతలకు సేవలు అందిస్తోంది.

రుణాల మంజూరులో కీలకంగా యూపీఐ

క్రెడిట్ హిస్టరీ లేకున్నా సామాన్యులకు రుణం ● లావాదేవీల ఆధారంగా నిర్ణయిస్తున్న కంపెనీలు



న్యూఢిల్లీ: రుణాల మంజూరులో యూని ఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) కీలకంగా మారిందని ఒక నివేదిక వెల్లడించింది. 'ఓపెన్ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు: రుణం పొందడంలో చిక్కులు' పేరుతో చేసిన అధ్యయనం ప్రకారం.. ప్రధానంగా క్రెడిట్ హిస్టరీ (గతంలో రుణం పొందడం) లేని వారు రుణం అందుకోవడానికి యూపీఐ దోహద పడుతోంది. యూపీఐ యాప్స్ ఆధారంగా జరిగిన డిజిటల్ చెల్లింపుల లావాదేవీల సమాచారం అందుబాటులో ఉన్నందున.. రుణ మంజూరుకై నిర్ణయాలు తీసుకునేందుకు రుణ దాతలకు మార్గం సుగమం అవుతోంది. మొదటిసారిగా అధికారికంగా రుణం అందుకోవడానికి సామాన్యులకు వీలు కల్పి స్తోంది. యూపీఐ లావాదేవీలలో 10% పెరుగుదల క్రెడిట్ లభ్యత 7% దూసుకెళ్లేందుకు దారితీసింది. రుణగ్రహీతలను మెరుగ్గా అంచనా వేయడానికి రుణదాతల కు డిజిటల్ ఫైనాన్షియల్ హిస్టరీలు ఎలా ఉపయోగపడ్డాయో ఈ గణాంకాలు ప్రతి బింబిస్తున్నాయి. రుణాల్లో వృద్ధి ఉన్నప్ప టికీ డిఫాల్ట్ రేట్లు పెరగలేదు. యూపీఐ- ఆధారిత డిజిటల్ లావాదేవీ డేటా రుణ దాతలు బాధ్యతాయుతంగా విస్తరించడంలో సహాయపడింది. 2016లో ప్రారంభించినప్పటి నుండి భారత్‌లో ఆర్థిక లభ్యతను యూపీఐ సమూలంగా మార్చింది.

75 శాతం యూపీఐ కైవసం..

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ 30 కోట్ల మంది వ్యక్తులు, 5 కోట్ల మంది వ్యాపా రులు అడ్డంకులు లేని డిజిటల్ లావా దేవీలను నిర్వహించడానికి వీలు కల్పించింది. 2023 అక్టోబర్ నాటికి భారత్‌లోని మొత్తం రిటైల్ డిజిటల్ చెల్లింపుల్లో 75 శాతం యూపీఐ కైవసం చేసుకుంది. పాల్గొనే బ్యాంకుల కస్టమర్లందరికీ చెల్లింపులను సేవగా అందించడానికి యాప్‌లను రూపొందించడానికి థర్డ్ పార్టీ వెండార్లను యూపీఐ చెల్లింపుల వ్యవస్థ అనుమతిస్తుంది. రియల్ టైమ్‌లో ధృవీకరించదగిన డిజిటల్ లావాదేవీల సమాచారం యూపీఐ ఆధారంగా అందుబాటులో ఉంటుంది. కస్టమర్లు ఈ సమాచారాన్ని రుణాన్ని అందుకునే ప్రక్రియలో భాగంగా ఆర్థిక సంస్థలు, అనుబంధ కంపెనీలతో పంచుకో వచ్చు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో విస్తృతంగా యూపీఐని ఆదరించడంలో అందుబాటులో ఉన్న డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషించింది. యూపీఐతో భారత దేశం సాధించిన విజయం ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తోంది. పబ్లిక్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఓపెన్ బ్యాంకింగ్ విధానాలతో కలపడం ఎక్కువ మందికి రుణాలు అందుతాయి. అలాగే ఆవిష్కరణలను, సమానమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుందని అధ్యయనం వివరించింది.

సాయి లైఫ్‌సైన్సెస్ ఐపీవో

ధర శ్రేణి రూ. 522-549



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ ఫార్మా సంస్థలు మొదలైన వాటికి డ్రగ్ డిస్కవరీ తదితర సేవలు అందించే సాయి లైఫ్ సైన్సెస్‌కి సంబంధించిన ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) డిసెంబర్ 11న ప్రారంభమై 13న ముగుస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ తేదీ డిసెంబర్ 10గా ఉంటుంది. ఒక్కో షేరుకు ధర శ్రేణి రూ. 522-549గా ఉంటుంది. ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 3,043 కోట్లు సమీకరించనుంది. రూ. 950 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ప్రమోటర్లు.. ఇన్వెస్టర్ షేర్‌హోల్డర్లు, ఇతరత్రా షేర్‌హోల్డర్లు 3.81 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద విక్రయించనున్నారు. ఐపీవో ద్వారా సమీకరించిన నిధుల్లో సుమారు రూ. 720 కోట్ల మొత్తాన్ని రుణాల చెల్లింపునకు, మరి కొంత భాగాన్ని ఇతరత్రా కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది. సాయి లైఫ్ సైన్సెస్ ఈ ఏడాది జూలైలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ సమర్పించగా నవంబర్‌లో అనుమతులు వచ్చాయి. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల వ్యవధిలో కంపెనీ రూ. 693 కోట్ల ఆదాయంపై రూ. 28 కోట్ల లాభం నమోదు చేసింది.

2030 నాటికి రూ. 1.46 లక్షల కోట్ల పెట్టుబడులు

టాటా పవర్ భారీ ప్రణాళికలు



న్యూఢిల్లీ: 2030 నాటికి నిర్వహణ సామర్థ్యలను రెట్టింపు స్థాయికి పెంచుకోవడంపై టాటా పవర్ దృష్టి పెట్టింది. 31.9 గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యన్ని సాధించే దిశగా రూ. 1.46 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. కంపెనీ సీఈవో, ఎండీ ప్రవీర్ సిన్హా ఈ విషయాలు వెల్లడించారు. 2024 ఆర్థిక సంవత్సరంలో టాటా పవర్ స్థాపిత సామర్థ్యం 15.6 గిగావాట్లుగా ఉంది. ఇందులో పునరుత్పాదక విద్యుత్ విభాగం వాటా 6.7 గిగావాట్లుగా ఉండగా.. ఇది 2030 నాటికి నిర్దేశించుకున్న విద్యుదుత్పత్తి సామర్థ్యంలో 23 గిగావాట్లకు పెరగనుంది. మరోవైపు, ట్రాన్స్‌మిషన్ విభాగాన్ని కూడా పటిష్ఠం చేసుకుంటున్నట్లు సిన్హా చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం 4,633 సీకేఎంగా (సర్క్యూట్ కిలోమీటర్స్) ఉన్న ట్రాన్స్‌మిషన్ లైన్ల సామర్థ్యాన్ని 10,500 సీకేఎంకి పెంచుకోనున్నట్లు వివరించారు. అలాగే కస్టమర్ల సంఖ్యను 1.25 కోట్ల నుంచి 4 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సిన్హా చెప్పారు. దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం రూ. 21,000 కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరం రూ. 26,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం రూ. 61,542 కోట్లుగా ఉన్న ఆదాయాన్ని 2030 నాటికి రూ. 1 లక్ష కోట్లకు, నికర లాభాన్ని రూ. 4,100 కోట్ల నుంచి రూ. 10,000 కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు సిన్హా చెప్పారు.

అంతర్జాతీయ సంస్థగా అవతరిస్తాం


బీఎస్ఈ ఎండీ సుందరరామన్ రామమూర్తి



సింగపూర్: అంతర్జాతీయ సంస్థగా అవతరించేందుకు సర్వ సన్నద్ధంగా ఉన్నట్లు బీఎస్ఈ ఎండీ, సీఈవో సుందరరామన్ రామమూర్తి ప్రకటించారు. గడిచిన 15 నెలల కాలంలో రూ.500 కోట్లు ఇన్వెస్ట్ చేయడం ద్వారా వసతులు, టెక్నాలజీని మెరుగుపరుచుకున్నట్లు చెప్పారు. ఫ్యూచర్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎఫ్ఐఏ) ఆసియా సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన బీఎస్ఈ ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా తిరిగి తన స్థానాన్ని పొందినట్లు చెప్పారు. వేగంగా వృద్ధి సాధిస్తున్న భారత ఆర్థిక వ్యవస్థకు లండన్, న్యూయార్క్, ఫ్రాంక్‌ఫర్ట్ తరహాలో వేగవంతమైన ఈక్విటీ మార్కెట్ కూడా అవసరం ఉంటుందన్నారు. పెరుగుతున్న అంతర్జాతీయ, స్థానిక డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తాము టెక్నాలజీ, వసతులపై పెట్టుబడులు పెట్టినట్టు చెప్పారు. 2022లో రోజువారీ 100 మిలియన్ ఆర్డర్లు నిర్వహిస్తే, ఇప్పుడు రోజువారీ 12 బిలియన్ ఆర్డర్లకు పెరిగినట్టు తెలిపారు. 2023 జనవరి 4న బీఎస్ఈ ఎండీ, సీఈవో బాధ్యతలు చేపట్టిన రామమూర్తి, దేశంలోనే తొలి స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తుండడం గమనార్హం. టైర్ 2, 3, 4 పట్టణాల్లోని యువ ఇన్వెస్టర్లను మొబైల్ యాప్‌ల ద్వారా వేగంగా చేరుకోవచ్చంటూ.. బీఎస్ఈ సైతం సిమ్యులేషన్ ఆధారిత యాప్‌ను తీసుకురావడంలో పురోగతిలో ఉన్నట్టు రామమూర్తి తెలిపారు.

భారత్‌లో అద్భుత అవకాశాలు

- పెట్టుబడులపై 15-20 రెట్ల ప్రతిఫలం
- అమెరికా ఇన్వెస్టర్లకు కేవీ సుబ్రమణియన్ సూచన



వాషింగ్టన్: అమెరికా ఇన్వెస్టర్లకు భారత్ అసాధారణ రీతిలో అవకాశాలు కల్పిస్తోందని ఐఎంఎఫ్‌లో భారత ఈడీగా పనిచేస్తున్న కేవీ సుబ్రమణియన్ అన్నారు. వచ్చే 20-25 ఏళ్లలో ఈ స్థాయి రాబడులు మరే ఆర్థిక వ్యవస్థ కల్పించలేదన్నారు. తాను రాసిన ఒక పుస్తకావిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత్‌వైపు చూస్తున్న ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను రెట్టింపు కాకుండా మూడింతలు చేయాలని సూచించారు. వారి పెట్టుబడులు 15-20 రెట్లు వృద్ధి చెందుతాయన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ఇండియా ః100: భవిష్యత్ ఆర్థిక శక్తిని ఊహించడం' పేరుతో సుబ్రమణియన్ రచించిన ఈ పుస్తకంలో.. భారత్ 100వ స్వాతంత్ర దినోత్సవం నిర్వహించుకునే 2047 నాటికి, 25 ఏళ్లలోపే 55 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎలా అవతరించగలదన్నది వివరించారు. 2014 తర్వాత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు, బలమైన విధానాలను ప్రవేశపెట్టడాన్ని ప్రస్తావించారు. కేవీ సుబ్రమణియన్ ప్రస్తుత పదవికి పూర్వం భారత ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేయడం గమనార్హం.

భారత్‌లో వేతన వృద్ధి ఎక్కువ..

భారత బ్యాంక్ ఖాతాల్లో పొదుపు చేసుకుంటే అమెరికా బ్యాంకుల కంటే ఎక్కువ రాబడి వస్తుందని భారత సంతతి వారికి సుబ్రమణియన్ సూచించారు. అమెరికాలో కంటే భారత్‌లో వేతన వృద్ధి ఎక్కువగా ఉంటుందన్నారు. ''డాలర్ల రూపంలో 12 శాతం వృద్ధి ఉంటే, భారత్‌లో 17-18 శాతం మేర వృద్ధి చెందనుంది. అంటే ప్రతి ఐదేళ్లకు వేతనం రెట్టింపు అవుతుంది. 30 ఏళ్ల కెరీర్‌లో ఏడు వేతన రెట్టింపులు చూడొచ్చు. అంటే 100 రెట్ల వృద్ధి. అదే యూఎస్‌లో అయితే గరిష్ఠంగా ఏడెనిమిది రెట్ల వృద్ధే ఉంటుంది''అని వివరించారు. 2047 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 55 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ధృడమైన విశ్వాసం వ్యక్తం చేశారు.

స్పామ్ కాల్స్ నివారణకు మార్గదర్శకాలు

వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే



న్యూఢిల్లీ: వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు స్పామ్ కాల్స్, మెసేజ్‌ల నివారణకు అతి త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. వినియోగదారులకు వచ్చే ఇబ్బందికర/ప్రమోషనల్ లేదా అయాచిత వాణిజ్య కాల్స్ సమస్యను పరిష్కరించడానికి వినియోగదారుల వ్యవహారాల శాఖ ముసాయిదా మార్గదర్శకాలను 2024 జూన్‌లో రూపొందించింది. 'ఇబ్బందికర కాల్స్ నివారణపై వినియోగదారుల వ్యవహారాల శాఖ పని చేయడం ప్రారంభించింది. ఇందులో భాగంగా విభిన్న భాగస్వాములతో నిమగ్నమవ్వాల్సి వచ్చింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ కూడా నిబంధనలతో ముందుకు వస్తోంది. టెలికం నియంత్రణ సంస్థకు పూర్తి అధికారాలను ఇవ్వాలనుకుంటున్నాము. కాబట్టి మేము నెమ్మదించాం. కంజ్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు టెలికం పరిశ్రమ కొన్ని మార్గదర్శకాలను రూపొందించాలని కోరుతోంది' అని నిధి ఖరే వివరించారు. తుది మార్గదర్శకాలను నోటిఫై చేయాలని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ) టెలికం శాఖకు ఇటీవల లేఖ రాసింది.



సిరీస్‌లో నిలిచేందుకు...

రెండో వన్డే బరిలో భారత మహిళలు ● ఆస్ట్రేలియాతో నేడు పోరు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ ఓడిన భారత మహిళల జట్టు సిరీస్‌ను కాపాడుకునే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. నేడు జరిగే రెండో వన్డేలో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్ లోపాలను అధిగమించి పటిష్టమైన ఆసీస్‌తో ఢీకొనేందుకు భారత్ సిద్ధమైంది. ఇదే వేదికపై జరిగిన తొలి మ్యాచ్‌లో అమ్మాయిల జట్టు కనీసం 35 ఓవర్లయినా ఆడలేక 100 పరుగులకే కుప్పకూలింది. టాపార్డర్‌లో ఓపెనర్లు స్మృతి మంధాన (8), ప్రియా పూనియా (3) ఇద్దరు సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరడం, వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్ (19) వైఫల్యం బ్యాటింగ్ ఆర్డర్‌పై పెను ప్రభావమే చూపింది. ఓవరాల్‌గా 11 మంది బ్యాటింగ్‌కు దిగితే ఒక్క జెమీమా రోడ్రిగ్స్ (23) మాత్రమే ఇరవై పైచిలుకు స్కోరు చేయగలిగింది. అనుభవజ్ఞురాలైన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా ఆసీస్ బౌలింగ్‌కు చేతులెత్తేసింది. ఇప్పుడు రెండో వన్డేలో ఈ పేలవ ఆటతీరు కొనసాగిస్తే మాత్రం పెర్త్‌కు ముందే ఇక్కడే సిరీస్‌ను ప్రత్యర్థి జట్టుకి సమర్పించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బ్యాటింగ్ విభాగంలో అందరు సమష్టి బాధ్యత తీసుకోవాలి. క్రీజులో నిలబడి పరుగులు రాబడితే బౌలర్లకు మ్యాచ్ గెలిపించేందుకు ఆస్కారం ఉంటుంది. అంతే కానీ వారి సొంతగడ్డపై వందకో... 150 పరుగులకో కుప్పకూలితే ఆసీస్ చకచకా ఛేదించడం ఖాయం. ఆసీస్ స్పీడ్‌స్టర్ మేగన్ షట్ (5/19)ను ఎదుర్కోవడంపై భారత బ్యాటర్లు కసరత్తు చేయాలి. బౌలర్లలో రేణుక, ప్రియా మిశ్రా ఆకట్టుకున్నారు. బౌలింగ్ దళంతో ఏ ఇబ్బంది లేకపోయినా కీలకమైన రెండో వన్డేలో అన్ని విభాగాలు సత్తా చాటాల్సిన అవసరముంది. బ్యాటింగ్‌లోనూ ఆసీస్ బలంగా కనిపిస్తోంది. ఎలిస్ పెరీ, లిచ్‌ఫీల్డ్, బెత్‌మూనీ, సదర్లాండ్, గార్డ్‌నర్ ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సమర్థులు.

భారత్ X బంగ్లాదేశ్

నేడు అండర్-19 ఆసియా కప్ ఫైనల్

దుబాయ్: అండర్-19 ఆసియా కప్ టోర్నమెంట్ చరిత్రలో యువ భారత్ హాట్ ఫేవరెట్. ఇప్పటివరకు 8 టైటిల్స్ గెలిచింది. గత ఏడాదీ గెలిచే దారిలో బంగ్లాదేశ్ అడ్డుకుంది. దీంతో 2023 టోర్నీలో భారత అండర్-19 టీమ్ సెమీఫైనల్లో నిష్క్రమించింది. ఇప్పుడు ఆ సెమీస్ పరాభవానికి బదులు తీర్చుకునే అవకాశం వచ్చింది. డిఫెండింగ్ చాంపియన్ బంగ్లాదేశ్‌ను అమీతుమీలో కంగు తినిపించి తొమ్మిదోసారి విజేతగా నిలిచేందుకు యువ భారత్ తహతహలాడుతోంది. ఆదివారం జరిగే ఫైనల్లో బంగ్లాపై విజయమే లక్ష్యంగా భారత కుర్రాళ్ల జట్టు బరిలోకి దిగుతోంది. టోర్నీలో పాక్‌తో తొలి మ్యాచ్ ఓడాక భారత్ వరుస విజయాలు సాధించింది. పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న యువ జట్టు వరుసగా జపాన్‌పై ఏకంగా 211 పరుగుల తేడాతో, యూఏఈపై పది వికెట్ల తేడాతో, సెమీఫైనల్లో లంకపై 7 వికెట్ల తేడాతో ఇలా ప్రతీజట్టుపై భారీ విజయాలనే నమోదు చేసింది. 13 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ ఓపెనింగ్‌లో అదరగొడుతున్నాడు. ఆయుశ్ మాత్రేతో కలిసి చక్కని శుభారంభాలు ఇస్తున్నాడు. ఈ టోర్నీలో ఆయుశ్ 175 పరుగులు చేయగా, వైభవ్ 167 పరుగులతో నిలకడను ప్రదర్శించారు. నేడు జరిగే తుది పోరులోనూ వీళ్లిద్దరు మరో శుభారంభం ఇస్తే భారత్ ట్రోఫీ గెలిచేందుకు సులువవుతుంది. మరోవైపు బంగ్లాదేశ్ బౌలింగ్ అస్త్రాలతో ప్రత్యర్థుల్ని కట్టిపడేస్తోంది. సెమీఫైనల్లో పాక్‌ను 116 పరుగులకే కుప్పకూల్చింది. బౌలర్లు ఫహాద్, ఇక్బాల్ హసన్ ఎమన్ ఇద్దరు ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తిస్తున్నారు. ఇద్దరు చెరో 10 వికెట్లతో జోరు మీదున్నారు. బ్యాటింగ్‌లో కెప్టెన్ అజీజుల్ హకీమ్, కలామ్ సిద్దిఖీ, అబ్రార్ ఫామ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగే టైటిల్ పోరు భారత్ బ్యాటింగ్, బంగ్లా బౌలింగ్ మధ్య రసవత్తరంగా జరగనుంది.



భారీ ఆధిక్యంలో ఇంగ్లండ్

533 పరుగుల ముందంజ ● రెండో ఇన్నింగ్స్‌లో 378/5
మెరిసిన డకెట్, బెథెల్, రూట్ ● న్యూజిలాండ్‌తో రెండో టెస్టు


బెథెల్

వెల్లింగ్టన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ జట్టు... న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారీ ఆధిక్యం దక్కించుకుంది. వన్డే తరహా ఆటతీరుతో విరుచుకుపడ్డ ఇంగ్లండ్... శనివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి 76 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 378 పరుగులు చేసింది. బెన్ డకెట్ (112 బంతుల్లో 92; 6 ఫోర్లు, 1 సిక్స్), జాకబ్ బెథెల్ (118 బంతుల్లో 96; 10 ఫోర్లు, 3 సిక్స్) సెంచరీలు చేజార్చుకోగా... జో రూట్ (106 బంతుల్లో 73 బ్యాటింగ్; 5 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (55; 5 ఫోర్లు) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో జో రూట్ అరుదైన ఫీట్ సాధించాడు. టెస్టు క్రికెట్‌లో రూట్ 50 అంతకంటే ఎక్కువ స్కోరు చేయడం ఇది వందోసారి కావడం విశేషం. సుదీర్ఘ ఫార్మాట్‌లో 35 సెంచరీలు చేసిన రూట్... మరో 65 అర్ధశతకాలు తన పేరిట లిఖించుకున్నాడు. క్రికెట్ చరిత్రలో సచిన్ టెండూల్కర్, జాక్ కలిస్, రికీ పాంటింగ్ మాత్రమే టెస్టుల్లో వందసార్లకు పైగా 50+స్కోర్లు నమోదు చేసుకోగా... ఇప్పుడు ఈ జాబితాలో రూట్ నాలుగో ప్లేయర్‌గా చేరిపోయాడు. న్యూజిలాండ్ బౌలర్లలో సౌథీ, హెన్రీ చెరో 2 వికెట్లు పడగొట్టారు. చేతిలో 5 వికెట్లు ఉన్న ఇంగ్లండ్... ఓవరాల్‌గా 533 పరుగుల ఆధిక్యంలో ఉంది. రూట్‌తో పాటు కెప్టెన్ బెన్ స్టోక్స్ (26 బంతుల్లో 35 బ్యాటింగ్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నారు.

అట్కిన్‌సన్ హ్యాట్రిక్

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 86/5తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ చివరకు 34.5 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. విలియమ్సన్ (37) మినహా ఏ ఒక్కరూ ఆకట్టుకోలేకపోయారు. టామ్ బ్లన్‌డెల్ (16), నాథన్ స్మిత్ (14) విఫలం కాగా.. గ్లెన్ ఫిలిప్స్ (16 నాటౌట్) అజేయంగా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లలో అట్కిన్‌సన్ హ్యాట్రిక్‌తో ఆకట్టుకున్నాడు. ఇన్నింగ్స్ 35వ ఓవర్ మూడో బంతికి నాథన్ స్మిత్‌ను అవుట్ చేసిన అట్కిన్‌సన్... ఆ తర్వాత వరుస బంతుల్లో మ్యాట్ హెన్రీ (0), టిమ్ సౌథీ (0)ని పెవిలియన్ పంపి హ్యాట్రిక్ పూర్తి చేసుకున్నాడు. బ్రైడన్ కార్స్ 4 వికెట్లు పడగొట్టాడు.

చాంపియన్ ల్యోషా



సాక్షి, హైదరాబాద్: యోనెక్స్-సన్‌రైజ్ మినీ జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ షట్లర్ కోరుకొండ ల్యోషా రెండు విభాగాల్లో చాంపియన్‌గా నిలిచింది. థానే వేదికగా జరిగిన ఈ టోర్నీలో బాలికల సింగిల్స్‌తో పాటు డబుల్స్‌లో ల్యోషా విజేతగా నిలిచింది. అండర్-11 విభాగంలో నిర్వహించిన ఈ టోర్నీ బాలికల సింగిల్స్‌లో శనివారం ల్యోషా 21-16, 17-21, 21-12తో శాన్వి నిమ్మపై విజయం సాధించింది. హైదరాబాద్‌లోని సిక్కీ-సుమీత్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ల్యోషా టోర్నీ ఆసాంతం చక్కటి ఆటతీరుతో ఆకట్టుకుంది. బాలికల డబుల్స్‌లో ల్యోషా-శాన్వి జంట 15-21, 21-16, 21-9 తేడాతో సుమయ్య షరీఫ్-శాంభవి శర్మ ద్వయంపై గెలిచింది. జాతీయ చాంపియన్‌షిప్‌లో రెండు ట్రోఫీలు నెగ్గిన ల్యోషాను కోచ్‌లు అభినందించారు.

డబ్ల్యూపీఎల్ మినీ వేలానికి 120 మంది ప్లేయర్లు

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మినీ వేలంలో 120 మంది ప్లేయర్లు పాల్గొననున్నారు. ఈ నెల 15న జరగనున్న డబ్ల్యూపీఎల్ వేలంలో అందుబాటులో ఉన్న 19 స్థానాల కోసం భారత్ నుంచి 91 మంది ప్లేయర్లు, విదేశాల నుంచి 29 మంది ప్లేయర్లు బరిలో ఉన్నారు. ఇందులో అసోసియేషన్ దేశాలకు చెందిన ముగ్గురు ప్లేయర్లు ఉన్నారు. గుజరాత్ ఫ్రాంచైజీ వద్ద అత్యధికంగా రూ.4.4 కోట్లు ఉన్నాయి. గుజరాత్ నలుగురు ప్లేయర్లను ఎంపిక చేసుకోవాల్సి ఉండగా... యూపీ వారియర్స్ జట్టు ముగ్గురు ప్లేయర్లను కొనుగోలు చేసుకోనుంది. ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలు తలా నలుగురు ప్లేయర్లను కొనుగోలు చేయనున్నాయి. భారత ఆటగాళ్లలో ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా రూ. 30 లక్షల కనీస ధరతో వేలానికి రానుండగా... విదేశీ ప్లేయర్లలో డాటిన్ (వెస్టిండీస్), హీథర్ నైట్ (ఇంగ్లండ్)పై అదరి దృష్టి నిలవనుంది. వీరిద్దరూ రూ. 50 లక్షల కనీస ధరతో వేలంలో పాల్గొంటున్నారు.

దక్షిణాఫ్రికా 191/3

శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 328


మార్క్రమ్

పోర్ట్ ఎలిజబెత్: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. శనివారం ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 55 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. ఎయిడెన్ మార్క్రమ్ (75 బంతుల్లో 55; 5 ఫోర్లు) అర్ధ శతకంతో మెరవగా... కెప్టెన్ తెంబా బవుమా (48 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టబ్స్ (36 నాటౌట్; 2 ఫోర్లు) రాణించారు. వీరిద్దరూ అజేయమైన నాలుగో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 2 వికెట్లు పడగొట్టాడు. చేతిలో 7 వికెట్లు ఉన్న ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని ప్రస్తుతం 221 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 242/3తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక చివరకు 99.2 ఓవర్లలో 328 పరుగులకు ఆలౌటైంది. ఏంజెలో మాథ్యూస్ (44; 6 ఫోర్లు), కమిందు మెండిస్ (48; 4 ఫోర్లు) కాస్త పోరాడారు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా (14), కుశాల్ మెండిస్ (16), ప్రభాత్ జయసూర్య (24) మరికొన్ని పరుగులు జోడించారు. సఫారీ బౌలర్లలో ప్యాటర్సన్ 5 వికెట్లు పడగొట్టగా.. యాన్సెన్, కేశవ్ మహరాజ్ చెరో రెండు వికెట్లు తీశారు.

సునీల్ ఛెత్రి హ్యాట్రిక్

● కేరళపై బెంగళూరు విజయం
● ఇండియన్ సూపర్ లీగ్

బెంగళూరు: స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రి (8వ, 73వ, 90+8వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించడంతో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ ఏడో విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో బెంగళూరు జట్టు 4-2 గోల్స్‌తో కేరళ బ్లాస్టర్స్‌పై గెలుపొందింది. భారత మాజీ కెప్టెన్ ఛెత్రి ఐఎస్‌ఎల్‌లో హ్యాట్రిక్ నమోదు చేసిన పెద్ద వయస్కుడి (40 ఏళ్ల 126 రోజులు)గా రికార్డుల్లోకి ఎక్కాడు. గతంలో ఓగ్బచే (38 ఏళ్ల 96 రోజుల్లో) పేరిట ఉన్న ఈ రికార్డును ఛెత్రి తిరగరాశాడు. ర్యాన్ విలియమ్స్ (38వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. కేరళ బ్లాస్టర్స్ తరఫున జీసెస్ జిమెన్జ్ (56వ నిమిషంలో), ఫ్రెడ్డీ (67వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. నిర్ణీత సమయంలో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై ఐదుసార్లు దాడి చేసి అందులో నాలుగు గోల్స్ సాధించగా.. కేరళ బ్లాస్టర్స్ ఏడుసార్లు ప్రయత్నించి అందులో రెండు సార్లు మాత్రమే సఫలమైంది. ఈ సీజన్‌లో 11 మ్యాచ్‌లు ఆడిన బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ 7 విజయాలు, 2 పరాజయాలు, 2 'డ్రా'లతో 23 పాయింట్లు ఖాతాలో వేసుకొని పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. కేరళ జట్టు 11 పాయింట్లతో పట్టిక పదో స్థానంలో నిలిచింది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ 2-0 గోల్స్ తేడాతో చెన్నైయిన్ ఎఫ్‌సీపై గెలుపొందింది. ఈస్ట్ బెంగాల్ జట్టు తరఫున విష్ణు (54వ నిమిషంలో), జాక్సన్ సింగ్ (84వ నిమిషంలో) చెరో గోల్‌తో సత్తా చాటారు.


సునీల్ ఛెత్రి



తనిషా
ధ్రువ్

ఫైనల్లో అశ్విని పొన్నప్ప జోడీ

● సింగిల్స్‌లో సతీశ్, అన్‌మోల్ తుది పోరుకు...
● గువాహటి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

గువాహటి: భారత సీనియర్ డబుల్స్ షట్లర్ అశ్విని పొన్నప్ప తన భాగస్వామితో కలిసి మహిళల డబుల్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. గువాహటి మాస్టర్స్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీలో మహిళల సింగిల్స్‌లో అన్‌మోల్ ఖర్బ్, పురుషుల సింగిల్స్‌లో సతీశ్ కుమార్ కరుణాకర్ తుదిపోరుకు అర్హత సంపాదించారు. శనివారం జరిగిన సెమీఫైనల్లో అన్‌సీడెడ్ సతీశ్ 13-31, 21-14, 21-16తో ఆరో సీడ్ వాంగ్ జెంగ్ జింగ్ (చైనా)ను కంగు తినిపించాడు. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో అన్‌మోల్ 21-19, 21-17తో మాన్సి సింగ్‌పై గెలుపొందగా, మహిళల డబుల్స్ సెమీఫైనల్లో టాప్‌సీడ్ అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 21-14, 21-14తో షు లియంగ్ కెంగ్-వాంగ్ టింగ్ జె జోడీపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలతో జోడీకట్టిన తనిషా క్రాస్టోకు సెమీస్‌లో నిరాశ ఎదురైంది. సెమీస్‌లో ఐదో సీడ్ ధ్రువ్-తనిషా ద్వయం 22-24, 11-21తో చైనాకు చెందిన జంగ్ హన్ యూ-లి జింగ్ బావో జంట చేతిలో ఓడింది. నేడు జరిగే ఫైనల్లో సతీశ్ కుమార్... చైనా క్వాలిఫయర్ జువన్ చెన్ జుతో, అన్‌మోల్ కూడా క్వాలిఫయర్ యన్ యన్ (చైనా)తో తలపడతారు. టాప్‌సీడ్ అశ్విని-తనిషా జోడీ... లి హు జో- వాంగ్ జి మెంగ్ (జంట)తో పోటీ పడనుంది.

సర్వీసెస్ రెజ్లర్ల పసిడి పట్టు

జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్

బెంగళూరు: జాతీయ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ రెజ్లర్లు ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్‌ఎస్‌సీబీ)కు చెందిన రెజ్లర్లు శనివారం ఆరు స్వర్ణాలు గెలుపొందారు. పురుషుల విభాగంలో సోను (97 కేజీలు), వినాయక్ (67 కేజీలు), లలిత్ (55 కేజీలు), ప్రవేశ్ (60 కేజీలు), అంకిత్ (72 కేజీలు), కరణ్ (77 కేజీలు) బంగారు పతకాలు సాధించారు. ఫైనల్లో సోను 3-0తో నమన్ (ఢిల్లీ)పై వినాయక్ 2-1తో అనిల్ (హరియాణా)పై, లలిత్ 7-0తో మను యాదవ్ (ఛత్తీస్‌గఢ్)పై కరణ్ 11-2తో అమిత్ (జార్ఖండ్)పై గెలుపొందారు. ప్రవేశ్... సాగర్ (పంజాబ్)పై, అంకిత్... ఆకాశ్ (హరియాణా)పై విక్టరీ బై ఫాల్‌తో గెలిచారు. దీంతో సర్వీసెస్ టీమ్ 220 పాయింట్లతో అగ్ర స్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత స్థానాల్లో హరియాణా (146), ఢిల్లీ (132) ఉన్నాయి. హరియాణా తరఫున అమన్ (82 కేజీలు), సునీల్ కుమార్ (87 కేజీలు) బంగారు పతకాలు గెలుపొందారు. ఢిల్లీకి చెందిన ఉమేశ్ (63 కేజీలు) పసిడి పతకం చేజిక్కించుకున్నాడు. మహిళల 50 కేజీల ఫైనల్లో శివాని (మధ్యప్రదేశ్) 12-4తో వినిత (హరియాణా)పై గెలిచి స్వర్ణం నెగ్గింది. 72 కేజీల తుదిపోరులో ప్రియాంక (హరియాణా) 6-4తో లక్ష్మీ పాండే (ఉత్తరప్రదేశ్)పై గెలిచింది.

తెలుగు టైటాన్స్ గెలుపు



తెలుగు టైటాన్స్, బెంగాల్ వారియర్స్ మ్యాచ్‌లో ఓ దృశ్యం

ప్రొ కబడ్డీ లీగ్

పుణే: ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ పదో విజయంతో నాలుగో స్థానానికి ఎగబాకింది. శనివారం జరిగిన పోరులో టైటాన్స్ 34-32తో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది. తెలుగు కెప్టెన్ విజయ్ మాలిక్ 19 సార్లు కూతకెళ్లి 11 పాయింట్లు తెచ్చిపెట్టాడు. మిగతా వారిలో ఆశిష్ నర్వాల్ (9) రాణించాడు. బెంగాల్ వారియర్స్ తరఫున మణిందర్ సింగ్ (14), మన్‌జీత్ (7) అదరగొట్టారు. దీంతో ఇరుజట్ల మధ్య ఆఖరిదాకా హోరాహోరీ సమరం జరిగింది. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో యూపీ యోధాస్ 36-33తో పుణేరి పల్టన్‌పై విజయం సాధించింది. యూపీ రెయిడర్ గగన్ గౌడ (15) చెలరేగాడు. 17 సార్లు కూతకెళ్లిన గగన్ క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చిపెట్టాడు. మిగతా వారిలో భవాని రాజ్‌పుత్ (6) రాణించగా, కెప్టెన్ సుమిత్ 3, అశు సింగ్, మహేందర్, హితేశ్ తలా 2 పాయింట్లు చేశారు. పల్టన్ జట్టులో పంకజ్ మోహితే (11), మోహిత్ గోయత్ (7) రాణించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్... యు ముంబాతో గుజరాత్ జెయంట్స్ తలపడతాయి.



శాంటా సంబరాలు
క్రిస్మస్ ఉత్సవాల్లో భాగంగా శనివారం జర్మనీలోని హెర్న్‌లో స్లెడ్జ్‌పై అలరిస్తున్న శాంటాక్లజ్ వేషధారి



దరాగ్ బీభత్సం
దరాగ్ తుఫాను కారణంగా బ్రిటన్‌లో వేల్స్ సమీపంలో శనివారం రాకాసి అలలు ఇలా ఎగసిపడ్డాయి

హోం శాఖ కోసం శివసేన పట్టు

మహారాష్ట్ర కేబినెట్‌పై నేడు స్పష్టత వచ్చే అవకాశం

ముంబై: మహారాష్ట్రలోని అధికార మహాయుతి పక్షాలు శాఖల కేటాయింపుపై ఎడతెగని చర్చలు జరుపుతున్నాయి. హోం శాఖ తమకే కావాలంటూ ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన పట్టుబడుతోంది. ఆదివారం కల్లా మంత్రివర్గం కూర్పుపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయంటున్నారు. దేవేంద్ర ఫడ్నవీస్ సారథ్యంలోని కేబినెట్ విస్తరణ ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో పూర్తవుతుందని చెబుతున్నారు. బీజేపీ, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి ఇటీవలి ఎన్నికల్లో ఘన విజయం సాధించినప్పటికీ అంతర్గత పోటీ కారణంగా సీఎం అభ్యర్థిని తేల్చేందుకు 12 రోజులు పట్టడం, చివరికి డిసెంబర్ 5న సీఎంగా ఫడ్నవీస్ ప్రమాణం చేయడం తెలిసిందే. డిప్యూటీ సీఎంలు షిండే, అజిత్ పవార్ ప్రమాణం చేశారు. అసెంబ్లీలోని 288 స్థానాలకు గాను అత్యధికంగా 132 సీట్లు గెలుచుకున్న బీజేపీ సీఎం సహా 22 వరకు శాఖలు, శివసేన 11- 12, ఎన్సీపీ 9-10 శాఖలు దక్కించుకునే చాన్సుంది.

ఢిల్లీలో వ్యాపారి సహా ఇద్దరు హత్య

హోం మంత్రి అమిత్ షా ఎన్నికలతో బిజీ: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో శనివారం ఇద్దరు హత్యకు గురవడంపై ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ మండిపడ్డారు. వరుస ఘటనలతో ఢిల్లీలో శాంతి భద్రతలు తీవ్రంగా క్షీణిస్తున్నా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాత్రం ఎన్నికలతో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. 'ఢిల్లీలో శాంతి భద్రతల బాధ్యత అమిత్ షాదే. ఆయన మాత్రం ఢిల్లీని గ్యాంగ్‌స్టర్లకు అప్పగించేసి, ఎన్నికల రాజకీయాలతో బిజీగా ఉన్నారు. హత్యలకు పాల్పడిన వారు పట్టుబడుతుండగా కుట్రదారులు మాత్రం తప్పించుకుంటున్నారు'అంటూ ఘాటు విమర్శలు చేశారు. శనివారం షాహదారా ప్రాంతానికి చెందిన వ్యాపారి సునీల్ జైన్(52) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా యమునా స్పోర్ట్ కాంప్లెక్స్ వద్ద బైక్‌పై వచ్చిన వ్యక్తులు కాల్పులు జరిపారు. ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గోవింద్‌పురిలో మరుగుదొడ్డి విషయమై జరిగిన ఘర్షణలో బిక్రం సింగ్, భార్య, కుమారులు కలిసి సుధీర్, అతడి సోదరుడు, స్నేహితునిపై కత్తులతో దాడి చేశారు. సుధీర్ ప్రాణాలు కోల్పోగా మిగతా ఇద్దరు గాయపడ్డారు.

వారసున్ని నిర్ణయించేది పార్టీయే: మమత

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ)లో సీనియర్లు, యువ నేతల మధ్య అంతర్గత విభేదాలు చోటుచేసుకుంటున్నాయన్న వార్తలపై ఆ పార్టీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. తన వారసులెవరనేది ఏకాభిప్రాయంతో పార్టీయే నిర్ణయిస్తుంది తప్ప, వ్యక్తిగతంగా తాను కాదన్నారు. బెంగాలీ వార్తా చానెల్ న్యూస్ 18 బంగ్లాతో శుక్రవారం ఆమె మాట్లాడారు. 'పార్టీ అంటే నేనొక్కదాన్నే కాదు. మేమందరం కలిస్తేనే పార్టీ. ఇదో ఉమ్మడి కుటుంబం. నిర్ణయాలన్నీ సమష్టిగానే జరుగుతాయి'అని ఆమె వివరించారు. 'క్రమశిక్షణ కలిగిన టీఎంసీలో ఎవరో ఒకరు ఆదేశాలను జారీ చేయరు. ప్రజలకు కావాల్సిందేమిటో పార్టీయే నిర్ణయిస్తుంది. మా ఎమ్మెల్యేలు, ఎంపీలు, బూత్ కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేస్తారు'అని ఆమె అన్నారు.

ముగ్గురు సీఎంల ముచ్చట



కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో భక్తుల కోసం సిద్ధం చేసిన తాత్కాలిక ఆవాసాలను శనివారం పరిశీలిస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



నూతన అసెంబ్లీ తొలి సమావేశాల సందర్భంగా శనివారం ముంబైలో శివాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మహారాష్ట్ర కొత్త సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులు అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే తదితరులు



శనివారం పచ్‌మడీలో పర్యటించిన సందర్భంగా రాజ్ భవన్లో సరదాగా బిలియర్డ్స్ ఆడుతున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

శతాబ్దాల ఖ్యాతి.. సమున్నతం

అంగరంగ వైభవంగా పునఃప్రారంభమైన

నోట్రే డామ్ చర్చి

- ఐదేళ్లలోనే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ
- పారిస్‌లో దేశాధినేతల సమక్షంలో వేడుకలు
- హాజరైన ట్రంప్, ప్రిన్స్ విలియం తదితరులు

ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరంలో 861 సంవత్సరాల చరిత్ర కలిగిన నోట్రే డామ్ చర్చి మళ్లీ పునరుజ్జీవనం చెందింది. ఐదేళ్ల క్రితం భారీ అగ్నిప్రమాదంలో పాక్షికంగా ధ్వంసమై కోట్లాది క్రైస్తవ భక్తుల్లో ఆవేదన మిగిల్చిన ఈ చర్చి మళ్లీ ప్రార్థనలకు సిద్ధమైంది. అప్పట్లో దీని పూర్తి నిర్మాణానికి ఏకంగా 200 ఏళ్లు పట్టిందని చెబుతారు. విభిన్నమైన డిజైన్, విశిష్ట నిర్మాణ శైలికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఈ చర్చికి మళ్లీ ఆ రూపం తేవడం చాలా కష్టమని నిర్మాణ రంగ నిపుణులే పెదవి విరిచారు. అయినా ఫ్రాన్స్ ప్రభుత్వం వెరవకుండా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన చర్చికి ప్రాణప్రతిష్ట చేసింది. కేవలం ఐదేళ్లలో ఏకంగా రూ.6,350 కోట్ల భారీ వ్యయంతో నాణ్యతో రాజీ పడకుండా అదే స్థాయిలో పునరుద్ధరించింది. శనివారం చర్చి పునఃప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, బ్రిటన్ యువరాజు విలియంసహా దాదాపు 50 దేశాలకు చెందిన అధి పతులు, రాజులు, సెలబ్రిటీలు, వివిధ దేశాల నుంచి 170 మంది బిషప్‌లు, ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు. రికార్డు సమయంలో చర్చిని అందుబాటులోకి తేవడంలో కార్మికుల అంకితభావం దాగుందని మేక్రాన్ జాతి నుద్దేశించి ప్రసంగంలో చెప్పారు. కోర్సియా పర్యటనలో ఉన్న పోప్ ఫ్రాన్సిస్ ఈ కార్యక్రమంలో పాల్గొన లేదు.


2,000 మంది నిపుణులతో..

2019 ఏప్రిల్ 15న ఘోర అగ్నిప్రమాదంలో చర్చి పై కప్పు, శిఖరం, అంతర్గత దారు నిర్మాణాలన్నీ కాలి బూడిదయ్యాయి. షార్ట్ సర్క్యూటో, కాల్చేసిన సిగరెట్ పీకో ఇందుకు కారణమంటారు. చర్చి పునఃనిర్మాణ వ్యయాన్ని భరిస్తామంటూ ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు ముందుకొచ్చారు. వేలాది కోట్ల విరాళాలిచ్చారు. చర్చి నిర్మాణ ఖర్చంతా ఇలా సమకూరిందే! పునర్నిర్మాణ క్రతువులో ఏకంగా 2,000 మంది నిపుణులు భాగస్వాములయ్యారు. అత్యంత నాణ్యమైన కలపను ఇచ్చే 2,000 ఓక్ చెట్ల నుంచి సేకరించిన కలపను ఈ నిర్మాణంలో వాడారు.

భారీ సంగీత విభావరితో..

చర్చి ప్రారంభోత్సవంలో భాగంగా ప్రముఖ సంగీతకళాకారులతో భారీ సంగీత విభావరి నిర్వహించారు. ఒపెరా గాయకులు ప్రెటీ యేండీ, జూలీ ఫచ్, పియానిస్ట్ లాంగ్ లాంగ్ తదితరుల ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. పారిస్‌లోని సీన్ నదీ తీరం వెంట ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ తెరల్లో కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారంచేశారు. ప్రత్యక్షంగా 40,000 మంది, పరోక్షంగా కోట్లాది మంది వాటిని వీక్షించనున్నారు. ఆరుబయట కార్యక్రమం నిర్వహిద్దామనుకున్నా భారీ ఈదురు గాలుల వల్ల లోనికి మార్చారు. ఆదివారం నుంచి చర్చిలో ప్రార్థనలను అనుమతిస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



పునర్నిర్మాణం అనంతరం నోట్రేడామ్ చర్చి

2019లో అగ్నిప్రమాదం

సామ్యవాదంతో సంబంధం

మతసంబంధ ప్రదేశంగా మాత్రమే గాక ఫ్రాన్స్ రాజకీయాలతోనూ నోట్రేడామ్ చర్చి ముడిపడి ఉంది. ఫ్రెంచ్ విప్లవానికి, రెండు ప్రపంచయుద్ధాలకు ఇది సజీవ సాక్షి. 1302లో రాజు నాలుగో ఫిలిప్ ఎస్టేట్ చట్టాన్ని ఈ చర్చిలోనే చర్చించి ఖరారు చేశారు. పన్నులు, రాజ్య పరిపాలనపై ఇక్కడే నిర్ణయాలు జరిగాయి. రోడ్లన్నీ రోమ్‌కే దారి తీస్తాయి (ఆల్ రోడ్స్ లీడ్ టు రోమ్) అనే సామెతకూ ఈ చర్చే మూలం. రోమన్ సామ్రాజ్యంలో రోడ్లన్నీ ఈ చర్చి సమీపంగా వెళ్లాలని చక్రవర్తి అగస్టస్ ఆదేశించారు.

ప్రత్యేకతలెన్నో..

- పారిస్‌లోని ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాల్లో నోట్రేడామ్ చర్చి ఒకటి.
- ఫ్రాన్స్ చరిత్ర, సాంస్కృతిక వైభవంలో ఈ చర్చిది కీలక పాత్ర.
- దీన్ని ఏటా ఏకంగా 1.3 కోట్ల మంది విదేశీ పర్యాటకులు సందర్శిస్తుంటారు.
- ఈఫిల్ టవర్ కంటే ఈ చర్చిని చూడ్డానికి పారిస్‌లో అడుగుపెట్టేవాళ్లే ఎక్కువ.
- సీన్ నదిలో అత్యంత చిన్న ద్వీపమైన 'ది లే డీ లా సిట్'లో ఈ అద్భుత చర్చి నిర్మాణాన్ని నాటి బిషప్ మారీస్ డి సలీ ఆదేశాల మేరకు 1163లో పూర్తి చేశారు.
- 64 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ చర్చి 12వ శతాబ్దం దాకా యూరప్ ఖండంలో అతి పెద్ద మానవ నిర్మాణం.
- మెరోవియన్, కారోవియన్, రోమన్ల, గోథిక్ నిర్మాణ శైలిలో దీనిని కట్టారు.
- మన తల కంటే ముంజేయి పొడవు సరిగ్గా 1.61803399 రెట్లు పెద్దగా ఉంటుందని గణిత సూత్రం. దీన్నే గోల్డెన్ రేషియో అంటారు.
- చర్చి నిర్మాణంలో ఈ గణిత సూత్రాన్ని అణువణువునా వాడారు. చర్చిలో అంతర్నిర్మాణాల మధ్య కూడా ఇవే కొలతలను పాటించడంతో ఏ వైపు నుంచి చూసినా చర్చి ఎంతో అద్భుతంగా కనిపిస్తుంది.

అమెరికాకు గుడ్‌బై

ట్రంప్ గెలిచాక యూరప్ దేశాల్లో స్థిరపడేందుకు తరలిపోతున్న అమెరికన్లు !

ట్రంప్ గత పాలనాధోరణి నచ్చక వెళ్లిపోతున్న స్థానికులు! ● విదేశాల్లో స్థిరపడటంపై జనాల్లో పెరిగిన ఆసక్తి



అత్యున్నత జీవన ప్రమాణాలు, అపార ఉపాధి అవకాశాలు, స్వచ్ఛమైన గాలి, విస్తృతస్థాయి మౌలిక వసతులు, ప్రశాంత వాతావరణం, ఆధునికతకు, అత్యాధునిక టెక్నాలజీకి అమెరికా చిరునామా. అందుకే పేద, వర్ధమాన దేశాల పౌరులు అవకాశం చిక్కితే అమెరికాలో సెటిల్ అయిపోదామని కలలు కంటారు. ఆ కలలను నిజం చేసుకునేందుకు సక్రమంగా, అక్రమంగా ఏటా లక్షలాది మంది ఛలో అమెరికా అనేస్తున్నారు. అలాంటి అమెరికాను వద్దనుకునే వాళ్లు ఇప్పుడు లక్షల్లో ఉన్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అమెరికన్లు ఏరికోరి ఎన్నుకున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంపే ఈ పోకడకు అసలు కారణమని తెలుస్తోంది. తనకు నచ్చినట్లు పాలించే ట్రంప్‌తో వేగలేక యూరప్ దేశాలకు వలసవెళ్లాలనుకునే అమెరికన్ల సంఖ్య బాగా పెరిగిందని తాజా గణాంకాలు చాటుతున్నాయి.

ఎన్నికల తర్వాతే..

తాజా అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాత ఈ ధోరణి మరింత పెరిగింది. తొలిదఫా పాలనలో పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న ట్రంప్ రెండోదఫా ఇంకెంతటి విపరీత పోకడలను పాలనలో చూపిస్తారోననే భయంతో జనం తరలిపోవడానికి సిద్ధపడుతున్నారు. ''ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో నాలుగేళ్ల వీసా కోసం దరఖాస్తు చేసుకున్నా. ట్రంప్ పాలనలో ఇక్కడ బ్రతకడం కష్టం''అని కెంటకీలో ఉండే 50 ఏళ్ల అమెరికా మహిళ డానా మక్‌మహన్ చెప్పారు. ''కళాకారులకు, రచయితలకు ఫ్రాన్స్ ప్రభుత్వం ఇచ్చే నాలుగేళ్ల 'టాలెంట్ వీసా'కోసం దరఖాస్తు చేశా. ఇప్పటికే పారిస్‌లో నెలకు 1,100 యూరోల అద్దెకు ఇక చిన్న గది తీసుకున్నా. త్వరలో నా భర్త, కుక్క అమెరికాకు గుడ్‌బై చెప్పి పారిస్‌కు వస్తారు''అని మక్‌మహన్ చెప్పారు. ''పొయ్యి మీద పాత్రలో వేసిన పీతలా ఉంది మా పరిస్థితి. పాత్ర ఎప్పుడు వేడెక్కుతుందో చెప్పలేం. శ్వేతజాతీయులపై మక్కువ చూపే ట్రంప్‌కు నల్లజాతీయులంటే పడదు. మా లాంటి బ్లాక్ మనుషులకు ఇక్కడ కష్టాలు తప్పవు. ఫ్రాన్స్ లేదంటే నెదర్లాండ్స్, పోర్చుగల్, స్పెయిన్‌కు వెళ్లిపోతాం''అని ఆఫ్రికా మూలాలున్న అమెరికా మాజీ ప్రభుత్వ అధికారిణి చెప్పారు. ''నాజీల కాలంలో జర్మనీలో, 70వ దశకంలో ఇరాన్‌లో మహిళలు పడ్డ బాధలు, అమెరికా సేనలు వెనుతిరిగాక అఫ్గానిస్తాన్‌లో మహిళల దుస్థితి ఎలాగుందో రేపొద్దున మా పరిస్థితి అలాగే ఉండొచ్చు''అని గ్రాడ్యుయేట్ స్కూల్‌లో చదువుతున్న ఒక అమ్మాయి చెప్పింది. వీళ్లలా విదేశాలకు వెళ్లి స్థిరపడిపోదామనుకునే అమెరికన్ల నుంచి వలసల సంబంధ ఎంక్వైరీలు ఇమ్మిగ్రేషన్ సంస్థలకు ఇటీవల అనూహ్యంగా పెరిగాయి.

పెరుగుతున్న ఎంక్వైరీలు

ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత చూస్తే 'కెనడాలో స్థిరపడటం ఎలా?'అంటూ గూగుల్ సెర్చ్‌లో వెతుకులాటలు గతంలో ఎన్నడూలేనంతగా పెరిగాయి. ఇంతటి భారీ సెర్చ్‌లు ఏకంగా గత ఏడాదికాలంలో ఎప్పుడూ లేవని తేలింది. 2016లోనూ ట్రంప్ తొలిసారి గెలిచినప్పుడు ఎక్కువ మంది వలసపోవాలనుకున్నా తక్కువ మందే వెళ్లినట్లు తెలుస్తోంది. ఇక్కడి ఉద్యోగం వదులుకుని, పిల్లల చదువులను పణంగా పెట్టి, వృద్ధ తల్లిదండ్రులను వదిలి వెళ్లలేక చివర్లో తమ ప్రయత్నాలను విరమించుకున్నారు. అయితే గతంతో పోలిస్తే ఈసారి తమను వలస వివరాలు అడిగే వారి సంఖ్య విపరీతంగా పెరిగిందని 'వెల్‌కమ్ టు పోర్చుగల్', 'బ్యూరోక్రసీ.ఈఎస్'వెబ్‌సైట్లు వెల్లడించాయి. స్పెయిన్‌కు వస్తామని, వలస సంబంధ వివరాలు చెప్పాలని అడిగేవారి సంఖ్య మూడు రెట్లు పెరిగిందని చెప్పాయి. ''ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరుసటి రోజు ఉదయం ఆరు గంటల నుంచే న్యూయార్క్‌లోని మా ల్యాండ్‌లైన్ ఫోన్లు ఆగకుండా మోగుతూనే ఉన్నాయి''అని 'ఇటాలియన్ సిటిజన్‌షిప్ అసిస్టెంట్'సంస్థ అధికారి మార్కో పెర్మోనియన్ చెప్పారు. ''తమ దేశంలో స్థిరపడాలనుకునే వారికి ఒక్కో దేశం కొన్ని అర్హతలను నిర్దేశిస్తుంది. వాటి కోసం విడివిడిగా అర్హత పరీక్షలు పెడతాం. గత 10 నెలల్లో మా దగ్గర 60,000 మంది టెస్ట్ రాస్తే ఇటీవలికాలంలోనే మరో 48,000మంది టెస్ట్ రాశారు''అని ఎక్స్‌ప్యాట్‌సీ సంస్థ అధికారి జెన్ బార్నెట్ చెప్పారు. ''ఇక్కడి చట్టాలు బాలికా పరిరక్షణకు అనువుగా లేవు. పూర్వీకుల దేశం వియత్నాం వెళతా''అని మాయీ ఎన్‌గుయెన్ చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్ విజయం వెనుక బారన్

కుమారుడిపై మెలానియా పొగడ్తలు



న్యూయార్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు తన కుమారుడు బారన్ సైతం ఎన్నికల సమయంలో చక్కటి సహాయసహకారాలు అందించాడని ఆమె తల్లి మెలానియా ట్రంప్ వెల్లడించారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక మెలానియా తొలిసారిగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను పంచుకున్నారు. ఫాక్స్ న్యూస్ ఛానెల్‌లో శనివారం ఫాక్స్ అండ్ ఫ్రెండ్స్ మార్నింగ్ టీవీ షోలో ఆమె మాట్లాడారు. వ్యాఖ్యాత లారెన్స్ జోన్స్ అడిగిన ప్రశ్నలకు ఆమె సరదాగా సమాధానాలిచ్చారు. '' మిగతా ప్రచార వ్యూహకర్తల్లాగే మా కుమారుడు బారన్ సైతం ట్రంప్‌కు ఎంతో సాయపడ్డాడు. బారన్‌కు 18 ఏళ్లు. యుక్తవయసు ఓటర్లను ఆకర్షించేందుకు అనుసరించాల్సిన ప్రచార ఎత్తుగడలను బారన్ పంచుకున్నారు. కాలేజీ దశలో ఉన్న బరాన్‌కు నేటి యువత మనస్తత్వం బాగా తెలుసు. పాడ్‌కాస్ట్, లైవ్‌స్ట్రీమింగ్, సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ ద్వారానే వీళ్లకు చేరువకాగలం. యువ ఓటర్లు అమితంగా మెచ్చే, ఫాలో అయ్యే సెలబ్రిటీలు, ప్రముఖులతో ట్రంప్ ఉమ్మడిగా ప్రచారంచేసేలా బారన్ సలహాలిచ్చారు. జనరేషన్ జెడ్‌ను ఆకర్షించే మీడియా వ్యక్తులతో ప్రోగ్రామ్‌లు చేశాం. అవి ఫలవంతమయ్యాయి. యువ ఓటర్ల మద్దతూ ట్రంప్‌కి దక్కింది. వారి ఓట్లనూ ట్రంప్ కొల్లగొట్టగలిగారు. అధ్యక్షుడి కుమారుడి హోదాలో కాలేజీలో సీక్రెట్‌గా చదువుకోవడం, సాధారణ విద్యార్థిలా ఉండటం కష్టం. అయినా బారన్ తనకు నచ్చినట్లు ఉంటాడు'' అని చెప్పారు.

ఐదింటిలో ఒకటి 'కోత'

- పెరుగుతున్న సిజేరియన్లు
- దక్షిణాది రాష్ట్రాల్లోనే అధికం

గర్భిణుల్లో సహజ ప్రసవాల సంఖ్య నానాటికీ తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేట్ ఆసుపత్రులు వ్యాపార ధోరణితో సిజేరియన్(సి-సెక్షన్) ద్వారా ప్రసవాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దేశంలో ప్రతి ఐదు ప్రసవాల్లో ఒకటి కోత (సిజేరియన్) ద్వారా జరుగుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. ఇందులో అధికంగా ప్రైవేట్ హాస్పిటళ్లలోనే జరుగుతున్నట్లు తేలింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సహజ ప్రసవాలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధ్యయనకర్తలు గుర్తించారు. ఈ అధ్యయనం వివరాలను లాన్సెట్ రీజినల్ హెల్త్-సౌత్‌ఈస్టు ఆసియా జర్నల్‌లో ప్రచురించారు.

- ఢిల్లీలోని జార్జి ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ పరిశోధకులతోపాటు మరికొందరు ఈ అధ్యయనం జరిపారు.
- దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 15–49 ఏళ్ల మహిళల గణాంకాలను విశ్లేషించారు.
- ఇండియాలో సిజేరియన్ల రేటు 21.5 శాతమని తేలింది.
- సి-సెక్షన్ ప్రసవాలు నాగాలాండ్‌లో 5.2 శాతం కాగా తెలంగాణలో ఏకంగా 60.7 శాతం కావడం గమనార్హం.
- పేదల కంటే ధనిక మహిళల్లోనే సిజేరియన్లు ఎక్కువ.
- మధ్యతరగతి, ధనిక కుటుంబాల గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే సిజేరియన్ చేయించుకుంటున్నారు. అల్పాదాయ కుటుంబాల వారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.
- దాదాపు 70 శాతం రాష్ట్రాల్లో పేదల కంటే ధనికుల్లోనే సి-సెక్షన్ ప్రసవాల రేటు రెండింతలు అధికం.
- ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల కంటే తమిళనాడు, తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాల్లోనే సి-సెక్షన్ ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయి. అక్షరాస్యత, తలసరి ఆదాయం, మెరుగైన వైద్య సౌకర్యాలు ఉండడమే ఇందుకు కారణం.
- సంస్కృతి, సామాజికపరమైన అంశాలు కూడా కోత ప్రసవాలకు కారణమవుతున్నాయి. సహజ ప్రసవం అంటే భయం, శుభ ముహూర్తాన జన్మనివ్వాలన్న నమ్మకం, నొప్పి లేకుండా ప్రసవం జరగాలన్న ఆకాంక్షతో సి-సెక్షన్‌కు మొగ్గుతున్నారు.
- పేద రాష్ట్రంగా భావించే బిహార్‌లో సహజ ప్రసవాలే అధికం. కొన్ని సందర్భాల్లో సిజేరియన్ ద్వారా బిడ్డను కనాలని డాక్టర్లు సూచిస్తున్నా గర్భిణులు వెనుకంజ వేస్తున్నారు. ఖరీదైన వైద్య చికిత్స పొందే స్తోమత లేకపోవడంతో సహజ ప్రసవాలను ప్రాధాన్యం ఇస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రాజ్యసభలో గరిష్ఠ ప్రాతినిధ్యం ఉన్న రాష్ట్రం?

భారత రాజ్యాంగ పరిషత్ మొదట ఉప రాష్ట్రపతి పదవిని కల్పించలేదు. రాజ్యాంగ పరిషత్ ముఖ్య న్యాయ సలహాదారుడైన బెనగల నర్సింగరావు చొరవతో ఈ పదవిని ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి మరణించినా, సెలవులో ఉన్నా లేదా విధులు నిర్వర్తించలేని పరిస్థితిలో ఉన్నా కొత్త రాష్ట్రపతి ఎన్నికయ్యేంత వరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పార్లమెంట్‌లోని సభాధ్యక్షులు ఒక కమిటీగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వ పరిపాలన నిర్వహించాలని ఆయన సూచించారు. ఆ తర్వాత జరిగిన చర్చల ఫలితంగా హెచ్.వి. కామత్ తదితరులు ఉప రాష్ట్రపతి పదవి ఏర్పాటుకు కృషి చేశారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

భారత పార్లమెంట్

కేంద్ర స్థాయిలో శాసన నిర్మాణ శాఖ అంటే పార్లమెంట్ (సంసద్). రాజ్యాంగంలోని 79వ అధికరణం ప్రకారం పార్లమెంట్ అంటే లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి. రాజ్యాంగంలో అయిదో భాగంలోని రెండో అధ్యాయంలో 79 నుంచి 122 వరకు ఉన్న అధికరణలు భారత పార్లమెంట్ నిర్మాణం, అధికారాలు, విధుల గురించి పేర్కొంటున్నాయి.

- భారతదేశంలో 1952 నుంచి 1962 వరకు ద్విసభ్య నియోజకవర్గాలను ఏర్పాటు చేసేవారు.
- బ్రిటిష్ పార్లమెంట్‌లా భారతదేశ పార్లమెంట్‌కు సార్వభౌమాధికారం లేదు.
- 1954లో మొదటి లోక్‌సభ స్పీకర్ జి.వి. మౌలాంకర్ (గణేష్ వాసుదేవ్ మౌలాంకర్) ప్రజా ప్రతినిధుల సభకు లోక్‌సభ అని, రాష్ట్రాల మండలికి రాజ్యసభ అని నామకరణం చేశాడు.
- రాజ్యాంగంలో రాజ్యసభకు 'కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్', లోక్‌సభకు 'హౌస్ ఆఫ్ ది పీపుల్' అనే పదాలను ఉపయోగించారు. కానీ హిందీ భాషా పదాలైన రాజ్యసభ, లోక్‌సభ అనే పదాలే జన బాహుళ్యంలో వాడుకలోకి వచ్చాయి.

రాజ్యసభ

భారత రాజ్యాంగంలోని 80వ అధికరణను అనుసరించి రాజ్యసభను ఏర్పాటు చేశారు. రాజ్యాంగ పండితులు దీన్ని 'ఎగువసభ', 'రాష్ట్రాల పరిషత్', 'పెద్దల సభ'గా వర్ణించారు.

- రాజ్యసభ 1952 ఏప్రిల్ 3న ఏర్పాటైంది.
- రాజ్యసభ తొలి సమావేశాన్ని 1952 మే 13న నిర్వహించారు.
- హిందీలో 'రాజ్య' అంటే రాష్ట్రం అని అర్థం. అందువల్ల రాజ్యసభ అంటే రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే సభగా పేర్కొనవచ్చు.
- రాజ్యాంగం ప్రకారం రాజ్యసభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 250 మంది. ప్రస్తుతం రాజ్యసభలో 245 మంది సభ్యులున్నారు.
- ప్రస్తుతం 4వ షెడ్యూల్ ప్రకారం మొత్తం రాజ్యసభకు కేటాయించిన సభ్యుల సంఖ్య 233. సాహిత్యం, కళలు, శాస్త్ర విజ్ఞానం, సామాజిక సేవ మొదలైన రంగాల్లో విశేషానుభవం ఉన్న 12 మంది సభ్యులను 80(3)వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు.
- రాజ్యాంగంలోని 80(2)వ అధికరణం ప్రకారం రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ సభ్యులను రాష్ట్రాల అసెంబ్లీల సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి ప్రకారం ఎన్నుకుంటారు.
- 80(4)వ అధికరణం ప్రకారం పార్లమెంట్ రూపొందించిన చట్టం ఆధారంగా రాజ్యసభలో కేంద్రపాలిత ప్రాంతాల ప్రాతినిధ్యం ఉంటుంది.
- 80(5)వ అధికరణం ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీట్ల కేటాయింపు రాజ్యాంగంలోని 4వ షెడ్యూల్ ప్రకారం జరగాలి.
- భారత రాజ్యాంగం సమాఖ్య విధానాన్ని అనుసరిస్తోంది. కాబట్టి పార్లమెంట్‌లో రాష్ట్రాల ప్రాతినిధ్యం అవసరమైంది. ఈ కారణంగా రాజ్యసభను ఏర్పాటు చేశారు.
- 'ప్రతి రాష్ట్రం నుంచి ఎగువ సభలో సమాన ప్రాతినిధ్య పద్ధతి' అనే అమెరికా సమాఖ్యకు చెందిన విధానం మన రాజ్యాంగంలో లేదు.
- 4వ షెడ్యూల్‌లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జనాభా ఆధారంగా రాజ్యసభలో ప్రతినిధుల సంఖ్యను నిర్ణయించారు.
- ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు కేటాయించిన సభ్యుల సంఖ్య 31 మంది.
- నాగాలాండ్, మణిపూర్ నుంచి ఒక్కో సభ్యుడిని మాత్రమే కేటాయించారు.
- రాజ్యసభకు నిర్వహించే ఎన్నికల పద్ధతిని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

రాజ్యసభకు పోటీ చేయడానికి కావాల్సిన అర్హతలు:

1. భారతదేశ పౌరుడై ఉండాలి.
2. వయసు కనీసం 30 ఏళ్లు ఉండాలి.
3. ఆదాయాన్ని పొందే ప్రభుత్వ ఉద్యోగం చేయకూడదు.
4. పార్లమెంట్ చట్టాలరీత్యా నిర్దేశించిన ఇతర అర్హతలు కలిగి ఉండాలి.

శాశ్వత సభ: లోక్‌సభలా రాజ్యసభకు నిర్ణీత కాల పరిమితి ఉండదు. ఇది శాశ్వత సభ. ఇది రద్దు కాదు. మొత్తం సభ్యుల్లో మూడో వంతు సభ్యులు ప్రతి రెండేళ్లకు ఒకసారి పదవీ విరమణ చేస్తారు. వీరి స్థానంలో కొత్త సభ్యులను ఎన్నుకుంటారు. పదవీ విరమణ చేసిన సభ్యులు తిరిగి పోటీ చేయవచ్చు. ఒక్కో సభ్యుడు ఆరేళ్లు కొనసాగుతాడు.

- అధికరణ 83(1) ప్రకారం రాజ్యసభ కాలపరిమితి గురించి వివరించారు.
- 89వ అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎక్స్-అఫీషియో ఛైర్మన్‌గా ఉప రాష్ట్రపతి వ్యవహరిస్తారు. ఈయనకు నిర్ణాయక ఓటు ఉంటుంది.
- రాజ్యసభ సభ్యులు తమలో నుంచి ఒకరిని డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు.
- మొదటి రాజ్యసభ ఛైర్మన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.
- మొదటి రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ - ఎస్.వి. కృష్ణమూర్తి రావు.
- రాజ్యసభ సమావేశానికి కావాల్సిన కనిష్ఠ సభ్యుల సంఖ్యను 'కోరమ్' అంటారు. మొత్తం సభ్యుల్లో పదో వంతును కోరమ్‌గా పరిగణిస్తున్నారు.

రాజ్యసభ ప్రత్యేక అధికారాలు:

1. 67వ అధికరణం ప్రకారం ఉప రాష్ట్రపతిని తొలగించే తీర్మానాన్ని ముందుగా రాజ్యసభలోనే ప్రవేశపెట్టాలి.
2. అధికరణ 249 ప్రకారం రాష్ట్ర జాబితాలోని ఏదైనా అంశానికి జాతీయ ప్రాముఖ్యం ఉందని భావించి రాజ్యసభ 2/3వ వంతు మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదిస్తే ఏడాది కాలానికి చెల్లుబాటయ్యే విధంగా శాసనం చేయవచ్చు.
3. అధికరణ-312 ప్రకారం నూతన అఖిల భారత సర్వీసులను ఏర్పాటు చేయడానికి సంబంధించిన బిల్లు ముందుగా రాజ్యసభ ఆమోదం పొందాలి.

- రాజ్యసభలో ప్రాతినిధ్యం ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు - ఢిల్లీ, పుదుచ్చేరి.
- జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు సంబంధించిన తీర్మానాన్ని రాజ్యసభ ఒక నెలలోపు ఆమోదించాలి.
- రాష్ట్రపతి పాలనకు సంబంధించిన తీర్మానాన్ని రాజ్యసభ రెండు నెలల్లోపు ఆమోదించాలి.
- లోక్‌సభ ఆమోదించిన ఆర్థిక బిల్లులను రాజ్యసభ 14 రోజుల్లోపు ఆమోదించాలి.
- **రాజ్యసభలో ఒక సభ్యుడిని మాత్రమే కలిగి ఉన్న రాష్ట్రాలు:** అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, గోవా, మేఘాలయా, సిక్కిం, త్రిపుర.
- కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి నుంచి రాజ్యసభకు ఒక సభ్యుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- ఢిల్లీ (కేంద్రపాలిత ప్రాంతం) నుంచి రాజ్యసభకు ముగ్గురు సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- తెలంగాణ, అసోం, పంజాబ్ రాష్ట్రాల నుంచి ఏడుగురు సభ్యుల చొప్పున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రాజ్యసభ ఛైర్మన్: పార్లమెంట్‌లోని ఉభయసభలను నిర్వహించడానికి విడివిడిగా సభాధ్యక్షులు ఉంటారు. 89వ అధికరణం ప్రకారం భారత ఉప రాష్ట్రపతి రాజ్యసభకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

- ఏ కారణంగానైనా రాజ్యసభ ఛైర్మన్ అందుబాటులో లేనప్పుడు డిప్యూటీ ఛైర్మన్ సభను నిర్వహిస్తారు.
- రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ కూడా అందుబాటులో లేనప్పుడు సభా నియమావళి ప్రకారం ఎంపిక చేసిన ఒక సీనియర్ సభ్యుడు సమావేశాలను నిర్వహిస్తారు.
- రాజ్యాంగంలో 89 నుంచి 92 వరకు ఉన్న అధికరణలు రాజ్యసభ సభాధ్యక్షుల ఎన్నిక, రాజీనామా, సమావేశాలకు సంబంధించిన వివరాలను తెలుపుతున్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

సీఈఐఎల్, ముంబైలో 42 పోస్టులు

మహారాష్ట్రలోని సర్టిఫికేషన్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సీఈఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 42.
- » **పోస్టుల వివరాలు:** ఇంజనీర్-16, సీనియర్ ఇంజనీర్-14,సీనియర్ ఆఫీసర్-02,డిప్యూటీ మేనేజర్-03,అసోసియేట్ గ్రేడ్-1/2/3-07.
- » **విభాగాలు:** క్వాలిటీ అసురెన్స్/క్వాలిటీ కంట్రోల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, హ్యూమన్ రిసోర్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో డిప్లొమా, సీఏ, బీఈ/బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ /ప్రొడక్షన్), బీబీఏ, బీసీఏ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నోటిఫికేషన్ వెలువడిన 15 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- » **పని చేయాల్సిన ప్రదేశాలు:** ముంబై, ఢిల్లీ.
- » **ఈమెయిల్:** recruit.hr3@ceil.co.in
- » **నోటిఫికేషన్ వెలువడిన తేది:** 29.11.2024.
- » **వెబ్‌సైట్:** https://ceil.co.in

ఏవీఎన్ఎల్, చెన్నైలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

చెన్నైలోని ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్) ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 04.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా/ఎంబీఏ/పీజీ ఉత్తీర్ణులవ్వాలి. ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 27 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.40,000.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** దరఖాస్తును స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా ది చీఫ్ జనరల్ మేనేజర్, ఏవీఎన్ఎల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెర్నింగ్, ఏవీఎన్ఎల్ (హెచ్‌వీఎఫ్) ఎస్టేట్, అవడి, చెన్నై-600054 చిరునామకు పంపించాలి.
- » **నోటిఫికేషన్ తేది:** 22.11.2024.
- » **వెబ్‌సైట్:** http://avnl.co.in

ఐసీఎంఆర్-ఎన్ఐవోహెచ్, అహ్మదాబాద్‌లో 27 పోస్టులు

అహ్మదాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ (ఎన్ఐవోహెచ్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 27.
- » **పోస్టుల వివరాలు:**అసిస్టెంట్-02,టెక్నీషియన్ 1-19, ల్యాబొరేటరీ అటెండెంట్1-06.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వేతనం:** నెలకు అసిస్టెంట్ పోస్టుకు రూ.35,400 నుంచి రూ.1,12,400, టెక్నీషియన్ పోస్టుకు రూ.19,900 నుంచి రూ.63,200, ల్యాబొరేటరీ అటెండెంట్‌కు రూ.18,000 నుంచి రూ.56,900.
- » **వయసు:** అసిస్టెంట్ పోస్టుకు 30 ఏళ్లు, టెక్నీషియన్ పోస్టుకు 28 ఏళ్లు, ల్యాబొరేటరీ అటెండెంట్‌కు 25 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తులకు చివరితేది:** 11.12.2024.
- » **వెబ్‌సైట్:** https://nioh.org

సీటీయూఏపీలో లైబ్రేరియన్ పోస్టులు

విజయనగరంలోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 01.
- » **అర్హత:** లైబ్రేరియన్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్/డాక్యుమెంటేషన్ సైన్స్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **దరఖాస్తు ఫీజు:** ఇతరులకు రూ.2000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.1000.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.11.2024.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**20.12.2024
- » **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.12.2024
- » **వెబ్‌సైట్:** https://www.ctuap.ac.in

జీఐసీఐ, ముంబైలో 110 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(జీఐసీఐ) అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 110.
- » **విభాగాలు:** జనరల్, లీగల్, హెచ్ఆర్, ఇంజనీరింగ్.
- » **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఏదైనా డిగ్రీ, ఎంబీబీఎస్, సీఎఫ్ఏ/సీఏ/సీఎంఏ/ఎంకాం, పీజీ, ఎల్ఎల్ఎం ఉత్తీర్ణతతో పాటు ఇతర నైపుణ్యాలు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.85,000.
- » **వయసు:** 01.01.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్, ఆన్‌లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.12.2024.
- » **న్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.12.2024. ఆన్‌లైన్ పరీక్ష తేది: 05.01.2025.
- » **పనిచేయాల్సిన ప్రదేశం:** ముంబై.
- » **వెబ్‌సైట్:** https://www.gicre.in

బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసేవి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

జీవులు - వర్గీకరణ

జీవులు సుమారు 3,500 బిలియన్ సంవత్సరాల క్రితం భూగోళంపైన ఏర్పడ్డాయి. వీటి గురించి వివరంగా తెలుసుకొనేందుకు వాటి వర్గీకరణ అవసరం. దీన్ని ఆధారంగా చేసుకొని అరిస్టాటిల్ మొదట శాస్త్రీయంగా వర్గీకరించే ప్రయత్నం చేశాడు. ఇతడు మొట్టమొదట మొక్కలను గుల్మాలు, పొదలు, వృక్షాలు అని, జంతువులను ఎరుపు రక్తం ఉన్నవి, ఎరుపు రక్తం లేనివి అని వర్గీకరించాడు.

తర్వాత లిన్నేయస్ రెండు రాజ్యాల వర్గీకరణను అభివృద్ధి చేశారు. వాటిలో

1) వృక్షరాజ్యం, 2) జంతురాజ్యం.

సూక్ష్మదర్శినిని కనుగొన్న తర్వాత కణ నిర్మాణం వరకు పరిశీలించి కణ కవచం ఉన్న వాటిని ఒక సమూహంగా, కణ కవచం లేని వాటిని వేరొక సమూహంగా వర్గీకరించారు. అలాగే విట్టేకర్ 1969లో కణ నిర్మాణాన్ని బట్టి జీవులను ఐదు రాజ్యాలుగా వర్గీకరించాడు.

1) మొనీరా 2) ప్రొటిస్టా
3) ఫంగీ 4) ప్లాంటేరియా
5) ఆనిమేలియా

1. **మొనీరా:** ఏకకణ నిర్మాణం కలిగిన జీవులను వీటిలో చేర్చారు. ఆర్కి బ్యాక్టీరియా, యూబ్యాక్టీరియం, మైకోప్లాస్మా, ఆక్టినోమైసిటిస్ మొదలైన కేంద్రక పూర్వజీవులు (ప్రోకేరియోట్స్) ఉన్నాయి. ఆర్కిబ్యాక్టీరియాలో కఠినమైన ఆవాసాలలో నివసించేవి ఉన్నాయి.
   1) హాలోఫిల్స్ - అత్యధిక లవణయుత ప్రాంతాలు
   2) థర్మోఅసిడోఫిల్స్ -వేడినీటి చలమలలో..
   3) మిథనోజెన్స్ - బురద ప్రదేశాల్లో

ఇవి ఆవులు, గేదెలు వంటి వాటి జీర్ణాశయాలలో జీవిస్తూ వాటి విసర్జక పదార్థాల నుంచి మీథేన్ (బయోగ్యాస్) ఉత్పత్తికి దోహదపడుతాయి.

- యుబ్యాక్టీరియా అనేవి అత్యధికంగా ఉండే సూక్ష్మజీవులు. వీటిలో గోళాకార (కోక్కై), దండాకార (బాసిల్లై), కామా ఆకారం (విబ్రియో),సర్పిలాకార (స్పైరిల్లం) బ్యాక్టీరియాలు ఉంటాయి. వీటి కణ కవచం మ్యూరిన్‌తో నిర్మితమై ఉంటుంది. వీటిలో రైబోసోమ్‌లు తప్ప ఇతర కణాంగాలు ఉండవు.
- సయనో బ్యాక్టీరియాలు నత్రజని స్థాపనలో తోడ్పడతాయి. కొన్ని పరపోషిత బ్యాక్టీరియాలు పాలను పెరుగుగా మార్చటంలో, జీవనాశకాల ఉత్పత్తిలో, లెగ్యూమ్ మొక్కల వేరు బుడిపెల్లో ఉండి నత్రజని స్థాపనలో తోడ్పడతాయి. కొన్ని బ్యాక్టీరియాలు మొక్కలు, జంతువుల్లో వివిధ రకాల వ్యాధులను కలగజేస్తాయి. బ్యాక్టీరియాలను ఫ్రెండ్స్ అండ్ ఫోయిస్ అని, ప్రకృతి పారిశుధ్య కార్మికులు అని కూడా పిలుస్తారు. ట్రైకోడెస్మియం ఎరిత్రియం ఎర్ర సముద్రంలో ఉంటుంది.
- మైకోప్లాస్మా అనేది అతి చిన్న కణం. ఇది మొక్కల్లో మంత్రగత్తె చీపురుకట్ట,పశువుల్లో ప్లూరో నుమోనియా,మనుషుల్లో మైకోప్లాస్మల్ యురిథ్రైటిస్ వంటి వ్యాధులను కలగజేస్తుంది.
- ఆక్టినోమైసిటిస్‌కు చెందిన స్ట్రెప్టోమైసిస్ ప్రజాతులు యాంటిబయోటిక్‌ను ఉత్పత్తి చేయడానికి ఉపయోగపడతాయి.

2. **ప్రొటిస్టా:** ఏక కణ నిజ కేంద్రక జీవులు. వీటిలో మొక్కలు, జంతువుల లక్షణాలు ఉండటం వల్ల వీటిని నిర్దిష్టంగా నిర్వచించలేదు. ఉదా: యూగ్లినా, జిగురుబూజులు.

- డయాటాలు డయాటమేసియస్ మృత్తికలు ఏర్పరుస్తాయి. ఇవి సిలికాన్‌ను కలిగి ఉండటం వల్ల పాలిష్ చేయడానికి, నూనెలు, ద్రవాల వడబోతకు ఉపయోగపడతాయి. మధ్యధరా సముద్రంలో ఎరుపు అలలు కనిపించడానికి కారణం వాటిలో డైనోఫ్లాజెల్లేట్స్ ఉండటమే.

ఈ వర్గంలోని ప్రొటోజోవన్లు కణకవచం లేని జంతువుల ఆదిమమైన బిందువులుగా భావించే జీవులు ఉదా: అమీబా, ప్లాస్మోడియం, పారమీసియం.

3. **శిలీంధ్రాలు (ఫంగి):** ఇవి ఎక్కువగా పూతికాహారులు. కొన్ని పరాన్న జీవులు మరికొన్ని సహజీవులు. వీటిలో ఈస్ట్, రొట్టెల బూజులు, పుట్టగొడుగులు, టాడ్ స్టూల్స్ (విషపూరిత పుట్టగొడుగులు) మొదలైనవి ఉంటాయి. వీటి కణ కవచం ఖైటిన్‌తో నిర్మితమై ఉంటుంది. వీటిలో నిల్వ ఆహారం గ్లైకోజన్.

- కొన్ని శిలీంధ్రాలు కాటుక తెగులు (యుస్టిలాగో), కుంకుమ తెగులు (పక్సీనియా), ఎర్ర కుళ్లు (కొలిటోట్రైఖం), మాడు వ్యాధి (ఆల్టర్నేరియా) వంటి వాటిని కలిగిస్తాయి.
- ఈస్ట్ అనే శిలీంధ్రం కిణ్వణ ప్రక్రియలో తోడ్పడుతుంది.
- పెన్సీలియం నోటేటం అనే శిలీంధ్రం నుంచి 1928లో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ పెన్సిలిన్ అనే యాంటిబయోటిక్ ఇంజక్షన్ ను తయారు చేశాడు.
- అగార్, అయోడిన్ లాంటివి ఎరుపురంగు శైవలాల నుంచి లభిస్తాయి.

4. **ప్లాంటె:** వీటిలో నిజ కేంద్రక, హరితయుత స్వయం పోషకాలు ఉన్నాయి. వీటిలో కొన్ని నత్రజని లోపించిన నేలల్లో పెరిగి కీటకాలను ఆహారంగా తీసుకొంటాయి. ఉదా: యూట్రిక్యులేరియా (బ్లాడర్‌వర్ట్), నెపెంథిస్ (పిచ్చర్ ప్లాంట్) మొదలైనవి. కొన్ని పరాన్న జీవ మొక్కలుగా ఉదా: కస్కుట, మరికొన్ని వృక్షోపజీవులుగా ఉంటాయి. మొక్కలు ముఖ్యంగా శైవలాలు, బ్రయోఫైటా, టెరిడోఫైటా, జిమ్నోస్పెర్మ్స్, ఆంజియో స్పెర్మ్స్‌గా విభజించారు.
5. **ఆనిమేలియా:** కణ కవచం లేని పరపోషిత నిజ కేంద్రక జీవులు. వీటిలో అవయవ వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఇవి ఆహారాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తీసుకొని జీర్ణక్రియను కలిగి శక్తిని పొందుతాయి. వీటిలో నిల్వ ఆహార పదార్థం కొవ్వు / గ్లైకోజన్ రూపంలో ఉంటుంది.

రాజ్యం	కణరకం	కేంద్రకం	కణ కవచం	శరీర సంవిధానం	పోషణ
మొనీరా	ప్రోకేరియోట్	ఉండదు	సెల్యులోస్ లేనిది	కణయుతం	స్వయం పోషణ, పరపోషణ
ప్రొటిస్టా	యూకేరియోట్	ఉంటుంది	కొన్నింటిలో ఉంటుంది	కణయుతం	స్వయం పోషకం
ఫంగీ	యూకేరియోట్	ఉంటుంది	ఉంటుంది (ఖైటిన్)	బహుకణయుతం	పూతికాహారులు / కొన్ని పరాన్న జీవులు
ప్లాంటె	యూకేరియోట్	ఉంటుంది	ఉంటుంది (సెల్యులోజ్)	కణజాలయుతం	స్వయం పోషకాలు
ఆనిమేలియా	యూకేరియోట్	ఉంటుంది	ఉండదు	కణజాలయుతం / అవయవ వ్యవస్థలు	పరపోషితాలు (జాంతవభక్షణ/ హోలోజోయిక్)

మాదిరి ప్రశ్నలు

1. బ్యాక్టీరియాను మొదట కనుగొన్నది?
   ఎ) రాబర్ట్‌హుక్
   బి) ఆంటోని వాన్‌లీవెన్ హుక్
   సి) రాబర్ట్‌బ్రౌన్ డి) ష్లీడెన్
2. వైరస్ అంటే?
   ఎ) తీపి పదార్థం బి) చేదు పదార్థం
   సి) విష పదార్థం డి) ద్రవ పదార్థం
3. లెగ్యూమ్ మొక్కల వేరు బుడిపెల్లో నత్రజని స్థాపన చేసేది?
   ఎ) వైరస్ బి) ప్రొటోజోవా
   సి) థాలస్ డి) బ్యాక్టీరియా
4. బయో పెస్టిసైడ్స్‌ను దేని నుంచి తయారు చేస్తారు?
   ఎ) ఇ-కొలీ బి) థయోబాసిల్లస్
   సి) బాసిల్లస్ థురెంజియన్సిస్
   డి) పైవన్నీ
5. రెండు రాజ్యాల వర్గీకరణలో ఏ అంశాలు పరిగణనలోకి తీసుకున్నారు?
   ఎ) బాహ్య స్వరూప లక్షణాలు
   బి) కణజాల లక్షణాలు
   సి) ప్రత్యుత్పత్తి అంశాలు డి) ఎ, సి
6. పూతికాహారులు అంటే?
   ఎ) అతిథేయి నుంచి ఆహారాన్ని సేకరించేవి
   బి) నిర్జీవ పదార్థాల నుంచి ఆహార సేకరించేవి
   సి) ఇతర జీవుల నుంచి ఆహారాన్ని పొందుతూ దానికి లాభాన్ని చేకూర్చేవి
   డి) స్వయంగా ఆహారాన్ని తయారు చేసుకొనేవి
7. బ్యాక్టీరియాలో ఉండి శిలీంధ్రాల్లో ఉండనిది?
   ఎ) గ్లైకోజన్ బి) కణకవచం
   సి) మీసోసోమ్ డి) రైబోసోమ్
8. ప్రొటోజోవా ఏ రాజ్యానికి చెందుతుంది?
   ఎ) ప్రొటిస్టా బి) ఫంగై
   సి) మొనీరా డి) ప్లాంటె
9. కాంతిని శోషించి పదార్థాలను తయారు చేసుకునే సముదాయం?
   ఎ) మొనీరా బి) ఫంగై
   సి) ఆనిమేలియా డి) ప్లాంటె
10. డయాటాలు ఏ కోవకు చెందుతాయి?
    ఎ) ఫంగై బి) మొనీరా
    సి) ప్లాంటె డి) ప్రొటిస్టా
11. వైరాయిడ్‌లో కేవలం...
    ఎ) ప్రోటీన్స్ ఉంటాయి
    బి) కాప్సిడ్ ఉంటాయి
    సి) ఆర్ఎన్ఏ ఉంటుంది డి) ఏదీకాదు
12. మనిషిలో యురైథ్రైటిస్ వ్యాధిని కలిగించేది?
    ఎ) మైకోప్లాస్మా బి) వైరాయిడ్
    సి) ప్రయాన్ డి) ప్లాస్మోడియం
13. టాడ్‌స్టూల్స్ అంటే?
    ఎ) తినదగిన పుట్టగొడుగులు
    బి) విషపూరిత పుట్టగొడుగులు
    సి) సాగు చేసే పుట్టగొడుగులు
    డి) పుట్టగొడుగుల విత్తనాలు
14. ఎర్ర సముద్రంలో ఉండే శైవలం?
    ఎ) ట్రికోడెస్మియం ఎరిత్రకం
    బి) నాస్టాక్ సి) అనబినా
    డి) రైజోబియం
15. కణ కవచం లేని నిజ కేంద్రక కణాలు?
    ఎ) బ్యాక్టీరియా బి) శిలీంధ్రాలు
    సి) ప్రొటోజోవా డి) ఏదీకాదు
16. చెరకు ఎర్రకుళ్లు తెగులును కలిగించేది?
    ఎ) పక్సీనియం బి) కొలిటోట్రైఖం
    సి) పెన్సీలియం డి) యుస్టిలాగో
17. పొటాటో స్పిండిల్ ట్యూబర్ వ్యాధి దేనివల్ల వస్తుంది ?
    ఎ) ప్రియాన్ బి) టీఎంవీ
    సి) వైరాయిడ్ డి) పైవన్నీ
18. బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసేవి?
    ఎ) ఆర్కి బ్యాక్టీరియా
    బి) యూ బ్యాక్టీరియా
    సి) ఫంగీ డి) లైకెన్స్
19. మధ్యధరా సముద్రంలో అలలు ఎరుపు రంగులో కనిపించడానికి కారణం?
    ఎ) వాల్‌వాక్స్ బి) గోనియోలాక్స్
    సి) డయాటమ్స్ డి) క్లోరెల్లా

సమాధానాలు

1) బి; 2) సి; 3) డి; 4) సి; 5) డి; 6) బి; 7) సి; 8) ఎ; 9) డి; 10) డి; 11) సి; 12) ఎ; 13) బి; 14) ఎ; 15) సి; 16) బి; 17) సి; 18) ఎ; 19) బి.

సాక్షి ప్లస్
ఆదివారం । 8-12-2024

రాష్ట్రంలో దక్షిణ కాశీగా పేరొందిన దేవాలయం?

తెలంగాణ నైసర్గిక స్వరూపం

తెలంగాణ రాష్ట్రం పురాతన గోండ్వానా ప్రాంతం నుంచి విడిపోయిన ద్వీపకల్ప భారతదేశంలో భాగం. ఇది దక్కన్ పీఠభూమి ప్రాంతానికి చెందింది. సముద్రమట్టానికి 150-600 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పీఠభూమి:

- దక్కన్ పీఠభూమి మీసోజోయిక్ కాలానికి చెందింది. ఈ పీఠభూమిలో అగ్నిమయ ఉదర విచ్ఛేదనం వల్ల లావా పెల్లుబుకి, ఘనీభవించడం ద్వారా బసాల్ట్ శిలలు ఏర్పడ్డాయి.
- తెలంగాణ పీఠభూమిలో హైదరాబాద్. సముద్ర మట్టానికి 600 మీటర్ల ఎత్తులో ఉంది. ఇది రాష్ట్ర రాజధాని.
- పడమటి పీఠభూమి ఆర్కియన్ శిలలతో ఏర్పడింది. ఇది సముద్ర మట్టం నుంచి 450 నుంచి 600 మీటర్ల వరకు ఎత్తు ఉంది.
- తెలంగాణ పీఠభూమి ఉత్తరాన ఆదిలాబాద్‌లోని నిర్మల్ గుట్టల నుంచి దక్షిణాన మహబూబ్‌నగర్‌లోని అమ్రాబాద్ గుట్టల వరకు వ్యాపించి ఉంది.
- ఉత్తర భాగంలో గోదావరి నదీలోయలో గోండ్వానా శిలలు ఉన్నాయి.
- గోండ్వానా శిలల్లో ప్రధాన ఖనిజం-బొగ్గు.

తెలంగాణ పీఠభూమిలో

2 రకాల శిలలు ఉన్నాయి. అవి.

1. గోండ్వానా శిలలు
2. దక్కన్ శిలలు

గోండ్వానా శిలలు: పురాతన యుగం తర్వాత ప్రకృతి ఉత్పాతాల వల్ల ఏర్పడిన వృక్ష సంబంధిత అవక్షేప శిలలను 'గోండ్వానా శిలలు' అంటారు. ఈ శిలల్లో అత్యధికంగా దొరికే ఖనిజం - బొగ్గు.

దక్కన్ శిలలు: అగ్ని పర్వత ఉద్భేదనం వల్ల ఇవి ఏర్పడ్డాయి. ఇవి తెలంగాణలోని గోదావరి నది పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.

- ఉత్తర తెలంగాణ (ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం)లో గొండ్వానా శిలలతో బొగ్గు నిక్షేపాలు ఏర్పడ్డాయి. ఇవి గోదావరి నది వెంబడి ఉన్నాయి.
- హైదరాబాద్‌లో దక్కన్ పీఠభూమి సముద్రమట్టానికి 600 మీటర్ల ఎత్తులో, కృష్ణా-

తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ఎత్తైన కొండలు, గుట్టలతో; ఎగుడు, దిగుడులతో శిలాప్రాంతంగా ఉండేది. కొన్ని మిలియన్ ఏళ్ల కాలంలో క్రమక్షయానికి గురై వికోషీకరణ చెంది అవశిష్ట పీఠభూమిగా ఏర్పడింది. నదుల కోతల వల్ల అక్కడక్కడా సమతల ప్రదేశాలతో పెనిప్లేన్లు ఏర్పడ్డాయి.

తుంగభద్ర నదీ లోయల మధ్య 350-450 మీటర్ల ఎత్తులో, భీమా-గోదావరి నదుల మధ్య 730 మీటర్ల ఎత్తులో ఉంది.

- మెదక్,మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య ఈ పీఠభూమి 600-900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పర్వతాలు (కొండలు, గుట్టలు):

తెలంగాణ ప్రాంతంలో అనేక రకాల కొండలు, గుట్టలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పర్వత శ్రేణులకు సంబంధించిన ముఖ్యాంశాలు..

- పడమటి కనుమలు లేదా సహ్యాద్రి పర్వతాలు అజంతా శ్రేణి నుంచి విడిపోయి ఆగ్నేయ దిశగా తెలంగాణ ప్రాంతంలోకి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఈ పర్వతాలు కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల వరకు విస్తరించాయి.

ఈ పర్వతాలను కింద చూపిన విధంగా వివిధ జిల్లాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

జిల్లా పేరు (ఉమ్మడి జిల్లాలు)	పర్వతాల స్థానిక పేరు
ఆదిలాబాద్	నిర్మల్ గుట్టలు
కరీంనగర్	రాఖీ గుట్టలు
వరంగల్	కందికల్ గుట్టలు
ఖమ్మం	పాపి కొండలు

తెలంగాణ పీఠభూమిలో తూర్పు కనుమలు మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశించి, రంగారెడ్డి, నల్గొండ వరకు విస్తరించాయి. వీటిని కూడా వివిధ జిల్లాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ భూగోళ శాస్త్రం

ఉమ్మడి జిల్లా	పర్వతాలు
మహబూబ్‌నగర్	నల్లమల కొండలు, అమ్రాబాద్ కొండలు
రంగారెడ్డి	అనంతగిరి గుట్టలు, రాచకొండ గుట్టలు
నల్గొండ	నంది కొండలు, యాదగిరి గుట్ట.

- తెలంగాణ పీఠభూమి సముద్రమట్టానికి 531 మీ. ఎత్తులో లేదా 1741 అడుగుల ఎత్తులో విస్తరించి ఉంది.
- హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలను హుస్సేన్‌సాగర్ వేరు చేస్తోంది. దీన్ని మూసీ ఉపనది అయిన కల్వలేరు నదికి అడ్డుకట్ట వేసి నిర్మించారు. హిమాయత్‌సాగర్ లేదా ఉస్మాన్ సాగర్‌ను మూసీ ఉపనది అయిన ఈసా వాగుపై నిర్మించారు. ఇది హైదరాబాద్ నగరానికి పశ్చిమాన 25 కి.మీ. దూరంలో ఉంది.
- పోచారం సరస్సును మంజీరా ఉపనది అయిన ఆలేరు పాయపై నిర్మించారు. ఇది నిజామాబాద్ జిల్లాలో ఉంది.
- ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ హస్తకళలకు, పెయింటింగ్స్‌కు ప్రఖ్యాతి చెందింది. అదే జిల్లాలోని కడెం నదిపై 45 మీటర్ల ఎత్తులో కుంతాల జలపాతం ఉంది. ఇది తెలంగాణ రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతం.
- మల్లూరు ఉగ్రనరసింహస్వామి దేవాలయం వరంగల్ జిల్లాలోని మంగపేటలో ఉంది.
- కంచర్ల గోపన్న నిర్మించిన భద్రాచలం



దేవాలయం ఖమ్మం జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉంది.

- 1980లో మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు మారిన తెలుగు ఫిలిం కల్చర్ (టాలీవుడ్ ఇండస్ట్రీ) దేశంలోనే రెండో అతిపెద్ద సినీ పరిశ్రమ.

తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రదేశాలు

- **ఓరుగల్లు:** నాటి కాకతీయ రాజధాని. నేడు ఖిలా వరంగల్‌గా పేర్కొంటున్నారు. 12వ శతాబ్దంలో మట్టికోట, రాతి కోటలను నిర్మించారు. వీటి మధ్యలో కాకతీయుల చిహ్నంగా నిలిచిన కీర్తి తోరణాలు, ఖుష్‌మహల్‌లు ఉన్నాయి.
  - ఇక్కడ భద్రకాళీ దేవాలయం, రుద్రేశ్వర ఆలయం (వెయ్యి స్తంభాల గుడి) వంటి చారిత్రక ప్రాంతాలు ఉన్నాయి.
  - దీనికి సమీపంలో రామప్ప ఆలయం అద్భుత శిల్పకళా సౌందర్యానికి ప్రతీక.
- **పిల్లల మర్రి:** మహబూబ్‌నగర్‌లో సుమారు మూడు ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న మహావృక్షం. దీని మొదలు, కొమ్మక్కెడో గుర్తించడానికి వీలు లేకుండా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇది పట్టణ కేంద్రానికి సుమారు 4 కి.మీ.ల దూరంలో ఉంది.
- **మెదక్ చర్చి:** ఆసియాలోనే అతి పెద్దదైన మెదక్ డయాసిస్‌లో ఈ చర్చిని గోథిక్ నిర్మాణ శైలిని అనుసరిస్తూ 1914లో నిర్మించారు. ఈ చర్చి టవర్ ఎత్తు దాదాపు 173 అడుగులు. ఇక్కడ ఒకేసారి 5000 మంది ప్రార్థన చేసుకోవచ్చు.
- **వేములవాడ:** కరీంనగర్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం.. రాజరాజేశ్వర దేవాలయానికి ప్రసిద్ధి. ఈ ఆలయాన్ని దక్షిణ కాశీ అంటారు. ఇది తెలంగాణలోనే అత్యధిక ఆదాయం ఆర్జించే, అత్యధిక భక్తులు దర్శించే ఆలయాల్లో ఒకటి.
- **కొలనుపాక జైన మందిరం:** ఇది హైదరాబాద్-వరంగల్ రోడ్డుపై ఆలేరు దగ్గరలోని కొలనుపాకలో ఈ దేవాలయం ఉంది. ఇది తెలంగాణలోని అత్యంత ప్రాశస్త్యి కలిగిన జైన మందిరం.
- **జ్ఞాన సరస్వతీ దేవాలయం:** ఇది ఆదిలాబాద్‌లోని బాసరలో ఉంది. దేశంలో ఉన్న రెండు సరస్వతీ దేవాలయాల్లో ఇది ఒకటి. ఆదిలాబాద్ నుంచి సుమారు 157.6 కి.మీ. దూరంలో ఉంది.
- **శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం:** ఇది నల్గొండ జిల్లాలోని యాదగిరిగుట్టలో ఉంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రత్యేక నిధులను కేటాయించి దేవాలయాన్ని అభివృద్ధి చేసింది.

మాదిరి ప్రశ్నలు

1. రాఖీ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) వరంగల్ 4) ఖమ్మం
2. కుంతాల జలపాతం ఏ జిల్లాలో ఉంది?
   1) వరంగల్ 2) కరీంనగర్
   3) ఆదిలాబాద్ 4) ఖమ్మం
3. తెలంగాణలో 'దక్షిణ కాశీ'గా పేరొందిన దేవాలయం?
   1) వేములవాడ రాజరాజేశ్వరాలయం
   2) బాసర సరస్వతీ ఆలయం
   3) యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి
   4) అలంపూర్ నవబ్రహ్మ ఆలయం
4. పిల్లలమర్రి ఏ జిల్లాలో ఉంది?
   1) హైదరాబాద్ 2) రంగారెడ్డి
   3) నల్గొండ 4) మహబూబ్‌నగర్
5. హైదరాబాద్ సముద్ర మట్టానికి సుమారుగా ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
   1) 200 మీ. 2) 450 మీ.
   3) 600 మీ. 4) 1000 మీ.
6. పశ్చిమ కనుమలు తెలంగాణ రాష్ట్రంలోకి ఏ జిల్లాలో మొదట ప్రవేశిస్తాయి?
   1) నిజామాబాద్ 2) రంగారెడ్డి
   3) మహబూబ్‌నగర్ 4) ఆదిలాబాద్
7. ఆదిలాబాద్ జిల్లాలో పశ్చిమ కనుమలను ఏ పేరుతో పిలుస్తారు?
   1) కందికల్ గుట్టలు
   2) నిర్మల్ గుట్టలు
   3) రాచ కొండలు
   4) పాపి కొండలు
8. మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య దక్కన్ పీఠభూమి ఎంత ఎత్తులో విస్తరించి ఉంది?
   1) 600-900 మీటర్లు
   2) 350-450 మీటర్లు
   3) 700-850 మీటర్లు
   4) 200-375 మీటర్లు
9. అనంతగిరి పర్వత శ్రేణులు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
   1) నల్గొండ 2) మెదక్
   3) రంగారెడ్డి 4) కరీంనగర్
10. అమ్రాబాద్ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
    1) రంగారెడ్డి 2) మహబూబ్‌నగర్
    3) నల్గొండ 4) ఆదిలాబాద్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 4; 5) 3;
6) 4; 7) 2; 8) 1; 9) 3; 10) 2.

Learn to live and live to learn

Directions (Q. No.1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. She didn't (1)/ even take the trouble (2)/ to find out how to (3)/ spelling my name. (4)/ No error (5)
2. The escaped prisoners (1)/ were eventually trapped (2)/ in an underground garage (3)/ as recaptured. (4)/ No error (5)
3. He was (1)/ weakly, (2)/ cowardly and (3)/ treacherous. (4)/ No error (5)
4. The director transposes (1)/ Shakespeare's play (2)/ to 16th century Venice (3)/ to present day England. (4)/ No error (5)
5. We need to (1)/ ensure a smooth transition (2)/ between the old system (3)/ and new. (4)/ No error (5)
6. I think you'll have to (1)/ tweak these figures (2)/ a little before you shown (3)/ them to the boss. (4)/ No error (5)
7. These days it seemed (1)/ we must all submit (2)/ to the tyranny (3)/ of the motor car. (4)/ No error (5)
8. The political situation remains (1)/ highly unstable in many remote areas (2)/ even though the curfew (3)/ is lifted. (4)/ No error (5)
9. If society (1)/ is to exist as a unity, (2)/ its members may have (3)/ shared values. (4)/ No error (5)
10. The universal geriatric problems (1)/ projected in the movie (2)/ catched the attention of (3)/ the people across the world. (4)/ No error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The ceremony was transmitted ____ by satellite to ____ 50 countries.
    1) open; above
    2) online; around
    3) streaming; almost
    4) live; over
    5) latest; approximately
12. The police reforms will ensure greater ____ and ____.
    1) law; care
    2) security; safe
    3) transparency; accountability
    4) trepidation; tumult
    5) flexibility; reach
13. She had set a ____ for him and he had walked straight into it.
    1) goal 2) objective
    3) vision
    4) mission 5) trap
14. A restaurant has to ____ the tricky path between maintaining ____ and keeping prices down.
    1) treat; quantity
    2) meet; demand
    3) tread; quality
    4) expect; stock
    5) maintain; inventory
15. The aircraft is designed to ____ turbulent conditions.
    1) withstand 2) resist
    3) change 4) modify
    5) oversea

Directions (Q. No. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? Mark (5) No correction required as your answer, if there is no error.

16. The city's crime rate is a serious turn down to potential investors.
    1) Turn on 2) turn in
    3) turn off 4) turn up
    5) no correction required
17. The rise in violent crime will may go unchecked.
    1) must go 2) would go
    3) must not go
    4) shall go
    5) No correction required
18. Planes passed overhead with unceasing regularity.
    1) over sky 2) over and above
    3) outcast 4) over flown
    5) No correction required
19. My son's 13 but he's younger for his age.
    1) youngest 2) youth
    3) older 4) young
    5) No correction required
20. When the needle enters the red zone the engine is indicator hot.
    1) too 2) much
    3) becomes 4) left
    5) No correction required

Directions (Q. No. 21-25): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.



For decades, Chinese economic policymakers have drawn praise for keeping their economy growing strongly through **turbulence**, such as the Asian financial crisis of 1997-1998 and the worldwide financial tumult of 2008. But investors have begun to lose faith in Beijing's economic management. As China's economy slowed, the government decided to **deploy** the stock market to ease the pain. State-run media talked up stocks, and individual investors responded by buying shares and igniting a 150 per cent run-up in the Shanghai Composite stock index in the year through June. The hope was that Chinese companies could issue shares into a rising market and use the proceeds to **shrink** debts. But the stock bubble burst June 12. Shanghai stocks plummeted 37 per cent. The government sought futilely to intervene, suspending trading in hundreds of companies and banning big investors from selling stakes for six months. The intervention undermined Beijing's pledge to give market forces a bigger say in the economy and left policymakers looking clumsy and ineffectual.

On August 12, China surprised investors by marking down the value of its currency, the yuan. The government said it was responding to market forces: Investors had signaled that the yuan was overvalued. But skeptics worried that the devaluation was a desperate move to jolt the economy - a sign that the economy was weaker than thought. The move followed a report that exports had plunged in July. A cheaper yuan gives Chinese companies a price advantage in foreign markets. Since the devaluation, China has intervened to keep the yuan from falling too fast, confusing markets and renewing doubts about Beijing's commitment to market forces.

Chinese economic statistics have long been viewed as **dubious**. Premier Li Keqiang once acknowledged that the statistics on economic output were "man-made" and worthless. China watchers tended to shrug off the uncertainty as long as it was clear that the economy was **booming**. But now there's concern about what's really happening. Economists are looking at alternative measures of economic performance, such as electricity consumption. The London firm Consensus Economics asked several economists for forecasts based on the unconventional measures. These forecasters saw the Chinese economy growing just 5.3 per cent in the year up to the fourth quarter of 2015. Conventional forecasts have the economy growing closer to 7 per cent.

21. The Chinese economic policy makers have drawn praise during
    1) The government's intervention which suspended trading
    2) Selling of stock prices and upkeeping the market value
    3) Undermining the value of the stock and trading stopped by the government
    4) Tough times like Asian financial crisis and the worldwide financial tumult
    5) individual investors responded by buying shares and igniting a 150 per cent run-up
22. What led the investors to lose faith in the Beijing's economy?
    1) Praise for keeping their economy growing strongly through turbulence
    2) State-run media boosted the sales by investing in more stocks
    3) The government suspending trading in hundreds of companies and banned big investors from selling stakes for six months
    4) Chinese companies issued shares into a rising market
    5) individual investors bought shares and reinvested
23. The effect of government's intervention
    1) Damaged the promise to give the market forces a bigger say in the economy
    2) policy makers looked cooperative and favourable
    3) effective measures to curb the slowdown boosted confidence
    4) stock brokers had visualized a steady decline
    5) there is an uprise in the sale of stocks
24. Devaluation of the currency
    1) Was to respond to the stock and inventory
    2) was in response to market forces
    3) was a desperate move to jolt the economy
    4) Was to respond positively to international market
    5) To bring back the faith in the international trade
25. The result of devaluation of Yuan as stated in the passage is
    1) exports had plunged after the move of devaluation
    2) in confusing markets and renewing doubts about Beijing's commitment
    3) to surprise investors by marking down the value of its currency
    4) to go for alternative measures of economic performance
    5) to burst the bubble of the uncertainty prevalent in the minds of the investors

Directions (Q. No. 26-28): Choose the word which is MOST SIMILAR in meaning to the word given from the five options.

26. **Turbulence**
    1) Turmoil 2) Stability
    3) Confident 4) Organize
    5) Segregate
27. **Deploy**
    1) Cluster 2) Entangle
    3) Install 4) Huddle
    5) Disperse
28. **Booming**
    1) Thriving 2) Striving
    3) Demotivated 4) Annoyed
    5) Provoked

Directions (Q. No. 29-30): Choose the word which is MOST OPPOSITE in meaning to the word given from the five options.

29. **Shrink**
    1) Shrivel 2) Contract
    3) Microscope 4) Minimize
    5) Nurture
30. **Dubious**
    1) Hesitant 2) Whisper
    3) Summarize 4) Certain
    5) Unsure

Directions (Q. No. 31-33): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Both humans and animals learn to live and live to learn.
B. According to scientific research animals not only learn from their own mistakes, but they can learn by observing their peers messing up.
C. Making mistakes is a fundamental part of every cognitive process, whether solving a math problem, making important decisions, or trying to convey meaning in a foreign language.
D. In the animal world, avoiding blunders may dramatically improve one's chances of survival.
E. Human beings, however have a unique skill: the ability to process and mistakes.
F. Making mistakes and learning from them is not simply a human skill.

31. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

ANSWERS

1) 4	2) 4	3) 2	4) 3	5) 4
6) 3	7) 1	8)5	9) 3	10) 3
11) 4	12) 3	13) 5	14) 3	15) 1
16) 3	17) 3	18) 5	19) 4	20) 1
21) 4	22) 3	23) 1	24) 2	25) 1
26) 1	27) 3	28) 1	29) 5	30) 4
31) 1	32) 2	33) 4		